
గురువారం 15-5-2025


'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 53

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



శాంతే సౌందర్యం

సాక్షి ఇంటర్వ్యూలో మిస్ వరల్డ్ లెబనాన్ నద కౌస్సా

- 15లో



1,511 రోజులుగా...

టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా జడేజా

- 16లో



డ్రోన్లపై భార్గవాస్త్రం

శత్రుదేశాల డ్రోన్లు, యూఏవీలను ధ్వంసం చేసే స్వదేశీ కౌంటర్-డ్రోన్ సిస్టమ్ భార్గవాస్త్రను భారత్ విజయవంతంగా పరీక్షించింది.

- వివరాలు 8లో



'సింధూ'పై పునరాలోచించండి..

సింధూ జలాల ఒప్పందం నిలుపుదల నిర్ణయంపై పునరాలోచించాలని భారత్‌ను కోరుతూ పాక్ రాసిన లేఖ వెలుగులోకి వచ్చింది.

- వివరాలు 8లో



కెనడా మంత్రివర్గంలో మనోళ్లు

కెనడా మంత్రివర్గంలో అనితా ఆనంద్, మణీందర్ సిద్ధూ అనే భారత సంతతి నేతలకు కీలక పదవులు లభించాయి.

- వివరాలు 8లో



మూడోవంతు పోయింది!

ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాకిస్తాన్ ఏకంగా మూడో వంతు వైమానిక శక్తిని కోల్పోయిందని రక్షణ నిపుణులు తేల్చారు.

- వివరాలు 8లో

కట్టిన మూడేళ్లకే కూలింది

ఈ భూ ప్రపంచంలో ఇలాంటి ప్రాజెక్టు కాళేశ్వరం ఒక్కటే

నిజాం, నెహ్రూలు కట్టిన జలాశయాలు నేటికీ చెక్కు చెదరలేదు



ఓ యువకుడికి నియామక పత్రం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. మంత్రి పొన్నం. చిత్రంలో మంత్రి ఉత్తమ్, జగ్గారెడ్డి, సీఎస్

రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం కట్టినా 50 వేల ఎకరాలకు కూడా నీరివ్వలేదు: సీఎం రేవంత్‌రెడ్డి

- పదేళ్లలో రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టినా..ఉమ్మడి రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కాలేదు
- ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి వెళ్లిందంటూ నిలదీత
- నీళ్లు నాగరికతను నేర్పుతాయి.. తెలంగాణ ప్రజలకు ఉద్యమాన్ని నేర్పాయని వ్యాఖ్య
- నీటిపారుదల శాఖలో కొత్త ఏఈలు సహా 423 మందికి నియామక పత్రాలు అందజేత

సాక్షి, హైదరాబాద్: ఈ భూ ప్రపంచంలో కట్టిన మూడేళ్లకే కుప్పకూలిన ప్రాజెక్టు ఏదైనా ఉందంటే అది కాళేశ్వరం ఒక్కటే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. నిజాం కాలంలో మూసీ నదిపై కట్టిన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌తో పాటు జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి సాగునీటి ప్రాజెక్టులు ఎన్ని ఉపద్రవాలు వచ్చినా ఇప్పటికీ చెక్కు చెదరలేదని చెప్పారు. కానీ మూడేళ్లలోనే కాళేశ్వరం.. కట్టడం, కూలడం రెండూ జరిగిపోయాయని అన్నారు. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టినా 50 వేల ఎకరాలకు కూడా నీరివ్వలేదని విమర్శించారు. నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్లుగా, టెక్నికల్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు పొందిన 423 మందికి బుధవారం జలసౌధలో జరిగిన కార్యక్రమంలో సీఎం నియామక పత్రాలు అందజేశారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న వారికి పలు సూచనలు చేస్తూ.. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల తీరుతెన్నులను వివరించారు.

ఓ రాజకీయ పార్టీ భావోద్వేగాన్ని వాడుకుంది

'నీళ్లు నాగరికతను నేర్పుతాయి. తెలంగాణ ప్రజలకు నీళ్లు ఉద్యమాన్ని నేర్పాయి. నీళ్ల కోసం పరితపించి పోరాడాం. అంతటి ప్రాధాన్యత గల నీటిపారుదల శాఖలో పనిచేయడం ఉద్యోగం కాదు. భావోద్వేగం. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది నీళ్లు, నిధులు

మిగతా 2వ పేజీలో ▶

నిధుల కొరత వచ్చినా ప్రాజెక్టులు పూర్తి చేస్తాం..

'సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జాగ్రత్తలు పాటించాలి. తెలంగాణకు అతిపెద్ద సెంటిమెంట్ నీళ్లు. నిధుల కొరత వచ్చినా, ఏదోరకంగా పూర్తి చేస్తాం. ఎస్ఎల్‌బీసీ, సీతారామ, దేవాదుల, నెట్టెంపాడు, సమ్మక్క సారక్క ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేస్తాం. గ్రూప్ వన్ నియామకాలను అడ్డుకోవడం వెనుక ఉన్న రాజకీయ నాయకులు ఎవరో తెలుసు. త్వరలోనే గ్రూప్స్ ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తాం' అని సీఎం అన్నారు.



నేటి నుంచి సరస్వతి పుష్కరాలు

కాళేశ్వరం వద్ద నదిలో పుష్కర ఆవాహన పూజతో ప్రారంభం

- వివరాలు 7లో

సీటు ఇవ్వండి.. ఫీజు తగ్గించండి

- ఇంజనీరింగ్ యాజమాన్య కోటాకు వెల్లువెత్తుతున్న సిఫారసులు
- తమ వారికి సీట్లు ఇవ్వాలంటున్న నేతలు, ఉన్నతాధికారులు
- ప్రైవేటు యాజమాన్యాలకు తలనొప్పిగా మారిన ఒత్తిళ్లు
- ప్రభుత్వంలోని కీలకమైన నేతతో సంప్రదింపులకు యోచన

- వివరాలు 2లో



జస్టిస్ గవాయ్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

సీజేఐగా జస్టిస్ గవాయ్ ప్రమాణం

- 8లో



బుధవారం రామప్ప ఆలయం వద్ద సంప్రదాయ వస్త్రధారణలో మిస్ వరల్డ్ పోటీదారులు

5లో

క్లుప్తంగా...

గురుకుల పనివేళల్లో మార్పులు

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి సీఎం హామీ



సీఎం రేవంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ గురుకుల పాఠశాలల పనివేళలను మార్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. గతంలో పాఠశాల ప్రారంభ సమయం ఉదయం 9 గంటలకు ఉండేదని, దీన్ని గత ఏడాది 8 గంటలకు మార్చారని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమయం సరిపోవడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ అంశాన్ని శ్రీపాల్‌రెడ్డి సీఎం దృష్టికి బుధవారం తీసుకెళ్లారు. సీఎంను కలిసిన ఆయన టీచర్లకు చెందిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలని, వేసవిలో టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, సంఘ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి ఉన్నారు.

కేన్సర్ బాధితునికి అండగా సీఎం రేవంత్

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకున్నారు. సిద్దిపేటకు చెందిన సిరిసిల్ల సాయిచరణ్ (35) బ్లడ్ కేన్సర్ బారిన పడ్డారు. ఆయనకు భార్య లక్ష్మీ ప్రసన్న, కుమార్తెలు లక్ష్మీ సుసజ్ఞ (6), సౌమ్య (2 నెలలు), తల్లిదండ్రులు రాము, సునీత ఉన్నారు. చరణ్ చికిత్సకోసం కుటుంబ సభ్యులు సిద్దిపేట మండలం ఎన్సాన్‌పల్లిలోని తమ ఇంటిని విక్రయించారు. అయినప్పటికీ చికిత్సకు అవసరమైన మేర డబ్బు సరిపోకపోవడంతో వారు ముఖ్యమంత్రిని గతంలో కలసి తమ ఆర్థిక ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాయిచరణ్ చికిత్సకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. దీంతో బసవతారకం కేన్సర్ ఆసుపత్రిలో సాయిచరణ్‌కు స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ పూర్తయింది. కాగా, చికిత్సకు అదనంగా వ్యయమైన మరో రూ.7 లక్షలను సీఎం ఆర్‌ఎఫ్ ద్వారా అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో ఆ మొత్తాన్ని అధికారులు బాధిత కుటుంబానికి అందజేశారు. చికిత్స చేయించుకున్న సాయిచరణ్ కుటుంబ సభ్యులతో కలసి బుధవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ధైర్యంగా ఉండాలని సీఎం ఈ సందర్భంగా సాయిచరణ్‌కు సూచించారు.

గొంతు కోసుకొని విద్యార్థి ఆత్మహత్య

బీటెక్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపం



కోదాడ రూరల్: బీటెక్‌లో మూడు సబ్జెక్టులు ఫెయిలయ్యానని ఓ విద్యార్థి గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన కీర్తి ఉపేందర్ కుమారుడు వివేక్ (20) హైదరాబాద్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షల్లో మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. గ్రామంలో ఇంటి వద్ద ఉన్న వివేక్ మనస్తాపంతో బాత్‌రూంలోకి వెళ్లి కత్తితో గొంతు, చెయ్యి కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



అలాగే 'మన టెర్రరిస్టులు' కూడా 100 మంది పోయారని చెప్పండి!

సీటు ఇవ్వండి.. ఫీజు తగ్గించండి

ఇంజనీరింగ్ యాజమాన్య కోటాకు వెల్లువెత్తుతున్న సిఫారసులు

- తమ వారికి సీట్లు ఇవ్వాలంటున్న నేతలు, ఉన్నతాధికారులు
- ప్రైవేటు యాజమాన్యాలకు తలనొప్పిగా మారిన ఒత్తిళ్లు
- ప్రభుత్వంలోని కీలకమైన నేతతో సంప్రదింపులకు యోచన

సాక్షి, హైదరాబాద్: ఈఏపీసెట్ ఫలితాలు వెలువడటంతో ఇంజనీరింగ్ యాజమాన్య కోటా (బీ కేటగిరీ) సీట్లకు గిరాకీ పెరిగింది. 40 వేల ర్యాంకు దాటిన విద్యార్థులు బీ కేటగిరీ సీట్ల కోసం వాకబు చేస్తున్నారు. ప్రైవేటు కాలేజీలకు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ నేతల పైరవీలు పెరుగుతున్నాయి. టాప్ కాలేజీలు మొదలుకుని ఒక మోస్తరు కాలేజీలకు కూడా సీటు కోసం సిఫారసు చేస్తున్నారు. ఈ జాబితాలో రాజకీయ ప్రముఖులతో పాటు మంత్రులూ ఉంటున్నారు. టాప్ టెన్‌లో ఉన్న ఐదు ప్రైవేటు కాలేజీలకు ఇప్పటికే 50కి పైగా సిఫారసులు వచ్చినట్టు తెలిసింది. కొంతమంది మంత్రులు తాము సిఫారసు చేసిన విద్యార్థుల నుంచి నామమాత్రపు ఫీజు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్టు కాలేజీల యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇంకోవైపు కొంతమంది రాజకీయ నేతల అనుచరులు జేబులు నింపుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు. తమకు తెలిసిన మంత్రికో, నాయకుడికో చెప్పి సీటు ఇప్పిస్తామంటూ బేరాలు కుదుర్చుకుంటున్నారు. మంత్రులు, ఇతర నేతల పేర్లు చెబుతూ యాజమాన్యాలను సంప్రదిస్తున్నారు. ఇలాంటివన్నీ తమకు తలనొప్పిగా మారుతున్నాయని యాజమాన్యాలు అంటున్నాయి. ఇలాంటి ఒత్తిళ్ల నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వంలోని కీలకమైన నేతతో సంప్రదింపులు జరపాలని కాలేజీ యాజమాన్యాల అసోసియేషన్ నిర్ణయించినట్టు తెలిసింది. సిఫారసులకు పరిమితి విధించేలా చూడాలని కోరనున్నట్లు సమాచారం.



మా కోటా సంగతేంటి?

కీలక పదవుల్లో ఉన్న ఉన్నతాధికారులూ పేరున్న ఇంజనీరింగ్ కాలేజీల్లో తమ వారికి సీట్ల కోసం డిమాండ్ చేస్తున్నారు. ఈ జాబితాలో సీనియర్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, యూనివర్సిటీల కీలక అధికారులు, ఉన్నత విద్యామండలిలో పనిచేసేవారు కూడా ఉన్నారని తెలిసింది. కాలేజీలకు అనుమతులు ఇచ్చే వ్యవహారంలో ప్రధాన పాత్ర పోషించే అధికారులు కూడా తమకు కొన్ని సీట్లు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. రాష్ట్రంలోని ఎక్కువ కాలేజీలకు జేఎన్‌టీయూహెచ్ అనుబంధ గుర్తింపు ఇస్తుంది. మౌలిక వసతులు, ఫ్యాకల్టీ అన్నీ సక్రమంగా ఉన్నాయని ధ్రువీకరించేది ఈ యూనివర్సిటీనే. దీంతో ఈ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే వ్యక్తులు తాము చెప్పిన వారికి కొన్ని సీట్లు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. ఇలా అన్ని వైపుల నుంచి వచ్చే సిఫారసులను అంగీకరించే పరిస్థితి లేదని యాజమాన్యాలు చెబుతున్నాయి.

సాధారణ విద్యార్థులపై భారం!

రాష్ట్రంలో 1.16 లక్షల ఇంజనీరింగ్ సీట్లున్నాయి. ఇందులో 70% కన్వీనర్ కోటా పోతే, యాజమాన్య కోటా సీట్లు 35 వేల వరకూ ఉంటాయి. డిమాండ్ ఉన్న కాలేజీల్లో 15 వేల సీట్లు ఉండే అవకాశం ఉంది. బీ కేటగిరీ సీట్లను నోటిఫికేషన్ తర్వాతే భర్తీ చేయాలి. జేఈఈ ర్యాంకు, ఈఏపీసెట్ ర్యాంకు, ఇంటర్ మార్కుల ఆధారంగానే సీట్లివ్వాలి. ఇవి కూడా 15% మాత్రమే ఉంటాయి. మిగిలిన 15% సీట్లు ప్రవాస భారతీయుల పిల్లలకు ఇవ్వాలి. బీ కేటగిరీ సీట్లకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు తీసుకుంటే, సీ కేటగిరీ (ఎన్‌ఆర్‌ఐ కోటా) సీట్లకు ఏడాదికి 5 వేల డాలర్లు తీసుకోవాలి. అయితే ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్లలో చేరేవారు తక్కువ. ఈ కారణంగా అన్ని సీట్లను యాజమాన్యాలు భర్తీ చేస్తాయి. ఒక్కో సీటుకు రూ.12 లక్షల నుంచి 18 లక్షల వరకూ డిమాండ్ చేస్తున్నాయి. అయితే ముఖ్యులు సిఫారసు చేసిన వారికి డొనేషన్ తగ్గిస్తే, ఈ భారం బీ కేటగిరీ సీట్లు తీసుకునే, సిఫారసులూ లేని సాధారణ విద్యార్థులపై వేయడం తప్ప మరో మార్గం లేదని యాజమాన్యాలు అంటున్నాయి.

కట్టిన మూడేళ్లకే కూలింది

▶ మొదటి పేజీ తరువాయి

నియామకాలు. ఈ మూడింటితో కూడిన భావోద్వేగాన్ని ఓ రాజకీయ పార్టీ వాడుకుని పదేళ్లు అధికారంలో కొనసాగింది. పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో జలయజ్ఞంలో భాగంగా ప్రారంభమై పెండింగ్‌లో ఉన్న ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదు. పాలమూరు-రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, కల్వకుర్తి, ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్, దుమ్ముగూడెం, సీతారామ ప్రాజెక్టులు ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఈ రూ.2 లక్షల కోట్లు ఎవరి జేబుల్లోకి పోయాయి? 10 ఏళ్లు నియామకాలు జరగలేదు. మేం ఇప్పటివరకు నీటి పారుదల శాఖలో 1,161 మందికి ఉద్యోగాలు ఇచ్చాం. లష్కర్లుగా మరో 2 వేల మందిని నియమించాం. మా ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత సాగునీటి పారుదలకే..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

ఆ మూడుచోట్లా కనీసం సాయిల్ టెస్ట్ చేయలేదు

'సాగునీటి ప్రాజెక్టులు ఎలా కట్టాలో.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య మొదలు సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో నాగార్జున సాగర్, శ్రీరాంసాగర్ కట్టిన ఇంజనీర్లు చూపించారు. 2009లో వచ్చిన వరదలకు శ్రీశైలం ప్రాజెక్టు కొట్టుకుపోతుందేమోనని భయపడ్డా. కానీ ఆ కట్టడానికి ఏం కాలేదు. ఒక ప్రాజెక్టు ఎలా కట్టకూడదో, ఎలా కడితే ప్రజలకు నష్టం జరుగుతుందో అనే దానికి ఉదాహరణ కాళేశ్వరం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కట్టిన చోట కనీసం సాయిల్ టెస్ట్ చేయలేదు. హెలికాప్టర్‌లో వెళ్తా కిందకు చూపించి మూడు బరాజ్‌లు కట్టించారు. 80 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి ఇంజనీరుగా మారి కట్టిన కాళేశ్వరం పరిస్థితి ఇది.

ఎవరి పని వారు చేయాలి: ఇంజనీర్ల పని ఇంజనీర్లే చేయాలి. రాజకీయ నాయకుల పని రాజకీయ నాయకులే చేయాలి. ఇంజనీర్లు తమ విచక్షణతోనే పనిచేయాలి. పరిమిత జ్ఞానంతో రాజకీయ నాయకులు చెప్పే మాటలు వింటే నష్టపోయేది మీరే. అలా చేసిన వాళ్ల ఊచలు లెక్కించాల్సిన పరిస్థితి ఎదురుకాబోతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు కుప్పకూలడానికి అధికారులే బాధ్యులన్నట్టుగా నివేదికలు వస్తున్నాయి. మీరు కట్టే ప్రాజెక్టులు భావితరాలకు ఉపయోగపడతాయి. 30 ఏళ్లు కష్టపడితే తప్ప అసిస్టెంట్ ఇంజనీర్.. ఇంజనీర్ ఇన్ చీఫ్ కాలేరని గుర్తుంచుకోవాలి. కుప్పకూలిన ప్రాజెక్టు కాళేశ్వరంను ఇంజనీర్లుగా ఉద్యోగాలు పొందిన వారు సందర్శించాలి..' అని రేవంత్ చెప్పారు.

ఏటా 5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు లక్ష్యం: మంత్రి ఉత్తమ్

రాష్ట్రంలో సాగునీటికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రతి ఏటా 5 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందని చెప్పారు. నీటిపారుదల శాఖలో తొలిసారిగా ఉద్యోగ ఖాళీలన్నింటినీ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' కూడా లోపభూయిష్టంగానే ఉంది

'సీతారామ ప్రాజెక్టు కూడా లోపభూయిష్టంగానే ఉంది. 45 కిలోమీటర్ల అతి పొడవైన టన్నెల్ ప్రాజెక్టు ఎస్‌ఎల్‌బీసీ 75 శాతం ఎప్పుడో పూర్తయితే పదేళ్లలో 10 కిలోమీటర్ల పనులు పూర్తి చేయలేదు. 3.36 లక్షల ఎకరాలకు నీరందించే ఈ ప్రాజెక్టును పదేళ్లు పట్టించుకోకపోతే మళ్లీ మేం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు ప్రారంభించాం. అయితే పదేళ్లు పనులు జరగక సొరంగం కుప్పకూలి 8 మంది ప్రాణాలు కోల్పోయారు.

అనుమతుల ప్రక్రియ సులభంగా ఉండాలి

సింగిల్ విండో విధానంపై అధ్యయనం చేయండి

అర్బన్ కోర్ రీజియన్‌పై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో వేం నరేందర్‌రెడ్డి, మాణిక్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అర్బన్ కోర్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలు, సదుపాయాలతోపాటు బిల్లుల వసూలుకు సింగిల్ విండో విధానంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. అర్బన్ కోర్ రీజియన్ పరిధిలో అనుమతులు, పౌరసేవలపై సీఎం బుధవారం సాయంత్రం సచివాలయంలో సమీక్షించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్‌లో వివిధ రకాల నిర్మాణాలకు ప్రజలు పలు విభాగాలకు దరఖాస్తులు చేసుకొని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని సీఎం పేర్కొన్నారు. ఏదైనా నిర్మాణం లేదా గృహాలు, వాణిజ్య సముదాయాల సేవలకు ఒకే ప్లాట్‌ఫాంపై దరఖాస్తు అందజేస్తే, వారికి అవసరమైన సేవలకు సింగిల్ విండోలో అనుమతి లభించేలా ఉండాలన్నారు. ఇందుకు రెవెన్యూ, పురపాలక, జల వనరులు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్ తదితర విభాగాలు సంయుక్తంగా పని చేయాలని సీఎం సూచించారు. ఆయా శాఖల వసూలు చేసే బిల్లులు సైతం ఒకేసారి, ఒకే విండో ద్వారా చెల్లించే విధానం ఉండాలన్నారు. అనుమతుల ప్రక్రియ అనవసరమైన జాప్యం చేయకూడదని, ఏ కారణం లేకుండా అనుమతులను నిరాకరించడానికి వీల్లేదన్నారు. ఏదైనా కారణం చేత అనుమతులకు ఆలస్యమైతే అందుకు కారణాలు ఏమిటో దరఖాస్తుదారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి ఏం చర్యలు తీసుకోవాలో కూడా అధికారులే సూచించాలని సీఎం చెప్పారు. ఈ సమీక్షలో వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులు ఇలంబర్తి, మాణిక్ రాజ్, సర్ఫరాజ్ అహ్మద్, ఆర్.వి.కర్ణన్, అశోక్‌రెడ్డి, ముషారఫ్ అలీ, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

రేవంత్ సర్కార్ కొత్తగా ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇచ్చింది

నీటిపారుదలపై శ్వేతపత్రం విడుదల చేయాలి: ఎమ్మెల్యే హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రేవంత్ 18 నెలల పాలనలో కొత్తగా ఎన్ని ఎకరాలకు నీళ్లు ఇచ్చారో స్పష్టం చేయాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారనే విషయంలో శ్వేతపత్రం విడుదల చేయాలని బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ దీనస్థితిలో ఉందని, 30 ఈఎన్సీ, 15 సీఈ పోస్టులు, 40 సూపరింటెండెంట్ ఇంజనీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ఇరిగేషన్ సెక్టార్‌లో కేసీఆర్ సాధించిన ప్రగతి చెరిపేస్తే చెరిగిపోయేది కాదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ద్వారా 17.24 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 31.50 లక్షల ఎకరాలు స్థిరీకరించామని, మొత్తంగా 48 లక్షల ఎకరాలకు నీళ్లు అందించి, సాగును బాగు చేశామని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకు నియామక పత్రాలు అందించి, తమ ఘనతగా చెప్పుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తంటాలు పడుతున్నాడని చెప్పారు. నియామక పత్రాలు అందిస్తూ మంచి మాటలు చెప్పాల్సింది పోయి, యథావిధిగా తనదైన శైలిలో అవే అబద్ధాలు చెబుతున్నాడన్నారు. ఉద్యోగాల్లో చేరుతున్న వారిలో ఉత్సాహాన్ని నింపాలని, వారికి వార్నింగ్ ఇచ్చి, భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని, అధికారులను ఉరి తీయాలని విజిలెన్స్, ఎన్డీఎస్‌ఏ నివేదికలు చెబుతాయా అని ప్రశ్నించారు. ఇంతకంటే అజ్ఞానం ఉన్న వ్యక్తి సోమాలియా నుంచి అమెరికా వరకు ఎక్కడ వెతికినా కనిపించడన్నారు. రాజకీయ నాయకుల సూచనలు పాటిస్తే, ఊచలు లెక్కపెడతారని ఇంజనీర్లను హెచ్చరిస్తున్న రేవంత్.. ఏ జ్ఞానంతో కాళేశ్వరం కూలిందని దుష్ప్రచారం చేస్తున్నాడన్నారు. ఆయన ఇంజనీరా..? ఇరిగేషన్ నిపుణుడా అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై చేసిన ఖర్చు ఓసారి రూ.1.50 లక్షల కోట్లు, ఓసారి లక్ష కోట్లు అంటారని, ఓ సారి ఒక్క గుంటకు నీళ్లు ఇవ్వలేదని, మరోసారి 50 వేల ఎకరాలకే నీళ్లు ఇచ్చారని అనడంలో అర్థం లేదన్నారు. ఆయనది నోరా లేక తాటి మట్టా అని అడిగారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించినట్టు అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన శ్వేతపత్రంలోనే ప్రకటించారన్నారు. మళ్లీ ఇప్పుడు 50 వేల ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని గోబెల్స్ ప్రచారం చేస్తున్నాడని, బాధ్యత గల పదవిలో ఉండి, రోజురోజుకీ స్థాయి దిగజార్చుతున్నాడన్నారు. ఎస్‌ఎల్‌బీసీ విషయంలో మొసలికన్నీరు కారుస్తున్న సీఎం మూడు నెలలైనా సొరంగంలో కూరుకుపోయిన వారి జీవితాలు గుర్తుకురావడం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ పాలనలో ఇరిటేషన్ పెరిగిందని, ఏడాదిన్నర పాటు ఇరిగేషన్ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు ప్రాధాన్య రంగమని మాటలు చెబుతుండటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆరు ప్రాజెక్టులు పూర్తి చేసి, ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా చెప్పి మాట తప్పారన్నారు.

మెడికల్ కాలేజీలకూ ర్యాంక్‌లు

- అంశాల వారీగా వెయిటేజీ మార్కులు
- ముసాయిదా ప్రకటించిన నేషనల్ మెడికల్ కౌన్సిల్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు అందించే విద్యలో నాణ్యత ఆధారంగా అక్రిడిటేషన్, రేటింగ్ జారీ చేసేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా 2023లో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(క్యూసీఐ)తో ఎన్‌ఎంసీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రెండేళ్ల అనంతరం ఇటీవల కళాశాలలకు రేటింగ్ కేటాయించడం కోసం రూపొందించిన ముసాయిదా విడుదల చేసింది. దీనిపై వైద్య కళాశాలలు, ఇతర భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను తెలియజేయాలని ఎన్‌ఎంసీ కార్యదర్శి డాక్టర్ రాఘవ్ కోరారు.

11 విభాగాలు.. 78 ప్రమాణాలు

11 విభాగాల్లో.. 78 ప్రమాణాలను మూల్యాంకనం చేయడం ద్వారా వెయిటేజీ ఖరారు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. 78 ప్రమాణాల్లోనూ 26 గుణాత్మక, 52 పరిమాణాత్మకంగా విభజించారు. 11 విభాగాలకు కలిపి మొత్తంగా వెయ్యి మార్కులతో వెయిటేజీ ఉంటుంది. 11 విభాగాలకు కేటాయించిన వెయిటేజీని పరిశీలిస్తే అత్యధికంగా కళాశాలలు, ఆస్పత్రుల్లో మానవ వనరుల అందుబాటుకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు స్పష్టమవుతోంది. ఈ విభాగంలో రెండు గుణాత్మక, 9 పరిమాణాత్మక ప్రమాణాలకు 160 మార్కుల వెయిటేజీని కేటాయించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్య సాధన పురోగతికి 140 మార్కుల వెయిటేజీ ఇచ్చారు. ముసాయిదాకు ఆమోదం లభిస్తే వైద్య కళాశాలల్లో నేషనల్ మెడికల్ కమిషన్ తనిఖీలు చేపట్టి అక్రిడిటేషన్, ర్యాంక్‌లు ఇచ్చే అవకాశం ఉంది.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



చెన్నూర్ రూరల్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో రైతులు రోడ్డెక్కారు. గత మూడు రోజులుగా కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేయడం లేదని, సన్నరకం ధాన్యంలో తరుగు చాలా తీస్తున్నారని చెబుతూ బుధవారం చెన్నూర్-మంచిర్యాల రహదారిపై ధర్నా చేపట్టారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించి వేసేందుకు ప్రయత్నించడంతో వాగ్వాదం జరిగింది. చివరికి పోలీసులు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు. అనంతరం రైతులు.. పోలీసులు, ఏడీఏ భానుప్రసాద్, ఏవో యామిని లను కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లి తమ కష్టాలను వివరించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలు చేపట్టేలా చూస్తామని వారు చెప్పడంతో శాంతించారు.

కోడిగుడ్ల టెండర్ ఖరారయ్యేనా?

- అంగన్‌వాడీల్లో రూ. 200 కోట్ల విలువైన గుడ్ల సరఫరా టెండర్ దరఖాస్తుకు నేడు ఆఖరు
- రెండుసార్లు గడువు పొడిగించినా నిబంధనలు మార్చకపోవడంపై పౌల్ట్రీ రైతుల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 37,500 అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన రూ. 200 కోట్లకుపైగా విలువైన 36.96 కోట్ల కోడిగుడ్ల కోసం కాంట్రాక్టర్ల ఎంపికలో అయోమయం నెలకొంది. ఏడు జోన్ల పరిధిలో ఏడుగురు కాంట్రాక్టర్ల ఎంపికకు మార్చి 30న టెండర్లు ఆహ్వానించగా నిబంధనలు మార్చకుండా రెండుసార్లు టెండర్ల గడువు పొడిగించడంపై పౌల్ట్రీ రైతులు నిరసన వ్యక్తం చేశారు. తాజా గడువు గురువారంతో ముగియనుండటంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. రెండేళ్ల క్రితం పిలిచిన టెండర్లలో ఒక్కో కోడిగుడ్డుకు సగటున రూ. 5.45 చొప్పున ధర నిర్ణయించి ప్రభుత్వం కాంట్రాక్టర్లను ఎంపిక చేసింది. అయితే తాజాగా రూపొందించిన టెండర్ నిబంధనలు పాత కాంట్రాక్టర్లకు అనుకూలంగా ఉండటం... కొత్తవారికి అవకాశం లేకపోవడంపై ఈ ఏడాది ఏప్రిల్ 6న సాక్షి ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ టెండర్ నిబంధనల్లో చిన్నపాటి సవరణలు చేసి టెండర్ గడువును పొడిగించింది. కానీ ప్రధాన నిబంధనలన్నీ పాత కాంట్రాక్టర్లకే అనుకూలంగా ఉన్నాయంటూ పలువురు పౌల్ట్రీ రైతులు సీఎం రేవంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో గడువు తేదీని మరోమారు పొడిగించారు. కానీ నిబంధనలు మార్చలేదు.

ఆరుగాలం కష్టం.. 'అకాల' నష్టం

భారీ వర్షానికి కల్లాల్లో తడిసిన ధాన్యం



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం గోగుపల్లి గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

ములుగు/ఎస్‌ఎస్‌తాడ్వాయి/ఏటూరునాగారం: ములుగు, ఏటూరు నాగారం, ఎస్‌ఎస్ తాడ్వాయి మండలాల్లో పలు చోట్ల బుధవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కల్లాల్లోనే వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ములుగు పరిధిలోని పాల్‌సాబ్‌పల్లిలో కేంద్రంలోని ధాన్యం భారీ వర్షానికి కొట్టుకుపోయింది. గోగుపల్లిలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం వద్ద 31 మంది రైతులు 500 క్వింటాళ్ల ధాన్యంతో పాటు.. ఆడ, మగ సీడ్‌కు సంబంధించిన 600 క్వింటాళ్ల ధాన్యం వ్యాపారులకు అమ్ముకునేందుకు నిల్వ చేశారు. ఈ క్రమంలో వర్షం వల్ల వచ్చిన ఊరవాగు వరదకు 500 క్వింటాళ్ల ధాన్యం కొట్టుకుపోగా.. 600 బస్తాల్లోని సీడ్ ధాన్యం తడిసిపోయింది. కాటాపూర్, నార్లాపూర్, గంగారం కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క గోగుపల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.

మూడో దేశం జోక్యం అభ్యంతరకరం

భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణపై ట్రంప్ ప్రకటన అసమంజసం

- ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి
- సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ



మాట్లాడుతున్న సీపీఎం ప్రధాన కార్యదర్శి బేబి. చిత్రంలో బీవీ రాఘవులు, విజయరాఘవన్, జాన్‌వెస్లీ

సాక్షి, హైదరాబాద్: పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల శిబిరాలపై భారత్ దాడి నేపథ్యంలో మధ్యలో మూడో దేశం జోక్యం అభ్యంతరకరమని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతనెలలో పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎంఏ బేబీ తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎ.విజయరాఘవన్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో కలసి మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదులను అణచివేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ సిందూరును దేశ ప్రజలతోపాటు, రాజకీయ పార్టీలు స్వాగతించాయని గుర్తు చేశారు. అయితే భారత్, పాక్ దేశాల మధ్య కాల్పులు జరుగుతున్నప్పుడు కాల్పుల విరమణ గురించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం అసమంజసమని మండిపడ్డారు. ఇండియా, పాకిస్తాన్ మధ్య తాము మధ్యవర్తిత్వం వహించబోమంటూ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ ప్రకటించగా, అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటన అభ్యంతరకరంగా ఉందన్నారు. ఇలాంటి అనేక విషయాలపై వాస్తవాలు ప్రజలకు తెలియాలంటే పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్లమెంటు సభ్యులకు అనేక ప్రశ్నలుంటాయనీ, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు.

మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి: రాఘవులు

కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపాలని బీవీ రాఘవులు కోరారు. చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టు లు కూడా ప్రకటించారని గుర్తు చేశారు. సాయుధ చర్యలను నిలిపేస్తామంటూ ప్రకటించారనీ, చర్చలకు ఇది సానుకూల వాతావరణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం షరతుల్లేకుండా మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

వాగ్దానాలను అమలు చేయాల్సిందే: జాన్ వెస్లీ

ఎన్నికలకు ముందు ప్రజలు, ఉద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాల్సిందేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హామీల అమలు గురించి అడిగితే డబ్బుల్లేవంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పించుకునే సమాధానం చెప్తున్నారని అన్నారు. అధికారం కోసం వాగ్దానాలు ఇస్తాం. తర్వాత తప్పించుకుంటామంటే కుదరదని పేర్కొన్నారు.

సత్యమేవ జయతే

సాక్షి

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 53

గురువారం 15-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



CASAGRAND GS INFINITY

3 & 4 BHK Apts. &
5 BHK Floor Villas
at Attapur

From ₹1.85Cr - ₹3.15Cr*

Project Highlights

- 405 well-designed apartments spread across 4.8 acres
- G+35 high-rise skyscrapers
- 80% open space & greenery
- 100+ world-class amenities
- 41,000 sft. grand clubhouse

• 10 mins from Banjara Hills • 12 mins from Jubilee Hills • 14 mins from Hitec City, Madhapur



CASAGRAND EVON

3 & 4 BHK Apts.
at Kompally

From ₹1.6Cr - ₹2.3Cr*

Project Highlights

- 4.7 acres of open space with Japanese-styled landscape
- 100+ world-class amenities
- Ultra-spacious homes with 12 ft. wide bedrooms
- 2-sided ventilation for scenic views and fresh air
- 35,000 sft. clubhouse

• 5 mins from Suchitra Jn. • 15 mins from Bowenpally



CASAGRAND BELAIR

5 BHK Luxury Bungalows
at Gowdavalli

From ₹3.5Cr*

Project Highlights

- 79 ultra-spacious 4000+ sft. bungalows
- 9.35 acre community
- 1000 sft. open space around each unit
- 85+ world-class amenities
- 20,000 sft. grand clubhouse

• 5 mins from ORR Exit No.5 • 10 mins from Medchal Checkpost • 15 mins from Kompally, Bachupally



CASAGRAND WINDSOR COURT

4 & 5 BHK
Ultra Luxurious Villas
at South Hyderabad

From ₹4.3Cr*

Project Highlights

- 21 exclusive villas spread across 4 acres
- Private home theatre in every villa
- 2 grand clubhouses with 25+ amenities
- 77% open space and greenery

• 10 mins from Rajiv Gandhi International Airport • 12 mins from ORR Exit 14 • 30 mins from Financial District



CASAGRAND Hanford

4 BHK
British Styled Villas
within ORR, South Hyderabad

From ₹3.2Cr*

Project Highlights

- 140 British-styled villas spread across 10.1 acres
- Exclusive home theatre or lavish 5th bedroom in every villa
- 60+ amenities & 15,000 sft. grand clubhouse
- Close to upcoming metro

• 10 mins from Attapur • 20 mins from Kokapet & Financial District • 25 mins from Gachibowli & HITEC City

WHY CASAGRAND

20 years of real estate excellence	**160+** landmark projects	**55,000+** happy families	**2023** rigorous quality checks	**87%** on-time delivery	**7 cities** Chennai, Bengaluru, Hyderabad, Coimbatore, Pune, Delhi & Dubai
2 months of rental assurance	**6 months** of resale support	**8 Year** warranty & 10 year community maintenance	**75%** open area for 2x more light & ventilation	**0%** space wastage for carpet area efficiency	**23** global brands used in fittings and finishing materials

Exclusive site visit available. Visit model house at site.

90475 40000 | www.casagrand.co.in

CREDAI

CASAGRAND
building aspirations


వేయిస్తంభాల గుడిలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అందాల భామలు


నేనే గెలవాలి: నందీశ్వరుని చెవిలో మనసులోమాట చెబుతూ...


వరంగల్ కోట అందాలను వీక్షిస్తూ...

తెలుగు అమ్మాయిల్లా..

పట్టు పరికిణీలు, చీరలు ధరించి.. నుదుట తిలకం దిద్దిన సుందరీమణులు

బతుకమ్మలతో ముద్దుగుమ్మలకు ఆత్మీయ స్వాగతం

రామప్ప, వరంగల్‌కు వివిధ దేశాల అందాల భామలు


హరిత హోటల్‌లో బతుకమ్మ ఆడుతున్న మిస్ వరల్డ్ పోటీదారులు


రామప్ప ఆలయంలో లేజర్ షో

సాక్షి ప్రతినిధి, వరంగల్: పట్టు పరికిణీలు, చీరలు కట్టుకొని తెలుగుదనం ఉట్టిపడేలా తిలకం దిద్దుకున్న ప్రపంచ దేశాల సుందరీమణులు ఓరుగల్లు పర్యటనలో జిగేల్‌మన్నారు. హెరిటేజ్ వాక్‌లో భాగంగా వివిధ దేశాలకు చెందిన 57 మంది సుందరీమణులు రెండు బృందాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. వరంగల్ కోట సందర్శనలో 22 మంది బుధవారం సాయంత్రం హనుమకొండకు చేరుకున్నారు. మరో బృందం ములుగు జిల్లా రామప్పలో సందడి చేసింది. సుందరీమణులకు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు, సంప్రదాయ డోలు వాయిద్యాలతో ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు సుందరీమణులు నృత్యాలు చేశారు. అనంతరం సంప్రదాయ ప్రకారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తాంబాలంలోని చెంబులో ఉన్న నీళ్లతో సుందరీమణులు కాళ్లను కడుక్కున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న నంది విగ్రహం వద్ద ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. అనంతరం కల్యాణ మంటపాన్ని దర్శించారు. అనంతరం ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన సుందరీమణులు వరంగల్ కోటను సందర్శించి అక్కడే ఏర్పాటు చేసిన పేరిణి శివతాండవం, ఇతర సంప్రదాయ నృత్యాలను చూసి తిరిగి హరిత హోటల్‌కు చేరుకుని డిన్నర్ చేసి హైదరాబాద్‌కు బయలుదేరారు.

ములుగు జిల్లా రామప్ప ఆలయం వద్ద ప్రపంచ సుందరీమణులకు గుస్సాడీ నృత్య ప్రదర్శన, ఒగ్గుడోలు ప్రదర్శన ద్వారా కళాకారులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆ తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత చరిత్ర ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పురాతన కట్టడం, వారసత్వ సంపద.. రామప్ప ఆలయాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. ఆలయ తీరుతెన్నులను తనివితీరా తిలకించి ఫిదా అయ్యారు. రామప్ప గార్డెన్‌లో అలేఖ్య పుంజాల శాస్త్రీయ నత్యం, రంజిత్ బృందం పేరిణి ప్రదర్శనలను వీక్షించిన అనంతరం..ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌లో డిన్నర్ చేసి హైదరాబాద్‌కు బయలుదేరారు.

అతిథులకు మంత్రుల సన్మానం

వరంగల్ కోటలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ సుందరీమణులకు స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ఓరుగల్లు నిలువెత్తు నిదర్శనమన్నారు. రామప్ప గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ సాంస్కృతిక చారిత్రక కట్టడాలకు నిలయం ములుగు ప్రాంతమని, ఇక్కడకు సుందరీమణులు రావడం సంతోషంగా ఉందన్నారు.

వరంగల్ పర్యటన ఎప్పటికీ గుర్తుంటుంది

చారిత్రక సంపదకు నెలవైన వరంగల్ పర్యటన మాకు జీవితాంతం గుర్తుండే అనుభూతి. కాకతీయులు నిర్మించిన వరంగల్ కోట అద్భుతంగా ఉంది. మాటల్లో దీన్ని వర్ణించలేం. రాణిరుద్రమదేవి గొప్పతనం ఇక్కడ కళ్లకు కట్టినట్టు కనిపించింది. కాకతీయుల పాలన గురించి తెలిపే సౌండ్ అండ్ లైట్ షో ప్రదర్శన మాకెంతో అవగాహన కలిగించింది. ఇక్కడి ఆతిథ్యం మమ్మల్ని మురిపిస్తోంది. చేనేత కలంకారి డ్రెస్ చూస్తే ఇక్కడి గొప్పతనం తెలుస్తోంది. చపాట మిర్చి చూసేందుకు బాగా ఉంది. ఇంకా టేస్ట్ కూడా ఆ రేంజ్‌లోనే ఉందనుకుంటున్నాం. తెలంగాణ జరూర్ ఆనా నినాదాన్ని మా దేశంలో వినిపిస్తాం.

–మిస్ వరల్డ్ పోటీదారులు


రామప్ప ఆలయంలోకి వెళ్లేముందు కాళ్లు కడుక్కుంటూ..

పేదల ఇళ్లు కూలుస్తారా?: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: అందాల పోటీల కోసం వచ్చిన సుందరీమణుల పర్యటన సందర్భంగా వరంగల్‌లో ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చుతోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక విధానాలను అవలంబిస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి ఆయన 'ఎక్స్'లో పలు ప్రశ్నలు సంధించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అమానవీయ చర్యలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుల్డోజర్ సంస్థలతో కాంగ్రెస్ పార్టీకి ఏమైనా రహస్య ఒప్పందం ఉందా? అని ప్రశ్నించారు.

అందగత్తెల కాళ్లు కడిగిస్తారా?

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వరంగల్ పర్యటనలో ప్రపంచ సుందరి పోటీదారుల కాళ్లను తెలంగాణ మహిళలతో కడిగించడం రాష్ట్రానికి తీవ్ర అవమానకరమని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతులు, పంటల కొనుగోళ్లను గాలికి వదిలేసి.. అందాల పోటీలు నిర్వహించడం అవివేకమని విమర్శించారు. అందాల పోటీల కోసం హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద దుకాణాలను మూసివేయించి క్యాట్‌వాక్ నిర్వహించడమేమిటని ఆయన ప్రశ్నించారు. అందాల పోటీదారుల వరంగల్ పర్యటన కోసం.. అక్కడి చిరువ్యాపారుల పొట్టగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అందాల పోటీలకు వ్యాపారుల ఇళ్లు కూలుస్తారా?: బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్న ప్రజా పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. అందాల పోటీల కోసం వరంగల్, నాగర్‌కర్నూలులో.. రోడ్డు పక్కన చిరు వ్యాపారుల దుకాణాలను కూల్చడాన్ని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం రాకేశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కూల్చివేతలతో నష్టపోయిన చిరు వ్యాపారులకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల అమలుకు డబ్బులు లేవంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. అందాల పోటీల కోసం రూ.200 కోట్లు ఖర్చు పెట్టడాన్ని ప్రశ్నించారు. గత ప్రభుత్వం నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌ను రద్దు చేసిన రేవంత్ ప్రభుత్వం.. అందాల పోటీలతో రాష్ట్రానికి వచ్చే లాభమేమిటో చెప్పాలని రాకేశ్‌రెడ్డి నిలదీశారు.

నేడు గుట్ట, పోచంపల్లిలో అందాల భామల పర్యటన

సాక్షి, యాదాద్రి: ప్రపంచ హెరిటేజ్ విలేజ్ భూదాన్ పోచంపల్లి, ఆధ్మాతిక క్షేత్రమైన యాదగిరిగుట్టకు గురువారం ప్రపంచ సుందరీమణులు రానున్నారు. ముందుగా పోచంపల్లిలో చేనేత ఇక్కత్, డబుల్ ఇక్కత్ చీరల తయారీ, పుట్టపాక తేలియా రుమాల్, సిద్దిపేట గొల్లభామ, నారాయణపేట, గద్వాల చీరలు, వస్త్రాలను పరిశీలిస్తారు. ఇందు కోసం 13 స్టాళ్లను ఏర్పాటు చేశారు. చేనేత విశిష్టతను వివిధ దేశాల అందగత్తెలకు వివరించేందుకు ప్రత్యేకంగా ట్రాన్స్‌లేటర్‌ను ఏర్పాటు చేశారు. మరోవైపు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే కోలాటం ప్రత్యేక ఆకర్షణ కానుంది. కృష్ణశిలతో నిర్మితమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయ విశిష్టతను ప్రపంచ సుందరీమణులకు వివరిస్తారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకుతారు. దేవస్థానం, చేనేత వస్త్రాల ప్రాముఖ్యతలను ప్రపంచ వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతుందని కలెక్టర్ హనుమంతరావు, పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ మండడి ఉపేందర్‌రెడ్డి చెప్పారు.

EDUCATION SPECIAL FEATURE

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు 'దోస్త్'

తెలంగాణలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం ● టీజీ దోస్త్ 2025 నోటిఫికేషన్ విడుదల ● మూడు విడతల్లో కౌన్సెలింగ్

తెలంగాణలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు 'డిగ్రీ ఆన్‌లైన్ సేవలు, తెలంగాణ' (దోస్త్–2025) నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు అందించే డిగ్రీ కోర్సుల్లో సీట్లను సింగిల్ విండో విధానంలో భర్తీ చేస్తారు. చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్(సీబీసీఎస్)తో సెమిస్టర్ విధానం, నూతన సిలబస్, సబ్జెక్టులను ఎంచుకునేందుకు బకెట్ విధానం, టెక్నాలజీ సబ్జెక్టులను ప్రవేశం పెట్టడం తదితరాల ద్వారా కొన్నేళ్లుగా రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల రూపురేఖలను మార్చే ప్రయత్నం జరుగుతోంది. ఈ నేపథ్యంలో.. దోస్త్–2025 ద్వారా ప్రవేశాలు లభించే కోర్సులు, యూనివర్సిటీలు, కౌన్సెలింగ్ ప్రక్రియ, రిజిస్ట్రేషన్ విధానం తదితర వివరాలు..

కోర్సులు ఇవే..

దోస్త్ ద్వారా బీఏ, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్, బీకామ్, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీఎస్‌డబ్ల్యూ(బ్యాచిలర్ ఆఫ్ సోషల్ వర్క్), బీ ఒకేషనల్, రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి అందించే పాలిటెక్నిక్ కాలేజీల్లోని డి.ఫార్మసీ(డిప్లొమా ఇన్ ఫార్మసీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్) అందించే డిప్లొమా ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఆయా డిగ్రీ కోర్సుల వ్యవధి మూడేళ్లుగా ఉంది. అదేవిధంగా నాలుగేళ్ల హానర్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ప్రవేశం కల్పించే విశ్వవిద్యాలయాలు

6 ప్రధాన యూనివర్సిటీలకు సంబంధించిన దాదాపు వెయ్యి కాలేజీల్లో వివిధ విభాగాల్లో 4 వందలకుపైగా యూజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ విశ్వవిద్యాలయం, మహాత్మాగాంధీ యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ, జేఎన్‌టీయూ హైదరాబాద్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, తెలంగాణ రాష్ట్ర సాంకేతికవిద్యా మరియు శిక్షణ మండలి(టీఎస్–బీటీఈటీ),నిథమ్‌ల్లో టీజీదోస్త్–2025 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

బకెట్ విధానం

ఆయా డిగ్రీ కోర్సు(చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్)లకు సంబంధించిన విభిన్న సబ్జెక్టులను నాలుగు గ్రూపులు(బకెట్1, బకెట్2, బకెట్ 3, బకెట్ 4)గా విభజించారు. ఉదాహరణకు బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. బకెట్1లో మ్యాథమెటిక్స్; బకెట్ 2లో ఫిజిక్స్, డేటా సైన్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్; బకెట్ 3లో కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్, జియాలజీ; బకెట్ 4లో నెట్‌వర్క్ అండ్ హార్డ్‌వేర్, జాగ్రఫీ, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ ఉన్నాయి. ప్రతి బకెట్‌నుంచి ఒక కోర్సును ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇదే విధానం బీఏ, బీఎస్సీ లైఫ్‌సైన్సెస్‌కు కూడా ఉంది. ఇలా ఆయా కోర్సుల్లో చేరిన విద్యార్థులు తమ ఆసక్తి మేరకు ఒక్కో బకెట్ నుంచి ఒక్కో సబ్జెక్టు చొప్పున ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

స్పష్టత ముఖ్యం

దోస్త్ ద్వారా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు ముందుగా తమకు ఇష్టమైన కోర్సులు, చేరాలనుకుంటున్న కాలేజీలపై కసరత్తు చేయాలి. తమ ఆసక్తులు, జాబ్ మార్కెట్‌లో ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు, కెరీర్ స్కోప్‌ను పరిగణనలోకి తీసుకొని వెబ్ ఆప్షన్లు ఇవ్వడం మేలు చేస్తుంది.

రిజిస్ట్రేషన్ ఇలా..

- దోస్త్ ప్రవేశ ప్రక్రియ ఎంతో సులభం. విద్యార్థులు స్వయంగా ఆన్‌లైన్ విధానంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు.
- ప్రవేశ ప్రక్రియ ప్రారంభించేందుకు దోస్త్ వెబ్‌సైట్‌లో క్యాండిడేట్ ప్రీ రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవాలి. ఇందుకోసం విద్యార్థి ఇంటర్ హాల్ టికెట్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ తదితర వివరాలు నమోదు చేయాలి.
- ఇలా ప్రీ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న వారికి దోస్త్ ఐడీ లభిస్తుంది. ఈ దోస్త్ ఐడీ పొందిన తర్వాత దరఖాస్తు ఫీజు చెల్లించి పిన్ పొందాలి. ఈ పిన్‌ను ప్రవేశ ప్రక్రియ ముగిసే వరకూ భద్రంగా ఉంచుకోవాలి. దోస్త్ యాప్‌లో రిజిస్ట్రేషన్ ద్వారా కూడా ఐడీని పొందే అవకాశముంది.
- దోస్త్ ఐడీ, పిన్‌ను పొందిన తర్వాత వీటిని ఉపయోగించి తదుపరి దశల కోసం లాగిన్ అయి.. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంను నింపాలి. దరఖాస్తులో అవసరమైన అన్ని వివరాలు నింపాలి. ఒకసారి డేటా సబ్మిట్ చేసిన తర్వాత దాన్ని మార్చడానికి వీలుండదు.
- దరఖాస్తు ఫారం పూర్తిచేసి.. సబ్మిట్ చేసిన తర్వాత విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నింపాలి. తమకు ఇష్టమైన కోర్సులు, కళాశాలల ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేయాలి. సీటు కేటాయింపు విద్యార్థి ఇచ్చిన ఈ ప్రాధాన్యతల ఆధారంగానే జరుగుతుంది. కాబట్టి ప్రతి ప్రాధాన్యతను జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి.

సీటు కేటాయింపు, సెల్ఫ్ రిపోర్టింగ్

- వెబ్ ఆప్షన్లు పూర్తి చేసిన విద్యార్థులకు మాత్రమే సీటు కేటాయింపు చేస్తారు.
- ఇందుకోసం విద్యార్థి మెరిట్‌తోపాటు రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుంటారు.
- లభించిన సీటుతో విద్యార్థి సంతృప్తి చెందితే ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ (ధ్రువీకరణ) చేసి సంబంధిత ఫీజు చెల్లించాలి.
- పొందిన సీటుతో సంతృప్తి చెందని వారు రిజర్వేషన్ ఫీజు చెల్లించి.. రెండవ, మూడవ విడత కౌన్సెలింగ్‌ల్లో మెరుగైన సీటు కోసం వెబ్ ఆప్షన్ల ప్రక్రియలో పాల్గొనవచ్చు.

తుది ధ్రువీకరణ

ఏ దశలోనైనా సీటు పొందిన విద్యార్థులు 24.06.2025 నుంచి 28.06.2025లోపు తమకు కేటాయించిన కళాశాలకు వ్యక్తిగతంగా హాజరై, అవసరమైన సర్టిఫికెట్లు సమర్పించి ఫీజు చెల్లించాలి. అప్పుడే సీటు అధికారికంగా లభించినట్లవుతుంది. లేకుంటే సీటు రద్దు అవుతుంది.

అవసరమైన సర్టిఫికెట్లు

రిజర్వేషన్ ద్వారా సీటు పొందాలనుకుంటే.. తెలంగాణ ప్రభుత్వం మీ సేవా కేంద్రం ద్వారా జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలి. అదేవిధంగా 01.04.2025 తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

తరగతుల ప్రారంభం: 30.06.2025
పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://dost.cgg.gov.in

మూడు విడతల దోస్త్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఇలా...

- ఫేజ్ 1 రిజిస్ట్రేషన్ : 03.05.2025 నుంచి 21.05.2025
- ఫేజ్ 1 వెబ్ ఆప్షన్లు : 10.05.2025 నుంచి 22.05.2025
- ఫేజ్ 1 సీట్ అలాట్‌మెంట్ : 29.05.2025
- ఫేజ్ 1 ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ : 30.05.2025 నుంచి 06.06.2025
- ఫేజ్ 2 రిజిస్ట్రేషన్ : 30.05.2025 నుంచి 08.06.2025
- ఫేజ్ 2 వెబ్ ఆప్షన్లు : 30.05.2025 నుంచి 09.06.2025
- ఫేజ్ 2 సీట్ అలాట్‌మెంట్ : 13.06.2025
- ఫేజ్ 2 ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ : 13.06.2025 నుంచి 18.06.2025
- ఫేజ్ 3 రిజిస్ట్రేషన్ : 13.06.2025 నుంచి 19.06.2025
- ఫేజ్ 3 వెబ్ ఆప్షన్లు : 13.06.2025 నుంచి 19.06.2025
- ఫేజ్ 3 సీట్ అలాట్‌మెంట్ : 23.06.2025
- ఫేజ్ 3 ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ : 23.06.2025 నుంచి 28.06.2025



'కాదు' అనేది ఏమీ దాచదు.
కానీ 'అవును' అనేది సులభంగా మోసం చేయగలదు.
- సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 15 మే 2025

'శాంతిదూత' ట్రంప్!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంత సులభంగా అర్థం కారని ఆయన గల్ఫ్ దేశాల పర్యటన తీరుతెన్నులు చూస్తే తెలుస్తుంది. తాను అధికారంలోకొస్తే పశ్చిమాసియాలో సాగుతున్న 'అంతూ దరీ లేని యుద్ధాలకు' ముగింపు పలుకుతానని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆయన తరచు అనే వారు. ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగు రోజుల గల్ఫ్ పర్యటనలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు గమనిస్తే ఆ వాగ్దానాన్ని ఆయన నెరవేర్చదల్చుకున్నట్టు కనబడుతోంది. తన రెండో దశ పాలనలో ట్రంప్ మొదలెట్టిన తొలి విస్తృత విదేశీ పర్యటన ఇది. ఈ ప్రాంతంలోనే ఉన్న ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లకపోవటం ఆయన తాజా వైఖరికి సంకేతం. ఇది ఎన్నాళ్లుంటుందన్నది తెలియకపోయినా చేస్తున్న ప్రకటనలైతే భిన్నంగా ఉన్నాయి. ఇరాన్‌తో అమెరికా 46 ఏళ్లుగా సాగిస్తున్న 'అప్రకటిత యుద్ధం' ఇక కొనసాగనీయరాదన్న అభిప్రాయం ఉందని మంగళవారం సౌదీ అరేబియాలోని రియాద్‌లో ఆయన ప్రకటించారు. బుధవారం సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షారాతో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుకోవాలని సలహా ఇచ్చారు. అల్-షారాకు గతంలో అల్ కాయిదాతో, ఐఎస్‌తో సంబంధాలుండేవి. ఈ భేటీకి ముందే గల్ఫ్ సహకార మండలి(జీసీసీ) సదస్సులో సిరియాపై ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు తెలియజేశారు. ఈ నిర్ణయాలపై ఇజ్రాయెల్ అలిగినా, మరొకరు అభ్యంతర పెట్టినా ఆయన ఖాతరు చేయదల్చుకున్నట్టు లేరు. గత నెలలో ట్రంప్‌ను కలిసి సిరియాపై ఆంక్షలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వేడుకున్నారు. ఇరాన్ విషయంలో అయితే చాలా చెప్పివుంటారు. సిరియాపై ఆంక్షలు ఎత్తేయటం, ఇరాన్‌తో చెలిమికి సిద్ధపడటం నెతన్యాహూకు ససేమిరా ఇష్టం లేదు. కానీ లీకుల ద్వారా తప్ప నేరుగా తన అసమ్మతిని ఇంతవరకూ తెలియజేయలేదు. ఆ మధ్య ట్రంప్ ఇందుకు భిన్నంగా మాట్లాడారు. అణు ఒప్పందాన్ని అంగీకరించి, శాంతికి సిద్ధపడకపోతే ఇరాన్ భారీ స్థాయి ఒత్తిడులు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కానీ ట్రంప్ తాజా ధోరణి అందుకు భిన్నంగా ఉంది. ఇరాన్‌తో చెలిమి గురించి ఆయన ఏదో మాటవరసకు అనలేదు. 'ప్రస్తుతం అమెరికాకు అత్యంత సన్నిహిత దేశాలు కొన్ని తరాల కిందట మాపై శత్రుత్వంతో చెలరేగినవే' అని గుర్తుచేశారు. సిరియా, ఇరాన్‌ల విషయంలో తన వైఖరి మారటానికి సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ కారణమని ఆయన జీసీసీ వేదికపైనే ప్రకటించారు కూడా. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు ఇజ్రాయెల్‌పై విరుచుకుపడుతూనే ఉన్నా ఈనెల 5న వారితో అవగాహనకొచ్చారు.

స్నేహంలోనైనా, శత్రుత్వంలోనైనా ట్రంప్ తీరే వేరని ఆయన నిర్ణయాలు తెలియజేస్తున్నాయి. మూడేళ్లనాడు అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సౌదీ వచ్చినప్పుడు దేశంలో మానవహక్కులు అడుగంటుతున్న వైనంపై సౌదీ యువరాజును నేరుగా ప్రశ్నించారు. 2018లో జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి ప్రాణం తీయించడాన్ని ప్రస్తావించారు. ఈ మాదిరి హత్యలు తమకు సమ్మతంకావని చెప్పారు. అందుకే కావొచ్చు... ఇప్పుడు ట్రంప్‌కు ఎదురైన స్వాగతసత్కారాల వంటివి బైడెన్‌కు లభించలేదు. సౌదీ గడ్డపై గతకాలపు అమెరికా అధ్యక్షుల్ని నిశితంగా విమర్శించటానికి ట్రంప్ వెనకాడలేదు. అమెరికన్ సమాజం గురించి కాస్తయినా తెలియనివారు ఎంతో జటిలమైన గల్ఫ్ సమాజాల్లో జోక్యం చేసుకోవటానికి ఎగబడ్డారని వ్యాఖ్యానించటం చిన్న విషయం కాదు. పశ్చిమాసియా దేశాలతో ఎన్ని వేల కోట్ల డాలర్ల ఒప్పందాలు కుదుర్చుకోగలమన్నదే ఆయన ఆరాటంగా కనబడుతోంది. దానికి తగ్గట్టే మంగళవారం సౌదీతో 14,200 కోట్ల డాలర్ల మేర ఆయుధ ఒప్పందంపై సంతకాలయ్యాయి. ఇదిగాక అమెరికాలో 60,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్టు యువరాజు ప్రకటించారు. ట్రంప్ దీంతో సంతృప్తిపడలేదు. దీన్ని లక్ష కోట్ల డాలర్లకు పెంచాలని ఆ వేదికపైనుంచే కోరారు. సౌదీతో అమెరికాకు ఎప్పుడూ మంచి స్నేహసంబంధాలేవున్నా ఈ స్థాయి ఒప్పందాలెప్పుడూ లేవు. ఒక పరిశోధక సంస్థ నివేదిక ప్రకారం 2010–20 మధ్య అమెరికాకు సౌదీతో 10,000 కోట్ల డాలర్ల విలువైన ఆయుధ ఒప్పందాలు మాత్రమే కుదిరాయి.

స్నేహం పేరుతో అమెరికాను దోచుకుంటున్నారని నాటో భాగస్వామ్య దేశాలైన పాశ్చాత్య మిత్రులపై తరచూ విరుచుకుపడే ట్రంప్...పశ్చిమాసియా దేశాలకు ఏ కష్టమొచ్చినా అమెరికా దృఢంగా నిలబడుతుందని హామీ ఇవ్వటం గమనార్హం. ఇంధన అవసరాల్లోనూ, రక్షణరంగంలోనూ పనికొచ్చే అత్యంత విలువైన లిథియం, కోబాల్ట్‌లతోపాటు థోరియం వంటి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అన్వేషించి అమెరికా చేర్చటానికి సౌదీ–అమెరికా ఖనిజ సంస్థల మధ్య ఈ పర్యటనలో 900 కోట్ల డాలర్ల ఒప్పందం కుదరటంతో ట్రంప్ సంతోషానికి పట్టపగ్గాల్లేవు. అందువల్లే పశ్చిమాసియాకు శక్తిమంతమైన సెమీ కండక్టర్ చిప్స్, ఏఐ డేటా సెంటర్లకు పనికొచ్చే కీలక విడిభాగాల ఎగుమతులకు ఆయన పచ్చజెండా ఊపారు. ఇది సంప్రదాయ అమెరికా విదేశాంగ విధానానికి భిన్నం.

ఈ పర్యటనలో ట్రంప్ స్వకార్యమూ నెరవేర్చుకుంటున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దేశ ప్రయోజనాలకూ, అధ్యక్షుడిగా ఆయన నిర్ణయాలకూ చుక్కెదురన్నది విమర్శకుల వాదన. ట్రంప్ సొంత సంస్థకు సారథ్యం వహిస్తున్న ఆయన కుమారులు గత కొన్నివారాలుగా గల్ఫ్‌లో తిష్ఠ వేసి తమ సంస్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారనీ, కుదిరిన ఒప్పందాలన్నీ వారికి మేలు కలిగించేవేననీ అంటున్నారు. ఏది ఏమైనా ట్రంప్ వైఖరి మళ్లీ మారేలోగా పశ్చిమాసియా చక్కబడితే ప్రపంచానికి అంతకన్నా కావాల్సిందేమీ లేదు.

ద్వైపాక్షిక వాణిజ్యాల 'లోటు'పాట్లు

మూడేళ్ల చర్చల అనంతరం మే 6న ఇండియా, యూకే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ నేపథ్యంలో అసలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలతో ఇండియాకు జరిగిన మేలెంతో, లోటెంతో సమీక్షించుకోవడం అవసరం.



ఏదైనా రెండు దేశాల మధ్య జరిగే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాన్ని 'ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం'గా భావిస్తాం. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడి కార్యకలాపాలను ప్రోత్సహించడం లక్ష్యంగా వస్తు, సేవల వినిమయానికి సంబంధించి ఈ ఒప్పందాలు జరుగుతాయి. దిగుమతి సుంకాలు, దిగుమతి కోటాలు, ఎగుమతులపై నియంత్రణ లాంటి వాణిజ్య అడ్డంకుల నిర్మూలనకు ఈ ఒప్పందాలు దోహదపడతాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ గణాంకాల ప్రకారం, 2024 సెప్టెంబర్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 373 వాణిజ్య ఒప్పందాలపై (సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాలు, సమగ్ర ఆర్థిక సహకార ఒప్పందాలు కలుపుకొని) ఇండియా సంతకం చేసింది.

ఎగుమతులు తక్కువ, దిగుమతులు ఎక్కువ

మార్కెట్ అందుబాటు పెంపు, ఎగుమతుల పెంపు ద్వారా అధిక వృద్ధి సాధన లక్ష్యంగా వివిధ దేశాలతో భారత్ ఈ ఒప్పందాలు కుదుర్చుకుంది. కానీ ఆ లక్ష్య సాధనలో ప్రతికూల, మిశ్రమ పరిస్థితులను ఎదుర్కొంటున్నది. వ్యవసాయం, తయారీ, సేవా రంగాలను పరిశీలించినప్పుడు ఆ యా రంగాలకు సంబంధించి కొన్ని పరిశ్రమలు ప్రయోజనం పొందగా, మిగిలిన రంగాలు అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నాయి. వాణిజ్య ఒప్పందాల కారణంగా వాణిజ్య పరిమాణంలో పెరుగుదల ఏర్పడినప్పటికీ, ఎగుమతులతో పోల్చినప్పుడు దిగుమతుల పరిమాణం పెరిగి భారత్‌కు సంబంధించి వాణిజ్య లోటు పెరిగింది. 'ఏషియాన్'– ఇండియా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం తర్వాత, ఆ యా దేశాలకు సంబంధించి భారత్ వాణిజ్య లోటు 2011లో 7.5 బిలియన్ డాలర్లు కాగా, 2023లో 44 బిలియన్ డాలర్లకు పెరిగింది. దక్షిణ కొరియాతో ఒప్పందం జరిగే సమయంలో భారత్ వాణిజ్య లోటు 4 బిలియన్ డాలర్లు కాగా, ప్రస్తుతం 9 బిలియన్ డాలర్లకు పెరిగింది.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల కారణంగా భారత్ స్వదేశీ పరిశ్రమలు – ముఖ్యంగా చిన్న, మధ్యతరహా సంస్థలు, వ్యవసాయం, డైరీ రంగాలపై ప్రతికూల ప్రభావం ఏర్పడింది. ఒప్పంద దేశాల నుండి 'చౌక దిగుమతుల' కారణంగా భారత్‌లో స్థానిక రైతులు, ఉత్పత్తిదారులకు ఇబ్బందికర వాతావరణం ఏర్పడింది. వాణిజ్య సరళీకరణ వలన ఐటీ, సేవలకు కొంతమేర ప్రయోజనం ఏర్పడినప్పటికీ, సంప్రదాయ పరిశ్రమలు అధిక దిగుమతుల కారణంగా పోటీ ఎదుర్కొంటున్నాయి.

స్థానిక మార్కెట్‌లో విదేశీ కంపెనీల ప్రవేశం వలన చిన్న, స్థానిక వ్యాపారాలు పోటీని ఎదుర్కోలేక మూసివేతకు గురవుతాయి. అలాగే కొన్ని ఉత్పత్తుల ధరలు అధికంగా ఉన్నప్పటికీ, అధిక సామర్థ్యంతో కూడిన సప్లయ్‌దారుల నుండి వాణిజ్య ప్రవాహం భాగస్వామ్య దేశాలకు జరుగుతుంది. 2017 నుండి 2022 మధ్య కాలంలో ఒప్పంద భాగస్వామ్య దేశాలకు సంబంధించి భారత్ ఎగుమతులలో 31 శాతం పెరుగుదల ఏర్పడగా, దిగుమతులలో 82 శాతం పెరుగుదల ఏర్పడింది. దక్షిణ కొరియా, ఏషియాన్ దేశాలు టెక్స్‌టైల్స్, తోలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్‌ను తక్కువ ధరకు ఉత్పత్తి చేయడం వలన ఆ యా ఉత్పత్తులకు సంబంధించి భారత్ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం ఏర్పడింది.

దిగుమతేతర సుంకాల ఇబ్బందులు

వాణిజ్య ఒప్పందాలలో భాగంగా దిగుమతి సుంకాలకు సంబంధించి స్పష్టత ఉన్నప్పటికీ, దిగుమతేతర సుంకాలు వస్తు ప్రవాహానికి అవరోధంగా నిలుస్తున్నాయి. దిగుమతి కోటా, దిగుమతి లైసెన్సింగ్, రూల్స్ ఆఫ్ ఆరిజిన్(వస్తు తయారీ మూలానికి సంబంధించిన), శానిటరీ, ఫైటో శానిటరీ(చీడలు, వ్యాధులు లేవని చెప్పాల్సిన) చర్యలు, సాంకేతిక నియంత్రణలు, కస్టమ్స్ కార్యసరళిని దిగుమతేతర సుంకాలుగా భావించవచ్చు.

దక్షిణ కొరియా మార్కెట్ అందుబాటు భారత ఉత్పత్తులకు క్లిష్టంగా మారడానికి శానిటరీ, ఫైటో శానిటరీ చర్యలు, సర్టిఫికేషన్ ఆవశ్యకత లాంటివి కారణాలుగా నిలుస్తున్నాయి. దిగుమతి లైసెన్సింగ్, రూల్స్ ఆఫ్ ఆరిజిన్ క్లిష్టతరంగా ఉండటం, శానిటరీ, ఫైటో శానిటరీ చర్యల వల్ల థాయ్‌లాండ్‌కు భారత ఎగుమతుల వృద్ధి తగ్గింది. మలేషియా అవలంబిస్తున్న వాణిజ్యపరమైన సాంకేతిక అడ్డంకులు, శానిటరీ, ఫైటో శానిటరీ చర్యలు భారత్ ఎగుమతులపై ప్రభావం చూపిస్తున్నాయి. ఆస్ట్రేలియా దిగుమతేతర సుంకాల చర్యలలో భాగంగా ఆరోగ్యం, భద్రతా సర్టిఫికేషన్స్, బయో సెక్యూరిటీ ఆవశ్యకత, ఇతర ప్రమాణాలు భారత్ ఎగుమతులపై ప్రభావం చూపించాయి. అధిక దిగుమతి ప్రమాణాలను పాటిస్తున్న కారణంగా జపాన్‌కు సంబంధించి భారత్ ఎగుమతులలో ప్రతిష్టంభన ఏర్పడింది. దిగుమతేతర సుంకాలు భారత్ ఎగుమతిదారుల ఎగుమతుల అవకాశాలను పరిమితం చేస్తున్నాయి. వాణిజ్య వ్యయాల పెరుగుదల, మార్కెట్ అందుబాటు పెరగకపోవడం వాణిజ్య సరళీకరణ ప్రయోజనాలను భారత్ అందుకోలేకపోవడానికి కారణమయ్యాయి.

ఉదాహరణకు 2019–23 కాలానికి జపాన్‌కు ఇండియా ఎగుమతుల విలువ 5,730 మిలియన్ డాలర్లు కాగా, దిగుమతుల విలువ 19,900 మిలియన్ డాలర్లు. ఇదే కాలానికి యూఏఈకి మన ఎగుమతుల విలువ 30 వేల మిలియన్ డాలర్లు కాగా, దిగుమతుల విలువ 50,510 మి.డాలర్లు. ఇక ఆస్ట్రేలియాకు మన ఎగుమతులు 8,730 మి.డాలర్లు కాగా, దిగుమతులు 11,300 మి.డాలర్లు. శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, అఫ్గానిస్తాన్, చిలీ లాంటి చిన్న ఆర్థిక వ్యవస్థలు మినహా పెద్ద వాణిజ్య దేశాలతో భారత్ వాణిజ్య లోటు పెరిగింది. అయితే, 2000–24 మధ్య కాలంలో మారిషస్, సింగపూర్, జపాన్, యూఏఈ నుండి భారత్ అధిక విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను మాత్రం ఆకర్షించగలిగింది. భారత్ మొత్తం వాణిజ్యంలో భాగస్వామ్య ఒప్పంద దేశాల వాటా సుమారు 20 శాతం.

అడ్డంకులు తొలగించుకునేలా...

ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలుగా– నార్త్ అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్–నాఫ్టా (అమెరికా, మెక్సికో, కెనడా), ట్రాన్స్ – పసిఫిక్ భాగస్వామ్యం (జపాన్, ఆస్ట్రేలియా, సింగపూర్), సమగ్ర ప్రాంతీయ భాగస్వామ్య ఒప్పందం (ఆర్‌సీఈపీ), చైనా – ఏషియాన్ ఒప్పందాలను పేర్కొనవచ్చు. భారత్‌కు సంబంధించి వాణిజ్య ఒప్పందాల ముందు కాలంతో పోల్చినప్పుడు ఒప్పందం అమలు కాలంలో భారత్ వాణిజ్య పరిమాణం, విలువలో పెరుగుదల ఏర్పడింది. అయితే, ముఖ్య భాగస్వామ్య దేశాల నుండి దిగుమతులు పెరిగిన కారణంగా భారత్ వాణిజ్య లోటులో పెరుగుదల ఏర్పడింది.

అందుకే వాణిజ్యపరంగా వ్యూహాత్మకమైన దేశాలతో ఒప్పందాల కోసం భారత్ ప్రయత్నించాలి. నియంత్రణలు, దిగుమతేతర సుంకాల అడ్డంకులను భాగస్వామ్య దేశాలు తొలగించే విధంగా వాణిజ్య ఒప్పందాలను సమీక్షించాలి. అమెరికాతో సహా వాణిజ్యపరంగా ముందంజలో ఉన్న ఏ దేశాలతోనైనా దిగుమతి సుంకాలు, దిగుమతేతర సుంకాల చర్యలను తగ్గించినట్లయితే భారత్ మార్కెట్ విస్తృతి పెరుగుతుంది.

> ◆ ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రకారం, 2024 సెప్టెంబర్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 373 వాణిజ్య ఒప్పందాలపై ఇండియా సంతకం చేసింది.
>
> ◆ 2017–2022 మధ్య కాలంలో ఒప్పంద భాగస్వామ్య దేశాలకు సంబంధించి భారత్ ఎగుమతులలో 31 శాతం పెరుగుదల ఏర్పడగా, దిగుమతులలో 82 శాతం పెరుగుదల కనబడింది.
>
> ◆ దిగుమతేతర సుంకాలు భారత్ ఎగుమతిదారుల అవకాశాలను పరిమితం చేస్తున్నాయి. ఈ అడ్డంకులను భాగస్వామ్య దేశాలు తొలగించే విధంగా వాణిజ్య ఒప్పందాలను సమీక్షించాలి.

వ్యాసకర్తలు డా॥ తమ్మా కోటిరెడ్డి, ప్రొఫెసర్ అండ్ డీన్; రితికారావు వీరిశెట్టి, పీహెచ్‌డీ స్కాలర్, ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, హైదరాబాద్

సోషల్ మీడియా

మంచి నిర్ణయం



ఉద్యోగ విరమణ అనంతరం మరో పదవిని చేపట్టనని ప్రకటించిన జస్టిస్ సంజీవ్ ఖన్నాను మెచ్చుకుంటున్నాను. భారత న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడటానికి ఇది గొప్ప అడుగు. భవిష్యత్తులో ఇదే అందరికీ ప్రమాణం కావాలని ఆశిస్తాను.

– యశ్వంత్ సిన్హా, కేంద్ర మాజీ మంత్రి

అసలు వాళ్లెక్కడ?



నలుగురు మనుషులు 26 మంది అమాయక పర్యాటకులను చంపేసి మాయమవుతారు– బహుశా వాళ్లు విదేశంలో భద్రంగా పండుగ చేసుకుంటుండవచ్చు. ఒక ప్రాంతం మొత్తంలో ఉద్రిక్తతలు చెలరేగడం, వాయు దాడులు, ఐక్యరాజ్యసమితి చర్చలు అన్నింటినీ ప్రపంచం చూసింది. నేను అడుగుతున్నా – ఈ మొత్తాన్ని మొదలుపెట్టిన ఆ నలుగురు ఎక్కడ?

– సబీర్ భాటియా, 'హాట్‌మెయిల్' సృష్టికర్త

అది ముఖ్యం



పాకిస్తాన్ మిలిటరీ అకాడెమీకి కేవలం మైలు దూరంలోని అబోటాబాద్‌లో ఒసామా బిన్ లాడెన్ తలదాచుకున్న విషయం పాక్ ప్రభుత్వానికి తెలుసా, లేదా అన్నది ముఖ్యం కాదు. తాను భద్రంగా ఉండే ఏకైక దేశం పాక్ అని లాడెన్ భావించడం కీలకాంశం.

– అనింద్యో చక్రవర్తి, జర్నలిస్ట్

మనకెవరు?



గత కొన్ని రోజులు ఇండియాకు కఠినతరమైనవి. పాక్ ప్రాయోజిత ఉగ్రవాదం మీద ఇండియా పోరాటం నిశ్చయంగా ఒంటరిది. అమెరికా, చైనా అన్నిచోట్లా వ్యూహాత్మక శత్రువులు కావొచ్చు, కానీ పాక్ కోసం మాత్రం రెండూ కలిసి వచ్చాయి.

– ఇంద్రాణీ బాగ్చీ, సంపాదకురాలు

మిత్రదేశమేనా?



నిజమైన సమస్య వచ్చినప్పుడు 'క్వాడ్' ఇండియాకు సాయపడలేదు. ఘర్షణ ఆపాలని యూఎస్ కేవలం సలహా ఇచ్చింది. హుమ్... అది ఎలాంటి మిత్రదేశం!

– అలెగ్జాండర్ దుగిన్, రష్యన్ థింకర్

ఇన్ బాక్స్

మేమందరం ఆయన శిష్యులమే!

కమ్యూనిస్టుల ప్రాబల్యం గణనీయంగా ఉన్న రోజుల్లో వారికి వ్యతిరేకంగా యువతను కూడగట్టి సంప్రదాయ యుద్ధవిద్యలు నేర్పి రాజకీయాలు నడిపిన సీనియర్ నాయకుడు అడుసుమిల్లి సీతారామారావు. ఆయన కృష్ణా జిల్లా కవుతారం గ్రామంలో 1928 మార్చి 19న జన్మించారు. విద్యార్థి దశ నుండి రాజకీయాల్లో పాల్గొంటూ నిజాం పాలనకు వ్యతిరేకంగా కె.వి. రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, చేకూరి కాశయ్య వంటి వారితో కలిసి పెక్కు పోరాటాల్లో పాల్గొన్నారు. అప్పటికి ఈ కార్యక్రమాల వార్తలు, సందేశాలు ప్రచురించడానికి పత్రికలు ముందుకు రాకపోవడంతో, తానే సికింద్రాబాదులో స్వయంగా ఒక ప్రింటింగ్ ప్రెస్‌ను నెలకొల్పి – కరపత్రాల ద్వారా ఈ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే వారు.



అడుసుమిల్లి సీతారామారావు

తదుపరి దివి తాలూకా వెలివేలు గ్రామంలో స్థిరపడి, కాకాని వెంకటరత్నం నాయకత్వంలో కమ్యూనిస్టు ఉద్యమానికి వ్యతిరేకంగా పోరాడటానికి– దాదాపు 25 గ్రామాల యువకులను సమీకరించి వారికి కర్రసాము, కత్తిసాములలో శిక్షణ ఇచ్చి వారిలో పోరాట పటిమను పెంపొందించారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలో నిర్వాసితుల కోసం బోర్డర్ క్యాంప్‌లను నిర్వహించారు. ఆ మీదట ఆచార్య రంగా, గౌతు లచ్చన్నల సాహచర్యంతో ఆనాటి 'కృషికార్' పార్టీలో చురుకుగా పాల్గొన్నారు.

1956–57లో చల్లపల్లిలో పంచదార కర్మాగారం నెలకొన్నప్పుడు, తొట్టెంపూడి నాగేశ్వరరావు, మిక్కిలినేని పాపారావులతో కలసి కార్మిక సంఘాన్ని స్థాపించి... కార్మికులకు, యాజమాన్యానికి, మధ్య వారధిగా క్రియాశీలక పాత్ర నిర్వహించారు. 1983లో చల్లపల్లి పంచదార మిల్లు మూతపడి, కార్మికులు రోడ్డున పడి అల్లాడుతున్నప్పుడు, సంబంధిత అన్ని వర్గాల వారినీ సమీకరించి, నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుతో చర్చించి, కె.సి.పి. వారి ఆధ్వర్యంలో మిల్లును తెరిపించారు.

1978లో ముఖ్యమంత్రిగా చెన్నారెడ్డి, ప్రతిపక్ష నాయకునిగా లచ్చన్న, శాసన సభాపతిగా దివి కొండయ్య చౌదరి, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకునిగా రోశయ్య, నీటిపారుదల మంత్రిగా ఓబులరెడ్డి... అందరూ ఆచార్య రంగా గారి రాజకీయ వారసులే! ఆ సందర్భంలో శాసనసభ ప్రాంగణంలో ఒక విందు ఏర్పాటు చేశాం. చెన్నారెడ్డి గారిని ఆహ్వానించడానికి, ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లాం. సీతారామారావు, నేను – రెడ్డిగారిని కలిసి వస్తుండగా, సావిత్రమ్మ గారు కింది అంతస్తులో నుండి, మమ్మలను వెనుకకు పిలిపించారు. 'ఏయ్యా! రెడ్డి గారికేనా విందు – నాకు లేదా?' అన్నారు, నవ్వుతూ. 'అదేమిటమ్మ, మీరు లేకపోవడమేమిటమ్మా?' అన్నారు సీతారామారావు. రజాకార్ల అల్లర్లప్పుడు బోర్డర్ క్యాంప్‌లో చెన్నారెడ్డితోపాటు, సావిత్రమ్మగారు కూడా ఉండటంతో సీతారామారావుగారికి బాగా పరిచయం.

చివరిగా మరొక మాట చెప్పాలి. వడ్డే శోభనాద్రీశ్వరరావు, నేను, కొనకళ్ళ నారాయణ, మాగంటి బాబు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్... ఐదుగురం పార్లమెంట్ సభ్యులుగా పనిచేశాం. మేమంతా అడుసుమిల్లి సీతారామారావు గారి పాదాల వద్ద పెరిగినవారమే. ఆయన కాలం చేసి (2010 మే 5) పదిహేను సంవత్సరాలు. అయినా వారి తీపి గుర్తులు మా అందరికీ చిరస్మరణీయమే.

– డా॥ యలమంచిలి శివాజీ । రాజ్యసభ మాజీ సభ్యులు

తేలని తెలంగాణ బీజేపీ గమనం

అభిప్రాయం



దిలీప్ రెడ్డి

కాంగ్రెస్‌ను 'కప్పల తక్కెడ' అని విమర్శించే బీజేపీ, తెలంగాణ విభాగం పార్టీ అంతర్గత వివాదాల్లో కాంగ్రెస్‌ను మించింది. కమలంలో ఎన్ని పువ్వు రేఖలున్నాయో అంతకన్నా ఎక్కువ గ్రూపులున్నాయని పార్టీ వర్గాలే నర్మగర్భ వ్యాఖ్య చేస్తాయి. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసి ఏడాదిన్నర కావస్తున్నా ఇంకా కొత్త అధ్యక్షుడిని నియమించుకోలేని పరిస్థితి! ఉన్న ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో... అత్యధికులు పార్టీ రాష్ట్ర అధ్యక్ష స్థానానికి పోటీ పడేవారే! వీరిలో ఒకరంటే మరొకరికి పడదు. పార్టీ జాతీయ బాధ్యులు కుదించిన రెండు, మూడు పేర్ల జాబితాల్ని అధిష్ఠానానికి సమర్పించినట్టు సమాచారం.

పోయినసారి ఎన్నికల్లోనే వెనుకబడిన వర్గాల (బీసీ) వ్యక్తిని తెలంగాణ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన బీజేపీ నాయకత్వం, అదే ఒరవడిలో బలమైన బీసీ సామాజికవర్గాలను మచ్చిక చేసుకునే 'సోషల్ ఇంజినీరింగ్'కు యత్నిస్తోంది. ముదిరాజ్, మున్నూరు కాపు (బీసీ), మాదిగ (ఎస్సీ) సామాజికవర్గాలకు ప్రాధాన్యంతో 'త్రీ–ఎమ్ ఫార్ములా'ను ముందుకు తోస్తోంది. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ (కరీంనగర్) పేర్లను అధినాయకత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందని అంటున్నారు. ఒకరు ముదిరాజ్ సామాజికవర్గానికి చెందితే మరొకరు మున్నూరు కాపు సామాజికవర్గం వారు. బండి సంజయ్ ఇదివరకు అధ్యక్షులుగా ఉండి ఇప్పుడు కేంద్రమంత్రిగా ఉన్నందున ఈటల రాజేందర్ వైపు అధినాయకత్వం కొంత మొగ్గింది. పార్టీలో తరచూ రగిలే పాత (తొలి నుంచి పార్టీలో ఉన్న), కొత్త (ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి వచ్చిన) నాయకుల మధ్య ఉండే స్పర్ధ ఒక అడ్డంకిగా మారింది. పార్టీ పాత నాయకులు పలువురు ఈ ఆలోచనను వ్యతిరేకించారు. దానికి తోడు పార్టీ నియమావళి ప్రకారం పదిసార్లకు తగ్గకుండా సాధారణ సభ్యుడిగా, కనీసం మూడు పర్యాయాలు క్రియాశీల సభ్యుడిగా ఉన్న వారిని మాత్రమే అధ్యక్షుడిగా నియమించాలని ఉంది. తమిళనాడు బీజేపీ రాష్ట్రాధ్యక్షుడిగా అన్నామలైని నియమించే విషయంలో లోగడ ఇటువంటి అడ్డంకే వచ్చింది. ఆయన 2017లో ఏఐఏడీఎంకే పార్టీ నుంచి బీజేపీలోకి వచ్చారు. పార్టీ నియమావళిని సడలించడం, పాత నాయకులకు నచ్చజెప్పడం ద్వారా అధిష్ఠానం ఒక నిర్ణయం చేయవచ్చు. అలా చేస్తుందా? అన్నది ప్రశ్న. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి సంతోష్ (సంస్థాగత వ్యవహారాలు), సునీల్ బన్సల్ (రాష్ట్ర ఇంచార్జీ) వారివైన నివేదికలు పై వారికి (మోదీ–షా ద్వయం) ఇచ్చారు.



తెలంగాణలో బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ, ఒక్క రాష్ట్రాధ్యక్ష ఎన్నిక మినహా దాదాపు పూర్తయింది. మండల, జిల్లా స్థాయి అధ్యక్షులు ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షులు ఎన్నికై రెండు, మూడు మాసాలవుతున్నా... రాష్ట్ర అధ్యక్ష ఎన్నికతో ముడివడి ఉండటం వల్ల జిల్లా కమిటీలు ఏర్పాటు కాలేదు. మండల స్థాయి కమిటీలు కూడా పూర్తిస్థాయిలో ఏర్పాటు కావాల్సి ఉంది. ఇవన్నీ పూర్తయితేనే సంస్థాగతంగా బలోపేతం చేసి, గ్రామ స్థాయి వరకు పార్టీని పటిష్ఠపరచి, స్థానిక సంస్థలకు సమాయత్తం చేయడానికి వీలవుతుంది. అన్ని స్థాయిల్లో మూడోవంతు మహిళలుండాలి. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి కమిటీల్లోనూ 'త్రీ ఎమ్ ఫార్ములా'కు ప్రాధాన్యం ఇవ్వాలని నాయకత్వం భావిస్తోంది. రాష్ట్రాధ్యక్ష నియామకపు చిక్కుముడి వీడితే ఈ అన్నీ ఓ కొలిక్కివస్తాయి.

అంచనాల స్థాయిలో బీఆర్ఎస్ రాష్ట్రంలో పుంజుకోవట్లేదని భావిస్తున్న బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయమని భావిస్తున్నాయి. నిజంగానే ప్రజలు ఆ దిశలో ఆలోచించినా... ఆ పరిస్థితిని సానుకూలంగా మలచుకునే స్థితిలో పార్టీ లేదని బీజేపీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. 'త్రీ ఎమ్ ఫార్ములా'లో భాగమైన మాదిగలను ఆకట్టుకోవడానికి గత ఎన్నికల్లోనే మంద కృష్ణ మాదిగను అక్కున చేర్చుకొని ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణకు సానుకూలత ప్రకటించారు. సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా, సదరు బాధ్యతను రాష్ట్రాలకు అప్పగిస్తూ కేంద్రం నిర్ణయించడం, రాష్ట్రంలో ఆ మేర చట్టం తీసుకురావడం జరిగిపోయాయి.

పార్టీని గెలిపిస్తే బీసీని సీఎంగా చేస్తామని ఎన్నికల ప్రకటన చేస్తూ, సరిగ్గా ఎన్నికల ముందు బీసీ రాష్ట్రాధ్యక్షుడిని కారణం చెప్పకుండా అధిష్ఠానం పక్కకు తప్పించడాన్ని ఇప్పటికీ తప్పుబట్టేవారు పార్టీలో ఉన్నారు. అదే సమయంలో, నాటి అసెంబ్లీ ఎన్నికల్లో ముక్కోణపు పోటీని నివారించి బీఆర్ఎస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయేలా చేసి, ఏడాది తర్వాత వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ముఖాముఖి తలపడి ఆధిక్యత తీసుకోవడం పార్టీ వ్యూహమని, అందుకే అలా చేశారని చెప్పేవాళ్లూ ఉన్నారు. వ్యూహాలు ఎత్తుగడల సంగతెలా ఉన్నా... ఢిల్లీ నాయకత్వం స్థాయిలో రాష్ట్ర పార్టీ పని చేయటం లేదనే భావన బలంగా ఉంది. పార్లమెంటు కమిటీ హాలులో ప్రత్యేక సమావేశం పెట్టి ప్రధాని మోదీ మందలించిన తర్వాత రాష్ట్ర ఇంచార్జీ బన్సల్ మందలించింది కూడా అందుకే! 'గోడమీద రాతల నుంచి చిన్న పోస్టర్ అతికించడం వరకు... అన్నీ డబ్బుమయం అయిపోయాయి తప్ప తెలంగాణలో ఆశించిన ఫలితాలు రావట్లేద'ని ఆయన మండిపడటం వెనుక ఎంత నిజముందో పార్టీ రాష్ట్ర నాయకత్వం బేరీజు వేసుకోవాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

అద్దం – గురువు

అద్దం ఎదుటి వస్తువును తనలో చూపిస్తుంది. మన ముఖం ఎలా ఉందో చూసుకోవాలంటే అద్దంలో చూడాల్సిందే కదా ! కనురెప్ప కన్నును రక్షిస్తుంది కానీ కన్నును చూడలేదు. అంత వరకెందుకు, అన్నింటినీ చూడగలిగిన కన్ను తనను తాను చూచుకోలేదు. అలా చూచుకోవాలంటే అద్దం కావలసిందే! అద్దంలో ఏదైనా ప్రతిబింబిస్తుంది. కాని అద్దంలో కనబడే వస్తువును పట్టుకోలేము. కాని వస్తు స్వరూపాన్ని చూపిస్తుంది కనుక అద్దం అవసరం ఎంతైనా ఉంది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

శైశవంలో శ్రీరాముడు చందమామ కావాలని పట్టుబట్టడంతో తల్లి కౌసల్య ఒక అద్దం తీసుకువచ్చి ఆరుబయట ఆకాశం వైపు చూపుతూ రాముణ్ణి అద్దంలో చూడమంది. అంతే రాముడు అద్దంలో ప్రతిబింబించిన చందమామను చూచి మురిసి పోయాడు. నిజానికి అద్దంలో వస్తుదర్శనం కలుగుతుంది కాని వస్తు ప్రాప్తి కలగదు. దానికి వేరే ప్రయత్నం కావాలి.

సద్గురువు కూడా అద్దం లాంటి వాడే. అంతకంటే కూడా గొప్ప వాడున్నూ! ఎలాగంటే గురువు ఉపాయంగా తన శిష్యునిలోని అజ్ఞానాన్ని తొలగించి తనలో దైవాన్ని చూపించటమే కాకుండా శిష్యుని మనసులో దైవానుభూతిని కలిగిస్తాడు. అంటే వస్తుప్రాప్తి సైతం శిష్యుడికి కలుగు తుందన్నమాట. గురువనే అద్దంలో పరోక్ష వస్తుదర్శనం కూడా జరుగుతుంది. జయ గురుదత్త!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.తదియ రా.1.46 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: జ్యేష్ఠ ప.12.26 వరకు, తదుపరి మూల, వర్జ్యం: రా.8.58 నుండి 10.40 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.48 నుండి 10.39 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.46 వరకు, అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.32, సూర్యాస్తమయం: 6.19.

నేటి నుంచి సరస్వతీ నది పుష్కరాలు

కాళేశ్వరం వద్ద నదిలో పుష్కర ఆవాహన పూజతో ప్రారంభం

కాళేశ్వరం/సాక్షి, హైదరాబాద్‌: జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద అంతర్వాహిని సరస్వతీ నదికి గురువారం నుంచి పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం రాత్రి 10.45 గంటలకు బృహస్పతిలోకి మిథున రాశిలో ప్రవేశిస్తుండటంతో సరస్వతీ నదికి పుష్కరాలు ప్రారంభమవుతున్నట్లు పండితులు పేర్కొన్నారు. అయితే రాత్రి సమయం కావడంతో గురువారం ఉదయం 5.44 గంటలకు అంతర్వాహిని సరస్వతీ నదికి విశేష పూజలతో పండితులు పుష్కరుడికి ఆహ్వానం పలుకుతారని కాళేశ్వరం దేవస్థానం వేదపండితులు వివరించారు. కాళేశ్వరాలయంనుంచి మంగళ వాయిద్యాలతో నదికి వెళ్లి గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. నదిలో నీటికి పంచ కలశాలలో ఆవాహన పూజ నిర్వహిస్తారు. పుష్కరునికి చీర, సారెతో ఒడి బియ్యం, పూలు, పండ్లు సమర్పిస్తారు. తర్వాత భక్తులందరూ పుష్కర సంకల్ప స్నానం చేస్తారు. మెదక్‌ జిల్లా రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి, మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శైలజారామయ్యర్‌, కమిషనర్‌ వెంకట్‌రావు, దేవాదాయశాఖ సలహాదారు గోవిందహరి, కలెక్టర్‌ రాహుల్‌ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, ఉత్సవ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

పుష్కరాలకు సీఎం రేవంత్‌రెడ్డి

నేటి నుంచి ప్రారంభం కానున్న సరస్వతీ పుష్కరాల్లో కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ ఘాట్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం సీఎం రేవంత్‌ పుణ్యస్నానం ఆచరిస్తారు. సీఎంతోపాటు పలువురు మంత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. పుష్కరాలకోసం దేవాదాయ శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది.

పుష్కరాల పవిత్రతను కాపాడాలి

సరస్వతీ నది పుష్కరాల పవిత్రతను కాపాడుకోవడానికి అందరూ చేతులు కలపాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం నుంచి జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరగనున్న సరస్వతీ నది పుష్కరాలను పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ బోర్డు రూపొందించిన పోస్టర్‌ను బుధవారం మంత్రి ఆవిష్కరించారు.



కాళేశ్వరంలోని సరస్వతీ వీఐపీ ఘాట్‌

చెరుకు పంటకూ బోనస్‌!

- టన్నుకు రూ. 225 చొప్పున ఇచ్చే ఆలోచన
- సాగు ప్రోత్సాహకానికి ప్రభుత్వం సూత్రప్రాయ నిర్ణయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: చెరుకు పంటకూ బోనస్‌ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. టన్నుకు రూ.500 వరకు ఇవ్వాలని కేన్‌ కమిషనరేట్‌ నుంచి ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లినట్లు సమాచారం. అయితే టన్నుకు రూ.225 చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు కేన్‌ కమిషనరేట్‌ వర్గాలు చెబుతున్నాయి. ఈ నిర్ణయంతో చెరుకు సాగు విస్తీర్ణం పెరిగేలా రైతులను ప్రోత్సహించడంతోపాటు, చక్కెర పరిశ్రమలు, చెరుకు ఆధారిత పరిశ్రమలకు సైతం ఊతమిచ్చేలా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

సాగు పెరిగితే సర్కారుకు భారీగా ఆదాయమే..

రాష్ట్రంలో చెరుకు సాగు విస్తీర్ణం పెరిగితే సర్కారుకు ఆదాయం పెరుగుతుంది. ఎకరం సాగైతే సర్కారు ఖజానాకు సుమారు రూ.10 వేల వరకు ఆదాయం లభిస్తుందని సంబంధిత పరిశ్రమల వర్గాలు లెక్కగట్టాయి. చెరుకు నుంచి చక్కెరతోపాటు ఉప ఉత్పత్తులు వస్తాయి. లిక్కర్‌ తయారీకి అవసరమైన మొలాసిస్‌ (రెక్టిఫైడ్‌ స్పిరిట్‌), ఇథనాల్‌ (గ్రీన్‌ ఫ్యూయల్‌) తయారీకి చెరుకే మూలాధారం. చక్కెరతోపాటు, ఈ ఉప ఉత్పత్తులపై సర్కారుకు భారీగా పన్ను రాబడి ఉంటుంది.

సాంగ్లీని సందర్శించిన ప్రజాప్రతినిధుల బృందం

మెదక్‌, నిజామాబాద్‌ జిల్లాల్లో ఉన్న నిజాం–దక్కన్‌ షుగర్స్‌ ఫ్యాక్టరీలను తిరిగి తెరిపిస్తామని కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధుల బృందాలు ఇటీవల మహారాష్ట్రలోని సాంగ్లీ ప్రాంతంలో ఉన్న చక్కెర కర్మాగారాలను సందర్శించింది. అక్కడి ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలను పరిశీలించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం చెరుకు పంటకు బోనస్‌ ఇవ్వాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. త్వరలోనే బహిరంగసభ ఏర్పాటు చేసి ఈ బోనస్‌ నిర్ణయాన్ని ప్రకటించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇటీవల అన్ని జిల్లాలకు చెందిన సీడీసీ (కేన్‌ డెవలప్‌మెంట్‌ కమిటీ) చైర్మన్లు ప్రభుత్వ పెద్దలను కలిశారు.

ఏటా పడిపోతున్న విస్తీర్ణం

రాష్ట్రంలో చెరుకు సాగు విస్తీర్ణం ఏటా తగ్గిపోతోంది. ఒకప్పుడు ఐదు లక్షల ఎకరాల వరకు ఉండే ఈ పంట విస్తీర్ణం ఇప్పుడు 82 వేల ఎకరాలకే పరిమితమైంది. ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే 28 వేల ఎకరాలు సాగవుతుండగా, కామారెడ్డి, వికారాబాద్‌, ఖమ్మం, వనపర్తి, మహబూబ్‌నగర్‌, జగిత్యాల జిల్లాల్లో అక్కడక్కడా చెరుకు సాగవుతోంది.

మూతపడుతున్న పరిశ్రమలు..

చెరుకు సాగు విస్తీర్ణం పడిపోవడంతో చక్కెర కర్మాగారాలు మూతపడుతున్నాయి. ఇప్పటికే సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఉన్న ట్రైడెంట్‌ చక్కెర కర్మాగారం గత ఏడాదే మూతపడిన విషయం విదితమే. ప్రస్తుతం కేవలం ప్రైవేట్‌ రంగంలోని చక్కెర కర్మాగారాలే పనిచేస్తున్నాయి. చెరుకు సాగువిస్తీర్ణం ఇలాగే తగ్గుతూ పోతే కర్మాగారాలు ఒక్కొక్కటిగా మూతపడే అవకాశాలున్నాయి. దీంతో బోనస్‌ ఇచ్చి సాగు విస్తీర్ణం పెంచడం ద్వారా ఈ పరిశ్రమలకు ఊతమిచ్చినట్టు కూడా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



కేంద్రం మావోయిస్టులతో చర్చలు జరపాలి

- రిటైర్డ్‌ న్యాయమూర్తి జస్టిస్‌ చంద్రకుమార్‌



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్‌ చంద్రకుమార్‌

పంజగుట్ట (హైదరాబాద్‌): శత్రు దేశమైన పాకిస్తాన్‌తో చర్చలు జరిపి, శాంతి ఒప్పందాలు చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం.. దేశంలోని మావోయిస్టులతో చర్చలు జరపకుండా ఆదివాసీ ప్రాంతాలపై దాడులు చేయడం అమానుషమని శాంతి చర్చల కమిటీ అధ్యక్షుడు, రిటైర్డ్‌ న్యాయమూర్తి జస్టిస్‌ చంద్రకుమార్‌ అన్నారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధం అన్న తరువాత కూడా సుమారు 23 మంది అమాయక ఆదివాసీలు, ముగ్గురు గ్రేహౌండ్స్‌ సిబ్బంది, 15 మంది మావోయిస్టులు చనిపోయారని, మరో ఇద్దరు ఎస్సైలు గాయపడ్డారన్న వార్తలు వచ్చాయని, అదే చర్చలు జరిపి ఉంటే ఇన్ని ప్రాణాలు పోయి ఉండేవి కావని ఆయన పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆదివాసీల అభివృద్ధి కోసమే ఆపరేషన్‌ కగార్‌ చేపట్టామని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం.. మావోయిస్టుల ప్రభావం లేని ఆదివాసీ ప్రాంతాల్లో ఎంత అభివృద్ధి చేసిందో చెప్పాలని డిమాండ్‌ చేశారు. బిహార్‌, జార్ఖండ్‌, ఉత్తరాఖండ్‌లలో పనిలేక ఎంతోమంది హైదరాబాద్‌లో కూలీ పనిచేసుకుంటున్నారని అన్నారు. మావోయిస్టులు కూడా చర్చలకు సిద్ధం అంటూ దాడులు చెయ్యడం సరికాదని సూచించారు. ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్‌ చేశారు.

టీపీసీసీకి జంబో కార్యవర్గం!

కేసీ వేణుగోపాల్‌కు నివేదిక అందజేసిన టీపీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌

- పీఈసీ, పీఏసీ, క్రమశిక్షణ కమిటీలపై సైతం ప్రతిపాదనలు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రదేశ్‌ కాంగ్రెస్‌ కమిటీ కార్యవర్గ కూర్పు తుది దశకు చేరింది. పార్టీ అగ్రనాయకత్వం సూచనల మేరకు సిద్ధమైన కార్యవర్గ ప్రతిపాదనల జాబితాను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ బుధవారం ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు అందజేశారు. కార్యవర్గంతోపాటు పార్టీలోని వివిధ కమిటీల చైర్మన్లకు సంబంధించిన పేర్లను అందులో చేర్చారు. దీనిపై తుది పరిశీలన అనంతరం రెండుమూడు రోజుల్లో కార్యవర్గ ప్రకటన ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఎక్కువమందికి అవకాశం కల్పించేలా..

- కొత్తగా ఏర్పాటు చేయనున్న టీపీసీసీకి జంబో కార్యవర్గమే ఉండనున్నట్లు తెలుస్తోంది. కొత్త కార్యవర్గంలో నలుగురు వర్కింగ్‌ ప్రెసిడెంట్లు ఉంటారు. మొదట ఐదు నుంచి ఆరు పేర్లు అనుకున్నా, దానిని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, రెడ్డి వర్గాలకు ఇచ్చేలా నాలుగుకు కుదించారు. ఈ పోస్టు కోసం ఎక్కువ మంది పోటీలో ఉన్న నేపథ్యంలో ఒక్కోవర్గం నుంచి ముగ్గురేసి పేర్ల చొప్పున 12 మంది పేర్లను సిఫార్సు చేశారు. హైకమాండ్‌ సూచనల మేరకు అందులో ఒకరి పేరు ఖరారు కానుంది.



- వైస్‌ ప్రెసిడెంట్లుగా 35 మంది వరకు ఉంటారు. అయితే 50 మంది పేర్లను ఏఐసీసీ ముందుంచినట్లు తెలుస్తోంది. ప్రధాన కార్యదర్శులుగా 80 మందిని నియమించుకున్నారు. ప్రతి జిల్లాకు కచ్చితంగా ఇద్దరేసి చొప్పున అవకాశం ఉంటుంది. హైదరాబాద్‌, రంగారెడ్డి జిల్లాల నుంచి మాత్రం ఎక్కువ మందికి అవకాశం కల్పించనున్నారు.
- పొలిటికల్‌ ఎగ్జిక్యూటివ్‌ కమిటీ (పీఈసీ), పొలిటికల్‌ అడ్వయిజరీ కమిటీ (పీఏసీ), క్రమశిక్షణ కమిటీ, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ, ప్రచార కమిటీ, మీడియా కమిటీలకు సైతం పలువురు పేర్లను సిఫార్సు చేస్తూ ప్రతిపాదనలను టీపీసీసీ చీఫ్‌ ఏఐసీసీకి అందజేశారు. వీటిపై మరోమారు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌ మీనాక్షి నటరాజన్‌తోపాటు రాష్ట్ర నేతలను సంప్రదించిన అనంతరం కార్యవర్గాన్ని ప్రకటించే అవకాశముంది.

జాబితా రాకముందే లొల్లి

- టీపీసీసీ కమిటీల్లో తమకు ప్రాధాన్యత లేదంటూ మహిళా కాంగ్రెస్‌ ధర్నా

సాక్షి, హైదరాబాద్‌: పదవుల జాబితా వెలువడకముందే అధికార కాంగ్రెస్‌ పార్టీలో లొల్లి మొదలైంది. త్వరలోనే వస్తాయని భావిస్తున్న పార్టీ కమిటీల్లో మహిళా నేతలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఆందోళనకు దిగారు. మహిళా కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకురాళ్లతో కలిసి బుధవారం సాయంత్రం ఆమె గాంధీభవన్‌లోని పీసీసీ అధ్యక్షుడి చాంబర్‌ ముందు బైఠాయించారు. 20 ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న మహిళలను కాదని ప్రభుత్వ పదవుల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని నియమించారని, బడా నేతల బంధువులకు పదవులిస్తూ అసలైన కార్యకర్తలను అవమానపరుస్తున్నారంటూ ఆమె ఆరోపించారు. ప్రభుత్వ పదవులతో పాటు పార్టీ పదవుల్లోనూ మహిళా కాంగ్రెస్‌లో పనిచేస్తున్న వారికి మొండిచేయి చూపారని, అధిష్టానానికి ఇచ్చిన జాబితాలో అసలు మహిళా కాంగ్రెస్‌ నేతల పేర్లే లేవని తెలిసిందన్నారు. మహిళా కాంగ్రెస్‌ నేతలకు పదవులు ఎందుకు ఇవ్వడం లేదో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌లు సమాధానం చెప్పాలని సునీతారావు డిమాండ్‌ చేశారు.

గవర్నర్‌ జిష్ణుదేవ్‌తో పొంగులేటి భేటీ

- ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి అమలుపై వివరించిన మంత్రి

సాక్షి, హైదరాబాద్‌: రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం, ఇందిరమ్మ ఇళ్ల పథకం గురించి వివరించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున గృహాలను మంజూరు చేస్తున్నామని పొంగులేటి.. గవర్నర్‌ దృష్టికి తెచ్చారు. మొదటిదశలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. కాగా, గవర్నర్‌ దత్తత తీసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పూసుకుంట, గోగులపూడి, ఆదిలాబాద్‌ జిల్లాలో భుర్కి, మంగ్లీ, నాగర్‌కర్నూల్‌ జిల్లా అప్పాపూర్‌, బౌరాపూర్‌ గ్రామాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని వివరించారు. ఎలాంటి రుసుము లేకుండానే ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి పాల్గొన్నారు.

30 నాటికి పరిష్కారం చూపుతాం

భూభారతి చట్టాన్ని పైలట్‌ పద్ధతిన తొలిదశలో భాగంగా అమలు చేసిన నాలుగు మండలాల్లో వచ్చిన దరఖాస్తులకు ఈ నెల 30వ తేదీకల్లా పరిష్కారం చూపుతామని పొంగులేటి చెప్పారు. 'పరిష్కరించలేని వాటికి ఎందుకు పరిష్కరించలేకపోతున్నామనే విషయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేస్తాం. శాశ్వత పరిష్కారం లేనివి, అక్రమమైన క్లెయిమ్‌లు ఉంటే వాటిని చేయలేమని రెవెన్యూ అధికారులు చెపుతారు. ఏదేమైనా సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నదే భూభారతి చట్టం లక్ష్యం' అని పొంగులేటి ఒక ప్రకటనలో వెల్లడించారు. సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో స్లాట్‌ బుకింగ్‌ విధానానికి మంచి స్పందన లభిస్తోందన్నారు.



గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మకు జ్ఞాపికను ఇస్తున్న మంత్రి పొంగులేటి

సమగ్ర విత్తన చట్టం కోసం కమిటీ

- ఏడుగురు సభ్యులతో ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో రైతాంగానికి ఎంతగానో మేలు చేసే సమగ్ర విత్తన చట్టం రూపకల్పనకు ప్రభుత్వం ముందుకొచ్చింది. విత్తనాల పేరుతో ప్రైవేటు సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయడంతో పాటు నాణ్యమైన మేలిమి రకం విత్తనాలను రైతులకు అందజేసేందుకు ఈ చట్టం తోడ్పడనుంది. ఈ మేరకు 'సమగ్ర విత్తన చట్టం 2025' ముసాయిదా రూపకల్పనకు కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీ జూన్‌ 30వ తేదీలోగా ముసాయిదా నివేదికను వ్యవసాయ శాఖకు సమర్పించాల్సి ఉంటుంది.

ఏడుగురు సభ్యులు వీరే..

కమిటీలో సీడ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ అన్వేష్‌ రెడ్డి, వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌ సభ్యుడు భూమి సునీల్‌, అగ్రికల్చర్‌ యూనివర్సిటీ సీడ్స్‌ డైరెక్టర్‌ నగేష్‌ కుమార్‌, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ రామాంజనేయులు, రిటైర్డ్‌ అగ్రికల్చర్‌ జాయింట్‌ డైరెక్టర్‌ శ్రీనివాస్‌ రెడ్డి, వ్యవసాయ రంగ నిపుణుడు దొంతు నర్సింహా రెడ్డి, సంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి శివ ప్రసాద్‌ తదితరులున్నారు.

17 నుంచి రాష్ట్రంలో బీజేపీ తిరంగా యాత్ర

- 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు ట్యాంక్‌బండ్‌ నుంచి ప్రారంభం
- 18, 19, 20 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో యాత్ర
- 21, 22, 23 తేదీల్లో అన్ని మున్సిపాలిటీల్లో ర్యాలీలు

సాక్షి, హైదరాబాద్‌: ఆపరేషన్‌ సిందూర్‌ విజయోత్సవాన్ని ప్రజలకు తెలియజేసేందుకు భారతీయ జనతా పార్టీ సిద్ధమైంది. పహల్గాంలో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌పై చేపట్టిన ఆపరేషన్‌ సిందూర్‌ సైనిక చర్య విజయవంతమైన విషయం తెలిసిందే. దీంతో ఈ విజయాన్ని ప్రజలకు వివరించేందుకు బీజేపీ ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు 'తిరంగా' యాత్ర నిర్వహించనుంది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలు, పట్టణ కేంద్రాల్లో తిరంగా యాత్ర పేరిట భారీ ర్యాలీలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ విడుదల చేసింది. ఈ యాత్రను తెలంగాణ సిటిజన్స్‌ ఫర్‌ నేషనల్‌ సెక్యూరిటీ అనే సంస్థ సమన్వయం చేయనుంది. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తిరంగా యాత్రపై సన్నాహక సమావేశం జరిగింది. బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా మూడు విధాలుగా ఈ యాత్ర నిర్వహించనుంది. ఇందులో భాగంగా 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు ట్యాంక్‌బండ్‌ వద్ద ఉన్న అంబేడ్కర్‌ విగ్రహం నుంచి యాత్ర ప్రారంభం కానుంది. అక్కడినుంచి యాత్ర ట్యాంక్‌బండ్‌పై ఉన్న వివేకా నంద విగ్రహం వరకు కొనసాగుతుంది. ఈ యాత్రలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు రాష్ట్రంలోని పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యే లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. ఆ తర్వాత ఈనెల 18, 19, 20 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో తిరంగా యాత్రను నిర్వహించనున్నారు. అనంతరం ఈనెల 21, 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ కేంద్రాల్లో ర్యాలీలు చేపట్టనున్నారు. ఈ యాత్రను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నప్పటికీ పార్టీలకతీతంగా విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు కోరారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్‌ విలీనం ఖాయం: ప్రభాకర్‌



సాక్షి, హైదరాబాద్‌: కాంగ్రెస్‌ పార్టీలో భారత రాష్ట్ర సమితి విలీనానికి ఒప్పందం కుదిరిందని మాజీ శాసన సభ్యుడు ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ వ్యాఖ్యానించారు. ఆయన బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జూన్‌ 2వ తేదీన లేదా డిసెంబర్‌ 9వ తేదీన.. కాంగ్రెస్‌ పార్టీలో బీఆర్‌ఎస్‌ విలీన ప్రక్రియ పూర్తవుతుందని జోస్యం చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా మారతారన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి స్థానంలో.. కేసీఆర్‌ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారన్నారు. కేటీఆర్‌ నాయకత్వంలో పనిచేసేందుకు సమ్మతమేనని హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలే ఇందుకు ఆధారమని ప్రభాకర్‌ స్పష్టం చేశారు.

బీఆర్‌ఎస్‌ విలీనం కాకపోతే బీజేపీని రద్దు చేసుకుంటారా?

- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని బీజేపీ నేతలకు మెదడు మోకాళ్లలో ఉందని, అందుకే వాళ్ల బుద్ధిలో మార్పు రావడం లేదని కాంగ్రెస్‌ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌ పార్టీలో బీఆర్‌ఎస్‌ విలీనం అవుతుందని ఆ పార్టీ నేత ఎన్వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌ చేసిన వ్యాఖ్యలను బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఖండించారు. అబద్ధాలు ప్రచారం చేయడంలో బీజేపీ నేతలు దిట్టలని విమర్శించారు. జూన్‌ రెండో తేదీన లేదంటే డిసెంబర్‌ నెలలో కాంగ్రెస్‌ పార్టీలో బీఆర్‌ఎస్‌ విలీనం కాకపోతే బీజేపీని రద్దు చేసుకుంటారా అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒక్కటేనని, కమలం కాడకు గులాబీ పువ్వుని అంటు కట్టారని, అందుకే ప్రజలు బీజేపీని తొక్కి పెట్టారన్నారు.

డాలస్‌లో జూన్‌ 1న బీఆర్‌ఎస్‌ రజతోత్సవం

- పోస్టర్‌ను ఆవిష్కరించిన తలసాని

సాక్షి, హైదరాబాద్‌: భారత రాష్ట్ర సమితి రజతోత్సవాలను విదేశాల్లోనూ ఘనంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ ఎన్‌ఆర్‌ఐ విభాగం అంతర్జాతీయ సమన్వయకర్త బిగాల మహేశ్‌ గుప్తా వెల్లడించారు. ఇందులో భాగంగా జూన్‌ 1న అమెరికాలోని డాలస్‌లో జరిగే సభకు పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. డాలస్‌లో జరిగే బీఆర్‌ఎస్‌ రజతోత్సవ పోస్టర్‌ను బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌, ఎమ్మెల్యే డాక్టర్‌ కె.సంజయ్‌, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో కలసి ఆవిష్కరించారు. రజతోత్సవ సభలో తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా మహేశ్‌ గుప్తా వెల్లడించారు. అమెరికాతో పాటు యూకే, కెనడా, ఆస్ట్రేలియాలోనూ రజతోత్సవాలు జరుగుతాయని తలసాని ప్రకటించారు.

నేడు కాళేశ్వరంపై రౌండ్‌ టేబుల్‌ సమావేశం

సాక్షి, హైదరాబాద్‌: కాళేశ్వరం ప్రాజెక్టు స్థితిగతులపై ఇటీవల నేషనల్‌ డ్యామ్‌ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) తుది నివేదిక ఇచ్చిన నేపథ్యంలో 'కాళేశ్వరం భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు భవిష్యత్తు' అనే అంశంపై రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలంగాణ జనసాధన సమితి వెల్లడించింది. గురువారం ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌ వేదికగా జరగనున్న ఈ సమావేశానికి హాజరు కావాలని సమితి కన్వీనర్‌ నైనాల గోవర్ధన్‌ ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, సాగునీటిరంగ నిపుణులను బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో భాగంగా ఎన్‌డీఎస్‌ఏ నివేదికలోని కీలకాంశాలను ప్రజల ముందుంచనున్నట్టు ఆయన వెల్లడించారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి



స్వరూప

న్యాల్‌కల్‌ (జహీరాబాద్‌)/ షాబాద్‌: రాష్ట్రంలో పిడుగుపాటుకు రెండు ప్రాణాలు పోయాయి. సంగారెడ్డి జిల్లాలో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోగా, రంగారెడ్డి జిల్లాలో ఓ మహిళా రైతు మృతిచెందింది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌ మండల పరిధిలోని డప్పూర్‌ గ్రామానికి చెందిన ఇస్మాయిల్‌–నస్రీన్‌బేగం దంపతుల కుమారుడు సాబేర్‌ (15) 9వ తరగతి చదువుతున్నాడు. సెలవులు కావడంతో కుటుంబ సభ్యులతో కలసి పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం ప్రారంభమైంది. దీంతో సాబేర్‌ సమీపంలో గల చెట్టు కిందకు వెళ్లగా, కుటుంబ సభ్యులు మరో చెట్టు కిందకు వెళ్లారు. సాబేర్‌ నిలుచున్న చెట్టుపై పిడుగు పడటంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన తండ్రి పరుగున కుమారుడి వద్దకు వెళ్లడంతో అతనికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. మరోఘటనలో రంగారెడ్డి జిల్లా మక్తగూడ గ్రామానికి చెందిన సోలీపేట్‌ స్వరూప (55) కూలీలతో కలిసి తమ మిరప తోటలో పనిచేస్తుండగా గాలివాన మొదలైంది. అందరూ పశువుల పాకలోకి వెళ్లగా, స్వరూప పక్కనే ఉన్న చెట్టు కిందికి వెళ్లింది. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగు పడి, తీవ్ర గాయాలపాలైంది. ఆమెను చేవెళ్ల ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

భార్గవాస్త్రం సిద్ధం



- కౌంటర్–డ్రోన్ సిస్టమ్‌ను విజయవంతంగా పరీక్షించిన భారత్
- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో, తక్కువ ఖర్చుతో 'భార్గవాస్త్ర' అభివృద్ధి
- గగనతల ముప్పును ఎదుర్కోవడంలో గొప్ప ముందడుగు

న్యూఢిల్లీ: ప్రత్యర్థి దేశాల డ్రోన్లు, మానవ రహిత గగనతల వాహనాలను తుత్తునియలు చేసే స్వదేశీ కౌంటర్–డ్రోన్ సిస్టమ్ 'భార్గవాస్త్ర'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల రూపంలో ఎదురవుతున్న ముప్పును సమర్థంగా తిప్పికొట్టడంలో గొప్ప ముందడుగు వేసింది. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్(ఎస్‌డీఏఎల్) అభివృద్ధి చేసిన ఈ డ్రోన్ల నిరోధక వ్యవస్థను ఒడిశా రాష్ట్రం గోపాల్‌పూర్‌లోని సీవార్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆర్మీ ఎయిర్ డిఫెన్స్(ఏఏడీ) అధికారుల సమక్షంలో మంగళవారం పరీక్షించారు. మొత్తం మూడు ట్రయల్స్ నిర్వహించగా, అన్నీ విజయవంతమయ్యాయి. ఎక్కడా గురి తప్పలేదు. 'భార్గవాస్త్ర'లోని నాలుగు మైక్రో రాకెట్లు అన్ని నిర్దేశిత లక్ష్యాలను ఛేదించాయి. తొలుత రెండు రాకెట్లను వేర్వేరుగా ఫైర్ చేశారు. దాంతో రెండు ట్రయల్స్ పూర్తయ్యాయి. మూడో ట్రయల్‌లో భాగంగా.. మరో రెండు రాకెట్లను ఒకేసారి సాల్వో మోడ్‌లో కేవలం రెండు సెకండ్ల వ్యవధిలోనే పరీక్షించారు. నాలుగు రాకెట్ల పనితీరూ అద్భుతంగా ఉన్నట్లు తేలింది. అవి నిర్దేశిత లాంచ్ పారామీటర్లను సాధించాయి. భారీ డ్రోన్లతో దాడులు జరిగినప్పుడు వాటిని గురిపెట్టి కచ్చితంగా నేలకూల్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్ సొంతం చేసుకుంది. పాకిస్తాన్ ఉగ్రవాదులపై 'ఆపరేషన్ సిందూర్' ప్రారంభించిన కొన్ని రోజులకే భార్గవాస్త్రను విజయవంతంగా పరీక్షించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

- భార్గవాస్త్రలో మొదటి దశలో అన్‌గైడెడ్ మైక్రో రాకెట్లు ఉంటాయి. ఇవి శత్రుదేశాల డ్రోన్లను కూల్చివేస్తాయి.
- ఇక రెండో దశలో గైడెడ్ మైక్రో మిస్సైల్ ఉంటుంది. ఇది పిన్‌పాయింట్ కచ్చితత్వంతో ప్రత్యర్థి డ్రోన్లను చిత్తుచేస్తుంది. శత్రువు డ్రోన్లు తప్పించుకొనే అవకాశమే ఉండదు. గైడెడ్ మైక్రో మిస్సైల్‌ను గతంలోనే పరీక్షించారు.
- అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో సమర్థంగా పనిచేసేలా భార్గవాస్త్రను అభివృద్ధి చేశారు. సముద్ర మట్టానికి 5 కిలోమీటర్లకుపైగా ఎత్తులోనూ చక్కగా పనిచేయగలదు. భారత సైనిక దళాల అవసరాలను అనుగుణంగా రూపొందించారు.
- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో, చాలా తక్కువ ఖర్చుతో భార్గవాస్త్రను డిజైన్ చేయడం విశేషం. త్రివిధ దళాల అవసరాల మేరకు ఇందులో అదనంగా మార్పుచేర్పులు చేసుకోవచ్చని ఎస్‌డీఏఎల్ వెల్లడించింది.
- అడ్వాన్స్‌డ్ సీ4ఐ(కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్స్, ఇంటెలిజెన్స్) టెక్నాలజీతో భార్గవాస్త్ర పనిచేస్తుంది. గగనతలంలో ఎదురయ్యే ముప్పును రియల్–టైమ్‌లో ఎప్పటికప్పుడు గుర్తించవచ్చు.
- ఇందులోని రాడార్ 6 నుంచి 10 కిలోమీటర్ల దూరంలోని డ్రోన్లను గుర్తించగలదు. అలాగే ఎలక్ట్రో ఆప్టికల్/ఇన్‌ఫ్రారెడ్(ఈఓ/ఐఆర్) సెన్సార్లు 'లో రాడార్ క్రా–సెక్షన్' లక్ష్యాలను కనిపెట్టగలవు.
- కౌంటర్–డ్రోన్ టెక్నాలజీలో భార్గవాస్త్ర ఒక మైలురాయి అని ఎస్‌డీఏఎల్ అధికారులు చెబుతున్నారు.
- కొన్ని దేశాలు భార్గవాస్త్ర తరహాలో మైక్రో–మిస్సైల్ సిస్టమ్స్‌ను రూపొందించినప్పటికీ... పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో, తక్కువ ఖర్చుతో ఇలాంటి బహుళ దశలతో కూడిన కౌంటర్–డ్రోన్ వ్యవస్థను ఎవరూ తయారు చేయలేకపోయారు.
- భార్గవాస్త్రను హార్డ్‌కిల్ మోడ్‌లో రూపొందించారు. భారీ డ్రోన్లతోపాటు చాలా చిన్నస్థాయి డ్రోన్లను కూడా గుర్తించి, కూల్చివేయగలదు.

'సింధూ' ఒప్పందంపై పాకిస్తాన్ వేడుకోలు

సమీక్షించాలంటూ భారత్‌కు లేఖ

న్యూఢిల్లీ: నీళ్లను ఆపితే రక్తం పారుతుందంటూ ఇంతకాలం మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన పాకిస్తాన్‌కు క్రమంగా తత్వం తలకెక్కుతోంది. సింధూ జలాల ఒప్పందం నిలుపుదల తాలూకు సెగ గట్టిగా తాకుతోంది. దాంతో ఆ నిర్ణయంపై పునరాలోచించాలని భారత్‌ను కోరుతోంది. పాక్ జల వనరుల శాఖ కార్యదర్శి సయీద్ అలీ ముర్తుజా ఈ మేరకు కొద్ది రోజుల క్రితమే లేఖ కూడా రాసినట్టు వెలుగులోకి వచ్చింది. ''సింధూ జల ఒప్పందాన్ని నిలుపుదల చేయడం సరి కాదు. ఆ నిర్ణయాన్ని దయచేసి వెనక్కు తీసుకోండి'' అంటూ జల శక్తి శాఖ కార్యదర్శికి రాసిన లేఖలో ఆయన వేడుకున్నారు. కేంద్ర ప్రభుత్వ వర్గాలు బుధవారం ఈ మేరకు వెల్లడించాయి. పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో పాక్‌పై ఆంక్షలు, కఠిన చర్యల్లో భాగంగా సింధూ ఒప్పందాన్ని నిలుపుదల చేస్తూ మోదీ సర్కారు నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. దానిపై పాక్ భగ్గుమనడమే గాక, ఆ ఒప్పందం కుదిర్చిన ప్రపంచ బ్యాంకుకు, అంతర్జాతీయ కోర్టుకు ఫిర్యాదు చేస్తానని బెదిరింపులకు దిగిన పాకిస్తాన్ చివరకు కాళ్ల బేరానికి వచ్చింది.

మన జవాను తిరిగొచ్చాడు

- 21 రోజుల తర్వాత అప్పగించిన దాయాది
- పాక్ రేంజర్‌ను అప్పగించిన భారత్



అమృత్‌సర్: అనుకోకుండా సరిహద్దు దాటి పాక్ రేంజర్లకు చిక్కిన బీఎస్‌ఎఫ్ జవాన్ పూర్ణం కుమార్ షా 21 రోజుల ఉత్కంఠ అనంతరం ఎట్టకేలకు తిరిగొచ్చాడు. బుధవారం ఉదయం పాక్ ఆయనను భారత్‌కు అప్పగించింది. మే 3న రాజస్తాన్‌లో చిక్కిన మహమ్మదుల్లా అనే పాక్ రేంజర్‌ను బీఎస్‌ఎఫ్ సురక్షితంగా ఆ దేశానికి అప్పగించింది. ప్రొటోకాల్‌ను అనుసరించి అమృతసర్‌లోని అట్టారి జాయింట్ చెక్‌పోస్ట్ వద్ద ఉదయం 10.30 గంటలకు శాంతియుతంగా అప్పగింతలు పూర్తయినట్టు తెలిపింది. బీఎస్‌ఎఫ్ 24వ బెటాలియన్‌కు చెందిన షా పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ వాసి. ఏప్రిల్ 10న పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లాలో పాక్ సరిహద్దులో విధుల్లో చేరారు. అక్కడి భారత రైతుల భద్రత కోసం ఏర్పాటైన కిసాన్ గార్డ్‌లో భాగంగా ఉన్నారు. ఏప్రిల్ 23న విశ్రాంతికోసం ఓ చెట్టునీడకు చేరారు. అది పాక్ భూభాగం కావడంతో అక్కడి రేంజర్లు అదుపులోకి తీసుకున్నారు. అప్పటినుంచి ఆయనను రప్పించడానికి బీఎస్‌ఎఫ్ ప్రయత్నిస్తూ వస్తోంది. గర్భవతిగా ఉన్న భార్య రజని ఆయన క్షేమం కోసం తల్లడిల్లింది. ఏకంగా సరిహద్దుల దాకా వెళ్లి ఎదురుచూపులతో గడిపింది. ఎట్టకేలకు షా విడుదలతో కుటుంబంలో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. షాకు ప్రస్తుతం పూర్తిస్థాయి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మన దౌత్యాధికారిని బహిష్కరించిన పాక్

భారత చర్యకు ప్రతీకారంగానే

న్యూఢిల్లీ/ఇస్లామాబాద్: భారత దౌత్యవేత్త ఒకరిని పాకిస్తాన్ బహిష్కరించింది. ఇస్లామాబాద్‌లోని భారత హై కమిషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయనను 'అవాంఛిత వ్యక్తి'గా పేర్కొంది. 24 గంటల్లో దేశం వీడి వెళ్లాలని బుధవారం ఆదేశించింది. ఢిల్లీలోని పాక్ హైకమిషన్‌లో పని చేస్తున్న ఓ అధికారిని గూఢచర్య ఆరోపణలపై భారత్ మంగళవారం బహిష్కరించడం తెలిసిందే. 24 గంటల్లో దేశం వీడాలని విదేశాంగ శాఖ ఆయనను ఆదేశించింది. అందుకు ప్రతీకారంగానే పాక్ తాజా చర్యకు దిగినట్టు చెబుతున్నారు. పహల్గాం ఉగ్ర దాడి నుంచీ ఇరుదేశాల మధ్య తారస్థాయిలో ఉద్రిక్తతలు కొనసాగుతుండటం తెలిసిందే.

యూపీఎస్సీ చైర్మన్‌గా అజయ్ కుమార్



న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) చైర్మన్‌గా రక్షణ శాఖ మాజీ కార్యదర్శి అజయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. యూపీఎస్సీ చైర్మన్ పదవి గత నెల 29 నుంచి ఖాళీగా ఉంది. నూతన చైర్మన్‌గా అజయ్ కుమార్ నియామకాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించినట్లు అధికారులు తెలిపారు. అజయ్ కుమార్ 1985 బ్యాచ్‌కు చెందిన కేరళ క్యాడర్ ఐఏఎస్ అధికారి. 2019 ఆగస్టు 23 నుంచి 2022 అక్టోబర్ 31 దాకా రక్షణ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. యూపీఎస్సీలో చైర్మన్‌తోపాటు గరిష్టంగా 10 మంది సభ్యులుంటారు. ప్రస్తుతం రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మోదీ నేతృత్వంలో రక్షణ కేబినెట్ కమిటీ భేటీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం రక్షణ కేబినెట్ కమిటీ(సీసీఎస్) సమావేశం జరిగింది. భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత సీసీఎస్ భేటీ జరగడం ఇదే మొదటిసారి. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా కూడా పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో తాజా పరిణామాలపై వారు చర్చించారు. సీసీఎస్ భేటీ అనంతరం ప్రధాని మోదీ కేంద్ర కేబినెట్ సమావేశానికి హాజరయ్యారు.

సీజేఐగా జస్టిస్ గవాయ్

ప్రమాణస్వీకారం చేయించిన రాష్ట్రపతి

- పాల్గొన్న ఉపరాష్ట్రపతి, మోదీ తదితరులు
- తొలి బౌద్ధుడు, రెండో దళితునిగా రికార్డు
- న్యాయవాదులకు జై భీం అంటూ అభివాదం



బుధవారం సీజేఐగా ప్రమాణస్వీకారం అనంతరం ఫైల్లో సంతకం చేస్తున్న జస్టిస్ బి.ఆర్.గవాయ్

న్యూఢిల్లీ: భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఉదయం రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, గవర్నర్లు తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ గవాయ్ హిందీలో ప్రమాణస్వీకారం చేశారు. ఆయన సుప్రీంకోర్టుకు తొలి బౌద్ధ ప్రధాన న్యాయమూర్తి. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత రెండో దళిత సీజేఐ. ప్రమాణస్వీకారం తర్వాత తల్లి కమల్ తాయ్ పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రాంగణంలో గాంధీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. న్యాయవాదులు తదితరులు తనకు శుభాకాంక్షలు తెలపగా 'జై భీమ్' అంటూ నినదించారు. న్యాయవ్యవస్థలోని అత్యున్నత స్థానం నుంచి సామాజిక న్యాయం తాలూకు శక్తిమంతమైన ప్రకటనకు ఆ నినాదం ప్రతీక అని సుప్రీంకోర్టు బార్ పేర్కొంది. జస్టిస్ గవాయ్ ప్రమాణస్వీకార ఫొటోలను మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితరులు జస్టిస్ గవాయ్‌కి శుభాకాంక్షలు తెలిపారు. 64 ఏళ్ల జస్టిస్ గవాయ్ మహారాష్ట్ర నుంచి సీజేఐ పదవి చేపట్టిన ఆరో వ్యక్తి. మంగళవారం రిటైరైన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్థానంలో బాధ్యతలు స్వీకరించారు. ఆర్నెల్ల పాటు, అంటే నవంబర్ 23 దాకా విధులు నిర్వర్తిస్తారు.

ప్రజా పక్షపాతి

జస్టిస్ గవాయ్‌ది అతి సాధారణ కుటుంబంలో జన్మించి అత్యున్నత స్థానానికి చేరిన అత్యంత స్ఫూర్తిదాయక నేపథ్యం. ఆయన 1960 నవంబర్ 24న మహారాష్ట్రలో అమరావతి జిల్లాలోని ఓ కుగ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి ఆర్‌ఎస్ గవాయ్ రాజకీయ నాయకుడు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (గవాయ్)ని స్థాపించారు. జస్టిస్ గవాయ్ న్యాయప్రస్థానం 1985లో న్యాయవాదిగా మొదలైంది. నాగపూర్, అమరావతి కార్పొరేషన్ల స్టాండింగ్ కౌన్సిల్‌గా వ్యవహరించారు. 1993లో బాంబే హైకోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా, ఏడాదికి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, 2000లో నాగపూర్ బెంచ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. 2003లో బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తి, రెండేళ్లకు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

చరిత్రాత్మక తీర్పులు

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ 700కు పైగా ధర్మాసనాల్లో సభ్యునిగా, సారథిగా ఉన్నారు. 300కు పైగా తీర్పులు వెలువరించారు. రాజ్యాంగపరమైన అంశాలు, పౌర హక్కులకు సంబంధించిన పలు కీలక తీర్పులు వాటిలో ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు బుల్డోజర్లతో ఇళ్లు కూల్చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనానికి జస్టిస్ గవాయ్ నాయకత్వం వహించారు. కూల్చివేతలను తీవ్రంగా తప్పుబట్టడమే గాక వాటికి అడ్డుకట్ట వేస్తూ కఠిన నిబంధనలు రూపొందించారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం సబబేనని తీర్పు వెలువరించిన, పార్టీలకు విరాళాలిచ్చే ఎన్నికల బాండ్లను రద్దు చేసిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనాల్లో ఆయన సభ్యులు. పెద్ద నోట్ల రద్దు సబబేనని 4:1 మెజారిటీతో తీర్పు వెలువరించిన, ఎస్సీల్లో ఉప వర్గీకరణ చేసే అధికారాన్ని రాజ్యాంగం రాష్ట్రాలకు కల్పించిందంటూ 6:1తో తీర్పిచ్చిన రాజ్యాంగ ధర్మాసనాల్లో కూడా జస్టిస్ గవాయ్ ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ నిబంధనను ప్రవేశపెట్టాలని ఈ కేసులో భాగంగానే తీర్పు వచ్చింది. మహిళల ఛాతీ పట్టుకోవడం, పైజామా లాగడం అత్యాచార యత్నం పరిధిలోకి రాబోవన్న అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలను జస్టిస్ గవాయ్ ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టడమే గాక ఆ తీర్పుపై స్టే విధించింది. పలు రాజ్యాంగ, పర్యావరణ సంబంధ అంశాలపై కొలంబియా, హార్వర్డ్ తదితర ప్రపంచ ప్రఖ్యాత వర్సిటీల్లో జస్టిస్ గవాయ్ ప్రసంగాలిచ్చారు. దేశవ్యాప్త సంచలనానికి కారణమైన వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన కేసులను ఆయన ధర్మాసనమే విచారించాల్సి ఉంది.

పాకిస్తాన్ వైమానిక శక్తి...

మూడోవంతు ఊడ్చుకుపోయింది!

అంతర్జాతీయ మీడియా, నిపుణుల వెల్లడి • 'ఆపరేషన్ సిందూర్' మైలురాయి: రక్షణ శాఖ

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాక్‌కు అలా ఇలా తగల్లేదు. మన ప్రతి దాడుల దెబ్బకు దాయాది ఏకంగా మూడో వంతు వైమానిక శక్తిని కోల్పోయింది! ఆ నష్టాల తాలూకు పూర్తి వివరాలు క్రమంగా వెలుగులోకి వస్తున్నాయి. మన బ్రహ్మోస్ తదితర క్షిపణులు పాక్‌లోని 11 కీలక వైమానిక స్థావరాలపై విరుచుకుపడడం తెలిసిందే. వాటి ధాటికి అవి కోలుకోలేనంతగా దెబ్బ తిన్నట్టు అంతర్జాతీయ వార్తా సంస్థలతో పాటు రక్షణ నిపుణులు తేల్చారు. ''పాక్ వైమానిక స్థావరాల్లోని కీలక వ్యవస్థలన్నీ భారీగా దెబ్బతిన్నాయి. పాక్ ఎంతోకాలంగా మిడిసిపడుతున్న ఎఫ్ 16, జేఎఫ్ 17 వంటి అత్యాధునిక అమెరికా, చైనా తయారీ యుద్ధ విమానాల్లో చాలావరకు కోలుకోలేని విధంగా దెబ్బ తిన్నాయి'' అని వెల్లడించారు. సైనిక ఆపరేషన్లలో స్వావలంబన ప్రస్థానంలో ఆపరేషన్ సిందూర్‌ను మైలురాయిగా రక్షణ శాఖ అభివర్ణించింది. భారత రక్షణ పాటవానికి, ఆ రంగంలో సాధించిన స్వావలంబనకు ప్రతీకగా నిలిచిందని పేర్కొంది. ''సరిహద్దులు దాటకుండానే పాకిస్తాన్‌లోని ఉగ్ర శిబిరాలతో పాటు ఆ దేశ నలుమూలల్లోని కీలక సైనిక, వైమానిక వ్యవస్థలను కూడా తుత్తునియలు చేసి చూపించాం. పాక్ మాత్రం సైనికపరంగా కేవలం విదేశీ సాయాన్నే నమ్ముకుంది. మనపై దాడులకు చైనా తయారీ పీఎల్–15, తుర్కియేకు చెందిన 'యిహా' డ్రోన్లు, యూఏవీలను వాడింది. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోల ద్వారా తిరుగులేని రుజువులను ప్రపంచానికి చూపించాం'' అని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఐఏఎఫ్ చీఫ్‌దే కీలకపాత్ర

పాక్ వైమానిక స్థావరాలపై మన దాడుల్లో ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్‌దే కీలక పాత్ర. విశ్వసనీయ సమాచారం మేరకు ఆ దాడులు పూర్తిగా ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి. ముఖ్యంగా అతి కీలకమైన రావల్పిండిలోని చక్లాలా (నూర్ ఖాన్) ఎయిర్‌బేస్‌పై దాడి ప్లానింగ్ పూర్తిగా ఆయనదే. ఆ దాడిలో పాల్గొన్న పైలట్ల ఎంపిక తదితరాలను కూడా సింగ్ స్వయంగా ఎంపిక చేశారు. శనివారం తెల్లవారుజామున చక్లాలాలో మూడు ప్రాంతాలపై మన క్షిపణులు విరుచుకుపడి పెను విధ్వంసం సృష్టించాయి. వాటి దెబ్బకు పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ మూడు గంటలు బంకర్లో తలదాచుకోవడమే గాక తన నివాసాన్ని సురక్షిత ప్రాంతానికి మార్చేశారట!

నేవీ త్రిముఖ వ్యూహం

పాక్‌పై మన దాడుల సందర్భంగా నేవీ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి పాక్‌ను అష్టదిగ్బంధం చేసేసింది. అందులో భాగంగా పాక్‌కు జీవనాడి వంటి కరాచీ ఓడరేవుపై మన ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధ నౌక పూర్తిస్థాయిలో గురిపెట్టింది. ఏకంగా 36 నావికా దళాలను మోహరించింది. ఏడు డిస్ట్రాయర్లు, ఐఎన్ఎస్ తుషిన్ వంటి యుద్ధనౌకలు వాటిలో ఉన్నాయి. అవన్నీ బ్రహ్మోస్, ఎంఆర్ఎస్ఏఎం తదితర క్షిపణులను ఎక్కుపెట్టి ఏ క్షణమైనా ప్రయోగించేందుకు సిద్ధంగా ఉంచాయి. అంతేగాక వరుణాస్త్ర వంటి అత్యాధునిక టార్పెడోలతో జలాంతర్గాములను కూడా ఐఎన్ఎస్ విక్రాంత్ పూర్తిగా సన్నద్ధం చేసింది. దాంతో మరో దారిలేక పాక్ నేవీ కేవలం పోర్టుకే పరిమితం కావాల్సి వచ్చింది.

నవాజ్ కనుసన్నల్లోనే...!

భారత్‌పై పాక్ సైనిక చర్యలను పూర్తిగా ప్రధాని షహబాజ్ సోదరుడు నవాజ్ షరీఫే పర్యవేక్షించినట్టు తెలుస్తోంది. మనపై దాడులన్నీ ఆయన కనుసన్నల్లోనే సాగినట్టు సమాచారం. నవాజ్ మూడుసార్లు పాక్ ప్రధానిగా చేశారు. ప్రస్తుతం అధికార పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్ (పీఎంఎల్–ఎన్) సారథి. 1999లో ఆయన ప్రధానిగా ఉండగానే కార్గిల్ యుద్ధం జరిగింది. మే7న భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టడం, పాక్, పీఓకేల్లోని 9 ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేయడం తెలిసిందే. ఆ మర్నాడు షహబాజ్ ఏర్పాటు చేసిన కీలక భేటీలో ప్రభుత్వపరంగా ఏ హోదా లేని నవాజ్ కూడా పాల్గొన్నారు.

మా మద్దతు పాక్‌కే: తుర్కియే

అంతర్జాతీయంగా ఛీత్కారాలు ఎదురవుతున్నా తుర్కియే బుద్ధి మాత్రం మారడం లేదు. అన్నివేళలా పాక్‌కే మద్దతుగా ఉంటామని ఆ దేశ అధ్యక్షుడు ఎర్డోగన్ బుధవారం కుండబద్దలు కొట్టారు. ''పాక్ మా నిజమైన మిత్రదేశం. మా దేశాల సోదర భావం నిజమైన స్నేహానికి నిదర్శనం. పాక్–తుర్కియే దోస్తీ జిందాబాద్!'' అని చెప్పుకొచ్చారు.

యుద్ధ విమానాలే నడిపిస్తుంటే... సైన్యంలో లీగల్ పోస్టులు మహిళలకు ఇవ్వరా: సుప్రీం

న్యూఢిల్లీ: భారత వాయుసేనలో మహిళలు యుద్ధ విమానాలు నడిపిస్తున్నారని, వారికి సైన్యంలోని లీగల్ పోస్టులు ఎందుకు ఇవ్వడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. సైన్యంలో న్యాయమూర్తి, అడ్వొకేట్ జనరల్, ఇతర లీగల్ బ్రాంచ్ పోస్టుల్లో మహిళలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని వెల్లడించింది. ఆయా పోస్టులకు స్త్రీ–పురుష నిష్పత్తి వర్తించదని, అయినప్పటికీ మహిళలను ఎందుకు నియమించడం లేదని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. సైన్యంలో లీగల్ పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో తాము నాలుగు, ఐదో ర్యాంకులు సాధించామని, అయినా తమను ఎంపిక చేయలేదంటూ ఇద్దరు మహిళా అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. న్యాయం చేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. తమకంటే తక్కువ ర్యాంక్ వచ్చిన పురుష అధికారులను లీగల్ బ్రాంచ్‌లో నియమించారని వారు ఆక్షేపించారు. ఈ పిటిషన్‌పై ధర్మాసనం తాజాగా విచారణ చేపట్టింది. సైన్యంలోని న్యాయ విభాగంలో పురుషుల కంటే ఎక్కువగా మహిళలను విధుల్లో చేర్చుకుంటే ఇబ్బందులేమిటో చెప్పాలని నిలదీసింది. పురుషులైనా, మహిళలైనా అర్హత ఉంటే అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టంచేసింది.

కెనడా కేబినెట్లో మనోళ్లు

విదేశాంగ మంత్రిగా అనిత • వాణిజ్య మంత్రిగా సిద్ధూ
సహాయ మంత్రులుగా రూబీ సహోటా, సరాయ్



భగవద్గీత మీద ప్రమాణం చేస్తున్న అనితా ఆనంద్

ఒట్టావా: కెనడాలో మార్క్ కార్నీ మంత్రివర్గంలో ఇద్దరు భారత సంతతి నేతలకు కీలక పదవులు దక్కాయి. విదేశాంగ మంత్రిగా అనితా ఆనంద్ (58) , అంతర్జాతీయ వాణిజ్య శాఖ మంత్రిగా మణీందర్ సిద్ధూ (41) బాధ్యతలు చేపట్టారు. అంతర్జాతీయ వ్యవహారాల సహాయ మంత్రిగా రణ్‌దీప్ సరాయ్ (50), నేర నియంత్రణ శాఖ సహాయ మంత్రిగా రూబీ సహోటా (44) ప్రమాణస్వీకారం చేశారు. అనిత భగవద్గీతపై ప్రమాణం చేయడం విశేషం. ''ఇది నాకు గర్వకారణం. కెనడియన్లకు సురక్షితమైన, న్యాయమైన ప్రపంచాన్ని అందించడానికి ప్రధాని మార్క్ కార్నీ బృందంతో కలిసి పని చేయనున్నా'' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అనిత కెనడా లిబరల్ పార్టీలో సీనియర్ సభ్యురాలు. గతంలో ప్రజా సేవలు, ఇన్నొవేషన్, సైన్స్, పరిశ్రమలు, రక్షణ మంత్రిగా పలు పదవులు నిర్వహించారు. మంత్రివర్గంలో స్థానం దక్కడం తనకు జీవిత కాలపు గౌరవమని సిద్ధూ పేర్కొన్నారు. ఆమెకు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అభినందనలు తెలిపారు. ఎన్నికల విజయం సాధించిన రెండు వారాల అనంతరం కార్నీ తన మంత్రివర్గాన్ని పునర్ వ్యవస్థీకరించారు. మంత్రివర్గం సంఖ్యను 39 నుంచి 28కి కుదించారు. వారిలో సగం మహిళలే కావడం విశేషం! కెనడా–యూఎస్ సంబంధాల ఉద్రిక్తతల మధ్య కెనడియన్లు కోరుకునే, అవసరమైన మార్పును అందించడానికి మంత్రివర్గాన్ని ఎన్నుకున్నట్లు కార్నీ తెలిపారు.

కెనడాలోనే పుట్టి పెరిగిన అనిత

అనిత ఆనంద్ 1967 మే 20న కెనడాలోని కెంట్‌విల్లేలో భారతీయులైన వైద్య దంపతులకు జన్మించారు. ఆమె తండ్రి ఎస్వీ ఆనంద్‌ది తమిళనాడు కాగా తల్లి సరోజ్ డి రామ్ పంజాబీ. వారు 1960ల్లో భారత్ నుంచి కెనడాకు వలస వెళ్లారు. 1985లో ఒంటారియోలో పొలిటికల్ సైన్స్‌లో అకడమిక్ డిగ్రీ, ఆక్స్‌ఫర్డ్ నుంచి న్యాయశాస్త్రంలో ఆనర్స్, డల్హౌసీ వర్సిటీ నుంచి బ్యాచిలర్స్, టొరంటో వర్సిటీ నుంచి న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. న్యాయవాద వృత్తిలో, బోధన, ప్రజాసేవలో బలమైన కెరీర్‌ను నిర్మించుకున్నారు. 1995లో న్యాయవాది, వ్యాపారవేత్త జాన్ నోల్టన్‌ను వివాహం చేసుకున్నారు. వారికి నలుగురు పిల్లలు. అనిత 2019లో కెనడా మంత్రివర్గంలో అడుగుపెట్టారు. ఆ ఘనత సాధించిన తొలి హిందూ మహిళగా చరిత్ర సృష్టించారు. రక్షణ మంత్రిగా ఆమె క్రమశిక్షణ, పనితీరుకు ప్రశంసలు లభించాయి. నిరసనల ఫలితంగా గతేడాది జస్టిన్ ట్రూడో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నాక ఆయన వారసునిగా అనిత పేరు ప్రముఖంగా వినిపించింది. ఇక సిద్ధూవి పంజాబీ మూలాలు. తల్లిదండ్రులతో కలిసి బాల్యంలోనే కెనడా వెళ్లారు. బ్రాంప్టన్ ఈస్ట్ ఎంపీగా ఉన్నారు. పలువురు మంత్రులకు పార్లమెంటరీ కార్యదర్శిగా పని చేశారు. రూబీవీ పంజాబీ మూలాలే. ఆమె టొరంటోలో జన్మించారు. సరాయ్ తల్లిదండ్రులు కెనడా వలస వెళ్లారు. బ్రిటిష్ కొలంబియాలో జన్మించిన ఆయన నాలుగుసార్లు ఎంపీగా గెలిచారు. ఇటీవలి ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 22 మంది భారత సంతతి నేతలు ఎంపీగా గెలవడం తెలిసిందే.

యూపీలో సెమీకండక్టర్ పరిశ్రమ

తిరుపతితోపాటు నాలుగు ఐఐటీల విస్తరణ • కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో రూ.3,706 కోట్లతో సెమీకండక్టర్ల తయారీ పరిశ్రమ నెలకొల్పేందుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదముద్ర వేసింది. గౌతమబుద్ధ నగర్‌లోని జేవార్‌లో భారత్‌కు చెందిన హెచ్‌సీఎల్ గ్రూప్, తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ సంస్థలు కలిసి సంయుక్తంగా ఈ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నాయి. 'ఇండియా సెమీకండక్టర్ మిషన్' కింద మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఆటోమొబైల్స్‌కు అవసరమైన డిస్‌ప్లే డ్రైవర్ చిప్‌లు ఇక్కడ తయారు చేస్తారు. సెమీకండక్టర్ల కోసం విదేశాలపైనే ఆధారపడాల్సి వస్తోంది. దిగుమతులను తగ్గించుకోవాలన్న లక్ష్యంతో దేశీయంగానే తయారు చేసుకోవడంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఇందుకోసం 'ఇండియా సెమీకండక్టర్ మిషన్'కు శ్రీకారం చుట్టింది. సెమీకండక్టర్ల తయారీ దిశగా ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహిస్తోంది. కొత్త యూనిట్‌లో నెలకు 3.6 కోట్ల చిప్‌లు తయారు చేసే అవకాశం ఉంది. దేశంలో ఇది ఆరో సెమీకండక్టర్ ప్లాంట్ అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. దీనిద్వారా 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని వెల్లడించారు.


అలాగే నేషనల్ స్కీమ్ ఫర్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ) అప్‌గ్రెడేషన్‌కు సైతం కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద ఐటీఐలను ఆధునీకరిస్తారు. ఐదు 'నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్కిల్లింగ్' ఏర్పాటు చేస్తారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం. మరోవైపు ఐదు ఐఐటీల విస్తరణకు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఐఐటీ–తిరుపతి, ఐఐటీ–పాలక్కాడ్, ఐఐటీ–భిలాయ్, ఐఐటీ–జమ్మూ, ఐఐటీ–ధార్వాడ్‌లో అకడమిక్, మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని మరింత పెంచబోతున్నారు. ఇందుకోసం 2025–26 నుంచి 2028–29 దాకా రూ.11,828.79 కోట్లు ఖర్చు చేస్తారు. ఆయా ఐఐటీల్లో 130 ఫ్యాకల్టీ పోస్టులకు కేబినెట్ అంగీకరించింది.

సెమీకండక్టర్ల తయారీ రంగంలో మన దేశం ముందంజలో దూసుకెళ్తోందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో కొత్త ప్లాంట్ ఏర్పాటుతో ఈ రంగంలో మనం మరింత ప్రగతి సాధిస్తామని, యువతకు ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు.

ఖురేషీపై వ్యాఖ్యలు.. మంత్రిపై ఎఫ్ఐఆర్
ఖతార్‌తో 200 బిలియన్ డాలర్ల డీల్
మన వేలితో మన కన్నే!
- సాక్షిప్లస్ పేజీలో

సాక్షి హైదరాబాద్

గురువారం । 15 । మే । 2025



అక్కడ ట్రైనింగ్.. ఇక్కడ యాక్షన్!
పాకిస్తానలో ఇటీవల ఇండియన్ ఆర్మీ దాడిలో ధ్వంసమైన లష్కర్ తోయిబా టెర్రర్ ఫ్యాక్టరీ.. మర్కజ్ తోయిబాతో మన హైదరాబాద్‌కు లింకులు ఉన్నట్టు తెలుస్తోంది.

-10లో



సండే ఫండే.. ఇక సండదే..
గతంలో నగరవాసుల్ని ఉర్రూతలూగించిన వారాంతపు వినోద కార్యక్రమం 'సండే..ఫండే' మరోసారి తిరిగి రానుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
38.0/25.0

వాతావరణం
నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 38, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

లగ్జరీ కార్ల స్మగ్లింగ్‌లో హైదరాబాదీ!

గుజరాత్ కేంద్రంగా వ్యవస్థీకృత దందా

- అమెరికా, జపాన్ నుంచి ఖరీదైన కార్లు అక్రమ రవాణా
- గుట్టురట్టు చేసిన అహ్మదాబాద్ డీఆర్ఐ యూనిట్ టీమ్
- వ్యాపారి బర్షద్ ఖాన్ పఠాన్‌ను అరెస్టు చేసిన అధికారులు



సాక్షి, సిటీబ్యూరో: గుజరాత్ కేంద్రంగా వ్యవస్థీకృతంగా సాగిన లగ్జరీ కార్ల అక్రమ రవాణా దందాకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అహ్మదాబాద్ యూనిట్ అధికారులు చెక్ చెప్పారు. ఈ స్మగ్లింగ్‌లో కీలకంగా వ్యవహరించిన హైదరాబాద్ వ్యాపారి బర్షద్ ఖాన్ పఠాన్‌ను అరెస్టు చేశారు. మంగళవారం అహ్మదాబాద్‌లోని కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ దందాలో ఇతడికి సహకరించిన వారి కోసం గాలిస్తున్నారు. కొన్నాళ్లుగా బర్షద్ ముఠా రూ.70 కోట్ల విలువైన లగ్జరీ కార్లను అక్రమ రవాణా చేసి, దేశంలో ఉన్న అనేక మందికి విక్రయించినట్లు డీఆర్ఐ అధికారులు ఆరోపిస్తున్నారు. బర్షద్ నేతృత్వంలో ఆరుగురితో ఏర్పడిన ముఠా అమెరికా, జపాన్‌ల్లో ఖరీదైన లగ్జరీ కార్లను ఖరీదు చేస్తోంది. ప్రధానంగా భారత మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉండే హమ్మర్ ఈవీ, కాడిలాక్ ఎస్కలేడ్, రోల్స్ రాయిస్, లెక్సస్, టయోటా ల్యాండ్ క్రూయిజర్, లింకన్ నేవిగేటర్ వంటి వాటిని ఎంచుకుంటోంది.



తొలుత ఈ కార్లను ఆయా దేశాల నుంచి శ్రీలంక, యూఏఈలకు తరలిస్తోంది. అక్కడ ఉన్న నిపుణుల సాయంతో కీలక మార్పు చేర్పులో చేస్తోంది.

రోడ్డుకు ఎడమ వైపు నుంచి డ్రైవ్ చేసే నేపథ్యంలో ఇక్కడ కారు స్టీరింగ్స్ కుడి వైపున ఉంటాయి. అమెరికా, జపాన్‌ల్లో కార్లు ఎడమ వైపు స్టీరింగ్‌తో ఉంటాయి. ఈ నేపథ్యంలోనే శ్రీలంక, యూఏఈల్లో ఆ కార్ల స్టీరింగ్స్‌ను ఎడమ వైపు నుంచి కుడి వైపునకు మార్పిస్తున్నారు. ఈ తతంగం ముగిసిన తర్వాత ఓడల ద్వారా తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్‌ల్లో ఉన్న వివిధ పోర్టులకు అక్రమ రవాణా చేస్తున్నారు. ఆ సమయంలో ఆయా కార్ల ధరలకు సగానికి సగం తగ్గిస్తూ పత్రాలు రూపొందిస్తున్నారు. దీంతో వీరు చెల్లించే సుంకం కూడా ఆ మేరకు తగ్గిపోతోంది. ఇలా ఇప్పటి వరకు రూ.70 కోట్ల విలువైన కార్లను స్మగ్లింగ్ చేశారు.

ఈ వాహనాలను హైదరాబాద్, పుణే, అహ్మదాబాద్, బెంగళూరు, ఢిల్లీల్లో బడా వ్యాపారులు, రియల్టర్లకు విక్రయించారు. దీనిపై అహ్మదాబాద్‌లోని డీఆర్ఐ జోనల్ యూనిట్‌కు సమాచారం అందింది. లోతుగా దర్యాప్తు చేసిన అధికారులు ఈ దందా ఆద్యంతాలను గుర్తించారు. సోమవారం సిటీకి వచ్చిన ప్రత్యేక బృందం ఈ ఖరీదైన కార్ల స్మగ్లింగ్‌లో సూత్రధారిగా ఉన్న వ్యాపారి బర్షద్ ఖాన్ పఠాన్‌ను అరెస్టు చేసి తీసుకువెళ్లింది. మంగళవారం అక్కడి చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. తదుపరి విచారణ నిమిత్తం తమ కస్టడీకి అప్పగించాల్సిందిగా కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. స్మగుల్డ్ కార్ల క్రయవిక్రయాల్లో భారీ ఎత్తున మనీ లాండరింగ్ కూడా జరిగినట్లు డీఆర్ఐ అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలోనే కార్ల ఖరీదు చేసిన వారినీ విచారించడంతో పాటు ఈడీ అధికారులను రంగంలోకి దింపాలని నిర్ణయించింది. బర్షద్ ఖాన్ పఠాన్ నుంచి కార్లు ఖరీదు చేసిన ఇద్దరు హైదరాబాద్ వాసుల్ని గుర్తించినట్లు తెలిసింది. వీరికి త్వరలో నోటీసులు జారీ చేయడానికి అహ్మదాబాద్ డీఆర్ఐ అధికారులు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.



- రూ.5135 కోట్ల జైకా రుణం కోసం ప్రతిపాదనలు
- ఆధునిక పద్ధతుల్లో నాలాల నిర్మాణం.. భూగర్భంలోనూ నిర్మించే అవకాశం
- జపాన్‌లో చేపట్టిన అండర్ గ్రౌండ్ డిశ్చార్జి టన్నెల్ తరహాలో నిర్మాణం



అండర్ గ్రౌండ్ టన్నెల్ నమూనా చిత్రం

ఇక పక్కాగా 'వరద' నివారణ

జపాన్ నిధులతో పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో:

నగరంలో వానొస్తే రోడ్లు, కాలనీలు అని తేడా లేకుండా వరద నీరు ముంచెత్తుతోంది. ప్రతి వానాకాలానికి ముందు వరద నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, వర్షాకాలంలో ముంపు దృశ్యాలు కనిపిస్తూనే ఉన్నాయి. నగరంలో వరదనీటి కాలువల (నాలాల) సమస్య వల్లే ఈ పరిస్థితులని గుర్తించిన యంత్రాంగం వాటి ఆధునికీకరణ పనులు చేపట్టింది. 2000 సంవత్సరంలో ముంపు అనుభవాలతో సమస్య శాశ్వత పరిష్కారం కోసం అప్పటి ప్రభుత్వం వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) కింద మొదటి దశలో రూ.985 కోట్ల పనుల్ని జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టింది. ఆ పనులు 80 శాతానికి పైగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు. కొన్ని సమస్యలు, కోర్టు కేసుల వంటి అవాంతరాలతో మిగతా పనులు ఇంకా పూర్తి కాలేదు. రెండో దశ కింద కూడా కొన్ని పనులు చేపట్టారు.

నిధుల కోసం..

ఈ పనులు చేయాల్సిన జీహెచ్ఎంసీ ఇప్పటికే వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం(ఎస్సార్డీపీ), తదితర పనుల కోసం చేసిన రుణాలకే ఏటా భారీ నిధులు మళ్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో తక్కువ వడ్డీకి వరదనివారణ ప్రాజెక్టులకు రుణాలిచ్చే జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ(జైకా) నుంచి రుణం పొందాలని భావించింది. వరద నివారణ పనులకు మన కరెన్సీలో రూ.5135.15 కోట్ల మేర రుణం కోసం జీహెచ్ఎంసీ పంపిన ప్రతిపాదనకు జైకా నుంచి సానుకూల స్పందన లభించినట్లు తెలిసింది. ప్రాజెక్టుకు సంబంధించి జైకా ప్రతినిధుల క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం ఈ నిధులందనున్నాయి.

ఏయే పనుల కోసం..

వరద నివారణ చర్యల్లో భాగంగా వరద కాలువల (నాలాల) ఆధునికీకరణ, కొత్త వరద కాలువల నిర్మాణం, చెరువుల పరిరక్షణ, సుందరీకరణల కోసం ఈ నిధులు తీసుకోనున్నారు. ప్రాజెక్టు కాలపరిమితి దాదాపు ఎనిమిదేళ్లు. ఇందులో జైకా ప్రతినిధులు క్షేత్రస్థాయి పరిస్థితుల్ని అధ్యయనం చేసేందుకే దాదాపు ఏడాది పట్టనున్నట్లు సమాచారం. అనంతరం లోన్ అగ్రిమెంట్, ప్రాజెక్ట్ కన్సల్టెంట్ నియామకం, పనుల డిజైన్లు, టెండర్లు, కాంట్రాక్టరు ఎంపిక వంటివి పూర్తయ్యేందుకు రెండు నుంచి మూడేళ్ల వరకు పట్టనున్నట్లు తెలుస్తోంది. జైకా నుంచి అందే రుణం (రూ.5135.15 కోట్లు)తో హైదరాబాద్ అర్బన్ అగ్లామరేషన్ (హెచ్‌యూఏ) వరకు 450 కి.మీ.ల మేర వరదకాలువల ఆధునీకరణ, కొత్తవాటి నిర్మాణం, బాక్స్ డ్రెయిన్ల నిర్మాణం తదితరమైనవి చేయనున్నారు. ఓఆర్ఆర్ వరకు ప్రాంతాన్ని హెచ్‌యూఏగా వ్యవహరిస్తున్నారు.

2036 విజన్‌తో..

హెచ్‌యూఏ పరిధి వరకు ప్రస్తుత జనాభా 1.40 కోట్లు కాగా, 2036 నాటికి ఇది 2 కోట్లకు చేరుకోనుందనే అంచనాతో ఈ ప్రతిపాదన రూపొందించారు. వరద నివారణ చర్యల కోసం ఈ నిధులతో చేపట్టే పనుల వల్ల పలు ప్రభుత్వ, ప్రైవేటు భవనాలతో పాటు రోడ్లు, వంతెనలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, యుటిలిటీస్ వంటివి దెబ్బ తినకుండా ఉంటాయని అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు.

జపాన్‌లో అలా..

జపాన్‌లో టోక్యో శివార్లలోని మెట్రోపాలిటన్ ఏరియా ఔటర్ అండర్ గ్రౌండ్ డిశ్చార్జి టన్నెల్ తరహాలో నగరంలో వరద నీటి పరిష్కారానికి అవకాశముంటుందా అనే దిశలో అధికారులు ఆలోచనలు చేస్తున్నారు. అయితే అందుకు తగిన సాంకేతిక సహకారం, క్షేత్రస్థాయి పరిస్థితులు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. జి-కేన్స్ ప్రాజెక్ట్‌గా ప్రసిద్ధి చెందిన అది ప్రపంచంలోనే అత్యంత భారీ వరద నీటిని మళ్లించే సొరంగమార్గం ప్రాజెక్ట్. దాని పొడవు 6.3 కిలోమీటర్లు. భూమి కింద 22 మీటర్ల లోతున నిర్మించారు. 177 మీటర్ల పొడవు, 78 మీటర్ల వెడల్పు, 25 మీటర్ల ఎత్తులో ఒక్కొక్కటి 500 టన్నుల బరువైన 59 రీయిన్‌ఫోర్స్‌డ్ కాంక్రీట్ స్తంభాలతో భారీ నీటి నిల్వ ట్యాంక్ నిర్మించారు. 78 పంపుల ద్వారా సెకనుకు 200 మెట్రిక్ టన్నుల నీటిని నదిలోకి మళ్లించే సామర్థ్యం ఉంది. ఐదు ప్రాంతాల్లో నీటి నియంత్రణ ఏర్పాట్లున్నాయి.

భూగర్భ సొరంగాలుగా..

వరద సాఫీగా ప్రవహించేందుకు వరద కాలువల (నాలాలు) నిర్మాణాలకు ఎలాంటి ఆధునిక సాంకేతికత వినియోగించాలో ఇంకా తుది నిర్ణయం తీసుకోనప్పటికీ, జపాన్ తరహాలో భూగర్భ సొరంగాల మాదిరిగా వరద నీరు మళ్లించే నిర్మాణాలు చేయాలనే యోచనలో అధికారులున్నారు. జపాన్ రుణం తీసుకోనుండటం కూడా అందుకు ఒక కారణం కావచ్చు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల జపాన్‌లో పర్యటించి రావడం తెలిసిందే.

ఎన్ని కాలువలు ఉన్నా..

నగరంలో 13 మేజర్ వరద కాలువలు, 150కి పైగా చిన్న, మధ్య తరహా చెరువులు, మూడు పెద్ద చెరువులు (హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, హుస్సేన్‌సాగర్) ఉన్నప్పటికీ 2020లో వచ్చిన వరదలో జరిగిన భారీ నష్టంతో, మున్ముందు సదరు ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎస్ఎన్‌డీపీ కింద పనులు చేపట్టారు.

గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద

డ్రోన్ కలకలం


ఫొటోలు తీసేందుకు ఎగుర వేసిన నగరవాసి

- దీన్ని గుర్తించి కేసు నమోదు చేసిన పోలీసులు
- హైదరాబాద్‌కు చెందిన అబ్రహం లింకన్ అరెస్టు



సాక్షి, సిటీబ్యూరో: ముంబైలో ఉన్న గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద డ్రోన్ ఎగరేసిన హైదరాబాదీ అబ్రహం లింకన్‌ను అక్కడి కొలాబా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతడు కేవలం ఫొటోల కోసమే గేట్ వే ఆఫ్ ఇండియాతో పాటు తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ వద్ద డ్రోన్ ఎగరేశాడని, దీని వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని అధికారులు ప్రకటించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత దేశ వ్యాప్తంగా పరిస్థితులు అత్యంత సున్నితంగా మారాయి. ఆపరేషన్ సిందూర్‌తో అన్ని విభాగాలు, పోలీసులు అప్రమత్తం అయ్యారు. దేశ సరిహద్దుల్లో పాకిస్తాన్ సైన్యం డ్రోన్లతో విరుచుకుపడటం, వాటిని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థతో కూల్చేయడం రోజుల తరబడి నడిచింది. ఈ పరిణామాల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా డ్రోన్లు, పారా గ్లైడర్లు తదితరాలను ఎగరేయడాన్ని నిషేధించాయి. ఇవేవీ పట్టించుకోని అబ్రహం లింకన్ ముంబై టూర్‌లో ఫొటోల కోసం ఈ డ్రోన్ ఎగరేశాడు. తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో తొలుత గేట్ వే ఆఫ్ ఇండియా దగ్గర, ఆపై తాజ్ హోటల్ వద్ద డ్రోన్ ఎగరడాన్ని పెట్రోలింగ్ విధుల్లో ఉన్న కొలాబా పోలీసులు గుర్తించారు. ఈ రెండూ ముంబైలోని సున్నిత ప్రాంతాలు కావడంతో నిత్యం నిఘా ఉంటుంది. డ్రోన్లను చూసిన వెంటనే దాన్ని ఎగురవేస్తున్న వ్యక్తుల కోసం గాలించారు. అక్కడి జెట్టీ నెం.5 వద్ద తన వాహనాన్ని నిలిపి, దాని నుంచి డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న అబ్రహం లింకన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇతడిపై కొలాబా ఠాణాలో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. లింకన్ నుంచి పోలీసులు రూ.2.7 లక్షల విలువైన ఉపకరణాలు స్వాధీనం చేసుకున్నారు. అబ్రహం లింకన్ విహారయాత్రలో భాగంగా నాలుగు రోజుల క్రితం ముంబై వచ్చినట్లు అక్కడి పోలీసులు గుర్తించారు.

ఎంపిక సరే.. మంజూరేది?



ప్రజా పాలన రేషన్ కార్డుల దరఖాస్తుల విషయంలో రాని స్పష్టత

- మరోవైపు మీ సేవ కేంద్రాల్లో కొత్తగా దరఖాస్తుల స్వీకరణ
- సర్కిల్ ఆఫీసుల చుట్టూ దరఖాస్తుదారుల చక్కర్లు

వరంగల్‌కు చెందిన ఆంజనేయులు ఉపాధి కోసం రెండు దశాబ్దాల క్రితం నగరానికి వలస వచ్చి బోడుప్పల్‌లో స్థిర పడ్డారు. ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇప్పటి వరకు రేషన్ కార్డు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. దాని ఆధారంగా జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్ కార్డులేదని అధికారులు గుర్తించి క్షేత్ర స్థాయి విచారణ కూడా పూర్తి చేశారు. రేషన్ కార్డు కోసం ఎంపికై జాబితాలో సైతం పేరు చేర్చారు. అయితే ఇప్పటి వరకు రేషన్ కార్డు మంజూరు కాలేదు . ఇలాంటి ఉదంతాలు సిటీలో అనేకం. అయితే ప్రభుత్వం గత రెండు నెలలుగా మీ సేవ ఆన్‌లైన్ ద్వారా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ క్రమంలో ప్రజాపాలన దరఖాస్తులతో ఎంపికైన కుటుంబాలు కూడా మళ్లీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలా? వద్దా ? అనేది తెలియక వారు సందిగ్ధంలో పడ్డారు. దీనిపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని కోరుతున్నారు.

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో కొత్త రేషన్ కార్డుల కోసం ఎంపికైన కుటుంబాలకు స్పష్టత లేకుండా పోయింది. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా సమగ్ర కుటుంబ సర్వేతో రేషన్ కార్డుల కోసం ఎంపికైనా ఇప్పటికీ మంజూరు అందని ద్రాక్షగా తయారైంది. మరో వైపు తాజాగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో ఇప్పటికే ఆఫ్‌లైన్ దరఖాస్తుల ద్వారా ఎంపికైన కుటుంబాల పరిస్థితి ప్రశ్నార్థకంగా తయారైంది. మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే డబులింగ్ అయి అసలుకే ఎసరు వస్తుందన్న ప్రచారం కూడా కొనసాగుతోంది. సంబంధిత పౌరసరఫరాల అధికారులు కూడా స్పష్టత ఇవ్వక పోవడంతో పేద కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నారు.

సర్వేలో 83 వేల కుటుంబాలు

సరిగ్గా ఐదు నెలల క్రితం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్ కార్డులు లేని సుమారు 83 వేల కుటుంబాలను గుర్తించారు. వాటిపై నిబంధనల ప్రకారం విచారణ నిర్వహించి 70 శాతం కుటుంబాలు అర్హులు అని తేల్చారు. పారదర్శకత కోసం వార్డు సభల్లో లబ్ధిదారుల జాబితాను ప్రకటించిన తర్వాతనే కార్డులు మంజూరుకు సిఫార్సు చేయాలని జీహెచ్ఎంసీ భావించినప్పటికీ తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో వార్డు సభలు వాయిదా పడి ప్రక్రియ ముందుకు సాగలేదు. వాస్తవంగా గతేడాది జరిగిన ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం సుమారు 5.73 లక్షల కుటుంబాల కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ప్రభుత్వం కేవలం గ్యారంటీ పథకాల దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకొని, రేషన్ కార్డు దరఖాస్తులను పక్కకు పెట్టింది. సమగ్ర కుటుంబ సర్వేలో గుర్తించిన కుటుంబాలపై విచారణ జరపడంతో మిగతా కుటుంబాలు ఆందోళనకు గురయ్యాయి. దీంతో వాటిపై కూడా విచారణ జరిపిస్తామని అధికారులు ప్రకటించారు. ఆ తర్వాత ఆన్‌లైన్‌ద్వారా కొత్త దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో సర్వే జాబితాపై ఎలాంటి కదలిక లేకుండా పోయింది.

ఆన్‌లైన్ ద్వారా 2.60 లక్షల దరఖాస్తులు

కొత్త రేషన్ కార్డుల కోసం మీసేవా అన్‌లైన్‌లో ఇప్పటి వరకు సుమారు 2.60 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అయితే దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుండటంతో ఎలాంటి క్షేత్ర స్థాయి విచారణ ప్రారంభం కాలేదు. ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ఆదేశాలకు జారీ కాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. వాస్తవంగా సమగ్ర కుటుంబ సర్వేలో గుర్తించిన అర్హత గల కుటుంబాల జాబితా కూడా జీహెచ్ఎంసీ నుంచి పౌరసరఫరాల శాఖకు అందక పోవడం, మరోవైపు ఆన్‌లైన్ దరఖాస్తులపై కనీసం విచారణ ప్రారంభం కాకపోవడం వెరసి కొత్త రేషన్‌కార్డుల జారీపై సందిగ్ధత నెలకొంది.

హైడ్రా కమిషనర్ ఫీల్డ్ విజిట్

- ప్రజావాణి ఫిర్యాదులపై క్షేత్ర స్థాయి విచారణ
- బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులపై కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆయనే స్వయంగా క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారు. దీనికి సంబంధించి బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు రంగనాథ్ వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపారు. మరి కొన్ని ఫిర్యాదులకు సంబంధించి ఎలాంటి ఏమరుపాటు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా అన్ని కోణాలను క్షుణ్ణంగా పరిశీలించి, చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిశీలించాక చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం రంగారెడ్డి జిల్లా నుంచి మొదలైన రంగనాథ్ పర్యటన రాత్రి 7.30 గంటలకు మేడ్చల్ జిల్లాలో ముగిసింది. కొహెడ గ్రామంలోని రాజాజీనగర్ లేఔట్‌ను పరిశీలించారు. 17 ఎకరాల విస్తీర్ణంలో 190 ప్లాట్లతో ఉన్న ఈ లేఅవుట్‌లోని పార్కులు, రహదారులను కబ్జా చేసిన సంరెడ్డి బాల్‌రెడ్డి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించారని, తమ ప్లాట్లను కబ్జా చేశారని ప్లాట్ యజమానులు గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో రహదారులకు అడ్డంగా నిర్మించిన కట్టడాలను హైడ్రా తొలగించింది. అక్కడే బాల్‌రెడ్డి మళ్లీ నిర్మాణాలు చేయబోగా అడ్డుకున్న వారిపై దాడి చేశారు. దీనిపై మరో ఫిర్యాదు రావడంతో క్షేత్ర స్థాయిలో పర్యటించిన రంగనాథ్ బాధ్యులపై క్రిమినల్ చర్యలకు ఆదేశించారు. ఆ సమయంలో ఉన్న కొత్త చెరువును ఆయన సందర్శించారు. ఇందులో తమ స్థలాలు మునిగిపోయాయని వచ్చిన ఫిర్యాదుల విషయాన్ని పరిశీలించారు. మణికొండ డాలర్ హిల్స్ కాలనీకి వెళ్లిన రంగనాథ్ పార్కు స్థలం కబ్జాపై ఆరా తీశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్న సంస్థపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఎలాంటి సెట్ బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్న ఎనిమిది అంతస్తుల భవనాన్ని, గుట్టల బేగంపేటలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఐదు అంతస్తుల భవనాన్ని పరిశీలించారు. వీటిపై తదుపరి చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. కూకట్‌పల్లిలోని డైమండ్ హిల్స్ లే ఔట్‌లో రోడ్లు, పార్కుల కబ్జాపై ఆరా తీసిన ఆయన ఇరువర్గాల వద్ద ఉన్న పత్రాలు పరిశీలించాలని ఆదేశించారు. బౌరంపేట సర్వే నం.345లో 20 ఎకరాల్లో 200 ప్లాట్లతో జీపీఆర్ లేఔట్ వేశారు. యాదగిరి అనే వ్యక్తి ఆ భూమి తనదంటూ రోడ్ల నిర్మాణం అడ్డుకుంటున్నారనే ఫిర్యాదుతో హైడ్రా కమిషనర్ వెళ్లారు.

చెరువు పరిశీలన

గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ క్యాంపస్‌ను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం సందర్శించారు. అందులో కొన్నేళ్ల క్రితం తవ్విన చెరువును పరిశీలించారు. ఆ చుట్టుపక్కల మొత్తం రాళ్లే ఉండటంతో అందులో నీళ్లు నిలువ ఉండట్లేదని నిర్వాహకులు వివరించారు. ఈ చెరువుతో పాటు క్యాంపస్ మొత్తంలో నీటి నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేశారు. ఆయా కార్యకలాపాలను రీజినల్ డైరెక్టర్ కులదీప్ దీదీ రంగనాథ్‌కు వివరించారు.

పిల్లర్ గుంతలో పడి ఇద్దరు చిన్నారుల మృతి


- అదృశ్యమైన పిల్లలు శవమై తేలిన వైనం
- ఓ కుల సంఘం స్థలంలో ఘటన

ఉప్పల్ భగాయత్‌లో విషాదం

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లో విషాదం చోటు చేసుకుంది. ఇక్కడ ఓ కుల సంఘానికి కేటాయించిన స్థలంలో తవ్విన పిల్లర్ గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడ్డారు. పోలీసులు, బాధితులు తెల్పిన మేరకు..ఓ కుల సంఘానికి భవనం కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉప్పల్ భగాయత్‌లో స్థలం కేటాయించింది. ఈమేరకు ఇటీవల ఆ కుల సంఘం నేతలు భూమి పూజ చేసి నిర్మాణం కోసం పిల్లర్లు, లిఫ్ట్ కోసం గుంతలు తవ్వారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గుంతల్లో భారీగా నీరు చేరింది. ఈ క్రమంలో మంగళవారం భగాయత్ సమీపంలోని కురుమానగర్‌లో ఉంటున్న జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన సుజాత, వెంకటేశ్ దంపతుల కుమారులు మణికంఠ(15), అర్జున్ (8)లు ఆడుకునేందుకు వెళ్లి సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీంతో వారు అర్ధరాత్రి ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం ఉప్పల్ భగాయత్‌లో తీసిన భారీ పిల్లర్ గుంతలో చిన్నారి శవం తేలి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి, ఎస్ఐ చిరంజీవిలు పరిశీలించి డీఆర్ఎఫ్, ఫైర్ తదితర శాఖలకు సమాచారం అందజేసారు. వెంటనే వారు వచ్చి వెతకగా అదృశ్యమైన ఇద్దరు చిన్నారుల మృతదేహాలు పిల్లర్ గుంతలో లభ్యమయ్యాయి. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. చిన్నారులిద్దరు బహుశా ఈత కోసం వచ్చి నీటిలో మునిగిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

'నా కన్నలు ఎక్కడికి వెళ్లారురా..ఎప్పుడు వస్తారురా, లేండిరా..'అంటూ చిన్నారుల తల్లిదండ్రులు రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న కురుమానగర్ వాసులంతా సంఘటన స్థలానికి చేరుకుని చిన్నారుల తల్లిదండ్రులకు బాసటగా నిలిచారు. పిల్లర్ గుంతలను తవ్వి...జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కుల సంఘాల ప్రతినిధులు, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాగా పిల్లర్ గుంతలపై పోలీసులు ఆరా తీయగా ఆసక్తి కరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఉప్పల్ భగాయత్‌లో కుల సంఘాలకు కేటాయించినట్లుగానే జైన్ సంఘానికి కూడా రెండెకరాల స్థలాన్ని కేటాయించారు. కాగా తమకు కేటాయించిన స్థలంలో కాకుండా పక్కనే ఉన్న హెచ్ఎండీఏ కమర్షియల్ స్థలంలో పిల్లర్ గుంతలు తీసినట్లు అధికారులు చెబుతున్నారు.



మృతిచెందిన అన్నదమ్ములు మణికంఠ, అర్జున్ (ఫైల్)



మృతదేహాల కోసం గాలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

బెల్లంకొండ శ్రీనివాస్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: రాంగ్‌రూట్‌లో కారు నడపడమే కాకుండా ట్రాఫిక్ పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్‌పై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ జర్నలిస్టుకాలనీలో నివసించే బెల్లంకొండ శ్రీనివాస్ మంగళవారం మధ్యాహ్నం కారులో జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-45 వైపు నుంచి జర్నలిస్టుకాలనీ వరకు వచ్చి చౌరస్తాలో రాంగ్‌రూట్‌లో తన ఇంటికి వెళుతుండగా అక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్ అతడిని అడ్డుకున్నాడు. దీంతో బెల్లంకొండ శ్రీనివాస్ సదరు ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించడమేగా అతడి పైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. దీంతో కానిస్టేబుల్ భయంతో పక్కకు తొలగిపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘటనను ఓ వాహనదారుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇది కాస్తా వైరల్ కావడంతో జూబ్లీహిల్స్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఆయన మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడా? అన్న విషయం తేలాల్సి ఉంది. శ్రీనివాస్‌ను స్టేషన్‌కు పిలిపించి విచారించనున్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.1.4 లక్షలు టోకరా

సనత్‌నగర్: పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.1.4 లక్షలు టోకరా వేసిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సనత్‌నగర్‌కు చెందిన గోస్కొండ హారిక వాట్సాప్ నెంబర్‌కు పార్ట్‌టైం జాబ్ ఆఫర్ పేరుతో లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేసిన ఆమె అవతలి వ్యక్తుల సూచన మేరకు టెలిగ్రామ్‌లో చాట్ చేసింది. పార్ట్‌టైం జాబ్ పేరుతో వారు ఇచ్చిన టార్గెట్ పూర్తి చేసింది. అయితే కొంత పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో లాభం పొందవచ్చని చెప్పడంతో వారి మాటలు నమ్మి రూ.1.4 లక్షలు బదిలీ చేసింది. ఆ తర్వాత అవతలి వ్యక్తుల నుంచి స్పందన లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు బుధవారం సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాన్‌హోల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాంగోపాల్‌పేట్: ఓ హోటల్ సమీపంలోని మ్యాన్ హోల్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ ఎస్డీరోడ్‌లోని గ్రాండ్ మినర్వా హోటల్ వెనుక వైపు హోటల్‌కు సంబంధించిన డ్రైనేజీ మ్యాన్‌హోల్ ఉంది. బుధవారం హోటల్‌కు సంబంధించిన మురుగు నీరు వెళ్లకపోవడంతో తనిఖీ చేసిన ప్లంబర్ మ్యాన్‌హోల్‌లో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా పరిశీలించిన పోలీసులు పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి ఒంటిపై ప్యాంటు, చొక్కా మాత్రమే ఉన్నాయి. మృతుడికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఏసీపీ సైదయ్య, ఇన్‌స్పెక్టర్ పరశురాం, డీఐ ప్రసాద్ పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్కడ ట్రైనింగ్... ఇక్కడ యాక్షన్!

"ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత బలగాలు ధ్వంసం చేసిన తొమ్మిది ఉగ్రవాద క్యాంపుల్లో మురిద్కేలో ఉన్న లష్కరే తోయిబా (ఎల్ఈటీ) టెర్రర్ ఫ్యాక్టరీ కూడా ఉంది. లాహోర్ సమీపంలో నియంత్రణ రేఖకు 30 కిమీ దూరంలో ఉన్న ఈ కీలక క్యాంప్‌ను మర్కజ్ తోయిబా అని పిలుస్తారు. దీనితో హైదరాబాద్‌కు అనేక లింకులు ఉన్నాయి. ఇక్కడి నుంచి వెళ్లిన, ఇక్కడ పట్టుబడిన అనేక మంది ఉగ్రవాదులు, సానుభూతిపరులు మర్కజ్ తోయిబాలో శిక్షణ పొందడమో, అక్కడ జరిగే వార్షిక సమావేశాల్లో పాల్గొనడమో చేసిన వాళ్లే. 1993 నాటి జలీస్ అన్సారీ, 1998లో చిక్కిన పాకిస్థానీ సలీం జునైద్ నుంచి ఇప్పటికీ మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న కుర్మగూడకు చెందిన ఫర్హాతుల్లా ఘోరీ వరకు ఈ కోవకు చెందిన వాళ్లే."

\- సాక్షి, సిటీబ్యూరో

మురిద్కేలో ధ్వంసమైన ఎల్ఈటీ 'టెర్రర్ ఫ్యాక్టరీ'

- సిటీ ఉగ్రవాదుల్లో పలువురికి సుపరిచితం
- జలీస్ అన్సారీ నుంచి ఫర్హాతుల్లా ఘోరీ వరకు...
- నగరంలో జరిగిన విధ్వంసాలకు అక్కడే కుట్రలు

1993 నుంచి లింకులు...

ఐఎస్ఐ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ ఎల్ఈటీ ఉగ్రవాద సంస్థ 1987లో ప్రారంభమైంది. దీని ఛాయలు నగరంలో 1993 నుంచీ ఉన్నాయి. ముంబైకి చెందిన జలీస్ అన్సారీ, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ కరీం టుండా, కోల్‌కతాకు చెందిన అబ్దుల్ మసూద్, వరంగల్‌కు చెందిన ఆజం ఘోరీ తన్జీమ్ ఇస్లాహుల్ ముస్లిమీన్ (టీఐఎం) పేరుతో ఓ ఉగ్రవాద సంస్థను ఏర్పాటు చేశారు. 1993లో నగరంలోని అబిడ్స్, నాంపల్లి, సికింద్రాబాద్, హుమాయున్‌నగర్, మౌలాలీల్లో బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. ఆజం ఘోరీతో (2000లో జగిత్యాలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు) పాటు మిగిలిన ముగ్గురూ మర్కజ్ తోయిబాలో శిక్షణ పొందిన వారే. 1998లో పాకిస్తాన్ నుంచి పాతబస్తీకి వచ్చి, ఇక్కడి యువతను ఉగ్రవాదం వైపు మళ్లిస్తూ సలీం జునైద్ పట్టుబడ్డాడు. ఇతడూ అదే టెర్రర్ క్యాంప్‌లో శిక్షణ పొందిన వాడే.

మరో సంస్థ ఏర్పాటు చేసిన ఆజం ఘోరీ...

టీఐఎం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఆజం ఘోరీ 1999లో ఇండియన్ ముస్లిం మహ్మదీయ ముజాహిదీన్ (ఐఎంఎంఎం) ఏర్పాటు చేశాడు. నగరంలోని ఆరు ప్రాంతాలతో పాటు విజయవాడ, బోధన్, నిజామాబాద్‌ల్లోనూ విధ్వంసాలు సృష్టించిన ఈ మాడ్యూల్‌లోని అనేక మంది మురిద్కే వరకు వెళ్లి శిక్షణ పొంది వచ్చిన వాళ్లే. 2001లో గణేష్ నిమజ్జనంలో పేలుళ్లకు కుట్ర పన్నిన అబ్దుల్ అజీజ్ అలియాస్ గిడ్డా అజీజ్, 2002లో దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబ దేవాలయం వద్ద పేలుడుకు పాల్పడిన ఆజం, అజీజ్ తదితరులు, 2004లో సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్ పేల్చివేతకు కుట్ర పన్నిన నసీరుద్దీన్ మాడ్యూల్, 2005లో నగర వ్యాప్తంగా పేలుళ్లకు కుట్రపన్నిన నవీద్ మాడ్యూల్... వీటన్నింటి వెనుక ఎల్ఈటీనే ఉంది. ఈ విధ్వంసాలు, కుట్రలకు పథక రచన చేసి, పాల్గొన్న వారిలో అత్యధికులు మురిద్కే వరకు వెళ్లి మర్కజ్ తోయిబాను 'చూసి' వచ్చిన వాళ్లే.

సౌదీలో ఉద్యోగాల పేరుతో ఎర వేసి...

నగర యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించే ఎల్ఈటీ, దాని అనుబంధ సంస్థల నిర్వాహకులు వారిని నేరుగా మర్కజ్ తోయిబాకు చేర్చలేదు. ఎల్ఈటీ స్లోగన్స్‌లో 'హైదరాబాద్ లిబరేషన్' కూడా కీలకం కావడంతో నగరం, కాన్పూర్‌లకు చెందిన యువతనే ఎక్కువగా ఆకర్షించే వాళ్లు. వీరిని ఉద్యోగాల పేరుతో సౌదీకి తీసుకువెళ్లి అక్కడి నుంచి మురిద్కే పంపేవాళ్లు. ఉగ్రవాద శిక్షణ పూర్తయిన తర్వాత బంగ్లాదేశ్, నేపాల్ మీదుగా హైదరాబాద్ చేర్చే వాళ్లు. మర్కజ్ తోయిబాలో ఉన్న ట్రైనర్లకూ నగరంపై మంచి పట్టు ఉండేది. శిక్షణ కోసం వెళ్లిన యువతతో ఉర్దూలో మాట్లాడటం, సిటీలో ఉన్న కీలక ప్రాంతాల వివరాలు అడగటం చేసే వాళ్లు. చిక్కిన ముష్కరులు, వారి సానుభూతి పరుల విచారణలో ఈ విషయం గుర్తించిన నిఘా వర్గాలు ఆ ట్రైనర్లు ఇక్కడ సంచరించి వెళ్లినట్లు అనుమానాలు వ్యక్తం చేశారు.



భారత బలగాల దాడిలో ధ్వంసమైన పాకిస్తాన్‌లోని మర్కజ్ తోయిబా



ఆజం ఘోరీ | ఫర్హాతుల్లా | అబ్బు అజీజ్ | అబ్దుల్ కరీం టుండా | జలీస్ అన్సారీ

ఫర్హాతుల్లా పాత్ర అత్యంత కీలకం...

ఎల్ఈటీతో పాటు మర్కజ్ తోయిబాలోనూ కూర్మగూడ వాసి ఫర్హాతుల్లా ఘోరీ పాత్ర అత్యంత కీలకమని నిఘా వర్గాలు చెప్తున్నాయి. 1998లోనే ఉగ్రవాదం వైపు మళ్లిన ఇతగాడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 2002లో గుజరాత్‌లోని అక్షర్‌ధామ్ దేవాలయంపై జరిగిన దాడి కేసుతో ఇతని వ్యవహారాలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి. 2004లో నగరం కేంద్రంగా బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి హత్యకు కుట్ర జరిగింది. ఘోరీ అప్పట్లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ జైషేమహ్మద్‌కు (జేఈఎం) సానుభూతిపరుడిగా ఉండి ఈ కేసులోనూ నిందితుడిగా మారాడు. ఆ తర్వాత 2005లో టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై జరిగిన మానవబాంబు దాడి కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. 2012 నాటి బెంగళూరు 'హుజీ కుట్ర' కేసులోనూ వాంటెడ్‌గా ఉన్నాడు. 2022లో దసరా నేపథ్యంలో విధ్వంసాలకు కుట్రపన్ని హ్యాండ్ గ్రెనేడ్స్‌తో సహా చిక్కిన 'ఉగ్ర త్రయం'లో కీలకమైన జాహెద్‌తోనూ సంబంధాలు కలిగి ఉన్నాడు. ఇతను గత ఏడాది వరకూ మర్కజ్ తోయిబాలో జరిగే వార్షిక సమావేశాలకు హాజరయ్యాడు.

నమ్మించి మోసం చేశాడు...

- భార్యతో విడాకులు తీసుకుంటున్నానని చెప్పి.. డాక్టర్‌తో ప్రేమాయణం..
- పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడి..
- గర్భం దాల్చిన వైద్యురాలు..
- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

బంజారాహిల్స్: నా తల్లితో ఆస్తి గొడవలు ఉన్నాయి..నా భార్య నాతో సఖ్యంగా ఉండదు..అందుకే విడాకులు తీసుకుంటున్నాం..అందుకు సంబంధించిన విడాకులు పత్రాలు ఇవిగో అంటూ వైద్యురాలిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చింది. చివరకు సదరు వైద్యుడి అసలు నిజ స్వరూపం తెలియడంతో తాను మోసపోయానని బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే..ఢిల్లీకి చెందిన భరత్ గెరా నగరంలోని కొండాపూర్ ప్రైమ్ స్ప్లెండర్‌లో ఉంటూ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని డెరెడియా లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో హెచ్ఆర్ ఆపరేషనల్ హెడ్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే పనిచేస్తున్న ఓ వైద్యురాలితో అతడికి పరిచయం ఏర్పడింది. ఇద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునే వారు. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో భరత్ సదరు యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు తనకు గతంలోనే వివాహం జరిగిందని, తన భార్యతో గొడవల కారణంగా విడిపోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పాడు. న్యాయవాది ఎదుట ఇద్దరూ సంతకం చేసిన పత్రాలను కూడా ఆమెకు చూపించాడు. తన తల్లికి తనకు ఆస్తి గొడవలు ఉన్నాయని, తల్లి, సోదరుడు ఢిల్లీలో ఉంటారని చెప్పాడు. ఈ క్రమంలో మార్చి 31న కంపెనీ పనిపై చండీఘడ్ వెళుతున్న భరత్ సదరు వైద్యురాలిని కూడా తీసుకెళ్లి అక్కడ హోటల్ రూంలో బస చేశారు. ఆ సమయంలో భరత్ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత భరత్‌ను కంపెనీ యాజమాన్యం ఉద్యోగంలో నుంచి తొలగించగా, అతడితో పాటు సదరు యువతి కూడా ఉద్యోగానికి రాజీనామా చేసింది. ఇద్దరూ కలిసి సొంతంగా వ్యాపారం ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పెట్టుబడి నిమిత్తం ఆమె నుంచి భరత్ రూ.2.5 లక్షలు తీసుకున్నాడు. అంతేగాక భరత్ సదరు యువతి ఫోన్‌లో లోకేషన్‌ను ట్రాక్ చేసి ఆమె ఎక్కడికి వెళ్తుందని ఆరా తీయడం మొదలుపెట్టాడు. ఈ నేపథ్యంలో వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె భరత్‌తో మాట్లాడేందుకు అతని ఇంటికి వెళ్లగా అతడి భార్య ఇంట్లో ఉండటాన్ని చూసి షాక్‌కు గురైంది. ఆరు నెలల గర్భవతిగా ఉన్న అతని భార్య కూడా వైద్యురాలిని అసభ్యంగా దూషించడమేగాక వివాహితుడితో ఎందుకు సంబంధం కొనసాగిస్తున్నావంటూ నిలదీసింది. ఆ తర్వాత భరత్, అతని భార్య పూణెకు మకాం మార్చారు. కొన్ని రోజుల తర్వాత గర్భం దాల్చిన బాధితురాలు భరత్ తనను శారీరకంగా, ఆర్థికంగా వాడుకుని మోసం చేశాడంటూ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కౌన్సెలింగ్‌కు వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి

రాజేంద్రనగర్: భార్యభర్తల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో కౌన్సెలింగ్ కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కిస్మత్‌పూర్ దర్గా ఖలీజ్ ఖాన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్ (35) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి ఇద్దరూ భార్యలు ఉన్నారు. అయితే కొన్ని రోజులుగా అతను మరో మహిళతో ఉంటున్నాడు. ఈ విషయమై రెండో భార్య ఇషాద్ బేగం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు భార్యభర్తలను మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం ఇంటికి వెళ్లాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ నుంచి బయటికి రాగానే ఇర్ఫాన్ రోడ్డుపై ఒక్కసారిగా కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు అతడిని అత్తాపూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు గుండెపోటుగా నిర్ధారించి మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించచిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇర్ఫాన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.



ఇర్ఫాన్ మృతదేహం

మహిళ ఆత్మహత్య

నాగోలు: భర్త వేధింపుల కారణంగా ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఖమ్మం పట్టణానికి చెందిన కట్టా వెంకటేశ్వర్లు కుమార్తె జాస్మిన్(29)కు ఎల్‌బీనగర్, శివపురి కాలనీ చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పెండెం రాజశేఖర్‌తో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో రూ. 25 లక్షల నగదు, 20 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. వివాహం జరిగిన కొన్నాళ్లకే రాజశేఖర్, అతడి కుటుంబ సభ్యులు జాస్మిన్‌ను అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్ద మనుషులు ఆమెకు నచ్చజెప్పి కాపురానికి పంపించారు. అయినా తన వైఖరి మార్చుకోని రాజశేఖర్ కొన్నాళ్లకే జాస్మిన్‌ను కొట్టి పుట్టింటికి పంపించాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజశేఖర్‌ను పిలిపించిన పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. మంగళవారం ఆఫీస్‌కు వెళ్లిన రాజశేఖర్ సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా లోపలి నుంచి గడియపెట్టి ఉంది. జాస్మిన్‌ను పిలిచినా స్పందన లేకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు పగలకొట్టి చూడగా జాస్మిన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. కిందకు దింపి చూడగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. దీంతో అతను ఎల్‌బీనగర్ పోలీసులు, జాస్మిన్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. జాస్మిన్ శరీరంపై గాయాలను గుర్తించిన ఆమె కుటుంబ సభ్యులు రాజశేఖర్ ఆమెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జాస్మిన్ (ఫైల్)

నకిలీ సర్టిఫికెట్ల విక్రయానికి యత్నం

ఇద్దరు నిందితుల రిమాండ్



పోలీసుల అదుపులో నిందితులు

నాంపల్లి: నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మాసబ్‌ట్యాంక్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తలాబ్ కట్ట, అమన్ నగర్ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్, మాసబ్‌ట్యాంక్ ఫస్ట్ లాన్సర్‌కు చెందిన మహ్మద్ జహంగీర్ (27) నకిలీ సర్టిఫికెట్ల దందా నిర్వహిస్తున్నారు. వీరు బుధవారం మాసబ్ ట్యాంక్ చాచా నెహ్రూ పార్కు వద్ద నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మాసబ్‌ట్యాంక్ పోలీసులతో కలిసి దాడి చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుండి 36 నకిలీ సర్టిఫికెట్లను, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సయ్యద్ ఇమ్రాన్ మూడు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

యువకుడి బలవన్మరణం

హిమాయత్‌నగర్ : ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బాల్యతండాకు చెందిన ధరావత్ రాందాస్ కుమారుడు ధరావత్ ప్రవీణ్ కుమార్(20) నారాయణగూడలోని అభ్యశ్రీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ జేఈఈ మెయిన్స్‌కు కోచింగ్ తీసుకుంటున్నాడు. రెండుసార్లు ప్రయత్నించినా ర్యాంక్ రాకపోవడంతో మనస్తాపానికి లోనైన అతను ఈనెల 12న తల్లిదండ్రులకు ఫోన్ చేసి బాధపడగా వారు అతడికి సర్దిచెప్పారు. మంగళవారం తల్లిదండ్రులు ప్రవీణ్‌కు ఫోన్ చేయగా అతను ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆందోళనకు గురైన వారు బుధవారం ఉదయం హాస్టల్‌కు వెళ్లి చూడగా ప్రవీణ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



ప్రవీణ్ కుమార్ (ఫైల్)

వేలి ముద్రలు పట్టించాయి..

ఘరానా దొంగ అరెస్ట్

- నిందితుడు తెలంగాణకు చెందిన పాత నేరస్తుడు
- 90కి పైగా కేసులు.. అందులో 77 దొంగతనం కేసులే
- ద్వారకానగర్ రాధాటవర్స్ కేసును ఛేదించిన పోలీసులు
- రూ.3.50 లక్షల నగదు, 77 గ్రాముల బంగారం స్వాధీనం


ఎంవీపీకాలనీ: విశాఖపట్నం ద్వారకానగర్ రాధామాధవ్ టవర్స్‌లో ఈ ఏడాది మార్చి 1న దొంగతనానికి పాల్పడిన పాత నేరస్తుడు తిప్పరాజు రామకృష్ణ (26)ను ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎంవీపీ కాలనీ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో క్రైం ఏడీసీపీ మోహనరావు వివరాలు వెల్లడించారు. మార్చి 1న రాధామాధవ్ టవర్స్ ఫ్లాట్ నంబర్ 2లో నివాసం ఉంటున్న మరకాని రామకృష్ణ తన అమ్మమ్మ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి కాకినాడ వెళ్లారు. ఆ మరుసటి రోజు ఉదయం అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న శ్రావణి అతడికి ఫోన్ చేసి.. ఇంటి తాళం పగలగొట్టి ఉన్నట్లు సమాచారం అందించింది. దీంతో హుటాహుటిన ఆయన విశాఖ వచ్చి ఇంటిని పరిశీలించగా.. 23 తులాల బంగారం, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోని బీరువాను బెడ్‌పై పడుకోబెట్టి తాళాలు పగలగొట్టి నగదు, బంగారం చోరీ చేశాడు. రామకృష్ణ ద్వారకా క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. క్రైం సీఐ చక్రధర్‌రావు బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. వేలిముద్రలను సేకరించి పరిశీలనకు పంపించగా.. తెలంగాణకు చెందిన పాత నేరస్తుడు తిప్పరాజు రామకృష్ణ వేలిముద్రలతో సరిపోయినట్లు ఫింగర్ ప్రింట్స్ బ్యూరో అందించిన సమాచారం మేరకు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. ద్వారకా క్రైం ఎస్ఐ రాజు, ఏఎస్ఐ కిశోర్‌బాబు ఇతర సిబ్బంది బృందాలుగా విడిపోయి హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని అతని నివాస ప్రాంతాల్లో దర్యాప్తు చేసి రామకృష్ణ ప్రస్తుతం వాడుతున్న ఫోన్ నంబర్లు, వివరాలు సేకరించారు. దీంతో నిందితుడు విశాఖలోనే ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం అతడిని మద్దిలపాలెం వద్ద అరెస్ట్ చేశారు. కాగా.. రామకృష్ణ మేనల్లుడు అశోక్, అక్క భాగ్యమ్మలను హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ పోలీసులు ఈ నెల 6న వేరే కేసులో అరెస్ట్ చేసి వారి ఇంట్లో తనిఖీలు చేయగా రూ.3,40,000, 77 గ్రాముల బంగారు వస్తువులు లభించాయి. అశోక్‌ను విచారించగా.. తన మేనమామ తిప్పరాజు రామకృష్ణ విశాఖలో చేసిన దొంగతనానికి సంబంధించినవిగా వెల్లడించాడు. ఇదిలా ఉండగా మరికొన్ని బంగారు నగలను పలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టినట్లు విచారణలో వెల్లడైంది. రామకృష్ణను పట్టుకున్న సమయంలో అతని వద్ద నుంచి రూ.10 వేలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఆర్ నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రూ.3,40,000, 77 గ్రాముల బంగారంతో పాటు రామకృష్ణ వద్ద దొరికిన రూ.10 వేలను కలిపి మొత్తం రూ.3,50,000 నగదు, 77 గ్రాముల బంగారు నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగతా నగదు, బంగారాన్ని రికవరీ చేయాల్సి ఉందని ఏడీసీపీ తెలిపారు. రామకృష్ణపై 90 వరకు పాత కేసులు ఉన్నాయి. అందులో 77 దొంగతనం కేసులున్నట్లు ఏడీసీపీ వివరించారు. విశాఖలో తొలిసారి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన ద్వారకా క్రైం ఎస్ఐ రాజు, ఏఎస్ఐ డి.కిశోర్‌బాబు, కానిస్టేబుల్ అప్పలనాయుడు, రాజు, అప్పలరాజు, అగస్టీన్, జగత్ కిరణ్‌లను ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ లక్ష్మణరావు, సీఐ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ మోహనరావు

బాలుడి అనుమానాస్పద మృతి

కీసర: అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు మృతిచెందిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చీర్యాలకు చెందిన మహేష్, మంజుల దంపతుల కుమారుడు బర్లపాటి వర్ధన్ (17) 10 వ తరగతి చదువుకున్నాడు. ప్రస్తుతం కరెంట్ బిల్లుల రీడింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గది నుంచి దుర్వాసన వస్తుండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు తెరిచి చూడగా వర్ధన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. నాలుగు రోజుల క్రితమే అతను మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. వర్ధన్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వర్ధన్ (ఫైల్)

ఎల్‌ఆర్‌ఎస్‌కు మరో చాన్స్..!

సద్వినియోగం చేసుకోవాలని డీసీల సూచన



సమావేశంలో మాట్లాడుతున్న జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య

బంజారాహిల్స్: అనధికార స్థలాలు, వెంచర్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్)కు ఈ నెలాఖరు వరకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాంకేతిక కారణాలు, ఆర్థిక భారంతో ముందుకురాని వారికి గడువు పెంపు మంచి అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య, ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డిలు సూచించారు.

- జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధి కిందికి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్లు వస్తాయి. వీటి పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌కు 121 దరఖాస్తులు అర్హత కలిగినవిగా గుర్తించారు. వీరందరికీ ఫీజులు చెల్లించాలంటూ నోటీసులు కూడా జారీ చేశారు. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు రూ.2.66 కోట్లు వసూలైంది. మిగతా వారు కూడా ఈ నెలాఖరు లోగా తమ ఫీజులు చెల్లించుకోవాలని అధికారులు సూచించడమే కాకుండా దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు.
- ఖైరతాబాద్ సర్కిల్–17 కిందికి సోమాజీగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లు వస్తాయి. ఎల్‌ఆర్‌ఎస్ కోసం సర్కిల్ పరిధిలో 1600 దరఖాస్తులు రాగా 160 దరఖాస్తులు మాత్రమే అర్హతకు నోచుకున్నాయి. వీరందరికీ ఎంత ఫీజు చెల్లించాలో నోటీసులు కూడా జారీ చేశారు. ఇప్పటి వరకు 33 దరఖాస్తుదారులు మాత్రమే తమ ఫీజులను చెల్లించారు.

మూడోసారి పెంపు..

గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ 2020 పేరిట క్రమబద్ధీకరణ పథకాన్ని తీసుకువచ్చింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం 25 శాతం రాయితీతో గత ఫిబ్రవరిలో వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని ప్రకటించింది. మార్చి 31వ తేదీతో గడువు ముగిసింది. ప్రజలు విజ్ఞప్తి చేయడంతో ఏప్రిల్ 30 వరకు ఈ పథకాన్ని పొడిగించారు. ఆ తర్వాత మే నెల 3వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు. తాజాగా ఈ నెల 31 వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ సర్కిళ్ల పరిధిలో స్థలాలు, వెంచర్ల క్రమబద్ధీకరణకు పెద్ద ఎత్తున అర్జీలు అందగా పరిపాలన కేంద్రం నుంచి అందిన వివరాలను అనుసరించి రుసుము చెల్లింపునకు అర్హత గల దరఖాస్తులను గుర్తించి సంబంధీకులకు పంపించారు.

మార్పులు చేర్పులతో..

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకువెళ్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వీరికి సంబంధిత పత్రాలు అందజేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్తున్నారో లేదో కూడా తెలియకుండా ఉంది. ఫలితంగా ఇంకా చాలామంది దరఖాస్తు చేసుకునేందుకు ముందుకురావడం లేదు. ఈ ప్రక్రియలో వేగం కనిపించకపోవడంతో చాలా మంది వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. రుసుము చెల్లింపు పూర్తయిన వారి స్థలాలను పరిశీలించడానికి సరిపడా సిబ్బంది లేకపోవడం కూడా ఓ సమస్యగా మారింది. ఇంకోవైపు ఉన్న సిబ్బంది ఇతరత్రా పనులతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ఎంతవరకు ముందుకు సాగుతుందో వేచిచూడాల్సి ఉంది.

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు సన్మానం



కేసీ వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను బుధవారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డి ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూత్ కాంగ్రెస్ పనితీరును వివరించారు. అనంతరం కేసీ వేణుగోపాల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

16 నుంచి 'కిడ్స్ సమ్మర్ క్యాంప్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో కిడ్స్ సమ్మర్ క్యాంప్‌ను ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో స్వీయ చర్చా కార్యక్రమం, సృజనాత్మక ధ్యానం, విలువలతో కూడిన కార్యకలాపాలు, జ్ఞాపక శక్తిని పెంచుకోవడం, మైండ్‌ల్యాబ్, డిజిటల్ వెల్‌నెస్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 9–14 ఏళ్ళ లోపు వారికి అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234, సెల్ నంబర్ 8143466670 సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

28న 'జనభేరి' బహిరంగ సభ

హిమాయత్‌నగర్ : వనపర్తి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'జనభేరి' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ వెల్లడించారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మాట్లాడుతూ.. సభలో వనపర్తి జిల్లాలోని అన్ని మండలాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు ప్రస్తావిస్తామన్నారు.

పెంచిన ఫీజులను ప్రభుత్వమే భరించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పెంచిన ఇంజినీరింగ్ కోర్సుల ఫీజుల భారాన్ని ప్రభుత్వం భరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ బుధవారం డిమాండ్ చేశారు. విద్యార్థులపై పెంచిన ఫీజుల భారాన్ని వేయడంతో అనేక మంది పేద విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పథకాలు, ఉచితాలతో లక్షల కోట్ల సంపదను ప్రజలకు అందజేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు భరించలేరా అని ప్రశ్నించారు. బీసీలకు 20 ర్యాంక్‌లోపు నిబంధనను ఎత్తివేయాలన్నారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

మూసాపేట: సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతి పుష్కరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పుణ్య స్నానాలు ఆచరించే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని అన్నారు. కాలనీలో 40 మంది ప్రయాణికులు ఉంటే కాలనీకే బస్సును పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8919493417 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పోస్టర్ విడుదల



సనత్‌నగర్: భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాల నేపథ్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) పోస్టర్‌ను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నదులను పరిరక్షించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఎస్‌యూపీ) నిషేధించడం, సక్రమంగా వ్యర్థాల నిర్వహణ చేపట్టడం వంటి వాటిపై ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన రావాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రజా రవాణాను వినియోగించడం ద్వారా వాహన కాలుష్యం, వాహన రద్దీ తగ్గుతుందన్నారు. పర్యావరణం కాపాడడం, పుష్కరాల పవిత్రతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు.

ఇలా ఉంటే ఎలా నడుస్తాం.?

రహమత్‌నగర్: మార్నింగ్ వాకింగ్ కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం రహమత్‌నగర్ డివిజన్ మధురానగర్ పోలీస్ స్టేషన్ నుంచి శ్రీరాంనగర్ ముబారక్ కేఫ్, కార్మికనగర్ బస్టాప్ ముందు నుంచి ఆటో స్టాండ్ వరకు ఇదే పరిస్థితి ఉంది. మరి అధికారులు సుందరీకరణ పనులు చేపడతారా లేదా అనేది వేచి చూడాలి.



ఫుట్‌పాత్‌పై వ్యర్థాలు

దేశ అభివృద్ధికి మార్గదర్శకులు నేటి యువత

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నర్సింహా



ఫ్లాగ్‌మార్చ్ జాతాను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఈటీ.నర్సింహా

హిమాయత్‌నగర్ : దేశ అభివృద్ధికి మార్గదర్శకులు నేటి యువత అని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఈటీ.నర్సింహ పేర్కొన్నారు. ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో జరుగుతాయని పేర్కొన్నారు. గత 16వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లో జరిగాయన్నారు. ఏఐవైఎఫ్ ఆనవాయితీ ప్రకారం యువజన సంఘ జెండాను ప్రస్తుతం తిరుపతిలో జరుగుతున్న సభా ప్రాంగణానికి ఫ్లాగ్‌మార్చ్ పేరిట జాతాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌ను హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి ఈటీ.నర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రలతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ఏఐవైఎఫ్ నాయకులు నెర్లకంటి శ్రీకాంత్, సత్య ప్రసాద్, సల్మాన్ బేగ్, షేక్ మహమూద్, మాజీద్ అలీఖాన్, కళ్యాణ్, హేమంత్, వంశీ, మోసిన్ ఖాన్, మహేష్, భరత్, మురళి, నవీన్, కీర్తన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెత్త వేసిన మహిళకు జరిమానా..



రోడ్డు పక్కన చెత్త వేస్తున్న మహిళకు జరిమానా విధిస్తున్న మహిళా గ్రూపుల ప్రతినిధులు

వెంకటేశ్వరకాలనీ: రోడ్ల పక్కన చెత్త వేయడాన్ని అరికడుతూ తమ ఇంటి వద్దకే వచ్చే స్వచ్ఛ ఆటోకు చెత్తను వేయాలని, దీనిని ఎవరైనా ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని జీహెచ్‌ఎంసీ హెచ్చరించడమే కాకుండా ఈ బాధ్యతలను స్వయం సహాయక బృందాలకు అప్పగించింది. మహిళా గ్రూపు సభ్యులు, రిసోర్స్ పర్సన్లు బస్తీల్లో పర్యటించి ఎవరైనా రోడ్లపై చెత్త వేస్తే వారికి అవగాహన కలిగించి జరిమానాలు విధిస్తున్నారు. ఇందులో భాగంగానే బుధవారం జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నం.10 సింగాడికుంటలో ఓ మహిళ రోడ్డు పక్కన చెత్త వేస్తుండగా ఆర్‌పీ విజయ గమనించారు. వెంటనే ఆమె వద్దకు వెళ్లి ఇంటి వద్దకే వచ్చే స్వచ్ఛ ఆటోకు చెత్తను అందించాలని, ఇలా బహిరంగ ప్రదేశాల్లో డంపింగ్ చేయవద్దని సూచించి ఆమెకు రూ.500 జరిమానా విధించారు. ఎవరైనా సరే చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే ఇలాగే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి మృతదేహాలు లభ్యం



గుర్తుతెలియని మహిళ మృతదేహం

ఫిలింనగర్: షేక్‌పేట సాయిబాబా టెంపుల్ సమీపంలో రోడ్డు పక్కన సుమారు 60 సంవత్సరాల వయస్సు గల మహిళ మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు ఫిలింనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏఎస్ఐ నర్సింహగౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని సదరు మృతదేహం గురించి స్థానికంగా ఆరా తీశారు. చుట్టుపక్కల వారిని ప్రశ్నించారు. లుక్ అవుట్ నోటీసును జారీ చేశారు. ఎలాంటి సమాచారం లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నం. 87126 61492లో లేదా ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

మరో ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి...



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం.3లోని ఫుట్‌పాత్‌పై 35 - 40 సంవత్సరాల మధ్య వయస్సున్న వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లుగా స్థానికులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ ఏఎస్ఐ పి.వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని సదరు మృతదేహం గురించి స్థానికంగా ఆరా తీశారు. ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నం.93909 36338లో సమాచారం ఇవ్వాలని కోరారు.

పాన్‌షాప్ యాజమానులు నిబంధనలు పాటించాలి

రహమత్‌నగర్: పాన్‌షాప్ యాజమానులు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని బోరబండ ఎస్‌హెచ్‌ఓ సురేందర్ సూచించారు. బుధవారం మోతీనగర్‌లో ఏర్పాటు చేసిన పాన్‌షాప్ యాజమానులు సమావేశంలో ఆయన మాట్లాడారు. నిషేధిత పాన్ మసాల, గుట్కాలు విక్రయించొద్దన్నారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులకు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా రక్షణలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, పాన్‌షాపుల వద్ద గుంపుగుంపులుగా నిలబడకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రతి పాన్‌షాపు యాజమాని ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. నింబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్సైలు మనోజ్ కూమార్, స్వప్నారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



పాన్‌షాపు యాజమానులకు సూచనలు చేస్తున్న ఎస్‌హెచ్‌ఓ సురేందర్

కూరగాయల ధరలు



శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు కిలో రూపాయల్లో కిలో టమాట 15, నల్లవంకాయ18, పొడుగువంకాయ18, బెండకాయ35, పచ్చిమిర్చి40, బజ్జిమిర్చి40, క్యాప్సికం47, పచ్చికాకరకాయ35, పందిరిబీర40, క్యాబేజీ13, క్యారెట్25, దొండకాయ35, గుండు బీన్నీస్115, గింజచిక్కుడు55, గోకరకాయ35, కీర28, దోసకాయ18, బీట్‌రూట్25, ఉల్లిగడ్డ14, ఆలుగడ్డ25, చామగడ్డ35, మొరంగడ్డ17, కందగడ్డ65, క్యాలిఫ్లవర్ 23, సొరకాయ11, పొట్లకాయ15, అరిటికాయ11, మునగకాయ4, మామిడికాయ57, ముల్లంగి4–5, ఉల్లిపొరక40లుగా ఉన్నాయి.

గమనిక: ఈ ధరలు గురువారం ఉదయం 9గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.


తల్లి మందలించడంతో వెళ్లిపోయిన కుమారుడు

వెంగళరావునగర్: కన్నతల్లి తిట్టినందుకు అలిగి కుమారుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .... జి.ఈశ్వరమ్మ, కృష్ణయ్య దంపతులు ఓం నగర్‌లో నివాసం ఉంటున్నారు. కొంతకాలంగా కుమారుడు విజయ్‌కుమార్ ఏమి పని చేయకుండా ఖాళీగా ఉండటంతో ఆమె మందలిస్తోంది. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీన ఏదైన పనిచేయాలని తల్లి గట్టిగా మందలించింది. దీంతో రాత్రి 8గంటల సమయంలో విజయ్‌కుమార్ ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుమారుడి కోసం అనేక చోట్ల గాలించినా ప్రయోజనం లేకపోవడంతో అతడి తల్లి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సకాలంలో ఇంటికి రావడం లేదని మందలిస్తే..

వెంగళరావునగర్: బంధువుల ఇళ్లి సకాలంలో ఇంటికి రానందుకు ఓ తల్లి కుమారుడిని మందలించగా ఇంట్లోని వెళ్లిపోయాడు. వీడియో గల్లీలో ఎం.లక్ష్మి కుటుంబం నివసిస్తోంది. ఆమె చిన్న కుమారుడు విజయ్ చుట్టాల ఇళ్లకు వెళ్లి సకాలంలో ఇంటికి రావడం లేదు. దీంతో ఆమె కుమారుడిని మందలించడంతో ఈనెల 12వ తేదీ సాయంత్రం 4గంటల సమయంలో విజయ్ ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎప్పటి లాగానే ఆలస్యంగా తిరిగి వస్తాడని అనుకున్న తల్లికి నిరాశే మిగిలింది. బుధవారం వరకు కూడా తిరిగి రాలేదు. దీంతో ఆమె మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రి నుంచి మరోరోగి అదృశ్యం



తిరుపతి (ఫైల్)

రహమత్‌నగర్: ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం నుంచి మరో రోగి అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... పెద్దపల్లి జిల్లా జూలపెల్లి గ్రామానికి చెందిన ఆడేపు తిరుపతి(30)కి కొంతకాలంగా మానసికి స్థితి సరిగాలేదు. ఈ క్రమంలోనే అతడి తల్లిదండ్రులు ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాయంలో ఈ నెల 10న చేర్పించారు. అదే రోజు ఆస్పత్రి బయటకి వెళ్లిన తిరుపతి తిరిగి రాలేదు. దీంతోతో అతడి తల్లిదండ్రులు ఆస్పత్రి పరసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు బోరబండ పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'ఈఎస్ఐ'లో ఏటీఎస్‌ను అందుబాటులోకి తీసుకురండి





ఈఎస్ఐ ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు కిలారి మనోహర్
సేవలను వివరిస్తున్న ఈఎస్ఐ డీన్ డా. శిరీష్‌కుమార్

శ్రీనగర్‌కాలనీ: ఈఎస్ఐ ఆస్పత్రిలో ఓపీతో పాటు పలు విభాగాల్లో రద్దీ లేకుండా చూడాలని ఆస్పత్రి డీన్ డాక్టర్ శిరీష్‌కుమార్‌ను ఈఎస్ఐ ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ సూచించారు. రెండు రోజులుగా విపరీతమైన జనాలతో ఓపీ విభాగంలో గందరగోళం ఏర్పడ్డ పరిస్థితిని తెలుసుకొని బుధవారం ఆయన ఆస్పత్రిని సందర్శించారు. డీన్ డాక్టర్ శిరీష్ కుమార్‌తో కలిసి పలు విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ టోకెన్ సిస్టమ్ (ఏటీఎస్), డిజిటల్ టోకెన్ సిస్టమ్స్(డీటీఎస్)ను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. చిరు ఉద్యోగులు చికిత్స చేయించుకునే ఈఎస్ఐ ఆస్పత్రిలో మెరుగైన సేవల కోసం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడతామని పేర్కొన్నారు.

అక్రమ పార్కింగ్‌లో 'ఫిలింనగర్ రోడ్' నం.1

ఫిలింనగర్: ఫిలింనగర్ రోడ్ నం.1లో పదికి పైగా కాఫీ షాపులు, హోటళ్లు నడుస్తున్నాయి. అయితే ఎవరికీ సరైన పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో ఫుట్‌పాత్‌లు, రోడ్లకు ఇరువైపులా అక్రమ పార్కింగ్‌లు చేస్తున్నారు. రోడ్లకు రెండు వైపులా ఉదయం నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు కార్లు అక్రమ పార్కింగ్ చేస్తుండడంతో బిజీగా ఉండే ఈ రోడ్డు ట్రాఫిక్‌జామ్‌కు గురవుతోంది. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఈ కాఫీ షాపులు, హోటళ్లు ముందు అక్రమ పార్కింగ్‌లపై దృష్టి పెట్టకపోవడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రోజురోజుకు అక్రమ పార్కింగ్‌ల బెడద తీవ్రరూపం దాల్చుతోంది.

- ఫుట్‌పాత్‌లు కనుమరుగైపోవడంతో పాదచారులు రోడ్డెక్కుతున్నారు. ఇంకొంతమంది హోటళ్ల యజమానులు తమ వద్దకు వచ్చే కస్టమర్ల కార్లను వ్యాలెట్ పార్కింగ్‌లో కేబీఆర్ పార్కును ఆనుకుని ఉన్న జీహెచ్‌ఎంసీ పార్కింగ్ స్థలాల్లో దర్జాగా పార్కింగ్ చేస్తున్నారు. ఫిలింనగర్ రోడ్ నం.1లో హోటళ్ల యజమానులు పార్కింగ్‌ను వ్యాపారంగా మార్చుకున్నారు. ఏ ఒక్కరికీ సరిపోయేంత పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో యథేచ్ఛగా రోడ్లపై, కేబీఆర్ జీహెచ్‌ఎంసీ వాక్‌వే పార్కింగ్ స్థలంలోనూ పార్కింగ్ చేస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఫిలింనగర్ రోడ్ నం.1లోని కాఫీ షాపు ముందు ఫుట్‌పాత్‌పై అక్రమ పార్కింగ్

- అంతేకాకుండా సదరు హోటళ్ల యజమానులు జూబ్లీహిల్స్‌లోని వివిధ రహదారుల్లో వ్యాలెట్ పార్కింగ్ చేస్తూ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి అక్రమ పార్కింగ్‌లపై కొరడా ఝుళిపించి, హోటళ్ల యజమానులపై నోటీసులు జారీ చేసి అవసరమైతే ఆ హోటల్‌ను సీజ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదే పరిస్థితి జూబ్లీహిల్స్ రోడ్ నం.92లోని స్టార్‌బక్స్, తాజ్ మహల్ హోటల్, విజయ డయాగ్నస్టిక్ సెంటర్ ముందు కూడా కనిపిస్తోంది.

నందినగర్‌కు వర్షభయం.!

- చిన్నపాటి వర్షానికే మునిగిపోతున్న నందినగర్
- మూడు ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో మునుగుతున్న బస్తీ



వరదనీటితో ముంచెత్తిన నందినగర్ రోడ్డు


వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం.14లోని నందినగర్‌వాసుల పరిస్థితి దయనీయంగా తయారయ్యింది. బసవతారకం కేన్సర్ హాస్పటల్‌ను ఆను కుని ఉన్న నందినగర్‌లో ప్రతి వర్షాకాలంలో బస్తీవాసులు బిక్కుబిక్కుమంటూ బతకాల్సిన పరిస్థితి. చిన్నపాటి వర్షం కురిస్తే లోతట్టు ప్రాంతమైన ఈ బస్తీలోకి ఎగువన ఉన్న నందినగర్ బస్టాండ్, కేన్సర్ హాస్పటల్, కేబీఆర్ పార్కు నుంచి పెద్ద ఎత్తున నీరు వచ్చి బస్తీని వరద నీటితో ముంచెత్తుతోంది. ఏళ్ల తరబడి ఉన్న ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే రోడ్లు వేయాలి. అలాగే డ్రైనేజీ లైన్ సామర్థ్యం పెంచాలి.

- కేన్సర్ హాస్పటల్‌కు ప్రత్యేక లైన్ వేసుకోవాలని కోరినా పట్టించుకోకుండా బస్తీ లైన్‌లో కలిపేశారు. క్యాన్సర్ హాస్పటల్ నుంచి వస్తున్న మురుగు కూడా బస్తీ మురుగుతో నిండిపోతుండటంతో బస్తీ మధ్యలో ఉన్న ఈ లైన్ ఎప్పుడూ పొంగిపొర్లుతూనే ఉంది.
- ప్రస్తుతం బస్తీలో రోడ్లు వేస్తున్నప్పటికీ బ్రహ్మకుమారీస్ బిల్డింగ్ పక్కన ఉండే ఈ భయంకరమైన రోడ్డును మాత్రం పట్టించుకోవడం లేదు. వచ్చే వర్షాకాలంలోపు ఈ రోడ్డుకు మోక్షం కలగకపోతే బస్తీలోని పరిస్థితి గతంలో కంటే దయనీయంగా తయారయ్యింది. పైభాగంలో వేసిన కొత్త రోడ్లు ఇంకాస్త ఎత్తు పెరగడంతో వరదనీరు మరింత ఎక్కువగా బ్రహ్మకుమారీస్ పక్కన నిలిచిపోయి స్థానికుల భయాన్ని మరింత పెంచుతోంది. రాబోయే వర్షాకాలం లోపు ఈ సమస్యకు చెక్ పెడతారో లేదో చూడాలి.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్, గురువారం,
15, మే, 2025



సండే ఫండే.. ఇక సందడే..



మెట్రో నగరాల్లో వీకెండ్స్ సందడికి కొదవే ఉండదు. వీకెండ్స్ అంటేనే ఇక్కడ ఒక ట్రెండ్ అన్నట్టు. అయితే గత కొంత కాలంగా ఈ ట్రెండ్ నెమ్మదించింది. వారాంతాల్లో ఫుల్ జోష్‌తో జరిగే ఈవెంట్లు కరోనా తర్వాత నెమ్మదించాయి. దీనికితోడు నగరంలో అధికారికంగా నిర్వహించే వీకెండ్ కార్యక్రమాలు సైతం తగ్గుముఖం పట్టాయి. అయితే గతంలో కొంత కాలం పాటు నగరవాసుల్ని ఉర్రూతలూగించిన వారాంతపు వినోద కార్యక్రమం మరోసారి 'సండే.. ఫండే' తిరిగి రానుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే జరిగిపోయాయి. నగరం వేదికగా ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని మరోసారి నిర్వహిస్తున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

- గతంలో ఆగిపోయిన సండే ఫండే మరోసారి
- మిస్‌వరల్డ్ పోటీల నేపథ్యంలో నగరంలో నిర్వహణ
- 18న ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్‌లలో బ్యూటీల సందడి





వారాంతపు వినోదాలకు పునఃస్వాగతం

నగర వాసులు ఎంతో ఆసక్తిగా పాల్గొనే వీకెండ్ కార్నివాల్ కార్యక్రమం మళ్లీ తిరిగి రానుంది. ప్రతి వారాంతపు రోజును 'సండే-ఫండే' పేరిట ఉర్రూతలూగించే విధంగా నిర్వహించారు. కరోనా తర్వాత పూర్తిగా నెమ్మదించిన ఈ పరిస్థితి. అనంతరం కొంత కాలం నిర్వహించినా.. ఆ తర్వాత అనివార్య పరిస్థితుల వల్ల ఆగిపోయింది. అయితే ప్రస్తుతం ఈ వీకెండ్ జోష్‌కు మిస్ వరల్డ్ పోటీ తిరిగి ఊపిరిపోయనుంది. ఈ ఈవెంట్ మే 18న ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా సాయంత్రం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకూ విభిన్న రకాల కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందులో జానపద నృత్యాలు, వంటల పోటీలు వంటి మరెన్నో నగర వాసులను అలరించనున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సచివాలయ భవనంపై రాష్ట్ర చరిత్ర, అభివృద్ధి ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

నాటి వీకెండ్.. సూపర్ హిట్..

నగరవాసులకు వినోదం ద్వారా వారాంతపు ఆహ్లాదాన్ని పంచడానికి హైదరాబాద్ మెట్రో పాలిటన్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ 'సండే-ఫండే'కు రూపకల్పన చేశారు. దీని కోసం ప్రతి ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి 10 గంటల వరకూ ట్యాంక్ బండ్ రోడ్డు మీద వాహనాలకు ప్రవేశం ఆపేసి, ఈ వినోద కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఆ రహదారిని పలు రకాల సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాళ్ల ఏర్పాట్లతో ట్యాంక్ బండ్ రోడ్ ఒక ఓపెన్ ఎంటర్‌టైన్ మెంట్ ప్లేస్‌గా అవతరించేది. ఆ సందర్భంగా మ్యూజికల్ ప్రదర్శనలు, అబ్బురపరిచే ఫైర్‌వర్క్స్, జానపద కళలు, ఇంద్రజాల ప్రదర్శనలు వంటి ఎన్నో వినోద కార్యక్రమాలు నిర్వహించేవారు.

ప్రమోషన్ యాక్టివిటీస్..

ఆర్మీకి చెందిన బ్యాగ్ పైపర్ బ్యాండ్ ప్రదర్శనలు, శిల్పారామం కళాకారుల చేతి వృత్తిదారుల ఉత్పత్తుల అమ్మకాలు, ఫుడ్ ట్రక్స్ ద్వారా వివిధ రకాల వంటకాలు.. వంటివి ఇందులో భాగమయ్యేవి. అంతే కాకుండా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎమ్‌డీఏ) ద్వారా ఉచిత మొక్కల పంపిణీ కూడా జరిగేది. లేజర్ షోలు, ఫైర్ స్పోర్ట్స్ ఉండేవి. పలు ప్రైవేటు టీవీ చానెళ్లు తమ ప్రమోషన్ యాక్టివిటీస్‌కు కూడా అదే సందర్భాన్ని ఉపయోగించుకునేవి. దీంతో చిన్నితెర సెలబ్రిటీలు, యాంకర్స్ సైతం నగరవాసులకు కనువిందు చేసేవారు. అదే సమయంలో హుస్సేన్ సాగర్ వద్ద ఫౌంటెన్ షో కూడా ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. కోవిడ్ కారణంగా నిలిపేసిన ఈ కార్యక్రమం ఆ తర్వాత మధ్యలో ఒకసారి పునరుద్ధరించినా దీర్ఘకాలం కొనసాగలేదు. చివరిసారిగా రెండున్నరేళ్ల క్రితం ఈ ఈవెంట్‌ను నిర్వహించారు.

రీఛార్జ్.. రీస్టార్ట్..

సండే ఫండే నాటి ఉత్సాహాన్ని మళ్లీ తీసుకురావడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం నగరం కేంద్రంగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలను ఎంచుకున్నారు. నగరవాసులు మరచిపోయిన వారాంతపు సందడి సండే ఫండేకు పునర్వైభవం రావాలంటే.. అది మిస్ వరల్డ్ పోటీదారులను ఇందులో భాగం చేయడం ద్వారా సాధ్యపడుతుందని భావించి, మిస్ వరల్డ్ డైలీ షెడ్యూల్‌లో దీనిని కొత్తగా జేర్చారు. ఈ నేపథ్యంలో ఇకనైనా ఈ ఈవెంట్ నిరాటంకంగా కొనసాగుతుందని వారమంతా అలసి, సొలసిన నగర జీవికి సాంత్వన పంచుతుందని ఆశిద్దాం.









మరపురాని అనుభూతి..

ఆఫ్రికన్ డ్రమ్మింగ్..

ఐకియాలో జెంబే సర్కిల్ వర్క్‌షాప్

గచ్చిబౌలి : ఆఫ్రికన్ డ్రమ్మింగ్‌లో ప్రాథమిక లయలు, మునుపెన్నడూ డ్రమ్స్‌ను తాకిన అనుభవం లేకపోయినా నగరవాసులు డ్రమ్స్‌ను వాయిస్తూ మరపురాని అనుభూతిని పొందారు. సామూహిక సంగీతంలో ఆనందడోలికల్లో మునిగితేలారు. గచ్చిబౌలిలోని ఐకియా స్టోర్‌లో జెంబే సర్కిల్ వర్క్‌షాప్‌ను బుధవారం నిర్వహించారు. ది జెంబే సర్కిల్ ఫౌండర్ సాయి కుమార్ ఆఫ్రికన్ సంగీత పరికరం జెంబేను వాయించడంలో మెళకువలు నేర్పారు. నగరవాసులు ఉత్సాహంగా పాల్గొని సామూహిక సంగీతాన్ని ఆనందించారు. జెంబే దక్షిణాఫ్రికా నుంచి వచ్చి ఒక పెర్కుషన్ వాయిద్యం అని, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తూ ఒత్తిడిని తగ్గిస్తుందని సాయి కుమార్ పేర్కొన్నారు.






పవర్ లిఫ్టింగ్‌లో కేఎల్‌హెచ్ హవా..

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన కేఎల్‌హెచ్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ విద్యార్థినులు ఈ నెల 10, 11 తేదీల్లో ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన ఆసియన్ జూనియర్ ఉమెన్స్ ఎక్విప్డ్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్, ఆసియన్ యూనివర్సిటీ పవర్‌లిఫ్టింగ్ కప్‌లో తమ సత్తా చాటారు. నగరంలోని కొండాపూర్‌లో బిజినెస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఎర్ కోనేరు లక్ష్మణ్ హవీష్ ఈ వివరాలు తెలిపారు. తమ బీబీఏ విద్యార్థిని షేక్ షబీనా 84 కిలోల విభాగంలో నాలుగు, జూనియర్ ఉమెన్స్ విభాగంలో నాలుగు చొప్పున బంగారు పతకాలను గెలుచుకుందని, బీసీఏ విద్యార్థిని నాగం జ్ఞాన దివ్య, 84 కిలోలు పైబడిన విభాగంలో బంగారు పతకాలను దక్కించుకుందని, అలాగే బీఏ-ఐఏఎస్ విద్యార్థిని షనూన్ మదిరా 47 కిలోల విభాగంలో బంగారు పతకాన్ని గెలుచుకుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ఈ విజయాలకు తమ సంస్థ అందించిన ప్రోత్సాహమే కారణమని తెలిపారు.

ఎకోస్ ఆఫ్ ఆంధ్రా..

రీన్-ది చెఫ్స్ స్టూడియోలో ఆంధ్రా రుచుల పండుగ



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఎన్ని కాంటినెంటల్ వంటకాలున్నా తెలుగు రుచులకున్న ప్రత్యేకతే వేరు. వివిధ ప్రాంతాలు, దేశాల నుంచి నగరానికి వచ్చే అతిథులు ప్రత్యేకంగా ఆంధ్రా వంటకాలను రుచి చూసే వెళతారు. ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా నగరంలోని లీలా వేదికగా వివిధ సంస్కృతుల రుచులను నగరవాసులకు, అతిథులకు రుచి చూపిస్తున్న 'రీన్ – ది చెఫ్స్ స్టూడియో' ఈ సారి ఆంధ్రా వంటకాలను ప్రదర్శిస్తోంది. ఎకోస్ ఆఫ్ ఆంధ్ర పేరుతో నిర్వహిస్తున్న ఈ ఫుడ్ ఫెస్ట్ ఈ నెల 18వ తేదీ వరకూ ఆంధ్రా పసందైన రుచులను చేరువచేస్తోంది. అంతేకాకుండా ప్రముఖ చెఫ్ 'మీరా' ఈ ఎకోస్ ఆఫ్ ఆంధ్ర ఫెస్ట్‌లో తన పాకశాస్త్ర నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుత వేసవి నేపథ్యంలో తెలుగు రుచులతో విడదీయరాని అనుబంధమున్న మామిడి వంటకాలను సైతం ప్రత్యేకంగా వండివారుస్తున్నారు.

బాల్యపు ఆహారానికి నా ప్రేమలేఖ..

'ఎకోస్ ఆఫ్ ఆంధ్ర అనేది నా చిన్ననాటి ఆహారానికి నా ప్రేమలేఖ'..!! ఇవి నన్ను పెంచిన, లాలించిన రుచులు, తరతరాలుగా వారసత్వంగా వచ్చిన వంటకాలు. ప్రస్తుత తరుణంలో విభిన్న, వినూత్న రుచులుగా మోడ్రన్ డైనింగ్ టేబుల్ పైకి రావడం మళ్లీ ఇంటికి వెళ్లిన అనుభూతిని తీసుకువస్తుంది. ఆంధ్రా గొప్ప పాక సంప్రదాయాలకు గుర్తుగా రూపొందించిన క్యూరేటెడ్ థాలీని ఇక్కడ ప్రత్యేకంగా అందిస్తున్నారు. ఇది ప్రతిష్టాత్మకమైన వారసత్వ వంటకాలను పునరుజ్జీవింపజేస్తుంది. ఈ ప్రాంతం ఆహార సంస్కృతిని ఇక్కడికి విచ్చేసే అతిథులకు చేరువ చేస్తూ ఆ ఘుమఘుమలను విశ్వవ్యాప్తం చేస్తున్నాం. ముఖ్యంగా మామిడి అంటే ఒక నోస్టాల్జిక్ అనుభూతి. ఈ వారసత్వ థాలీ కుటుంబాలు, పండుగలు భూమి లయల కథను చెబుతుంది. ఆనాటి పచ్చడి మొదలు నేటి కూరలు ఆధునిక రుచుల వరకూ సృషిస్తుంది ఈ వేదిక. ఈ పాప్-అప్ ద్వారా కాంటినెంటల్ వంటకాలను మైమరపించే రుచలను అందంచడమే లక్ష్యంగా రీన్ చెఫ్స్ స్టూడియో సిద్ధమైంది. – ప్రముఖ చెఫ్ మీరా





నగరంలో జరుగుతున్న మిస్ వరల్డ్ 2025 పోటీలు హైదరాబాద్‌కి మరింత వన్నె తీసుకొస్తున్నాయి. వివిధ దేశాలకు చెందిన ఫ్యాషన్ డిజైనింగ్ వస్త్రాలతో అందాల తారలు హొయలు పోయారు. దీంతో పాటు వివిధ ప్రాంతాల్లోని ప్రత్యేకతలను తెలుసుకునేందుకు పోటీదారులు ఉత్సాహం చూపుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం హైటెక్ సిటీలోని ట్రిడెంట్ హోటల్ వేదికగా తమ తమ దేశాల వస్త్రధారణతో ఫొటోలకు ఫోజులిచ్చారు. ఇది అధునాత సాంస్కృతిక సమ్మేళనంగా భావిస్తున్నారు. దీనికి తోడు ఇక్కడి అధునాతన జీవనశైలి, ముఖ్యంగా ఆహారం తమకు ఎంతగానో నచ్చిందని పలువురు తారలు అభిప్రాయపడుతున్నారు. ఈ నెల 31వ తేదీ వరకూ కొనసాగనున్న మిస్ వరల్డ్ పోటీల కోసం నిత్యనూతనంగా సన్నద్ధమవుతున్నట్లు వారు పేర్కొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో



సాంస్కృతిక సమ్మేళనం..

అందాల సోయగం..

నగరంలో మిస్ వరల్డ్ తారల సందడి | కళ్లు చెదిరే వస్త్ర సోయగాలతో ఫొటోలకు ఫోజులు



క్లుప్తంగా...



ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సందీప్ సుల్తానియా.

ఏకీకృత రూల్స్ రూపొందించాలి

• ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కొమరయ్య



సాక్షి, హైదరాబాద్: ఏకీకృత సర్వీస్ నిబంధనలను రూపొందించాలన్న రెండు దశాబ్దాల డిమాండ్‌ను నెరవేర్చాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య కోరారు. సీఎస్‌ను ఆయన బుధవారం కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎంఈవోలు, డైట్ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లకు పదోన్నతి కల్పించాలని, డీఎస్సీ 2003 ద్వారా నియమించిన ఉపాధ్యా యులకు పాత పింఛను విధానం అమలు చేయాలని కోరారు.

నేడు బోరు రీచార్జింగ్‌పై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: ఏటా వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి.. ఎండిపోతున్న బోర్ల సమస్యకు పరిష్కారంగా బోరు రీచార్జి విధానంపై ఈ నెల 15న హైదరాబాద్‌లో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం, వాక్ ఫర్ వాటర్ సంస్థ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించనున్నాయి. ఎర్రమంజిల్ లోని విద్యాసాగర్‌రావు భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్న సదస్సులో కర్ణాటక కు చెందిన జల నిపుణుడు డాక్టర్ దేవరాజ్ రెడ్డి, తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు ఎం.శ్యాంప్రసాద్‌రెడ్డి, వాక్ ఫర్ వా టర్ సంస్థ వ్యవస్థాపకుడు ఎం.కరుణాకర్ రెడ్డి అవగాహన కల్పిస్తారు. వివరాలకు 9949094 370 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గడువులోగా పూర్తి చేయాలి

ప్రాధాన్య ప్రాజెక్టుల పనులపై అధికారులకు సీఎం ఆదేశం

- 18 నెలల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు.. డిసెంబర్‌లోగా కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల అందుబాటులోకి తేవాలి..
- నీటిపారుదల శాఖపై సమీక్షలో రేవంత్‌రెడ్డి



ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, చిన్నారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పనులను ప్రాధాన్యత క్రమంలో గడువులోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 2027 జూన్ నాటికి కృష్ణా పరీవాహకంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తదనుగుణంగా నిర్దిష్ట గడువులతో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టుల పనులను వేగిరం చేయాలన్నారు. కృష్ణా బేసిన్‌లోని ప్రాధాన్యత ప్రాజెక్టులకు నిధుల ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకొని భూసేకరణను సత్వరమే పూర్తిచేయాలని భూసేకరణ ప్రత్యేకాధికారిని ఆదేశించారు. నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ఎంపికైన 244 మందితోపాటు జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లుగా ఎంపికైన 199 మందికి బుధవారం సాయంత్రం జలసౌధలో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందించారు. అనంతరం మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్షించారు. సీఎస్ కె.రామకృష్ణారావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా, కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఈఎన్సీ అనిల్‌కుమార్‌సమీక్షలో పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి పనులకు కార్యాచరణ ప్రణాళిక

సూదిని జైపాల్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ఉద్దండాపూర్ జలాశయం వరకు మొదటి ప్రాధాన్యతగా తీసుకొని పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను 18 నెలల్లో పూర్తి చేయాలని, అందుకు వీలుగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది జూన్‌లోగా పూర్తి చేయాలని చెప్పారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి, జవహర్ నెట్టెంపాడు, రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకాలను ఈ ఏడాది డిసెంబర్‌లోపు పూర్తి చేయాలన్నారు. వీటికి సంబంధించి పెండింగ్ పనులు, అవసరమైన నిధులను సీఎం అడిగి తెలుసుకున్నారు.

కృష్ణాలో జలాల్లో నీటి వాటాల కోసం..

కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటాల సాధనకు చేస్తున్న ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రయోజనాలను అత్యంత ప్రాధాన్యంగా గుర్తించాలన్నారు. సుమారు 70 శాతం కృష్ణానది పరీవాహక ప్రాంతం తెలంగాణలోనే ఉండగా, ఏపీలో కేవలం 30 శాతమే ఉందని గుర్తు చేశారు. ఈ ప్రాతిపదికన కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి తెచ్చుకునేలా ట్రిబ్యునల్ ఎదుట పట్టుబట్టాలన్నారు. గోదావరి పరీవాహకం నుంచి పట్టిసీమ ద్వారా ఏపీ 90 టీఎంసీలను కృష్ణా పరీవాహక ప్రాంతానికి తరలిస్తున్న నేపథ్యంలో ఆ మేరకు తెలంగాణకు సంబంధించిన కృష్ణా జలాల వాటాను పెంచాలని కోరుతూ వాదనలు వినిపించాలన్నారు. రాష్ట్ర ఏర్పాటు నాటికి కృష్ణా పరీ వాహకంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులన్నింటికీ నీటి వాటాల కేటాయింపుల కోసం సమర్థంగా వాద నలు వినిపించాలని ఆదేశించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టే టప్పుడు నీటి కేటాయింపులు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ట్రిబ్యు నల్ నుంచి నీటి కేటాయింపులు పొందాలని సూచించారు.



ప్రమాణ స్వీకారం అనంతరం సీఎంతో సీఐసీ చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లు దేశాల భూపాల్, బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాస్‌రావు, మోసినా పర్వీన్

సమాచార కమిషనర్ల ప్రమాణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార కమిషన్‌లో కొత్తగా నియమితులైన నలుగురు కమిషనర్లు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో పీవీ శ్రీనివాస్‌రావు, మోసినా పర్వీన్, దేశాల భూపాల్, అయోధ్యరెడ్డి బోరెడ్డి ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ కె.రామకృష్ణారావు, సీఐసీ చంద్రశేఖర్‌రెడ్డి సహా పలువురు అధికారులు హాజరయ్యారు. కొత్తగా నియమితులైన కమిషనర్లను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ఏళ్లుగా ఖాళీగా ఉన్న పదవుల్లో నియామకం చేపడుతూ మూడు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీరంతా మూడేళ్లు లేదా 65 ఏళ్ల వయసు వచ్చేవరకు ఆయా పదవుల్లో కొనసాగుతారు. సీఐసీతోపాటు ఏడుగురి జాబితాను గవర్నర్‌కు పంపగా, పలు కారణాలతో ముగ్గురి నియామకం ఆగిన విషయం విదితమే. కాగా, ప్రధాన కమిషనర్, కమిషనర్ల రాకతో ఫిర్యాదుల విచారణ ఊపందుకోనుంది.

మరో 28 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: గతంలో మంజూరు చేసి వివిధ కారణాలతో లైసెన్సులు రద్దయిన మరో 28 బార్లకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24, మహబూబ్‌నగర్, బోధన్, నిజామాబాద్, సరూర్‌నగర్, జల్‌పల్లి మున్సిపాలిటీల్లో ఒక్కో టి చొప్పున బార్ల ఏర్పాటుకు దరఖాస్తులను కోరుతున్నట్టు ఆ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రూ.లక్ష (నాన్ రిఫండబుల్) చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించి ఎవరైనా ఈ బార్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, ఈనెల 15వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తులను ఆయా ప్రాంతాల్లోని కార్యాలయాల్లో సమర్పించాలని వెల్లడించారు.

ఇంటింటికీ, ప్రతి ఊరికీ సంక్షేమం

ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమం, అభివృద్ధి: భట్టి విక్రమార్క



ఎర్రుపాలెంలో పీహెచ్‌సీ భవనానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఎర్రుపాలెం: ధనిక రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ చేతిలో పెడితే అప్పులమయం చేసిందని.. అయినా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, ప్రజలందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యంగా తాము పాలన సాగిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. గత ప్రభుత్వంలో ఉన్న అప్పులు, తమ ప్రభుత్వం వచ్చాక ఊరూవాడ అమలుచేసిన సంక్షేమ పథకాలపై త్వరలోనే వివరాలన్నీ వెల్లడిస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో బుధవారం 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి, బోనకల్ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎర్రుపాలెంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, తాము అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచగా ఇప్పటివరకు 90 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి జరిగిందని తెలిపారు. అంతేకాక బీఆర్‌ఎస్ విస్మరించిన ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించి వేలాది ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. వైద్యరంగానికి రూ.11,600 కోట్లు కేటాయించగా, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు పొందిన రైతులకు ఇందిరా గిరి జలవికాసం ద్వారా ఉచితంగా బోర్లు వేయించి, పంప్ సెట్లు, సోలార్ విద్యుత్ సమకూరుస్తామని వివరించారు. ఆయిల్‌పామ్, అవకాడో మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తామని.. ఇందుకోసం రూ.12,500 కోట్లు వెచ్చించనున్నామని వెల్లడించారు. ఇక యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలకు రూ.11,600 కోట్లు, రాజీవ్ యువవికాసం పథకానికి రూ.9 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలానికి ముందే 3 నెలల రేషన్

రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: వర్షాకాలంలో తిండి గింజల నిల్వ, రవాణాలో అంతరాయాలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. జూన్ నుంచి మొదలయ్యే వర్షాకాలం, వరదల వంటివి రాష్ట్రాలకు అడ్డంకులుగా మారవచ్చన్న అంచనాల నేపథ్యంలో, అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు జాతీయ ఆహార భద్రత చట్టం కింద ఆగస్టు 2025 వరకు అవసరమైన తిండి ధాన్యాలను ముందస్తుగానే లిఫ్టింగ్ చేసి, పంపిణీ చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శులకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ సింగ్ లేఖ రాశారు. మే 30లోగా జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన సరుకును లబ్ధిదారులకు అందించాలని పేర్కొన్నారు. ముందస్తు బియ్యం లిఫ్టింగ్, పంపిణీ ప్రక్రియలో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోడౌన్లలో తగినంత నిల్వలు ఉండేలా చూసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుని అవస రమైన చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించారు. ఈ ఉత్త ర్వులు సంబంధిత అధికారుల అనుమతి మేరకు తక్షణం అమల్లోకి వస్తాయన్నారు.

రాష్ట్రంలో జూన్‌లోనే 3 నెలల సరఫరా

ఏప్రిల్ కోటా రేషన్ బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తవుతున్న నేపథ్యంలో వచ్చే జూన్‌లో మూడు నెలల కోటాను విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలియజేసినట్లు సమాచారం. ప్రతినెలా 1.75 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమైన నేపథ్యంలో మూడు నెలలకు సంబంధించి సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కారణంగా గోడౌన్‌ల నుంచి సన్న బియ్యం నిల్వలను సమీకరించి వచ్చే నెలలో మూడు నెలల రేషన్ కోటాను విడుదల చేసేందుకు పౌర సరఫరాల శాఖ సన్నాహాలు చేస్తోంది.

'వెటర్నరీ అంబులెన్స్'కు ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ రూ.17 లక్షల విరాళం

సాక్షి, హైదరాబాద్: ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. గో విజ్ఞాన్ అనుసంధాన్ కేంద్రానికి రూ.17 లక్షల విరాళం ప్రకటించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అందించనున్న ఈ మొత్తాన్ని పశు వుల సంక్షేమం కోసం సెంట్రల్ ఇండియా ప్రారంభించే మొదటి అధునాతన వెటర్నరీ అంబులెన్స్‌కు ఉపయోగించనున్నట్టు తెలిపింది. ఈమేరకు ఆర్‌సీ ప్లాస్టో డైరెక్టర్ నీలేశ్ అగర్వాల్ చెక్కును గో విజ్ఞాన అనుసంధాన్ కేంద్రం అధ్యక్షుడు పద్మేశ్ గుప్తాకు అందజేశారు. ప్రమాదంలో గాయపడిన లేదా జబ్బుపడిన పశువులకు తక్షణ వైద్య సహాయం అందించడానికి వెటర్నరీ అంబులెన్స్‌ల అవసరం ఎంతో ఉంది. తరచూ తీవ్రంగా గాయపడే పశువు లు సకాలంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నాయి. ఈ అధునాతన వెటర్నరీ అంబులెన్స్ ఆవులకు త్వరితగతిన, సురక్షితమైన వైద్య సహా యాన్ని అందిస్తూ జంతు సంక్షేమానికి దోహదం చేయనున్నాయి. కాగా, ఈ అంబులెన్స్‌ను గుజరాత్‌కు చెందిన మనియర్ గ్రూప్ రూపొందించింది.

నగర వార్తలు

ఫీజులు పెంచే అవకాశం కల్పించండి

– మంత్రికి ట్రస్మా ప్రతినిధుల వినతిపత్రం



కవాడిగూడ: ప్రతి ఏటా బడ్జెట్ పాఠశాలల్లో 15 శాతం ఫీజులు పెంచుకునే విధంగా వెసులుబాటు కల్పించాలని తెలంగాణ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మంత్రి శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. రూ. 60 వేలు ఫీజు ఉన్న పాఠశాలలను డిస్ట్రిక్ట్ రెగ్యులేటరీ ఫీ కమిటీ (డీఆర్‌ఎఫ్‌సీ) కింద పరిగణించవద్దన్నారు. ఏ పాఠశాలకు వచ్చిన ఫలితాలను అదే బ్రాంచ్‌లో అడ్వర్‌టైజ్ చేయాలని వేరే బ్రాంచ్‌లో చేయకూడదని విజ్ఞప్తి చేశారు. త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. గ్రూప్–1 పరీక్ష కుంభకోణంలో తనతో పాటు తన కోడలి ప్రమేయం ఉందంటూ కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలపై మాజీ ఎమ్మెల్సీ, ఆలిండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సబావత్ రాములు నాయక్ సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సనత్‌నగర్ పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి కేసును బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఏప్రిల్ 14న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఆయన కోడలు గ్రూప్–1 పరీక్ష కుంభకోణంలో ఉన్నారని ఒక ప్రకటనను విడుదల చేశారు. ఆ ప్రకటన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో రావడంతో వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఆ ఆరోపణలు తమ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు, తమ సామాజిక స్థితిని దెబ్బతీసేందుకు, మానసిక వేదనకు గురిచేసేలా ఉన్నాయని రాములు నాయక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేశారు.

బార్లకు టెండర్లు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని 24 బార్ అండ్ రెస్టారెంట్లకు ఎక్సైజ్‌శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ ఎక్సైజ్ డివిజన్ల పరిధిలో ఖాళీగా ఉన్న 2బీ బార్లకు టెండర్లు ఆహ్వానిస్తుంది. అదే విధంగా రంగారెడ్డి జిల్లా జల్‌పల్లి మున్సిపాలిటీలో ఒక బార్‌కు టెండర్లు ఆహ్వానిస్తుంది. ఈ మేరకు బుధవారం అబ్కారీ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

సిటీ మార్కెట్‌లో బాయ్‌కాట్ టర్కీ

- ఇరాన్, టర్కీ పండ్లు అమ్మబోమంటున్న వ్యాపారులు
- ఉగ్ర పోరులో పాకిస్థాన్‌కు సహకరించడమే కారణం



సాక్షి, సిటీబ్యూరో: ఒకరి నుంచి సాయం పొందామంటే వారి పట్ల కృతజ్ఞతాభావంతో ఉండాలి. వీలైతే సాయం చేయాలి. లేదంటే సదరు వ్యక్తికి నష్టం చేయకుండా ఉండటానికి ప్రయత్నించాలి. అంతేగాని శత్రువుతో కలిసి సాయం చేసినవారిపైనే దాడులకు పాల్పడతామంటే సమాజం క్షమించదు. ఇప్పుడిదంతా ఎందుకంటే.. గత కొన్నేళ్ల క్రితం టర్కీలో భూకంపం వచ్చినపుడు భారతదేశం తక్షణం స్పందించి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందించింది. తాజాగా ఉగ్రవాదులకు బుద్ధిచెప్పేందుకు భారత్ ఆపరేషన్ సిందూర్ తలపెట్టింది. దీంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ క్రమంలోనే భారత్–పాక్ మధ్య జరుగుతున్న దాడుల్లో ఏమాత్రం విశ్వాసం లేకుండా టర్కీ పాకిస్తాన్‌కు అండగా నిలిచింది.అన్నం పెట్టిన భారతదేశానికే ద్రోహం చేస్తోంది. అంతటితో ఆగకుండా తన మిత్ర దేశాలతో మన శత్రువుకు సాయం చేయాలని ప్రయత్నిస్తోంది. పాక్‌కు డ్రోన్లు సరఫరా చేయడమే కాకుండా మిలిటరీ సిబ్బందిని సైతం పంపించింది. ఆపద కాలంలో ఆదుకున్న భారతదేశాన్ని శత్రువుగా పరిగణిస్తోంది. ఈ పరిణామాలు ప్రజలు ఆగ్రహానికి గురవుతున్నాయి. వ్యాపారం, టూరిజం వంటి రంగాల్లో బాయ్‌కాట్ టర్కీ అంటూ ప్రముఖులు, సెలబ్రిటీలు, సాధారణ ప్రజలు సైతం పిలుపునిస్తున్నారు. ఓ ప్రముఖ ప్రైవేటు ఏజెన్సీ నిర్వహించిన సర్వేలో సుమారు 95 శాతం మంది బాయ్‌కాట్‌ను సమర్థించారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నగరంలోని పలు మార్కెట్లలో టర్కీ, ఇరాన్ దేశాల నుంచి వచ్చే పండ్లు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులపై నిషేధం విధించాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఉన్న వాటిని విక్రయించరాదని, కొత్తగా దిగుమతులను నిషేధించాలని నినదిస్తున్నారు. మలక్‌పేట్, గడ్డిఅన్నారం, బాటసింగారం మార్కెట్లలో టర్కీ, ఇరాన్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న పండ్లు, ఇతర ఉత్పత్తుల విక్రయాలు నిలిపివేశారు.

వచ్చే సీజన్‌పై నీలినీడలు..

టర్కీ నుంచి రెండు రకాల యాపిల్ పండ్లు సుమారు వెయ్యి నుంచి 1,200 టన్నులు హైదరాబాద్ మార్కెట్‌కు దిగుమతి చేసుకుంటున్నాం. ఏటా డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో కంటైనర్లు వస్తాయి. అలాగే ఇరాన్ నుంచి కివి పండ్లు సుమారు వెయ్యి టన్నులు వరకు వస్తాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కివీ అక్టోబరు, నవంబరు, డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి నెలల్లో వస్తాయి. ఈ రెండు రకాలకు ప్రస్తుతం సీజన్ ముగిసింది. వచ్చే సీజన్‌కు ముందస్తుగా ఆర్డర్లు పెట్టుకోవడానికి వ్యాపారులు ఆసక్తిచూపడం లేదు. ప్రస్తుత పరిస్థితులు అంత సానుకూలంగా లేవు. భవిష్యత్తులో ప్రభుత్వం ఏరకమైన నిర్ణయం తీసుకున్నా దాన్ని స్వాగతిస్తామని పేర్కొంటున్నారు. దేశానికి ద్రోహం చేస్తున్న ఆ దేశ ఉత్పత్తులను బాయ్‌కాట్ చేయాలని నిర్ణయించుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయంగా వాషింగ్టన్, సౌత్ అమెరికా నుంచి యాపిల్స్‌ను దిగుమతి చేసుకోవడానికి మొగ్గుచూపిస్తున్నారు.

బాయ్‌కాట్ ట్రెండ్ కనిపిస్తోంది.

టర్కీ నుంచి రెండు రకాల యాపిల్స్ వస్తాయి. ఇరాన్ నుంచి కివి పండ్లు హైదరాబాద్ మార్కెట్‌కు వస్తాయి. తాజా పరిణామాలతో మార్కెట్‌లో బాయ్‌కాట్ ట్రెండ్ కనిపిస్తోంది. ఈ ఏడాది సీజన్ అయిపోయింది. వచ్చే సీజన్ ఎలా ఉంటుందనేది స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రత్యామ్నాయ మార్కెట్లను పరిశీలించే అవకాశం ఉంది. భారత ప్రభుత్వ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా దాన్ని స్వాగతిస్తాం.

– నాగరాజు, బాటసింగారం, ఫ్రూట్ మార్కెట్.

టూరిస్టులు సైతం..

భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో టర్కీ వెళ్లేందుకు పర్యాటకులు ముందస్తుగా చేసుకున్న ప్రణాళికలను సైతం రద్దు చేసుకుంటున్నారు. బుకింగ్ క్యాన్సిలేషన్స్ 250 శాతంగా నమోదైందని, అదే సమయంలో కొత్త బుకింగ్స్ 60 శాతం పడిపోయాయని ప్రముఖ ట్రావెల్ సంస్థలు వెల్లడించాయి. టర్కీ, అజర్‌బైజాన్‌లకు ఆన్‌లైన్ బుకింగ్‌లు నిలిపివేస్తున్నట్లు పలు ట్రావెల్ ఏజెన్సీలు ప్రకటించాయి. గత వారం రోజులుగా ట్రావెల్ ట్రాక్‌లో బాయ్‌కాట్ నినాదం స్పష్టంగా కనిపిస్తోంది. అత్యవసర ప్రయాణాలు మాత్రమే కొనసాగుతున్నాయి.

విజయ్ షానుపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్ : కల్నల్ సోఫియా ఖురేషిని అవమానించిన మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా ఖురేషి పై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ డిమాండ్‌చేశారు. అలాగే సెక్రెటరీ విక్రమ్ మిస్త్రీ ప్రభుత్వ విధానాలను మీడియాకు తెలియజేస్తే అతనిని కూడా ట్రోల్ చేయటం కూడా దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడమేనన్నారు. ఈ రెండు విషయాలపై మోదీ ఖండించకపోవడం దారుణమన్నారు. దేశ భక్తిని ప్రదర్శించిన సోఫియా ఖురేషిని, విక్రమ్ మిస్త్రీని అవమానించేవారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే జైలులో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఎంను కలిసిన మేయర్



బంజారాహిల్స్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జీహెచ్‌ఎంసీకి నిధులు మంజూరు చేసినందుకు సెక్రెటేరియటలో సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీహెచ్‌ఎంసీ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించాలని మేయర్ సీఎంను కోరారు.

లక్డీకాపూల్‌లో రోశయ్య కాంస్య విగ్రహం

– ఏర్పాటుకు కొటేషన్లు పిలిచిన జీహెచ్‌ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: లక్డీకాపూల్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహం ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ సంబంధిత ఏజెన్సీల నుంచి కొటేషన్లు ఆహ్వానించింది. విగ్రహం 9 అడుగుల ఎత్తుతో ఉండేలా, విగ్రహం ఏర్పాటుకు దిమ్మె, తదితరమైన వాటి కోసం కొటేషన్లు పిలిచింది. విగ్రహం తయారీకి సంబంధించిన ఆర్కిటెక్ట్ సేవల నుంచి ప్రతిష్ఠ వరకు వివిధ పనుల కోసం కొటేషన్లు కోరింది. జూలై 4న రోశయ్య జయంతి రోజున విగ్రహాన్ని ఆవిష్కరించాలనే తలంపులో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అందుకనుగుణంగా జీహెచ్‌ఎంసీ ఈ కొటేషన్లు ఆహ్వానించింది.

పీవీఆర్ మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి



గోల్కొండ చౌరస్తాలో నిరసన వ్యక్తం చస్తున్న నాయకులు


ముషీరాబాద్: నగరంలోని పీవీఆర్ మల్టీప్లెక్స్ సినిమా థియేటర్లలో పని చేస్తున్న వారిపై యాజమాన్యం, హెచ్‌ఆర్ మేనేజర్ వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉన్నాయని, మహిళా ఉద్యోగులకు రక్షణ కరువైందని సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటేష్ పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని మహిళా కార్మికులకు రక్షణతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.పీవీఆర్ సినిమా కార్మికుల అక్రమ అరెస్టులు, యజమాన్యం మొండివైఖరిని నిరసిస్తూ గోల్కొండ చౌరస్తాలో రికార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవీఆర్ మల్టీప్లెక్స్ సినిమా థియేటర్స్‌లో పని చేసే కార్మికులు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేయిస్తున్నారన్నారు. 50 మంది చేయాల్సిన పనిని 20 మందితో చేయిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వీరికి కనీస కార్మిక హక్కుల్ని అమలు చేయడం లేదన్నారు. కార్మికుల హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి పూర్తిగా మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నగర అధ్యక్షులు ఎం.దశరథ్, సి.ఆర్.వెంకటేష్, పి.మల్లేష్, సినిమా థియేటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ మారన్న, రాష్ట్ర కార్యదర్శి అరుణ్, కమలాకర్, రాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు గౌరవప్రద జీవన భృతికి కృషి

ప్రతినిధుల సమావేశంలో జీహెచ్‌ఎంసీ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు గౌరవమైన జీవన భృతి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, చంద్రకాంత్ రెడ్డిలు అన్నారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్ల ప్రతినిధులు, ఎన్జీఓలతో యూసీడీ విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీలోని వివిధ విభాగాలలో ట్రాన్స్‌జెండర్ల సేవలు వినియోగించుకునే అంశంపై వారి సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్ల ఆసక్తి, అర్హతల మేరకు జీహెచ్‌ఎంసీలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. యూసీడీ విభాగం అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ, జీహెచ్‌ఎంసీలో ఉన్న అవకాశాలను వినియోగించుకొని ట్రాన్స్‌జెండర్లు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నది సీఎం నిర్ణయమని, అందుకనుగుణంగా తాము అన్ని విధాలుగా ట్రాన్స్‌జెండర్లకు సహాయ సహకారాలందించనున్నట్లు తెలిపారు. పార్కులు, జలమండలి రిజర్వాయర్లు, స్పోర్ట్స్ గ్రౌండ్స్ వద్ద సెక్యూరిటీ గార్డులుగా, మెట్రో స్టేషన్లలో, శిక్షణ అనంతరం స్ట్రీట్ లైట్ల నిర్వహణ, బస్తీ దవాఖానాలలో ప్యారా మెడికల్ సిబ్బందిగా, ఇతరత్రా పలు రకాలుగా వారు ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, హార్టికల్చర్ ఆఫీసర్ డా.సునంద తదితరులు పాల్గొన్నారు.

అందాల పోటీల కోసం ప్రజాధనం వృథా



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక నిరసన కార్యక్రమం పై రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ, పిఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రగతిశీల మహిళ సంఘం అధ్యక్షురాలు స్వరూప పేర్కొన్నారు. బుధవారం ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందాల పోటీలకు సుమారు 200 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందన్నారు. కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ నిర్వహిస్తున్న ఈ పోటీలు మహిళల ఆత్మగౌరవాన్ని మార్కెట్ సరుకుగా మారుస్తున్నాయని వారు విమర్శించారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పడం చేనేత పరిశ్రమలకు చేయూత, పర్యాటక రంగం అభివృద్ధికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో అందాలపోటీల వ్యతిరేక వేదిక ప్రతినిధులు అరుణ జ్యోతి, కె.ఎస్. ఆశలత, ఝాన్సీ, జయ, సావిత్రి పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల డిపాజిట్లు దుర్వినియోగం

- నల్లగొండలో కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యుడు అనంతరావు అరెస్ట్
- దారిమళ్లించిన రూ. 20 కోట్లు
- వివరాలు వెల్లడించిన సీఐడీ డైరెక్టర్ శిఖాగోయల్



సాక్షి, హైదరాబాద్/నల్లగొండ : బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులను తోటి ఉద్యోగులే నిలువునా ముంచారు. నల్లగొండ జిల్లా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సహకార పరపతి సంఘంలోని సభ్యులంతా తమ వేతనాల్లో కొంత దాచుకొని సహకార పరపతి సంఘంలో పొదుపు చేశారు. అయితే ఈ సొమ్మును సంఘం నేతలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయకుండా సభ్యులకు నకిలీ బాండ్లు ఇచ్చి నమ్మించారు. వారికి నకిలీ ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందచేసి దాదాపు రూ.20 కోట్ల వరకు కొట్టేశారు. ఇందులో ప్రధాన పాత్ర పోషించిన బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ సూపరింటెండెంట్ బాషమల్ల అనంతరావును సీఐడీ పోలీసులు నల్లగొండలో మంగళవారం అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు చంచల్‌గూడ జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరికొంత మంది కోసం గాలిస్తున్నారు. సీఐడీ డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపిన వివరాల ప్రకారం...నల్లగొండ జిల్లా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు, కార్యదర్శిగా సీహెచ్ భిక్షం 15 సంవత్సరాలుగా బాధ్యతలు నిర్వర్తించారని, భిక్షంతోపాటు మరో ఏడుగురు కమిటీ సభ్యులుగా ఉన్నారు. వీరి ఆధ్వర్యంలో బీఎస్ఎస్ఎన్ ఉద్యోగులు, ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు ఇతరుల నుంచి పెద్ద మొత్తంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు సేకరించారు. ఇలా సేకరించిన ఎఫ్‌డీలకు సంబంధించిన డబ్బును సొసైటీ బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేయకుండా నకిలీ బాండ్స్‌తో దారిమళ్లించారు. ఇలా నకిలీ బాండ్లను జారీ చేసి రూ.20 కోట్లు దుర్వినియోగం చేశారు. ఈ విషయం 2022 ఏప్రిల్ 30న వెలుగులోకి వచ్చింది. అప్పట్లో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, సొసైటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా కోఆపరేటివ్ కార్యాలయ డిప్యూటీ రిజిస్ట్రార్, ఆడిట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఆడిట్ నిర్వహించారు. నకిలీ బాండ్లతో ఎఫ్‌డీలు కొల్లగొట్టినట్లు ఆడిట్‌లో బయటపడింది. డిప్యూటీ రిజిస్ట్రార్ ఆడిట్ ఫిర్యాదు మేరకు సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు భిక్షం సహా పలువురిని గతంలోనే అరెస్ట్ చేశారు. బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ సూపరింటెండెంట్ బాషమల్ల అనంతరావు పాత్ర కూడా సీఐడీ దర్యాప్తులో వెలుగు చూసింది.

సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీలో రఘునందన్‌రావు



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటుకు చెందిన మరో కమిటీలో బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు చోటు దక్కింది. కమిటీ ఆన్ సబార్డినేట్ లెజిస్లేషన్‌లో సభ్యునిగా నియమిస్తూ.. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరిని చైర్‌పర్సన్‌గా.. మరో 13 మంది ఎంపీలను సభ్యులుగా స్పీకర్ నామినేట్ చేసినట్లు సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా.. రఘునందన్‌రావు ఇప్పటికే పర్సనల్ పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్ స్టాండింగ్ కమిటీ, కన్సల్టేటివ్ కమిటీల్లో సభ్యునిగా ఉన్న విషయం తెలిసిందే.

తండ్రి, అన్నపై కవిత రగిలిపోతున్నారు

- అందుకే కొత్త పార్టీ పెట్టాలని ఆలోచిస్తున్నారు
- పీసీసీ మీడియా కమిటీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: తన తండ్రి, అన్నపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అసంతృప్తితో రగిలిపోతున్నారని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అందుకే తన తండ్రి కేసీఆర్ గత పదేళ్ల కాలంలో చేసిన నిర్వాకాలను బయటపెడుతున్నారని చెప్పారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనలో ఉన్నారని, ఆ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని అన్నారు. కాగా, బీజేపీని విమర్శించినందుకే కవితను కేసీఆర్, కేటీఆర్‌లు పక్కన పెట్టారని, బీజేపీని ఏమైనా అంటే సొంత కుటుంబ సభ్యులను కూడా కేసీఆర్ వదిలిపెట్టరని అర్థమైందని అన్నారు. అటు పార్టీలో ఆధిపత్యంతో పాటు వేల కోట్ల ఆస్తుల్లో కొడుకు కేటీఆర్‌కు, ఆయన పిల్లలకు వాటా ఇచ్చారే తప్ప తన పిల్లలను పట్టించుకోలేదనే ఆవేదన కవితకు ఉందని రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. తన ఆవేదనను వెల్లడిస్తూ తండ్రి కేసీఆర్‌కు కవిత లేఖ రాశారని, అయినా స్పందన రాకపోవడంతోనే పార్టీ పెట్టాలని కవిత నిర్ణయం తీసుకున్నట్టు తమకు సమాచారం ఉందని చెప్పారు. ఆ లేఖను బయటపెట్టి కొన్నాళ్లు అమెరికా వెళ్లాలనే ఆలోచనలో కూడా కవిత ఉన్నట్టు తమకు తెలిసిందన్నారు.

రిమాండ్ నివేదిక సాక్షిగా

బాబు భేతాళ కుట్ర!

బాలాజీ గోవిందప్పతో బలవంతంగా సంతకాలు చేయించిన సిట్

- మూడో పార్టీ మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్ అక్రమంగా జప్తు
- అవాస్తవాలు, అభూత కల్పనలతో రిమాండ్ నివేదిక
- ప్రత్యేక మెమో ద్వారా కోర్టుకు నివేదిక
- వాటిని పరిగణనలోకి తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్న న్యాయస్థానం
- అరెస్టుకు ముందే రిమాండ్ నివేదికలు రూపొందిస్తున్న సిట్
- టీడీపీ ఆఫీసులో నివేదికలు... వాటినే కోర్టుకు సమర్పిస్తున్న దర్యాప్తు సంస్థ
- రెడ్‌బుక్ కుట్రలు మరోసారి బహిర్గతం
- బాలాజీ గోవిందప్ప జగన్ దగ్గర పనిచేస్తున్నట్లు తప్పుడు రాతలు
- ఆయన అంతర్జాతీయ సిమెంట్ దిగ్గజ కంపెనీ వికాట్‌లో ఫైనాన్స్ డైరెక్టర్
- ఈ అరెస్టుతో భారతదేశంలో ఎవరినైనా అరెస్టు చేయగలమని సందేశం పంపిన కూటమి సర్కారు



treatment in the hands of CID officials, but, Accused did not report ill-treatment in the hands of Police, but stated that, his signatures were obtained forcibly on some papers. Copies of remand report etc., were given to him at 11.15 A.M before producing him in the Court. Learned

బాలాజీ గోవిందప్పతో సిట్ అధికారులు పలు పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించారని న్యాయస్థానానికి సమర్పించిన మెమోలో పేర్కొన్న భాగం

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు రెడ్‌బుక్ కుట్ర మరోసారి బట్టబయలైంది. టీడీపీ వీరవిధేయ పోలీసు అధికారులతో నియమించుకున్న సిట్ ద్వారా సాగిస్తున్న కుతంత్రం న్యాయస్థానానికి సమర్పించిన రిమాండ్ నివేదిక సాక్షిగా బయటపడింది. దర్యాప్తు, ఆధారాలు తదితర న్యాయపరమైన విధానాలతో నిమిత్తం లేకుండా ఏకపక్షంగా సాగిస్తున్న కుతంత్రం మరోసారి వెలుగుచూసింది. టీడీపీ ప్రధాన కార్యాలయంలో అవాస్తవాలు, అభూత కల్పనలతో రూపొందించిన నివేదికలనే సిట్ తన రిమాండ్ నివేదికలతో సమర్పించి న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేందుకు బరితెగిస్తోందని ఆధారాలతో సహా వెల్లడైంది. ఈ అక్రమ కేసులో సిట్ తాజాగా అరెస్టు చేసిన అంతర్జాతీయ సిమెంట్ దిగ్గజ కంపెనీ వికాట్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప రిమాండ్ నివేదిక ప్రభుత్వ కుట్రను బట్టబయలు చేసింది. ఇప్పటికే రాజ్ కేసిరెడ్డి చెప్పని విషయాలు చెప్పినట్టుగా ఆయన పేరిట అబద్ధపు వాంగ్మూలంతో రిమాండ్ నివేదిక రూపొందించి సిట్ అడ్డంగా దొరికిపోయింది. ఆ వాంగ్మూలంపై ఆయన సంతకం చేసేందుకు నిరాకరించారని సిట్ అధికారులే న్యాయస్థానానికి వెల్లడించాల్సి వచ్చింది. అయినా సరే సిట్ తీరు ఏమాత్రం మారలేదు. ఈ కేసులో తాజాగా బాలాజీ గోవిందప్ప రిమాండ్ నివేదికలోనూ అదే అబద్ధపు వాంగ్మూలాల కుతంత్రానికి తెగబడింది. కర్ణాటకలో మంగళవారం అరెస్టు చేసిన ఆయన్ను సిట్ అధికారులు బుధవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆయనకు ఈ నెల 20 వరకు రిమాండ్ విధించింది. మరోవైపు టీడీపీ ప్రభుత్వ కుట్రలను సవాల్ చేస్తూ ఈ కేసులో అరెస్టైన రాజ్ కేసిరెడ్డి కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ అరెస్టు అక్రమమని, చట్ట విరుద్ధమని నివేదించింది. దీనిపై స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణలో అరెస్టుకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తామని ప్రకటించింది.



బాలాజీ గోవిందప్పను విజయవాడలో కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

గోవిందప్పతో బలవంతంగా సంతకాలు చేయించిన సిట్

చంద్రబాబు ప్రభుత్వ రెడ్‌బుక్ కుట్రతోనే ఈ అక్రమ కేసులో బాలాజీ గోవిందప్పను నిందితుడిగా చేర్చారన్నది వెల్లడైంది. ఆయన పేరిట అవాస్తవాలతో సిట్ అధికారులే అబద్ధపు వాంగ్మూలం నమోదు చేసేశారు. ఆ వాంగ్మూల పత్రంపై సంతకం చేసేందుకు బాలాజీ గోవిందప్ప నిరాకరించారని.. ఆయనతో పోలీసులు బలవంతంగా కొన్ని పత్రాలపై సంతకాలు చేయించారని న్యాయస్థానం జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టంగా ఉండటం గమనార్హం. అంతేకాదు మూడో పార్టీకి చెందిన మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను సిట్ అధికారులు అక్రమంగా జప్తు చేశారన్నది కూడా వెలుగులోకి వచ్చింది. వాటిని ట్యాంపర్ చేయడం ద్వారా ఈ కేసులో తప్పుడు సాక్ష్యాలు సృష్టించాలన్నది సిట్ లక్ష్యమన్నది స్పష్టమవుతోంది. ఇదే విషయాలను బాలాజీ గోవిందప్ప తరఫు న్యాయవాది ప్రత్యేక మెమో ద్వారా న్యాయస్థానం దృష్టికి తెచ్చారని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. ఆ మెమోలో పేర్కొన్న అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని న్యాయస్థానం సానుకూలంగా స్పందించడం కీలకంగా మారింది. ఇక బాలాజీ గోవిందప్ప ముందస్తు బెయిల్ పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు రానుందని తెలిసే... అంతకుముందే తెల్లవారు జామునే ఆయన్ను అక్రమంగా అరెస్టు చేశారని గోవిందప్ప న్యాయవాది న్యాయస్థానానికి నివేదించారు. సిట్‌లో సభ్యుడుకాని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఎలాంటి అధికారం లేనప్పటికీ బాలాజీ గోవిందప్పను అక్రమంగా అరెస్ట్ చేశారని కూడా న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. సిట్ పూర్తిగా అవాస్తవాలు, అభూతకల్పనలతో బాలాజీ గోవిందప్ప రిమాండ్ నివేదికను రూపొందించి న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేందుకు యత్నించింది.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అరెస్టుకు ముందే రిమాండ్ నివేదికలా..!

ఆ నివేదిక కుట్రే... ఇదిగో సాక్ష్యం...

ఇక నిందితుల అరెస్టు, విచారణతో నిమిత్తం లేకుండానే టీడీపీ కార్యాలయంలోనే రిమాండ్ నివేదికలు రూపొందిస్తున్న కుట్రలు బట్టబయలయ్యాయి. బాలాజీ గోవిందప్ప రిమాండ్ నివేదికే ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. ఆయన అరెస్టుకు కారణాలను వెల్లడిస్తూ... నిందితుడు పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి ఇతరులు అవినీతికి పాల్పడ్డారు అని పేర్కొంది. అసలు బాలాజీ గోవిందప్ప అరెస్టుపై రిమాండ్ నివేదికలో కృష్ణమోహన్‌రెడ్డి పేరును ఎందుకు ప్రస్తావించినట్టు..? అంటే నిందితుల అరెస్టులతో నిమిత్తం లేకుండానే ముందుగానే టీడీపీ ఆఫీసులోనే రిమాండ్ నివేదికలు రూపొందించి.. వాటిని కాపీ, పేస్ట్ చేస్తూ న్యాయస్థానానికి సమర్పిస్తున్నట్టు వెల్లడైంది.

ఎవరినైనా ఇరికిస్తాం..!

బాలాజీ గోవిందప్ప వైఎస్ జగన్ దగ్గర పనిచేస్తున్నట్లు రిమాండ్ రిపోర్టులో రాశారు. కానీ ఆయన వైఎస్ జగన్ సంస్థల్లో పని చేయట్లేదు. 12 దేశాల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న అంతర్జాతీయ దిగ్గజ కంపెనీ వికాట్‌లో పూర్తి స్థాయి డైరెక్టర్‌గా ఉన్నారు. భారతీ సిమెంట్స్‌లో మెజార్టీ వాటాను వికాట్ ఎప్పుడో కొనుగోలు చేసింది. వైఎస్ జగన్ కుటుంబ సభ్యులకు కంపెనీలో మైనార్టీ షేర్ మాత్రమే ఉంది. ఇక ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికారులతో గోవిందప్ప చాలా సన్నిహితంగా మెలిగి కుట్రలకు పాల్పడ్డారని రిపోర్టులో రాశారు. ఆయన ఎప్పుడూ హైదరాబాద్‌లోనే ఉంటారు. ఏపీకి రావడం చాలా తక్కువ. వృత్తిరీత్యా చార్టెడ్ అక్కౌంటెంట్ అయిన గోవిందప్పకు నిరంతరం ఊపిరి సలపని పనులు ఎన్నో ఉంటాయి. ఓ అంతర్జాతీయ దిగ్గజ కంపెనీ హోల్‌టైమ్ ఫైనాన్స్ డైరెక్టర్‌నే ఇలా టార్గెట్ చేసి అక్రమ కేసులో, జరగని కుంభకోణంలో ఇరికించారంటే.. ఇక దేశంలో ఎవరినైనా కేసుల్లో ఇరికించవచ్చు అనే సందేశాన్ని చంద్రబాబు సర్కారు పంపింది. దీన్నిబట్టి భేతాళ కుట్రలు మరోసారి నిరూపితమవుతున్నాయి.

మద్యం విధానంతో సంబంధమే లేదు

మాపైన నమోదు చేసింది అక్రమ కేసే
స్పష్టం చేసిన ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి
స్వచ్ఛందంగా సిట్ విచారణకు హాజరు

సాక్షి, అమరావతి: మద్యం విధానం రూపకల్పనలో గానీ, అమలుతో గానీ తమకు ఏమాత్రం సంబంధం లేదని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎ.ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి విస్పష్టంగా పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంపై టీడీపీ కూటమి ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులో వీరిద్దరూ బుధవారం స్వచ్ఛందంగా సిట్ విచారణకు హాజరయ్యారు. వీరిపై శుక్రవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సిట్ విచారణకు హాజరయ్యారు. వీరిని విడివిడిగా మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 వరకు విచారించారు. చెరో 60 ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. అన్ని ప్రశ్నలకు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణ మోహన్‌రెడ్డి దీటుగా సమాధానం ఇస్తూ తమపై నమోదు చేసింది అక్రమ కేసేనని తేల్చిచెప్పారు. మద్యం విధానం రూపొందించడం, అమలుతో తమకు ఏమాత్రం సంబంధం ఉండదని నిబంధనలను ఉటంకిస్తూ స్పష్టం చేశారు. డిస్టిలరీలతో వ్యవహారాలన్నీ బెవరేజస్ కార్పొరేషన్ ఎండీనే పర్యవేక్షిస్తారని స్పష్టం చేశారు. ఈ కేసులో సాక్షులు కొందరు మీ పేర్లు చెప్పారని సిట్ అధికారులు పేర్కొనగా, తాము కూడా ఏమాత్రం సంబంధం లేనివారి పేర్లను చెబితే వారినీ నిందితులుగా చేరుస్తారా అని ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ఎదురు ప్రశ్నించడంతో సిట్ అధికారులు మౌనం దాల్చారు. రాజ్ కేసిరెడ్డితో గానీ డిస్టిలరీల ప్రతినిధులతో గానీ తాము ఎలాంటి అధికారిక, అనధికారిక వ్యవహారాలు నిర్వహించలేదని అన్నారు. తమపై నమోదు చేసింది పూర్తిగా అక్రమ కేసని న్యాయ పోరాటం ద్వారా ఆ విషయాన్ని నిరూపిస్తామని తేల్చిచెప్పారు. కాగా, ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను గురువారం కూడా విచారణకు రావాలని సిట్ అధికారులు కోరారు.



విజయవాడలో విచారణకు హాజరైన ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి

నా అరెస్టు అక్రమం

అరెస్టు సమయంలో చూపిన సెక్షన్లకు అదనంగా రిమాండ్ రిపోర్టులో అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు సహా పలు సెక్షన్లను చేర్చారు

- కాబట్టి నా అరెస్టు అక్రమం.. రిమాండ్ కూడా అక్రమమే
- మద్యం విధానం కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాజ్ కసిరెడ్డి
- పిటిషన్ దాఖలు చేసిన ఆయన తండ్రి ఉపేందర్‌రెడ్డి
- ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చిన సుప్రీంకోర్టు
- తదుపరి విచారణను ఈ నెల 19కు వాయిదా వేసిన ధర్మాసనం.. ఆలోగా కారణాలు తమ ముందు ఉంచాలని ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ మద్యం విధానం కేసులో తన అరెస్టుతో పాటు రిమాండ్ కూడా అక్రమం అంటూ కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఏప్రిల్ 21న హైదరాబాద్ లో అరెస్టు చేశారని.. మరుసటి రోజు కోర్టులో హాజరుపరిచారని పేర్కొన్నారు. సెక్షన్ 420, 409, 120బి ఐపీసీ సెక్షన్ల కింద అరెస్టు చేస్తున్నట్లు అరెస్టు సమయంలో చూపారని, రిమాండ్ రిపోర్టులో మాత్రం వీటికి తోడుగా సెక్షన్ 34, 37 ఐపీసీ, పీసీ యాక్ట్ (ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్) సెక్షన్ 7, 7(ఎ), 8, 13(1)(బి), 13 (2) జోడించారని తెలిపారు. కాబట్టి తన అరెస్టు అక్రమం, రిమాండ్ కూడా అక్రమం అని ప్రకటించాలని కోరారు. ఈ మేరకు రాజ్ కసిరెడ్డి తండ్రి ఉపేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ బుధవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. రాజ్ కసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాదులు మహేష్ జెఠ్మలాని, పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, సిద్ధార్థ్ అగర్వాల్, అల్లంకి రమేష్‌లు వాదనలు వినిపించారు. రాజ్ కసిరెడ్డిపై అవినీతి నిరోధక చట్టాన్ని ప్రయోగించినట్లు ఏపీ ప్రభుత్వం తొలిసారిగా రిమాండ్ రిపోర్ట్‌లో తెలియజేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అరెస్టు తర్వాత రిమాండ్ రిపోర్టులో అదనంగా అవినీతి నిరోధక చట్టం సెక్షన్లను చేర్చడం అక్రమమని మహేష్ జెఠ్మలానీ పేర్కొన్నారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, కేంద్ర హోం శాఖ మార్గదర్శకాల మేరకు ప్రతి ప్రభుత్వ అధికారికి వేర్వేరుగా ప్రత్యేక ప్రతిపాదన ప్రకారం అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కాగా, రాజ్ కసిరెడ్డి అరెస్టు అక్రమమని దాఖలైన పిటిషన్‌పై ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 19కు వాయిదా వేసిన ధర్మాసనం.. ఆలోగా కారణాలు తమ ముందు ఉంచాలని ఆదేశించింది. తదుపరి విచారణలో అరెస్టుకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తామని పేర్కొంది. అవినీతి నిరోధక చట్టం సెక్షన్లు 19, 17ఏపై తమకు కొన్ని ప్రశ్నలు ఉన్నందున జస్టిస్ పార్దీవాలా ధర్మాసనం ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనం పరిశీలనకు ప్రతిపాదించింది.

దోస్త్ నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వలేం

ఎస్సీ వర్గీకరణపై కౌంటర్ వేయాలని సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై స్పష్టత లేనందున డిగ్రీ సీట్ల భర్తీ కోసం నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వాలన్న విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. అడ్మిషన్ల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఎస్సీ వర్గీకరణపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 10కి వాయిదా వేసింది. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను సవాల్ చేస్తూ హైకోర్టులో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా వన్ మ్యాన్ కమిషన్ ఇచ్చిన గణాంకాల మేరకు ఉప కులాల వర్గీకరణ చేశారని, తాజా లెక్కలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ప్రస్తుత ఎస్సీ కులాల గణాంకాల మేరకు వర్గీకరణ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు జరగలేదన్నారు. గత నెల పిటిషన్ దాఖలు చేయగా, కౌంటర్ దాఖలు చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదని చెప్పారు. ఇటీవల విడుదలైన దోస్త్ నోటిఫికేషన్‌లో చట్టబద్ధంగా ఎస్సీ రిజర్వేషన్లు అమలయ్యే అవకాశం లేనందున, సీట్ల భర్తీని నిలిపివేయాలని కోరారు. చట్టాలను సవాల్ చేసినప్పుడు కోర్టులు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం సాధ్యం కాదని అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదించారు. అడ్మిషన్ల ప్రక్రియ యూనివర్సిటీ పరిధిలో ఉంటుందని, విద్యా సంవత్సరం ప్రకారం సీట్ల భర్తీ కొనసాగుతుందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. దోస్త్‌లో జోక్యం చేసుకునేందుకు నిరాకరిస్తూ, విచారణ వాయిదా వేసింది.

బాధితులు లేకుండా పిటిషనా?

వేసవి తరగతులపై ఉత్తర్వులకు హైకోర్టు నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: విద్యా సంస్థల వేసవి తరగతుల నిర్వహణపై బాధితులు లేకుండా పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభావితం అవుతారని.. మీరెలా బాధితులవుతారో చెప్పాలంది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. రాష్ట్ర ఇంటర్మీడియెట్ విద్యా మండలి (టీఎస్‌బీఐఈ) జారీ చేసిన వార్షిక కేలండర్‌లో ప్రకటించిన విధంగా ప్రైవేట్ కళాశాలలు సెలవులు ప్రకటించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బందెల క్రాంతికుమార్ తరఫున న్యాయవాది సీఆర్ సుకుమార్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఆదివారాలు, ప్రభుత్వ సెలవు రోజులు అని తేడా లేకుండా ఫిజికల్‌గా, వర్చువల్‌గా తరగతులను నిర్వహిస్తున్నారని, వెంటనే ఆపేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం కౌంటర్ కోసం వేచిచూస్తే ఈలోగా వేసవి సెలవులు కూడా ముగిసిపోతాయన్నారు. వెంటనే తరగతులు ఆపేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. చట్టపరంగా తనిఖీలు నిర్వహిస్తూనే ఉన్నామని స్పెషల్ జీపీ రాహుల్ నివేదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. తాము ఇచ్చే తీర్పు ఈ ఒక్కఏడాదికే కాదు.. తదుపరి ఏడాదిలకు అమల్లో ఉంటాయన్న విషయం తెలుసుకోవాలని పిటిషనర్‌కు సూచిస్తూ, విచారణ వాయిదా వేసింది.

మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట

భూ వివాదం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు



సాక్షి, న్యూఢిల్లీ: నిజామాబాద్ జిల్లా ఆర్మూరు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. భూ వివాదం కేసులో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో దర్యాప్తుకు సహకరించాలని బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీవన్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులు తన భూమిని కబ్జా చేశారంటూ.. గతేడాది సామ దామోదర్‌రెడ్డి మోకిల, చేవెళ్ల పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. దీనిపై జీవన్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులపై మోకిలా పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఆయన రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన కేసులను కొట్టివేయాలని, ముందస్తు బెయిల్ ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. దీంతో జీవన్‌రెడ్డి ఈ ఏడాది మార్చి 21న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ బుధవారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. జీవన్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో ఇప్పటికే ఆయన కుటుంబ సభ్యులకు బెయిల్ మంజూరైందని, కేసు విచారణకు జీవన్‌రెడ్డి అన్నివిధాలా సహకరిస్తున్నారని కోర్టుకు తెలిపారు. వాదనల అనంతరం జీవన్‌రెడ్డికి ధర్మాసనం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కేసు దర్యాప్తుకు సహకరించాలని ఆదేశించింది. దర్యాప్తుకు సహకరించనట్లయితే తగిన చర్యలు తీసుకోవచ్చని, న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు

ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టుకు ప్రభాకర్‌రావు



సాక్షి, న్యూఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో నిందితుడు, మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మల ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషన్‌పై తెలంగాణ ప్రభుత్వం తన వాదనలు తెలపాలని సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను వాయిదా వేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ప్రభాకర్‌రావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 2న విచారణ జరిపిన హైకోర్టు బెయిల్ మంజూరుకు నిరాకరించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. ఈ నెల 9న ప్రభాకర్‌రావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పోలీస్ అధికారిగా 30 ఏళ్లపాటు వివిధ హోదాల్లో సేవలందించిన తాను రాష్ట్రపతి పురస్కారాన్ని సైతం అందుకున్నట్లు పేర్కొన్నారు. కొందరు రాజకీయ నాయకులే లక్ష్యంగా.. ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు చేయడం కక్ష సాధింపులో భాగమని పిటిషన్‌లో పేర్కొన్నారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరగలేదన్న ప్రభాకర్‌రావు.. కీలక సమాచారం ధ్వంసం చేసినట్లు వచ్చిన ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. విచారణకు పూర్తి స్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ముందస్తు బెయిల్ జారీ చేస్తే చికిత్స కోసం అమెరికా వెళ్లాలనుకుంటున్నట్లు ప్రభాకరరావు పిటిషన్‌లో పేర్కొన్నారు.

అయిదుగురిపై పిచ్చికుక్క దాడి

చంపేసిన గ్రామస్తులు

పరిగి: అయిదుగురిని గాయపరచిన పిచ్చి కుక్కను గ్రామస్తులు వెంబడించి చంపేశారు. వికారాబాద్ జిల్లా గడిసింగాపూర్‌లో జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాలివి. బుధవారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఆడుకుంటున్న చిన్నారులు హారిక, నిత్యపై పిచ్చి కుక్క దాడి చేసింది. పిల్లలు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వచ్చి అదిలించగా శునకం అక్కడి నుంచి పరుగులు తీసింది. ఈ క్రమంలో రోడ్డుపై ఉన్న మరో ముగ్గురిని కరిచింది. ఆందోళనకు గురైన స్థానికులు వెంబడించి కుక్కను చంపేశారు. గాయపడిన వారిని వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు.



● అన్న అర్జున్, తండ్రి బోనీ కపూర్, చెల్లి ఖుషీతో జాన్వీ కపూర్



● తల్లిదండ్రులు సుమేధ, కిషన్ బాకర్‌లతో మను బాకర్

పవర్ హౌస్

ఫ్యామిలీ అంటే...
జీవితం మొదలయ్యే చోటు.
ప్రేమ ఎప్పటికీ అంతం కాని చోటు.
'భారతదేశ బలం కుటుంబం' అంటారు.
అయితే కాలంతో పాటు
కుటుంబ ముఖచిత్రం మారిపోయింది.
ఉమ్మడి కుటుంబాలు కనిపించడం అరుదైపోయింది.
కుటుంబం అసాధారణమైన బలం ఇస్తుంది.
అద్భుత విజయాలు సాధించేలా చేస్తుంది.
ఈ స్ఫూర్తితో ముందుకు వెళదాం...

ఆ విషాదంలో ఒకరికి ఒకరు అండగా...

'ఫ్యామిలీ నా స్ట్రెంత్' అని తరచుగా చెబుతుంటుంది బాలీవుడ్ నటి జాన్వీ కపూర్. శ్రీదేవి చనిపోవడం జాన్వీ కుటుంబానికి షాక్. ఆ విషాదం నుంచి బయట పడడానికి కుటుంబ సభ్యులు ఒకరికి ఒకరు అండగా నిలిచారు.

జాన్వీ ఎప్పుడైనా డల్‌గా కనిపిస్తే నాన్న బోనీ కపూర్ ఆ సమయంలో అమ్మగా మారిపోతాడు.

తన కబుర్లతో జాన్వీ యాక్టివ్ అయ్యేలా చేస్తాడు. మరి బోనీ డల్‌గా కనిపిస్తే?

కూతుళ్లు జాన్వీ, ఖుషీ తండ్రి దగ్గరకు వచ్చేస్తారు. నాన్నకు ఫ్రెండ్స్‌గా మారిపోతారు. నాన్న ఎప్పటిలాగే నవ్వేలా చేస్తారు.

ఆ ముగ్గురిలో ఏ మూలో విషాదం గూడుకట్టుకొని ఉండవచ్చు. అయితే వారు ఒక దగ్గరకు వచ్చినప్పుడు మాత్రం సరదాలు, సంతోషాలే ఉంటాయి. కొన్ని సమయాల్లో చెల్లి ఖుషి అక్క జాన్వీకి అమ్మ అవుతుంది. ధైర్యం చెబుతుంది. దారి చూపుతుంది!

ఖుషి విషయంలో జాన్వీ కూడా అంతే!

తల్లి లేని లోటు రానివ్వకుండా సకల జాగ్రత్తలు తీసుకుంటుంది. 'నాన్న, చెల్లి, అన్న అర్జున్ నాకు మెంటార్స్. నా జీవితానికి మార్గదర్శకులు. కెరీర్‌లో, జీవనగమనంలో వారు నా బలం' అని తన కుటుంబం గురించి చెబుతుంది జాన్వీ కపూర్.



● చెల్లి ఖుషీ కపూర్‌తో జాన్వీ...



● అమ్మమ్మ దయా కౌర్‌తో మను

పెద్ద కుటుంబం... మను బాకర్ బలం

తన స్ట్రెంత్‌కు కేరాఫ్ అడ్రస్ చెప్పమంటే స్టార్ షూటర్ మను బాకర్ నోటి నుంచి వచ్చే మాట... గోరియా.

హరియాణా రాష్ట్రం చర్కీ దాద్రి జిల్లాలోని గోరియా గ్రామంలో బాకర్ కుటుంబ సభ్యులు ఉంటారు.

మను పతకాలు గెలుచుకున్నప్పుడల్లా ఆ కుటుంబ సంతోషం అంబరాన్ని అంటుతుంది.

పోటీలకు వెళ్లి స్వదేశానికి తిరిగివస్తున్నప్పుడు... కుటుంబ సభ్యులను కలవబోతున్నాననే సంతోషం మనూను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

ఆమె తండ్రి రామ్ కిషన్ బాకర్ నేవీలో చీఫ్ ఇంజనీర్. తల్లి సుమేధ స్కూల్ ప్రిన్సిపల్. ఆటల్లో కూతురుని ఎంతో ప్రోత్సహించేవారు. అవసరమైన ట్రెనింగ్ ఇచ్చేవారు.


'మీ అమ్మాయిని డాక్టర్ చేస్తారా? ఇంజనీర్ చేస్తారా?' అని బంధువులు అడిగినప్పుడు....

'ఛాయిస్ మాది కాదు... మనూ దే' అనే వాళ్లు.

అలా తల్లిదండ్రులు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం వల్లే మను బాకర్ స్టార్ షూటర్ అయింది. మను బాకర్‌కు ఊళ్లో మరో పెద్ద కుటుంబం ఉంది. ఆ కుటుంబం పేరు యూనివర్శల్ హైయర్ సెకండరీ స్కూల్. మను కుటుంబమే ఈ స్కూల్‌ను నడుపుతుంది. ఈ స్కూల్‌లోని పిల్లలందరికీ మను బాకర్ అక్క. దయా కౌర్ తనకు అమ్మమ్మ కాదు... క్లోజ్ ఫ్రెండ్! 'సంతోషంలో ఉన్నప్పుడైనా, బాధలో ఉన్నప్పుడైనా ఈ సమయంలో నా ఫ్యామిలీ నాతో ఉంటే బాగుండేది అనిపిస్తుంది. అదే ఫ్యామిలీకి ఉన్న బలం' అంటుంది మను బాకర్.

పిల్లలకు కుటుంబ విలువ తెలియజేసే పుస్తకాలు

కుటుంబ బంధాలు, శక్తి గురించి పిల్లలకు సులభమైనరీతిలో అవగాహన కలిగించడానికి సెర్చ్ ఇనిస్టిట్యూట్ సంస్థ 'ఫస్ట్ లుక్' భాగస్వామ్యంతో కొన్ని పుస్తకాలు విడుదల చేసింది... 'ఫ్యామిలీ స్ట్రెంత్'ను పిల్లలకు తెలియజేయడానికి టాడ్ పార్ రాసి, బొమ్మలు వేసిన పుస్తకం...ది ఫ్యామిలీ బుక్. 'హ్యాపీ లైక్ సాసర్: ఇన్‌వెస్ట్' పుస్తకాన్ని మారిబెత్ బోయిల్ట్స్ రాశారు. లారెన్ కాస్టిలో బొమ్మలు వేశారు. అవర్ ట్రీ నేమ్‌డ్ స్టీవ్(ఫ్యామిలీ స్ట్రెంత్: బీ డిపెండబుల్) పుస్తకాన్ని అలాన్ జ్వైబెల్ రాశారు. డేవిడ్ కాట్రో బొమ్మలు వేశారు. సాల్ట్ ఇన్ హిజ్ షూస్(ఫ్యామిలీ స్ట్రెంత్: గైడ్) పుస్తకాన్ని మైఖేల్ జోర్డన్ రాశారు. నెల్సన్ బొమ్మలు వేశారు. అమేజింగ్ గ్రేస్(ఫ్యామిలీ స్ట్రెంత్: ఇన్‌స్పైర్) పుస్తకాన్ని మేరీ హఫ్మాన్ రాశారు. కరోలైన్ బించ్ బొమ్మలు వేశారు.



ఫ్యామిలీ మైండ్‌సెట్ కోచ్!

'ఫ్యామిలీ డైనమిక్స్‌లో సమగ్రమైన, సమర్థమైన మార్పులు తేవడమే మా లక్ష్యం' అంటున్నారు ఫ్యామిలీ మైండ్‌సెట్ కోచ్‌లు. ఫ్యామిలీ మైండ్‌సెట్ కోచింగ్ ప్రోగ్రామ్ ఎలా ఉంటుంది? అనే విషయానికి వస్తే...కుటుంబ సంబంధాలను బలోపేతం చేయడానికి వ్యక్తిగత, గ్రూప్ సెషన్లు నిర్వహిస్తారు. కుటుంబ సభ్యుల మధ్య భేదాభిప్రాయాలు ఉంటే గ్రూప్ సెషన్‌లలో ఓపెన్ కమ్యూనికేషన్ ద్వారా లేకుండా చేస్తారు. 'సైకోమెట్రిక్ అసెస్‌మెంట్' ప్రోగ్రాం ద్వారా కుటుంబ సభ్యులలో ప్రతి ఒక్కరి బలాబలాలను అంచనా వేసి అవసరమైన సలహాలు ఇస్తారు.

శాంతే సౌందర్యం



● నద కౌస్సా
మిస్ వరల్డ్ లెబనాన్ 2025

మిస్ వరల్డ్ 2025



నద... అంటే అరబిక్ భాషలో పిల్లల స్వచ్ఛమైన మనసు, ఉషోదయపు మంచు బిందువులు అని అర్థం. మిస్ వరల్డ్ లెబనాన్ 2025 పేరు నద. మిస్ వరల్డ్ 2025 పోటీల కోసం హైదరాబాద్‌కి వచ్చిన నద తన పేరుకు అర్థం చెప్పుకుంటూ తమ దేశంలో పిల్లల బాల్యం, యువత భావోద్వేగాలు అంత స్వచ్ఛంగా ఏమీ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యూటీ పాజంట్ కావాలనే కోరిక కలగడానికి కారణం తెలియదు కానీ బాల్యం నుంచి తన తోపాటు పెరిగి పెద్దయిందన్నారామె.

ఈ అవకాశం కోసం ఎదురు చూశాను!

''ఎనిమిదేళ్ల వయసు నుంచి నాకు జ్ఞాపకం ఉంది. నా ఆకాంక్ష తీరడానికి అవకాశం కోసం ఎదురు చూస్తూ బ్యాచులర్స్ పూర్తయింది. మాస్టర్స్ ఇన్ సైకాలజీ కూడా పూర్తయింది. క్లినికల్ సైకాలజిస్టుగా స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలను సందర్శిస్తూ పిల్లలకు, యువతకు మనోధైర్యాన్నిస్తున్నాను. అంతర్యుద్ధంతో అట్టుడిగిన దేశం మాది. అలాగే ఇరుగుపొరుగు యుద్ధాల తాకిడి కూడా దేశాన్ని కుదిపేసింది. అలాంటి దేశంలో మానసిక స్థైర్యం కల్పించడం చాలా అవసరం. ఇందు కోసం నేను ఐదు ఎన్‌జీవోలతో కలిసి పని చేస్తున్నాను.

మహిళలు నలిగిపోతున్నారు!

మా దేశంలో సగటు మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒక దేశం ద్రవ్యోల్బణం, ఆర్థిక ఒడిదొడుకులను ఎదుర్కొంటోందీ అంటే ఆ పరిణామాలకు క్షేత్రస్థాయిలో నేరుగా బాధితులయ్యేది మహిళలే. విద్య, ఉద్యోగం, పిల్లలను చక్కబెట్టుకుంటూ, ఆర్థికపరమైన సర్దుబాట్లు చేసుకుంటూ కుటుంబాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను తమ భుజాల మీద మోస్తున్నారు మా దేశంలో మహిళలు. ఎక్కడో ఒకరిద్దరు కాదు, దాదాపుగా ప్రతి మహిళా వీటన్నింటినీ భరిస్తోంది. వీటికితోడు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోజులు గడపడం అనేది ఎంత కష్టమో ఒకసారి ఆలోచించండి. ఎయిర్ క్రాఫ్టులు మన తల మీద నుంచి వెళ్తున్నట్లే ఉంటాయి. రోజూ ఒకదాని తర్వాత ఒకటిగా యుద్ధవిమానాలు ఇళ్ల మీద నుంచి వెళ్తుంటే వచ్చే 'ఉమ్‌మ్' అనే శబ్దం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఎంత చిన్న శబ్దం వచ్చినా ఉలిక్కి పడుతుంటారు. రాత్రిళ్లయితే టేబుల్ మీద నుంచి పుస్తకం కింద పడిన శబ్దం వచ్చినా సరే గుండె వేగం పెరిగిపోతుంటుంది. ఇంట్లో అందరినీ ఒకసారి కలయచూసుకుని 'హమ్మయ్య ఏమీ కాలేదు, అందరూ క్షేమం' అని ఊపిరి పీల్చుకోవాల్సిన దుస్థితి. ఈ పరిస్థితుల్లో జీవించడం వల్ల వారిని మెంటల్ ట్రామా పీడిస్తోంది. ఇది ఏ ఒకరిద్దరిదో, ఒకటి – రెండు ప్రదేశాలదో కాదు. దేశమంతటా ఇదే పరిస్థితి. వారిలో మానసికాందోళనలు పోగొట్టి ధైర్యం, మానసిక ప్రశాంతత నెలకొల్పడానికి పని చేయాల్సిన అవసరం ఉంది. ఈ కలెక్టివ్ ట్రామాను తొలగించడానికి కార్యక్రమాలను రూపొందించుకుంటున్నాను. ఇన్నింటి మధ్య కొనసాగుతూ కూడా బ్యూటీ పాజంట్ కావాలనే కోరికను మాత్రం పక్కన పెట్టలేదు. సమాజం కోసం చేయాల్సిన కర్తవ్యాలను నిర్వర్తిస్తూనే బ్యూటీ కాంటెస్ట్ విజేతనయ్యాను. ఇప్పుడు మిస్ వరల్డ్ పోటీ కోసం మీ ముందుకు వచ్చాను. బ్యూటీ విత్ పర్పస్ థీమ్‌లో భాగంగా... నా విజయంతో నా దేశంలో ప్రశాంత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తాను. శాంతి కోసం పని చేయడానికి బ్యూటీ పాజంట్ గుర్తింపు ఉపయోగపడుతుంది.

నమస్తే నేర్చుకున్నాను!

బ్యూటీ పాజంట్ పోటీల కోసం వచ్చేటప్పుడు ఇండియన్ కల్చర్ గురించి తెలుసుకున్నాను. నమస్తే చెప్పడం నేర్చుకున్నాను. హైదరాబాద్ నగరం చాలా నచ్చింది. కలర్‌ఫుల్‌గా, వైబ్రెంట్‌గా ఉంది. ఇక్కడి ప్రజలు చాలా స్నేహపూర్వకంగా ఉన్నారు. చౌమొహల్లా ప్యాలెస్ ఒక అద్భుతం. నిర్మాణంలో సునిశితమైన క్రాఫ్ట్‌మన్‌షిప్‌కి ఫిదా అయ్యాను. ప్రతి అంగుళాన్ని వదలకుండా ఫొటోలు తీసుకున్నాను. ఆ కట్టడం గొప్ప చారిత్రక వారసత్వం, అలాగే హైదరాబాద్ మెహందీ కూడా'' అంటూ మంగళవారం నాడు చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్ సందర్శన సమయంలో పెట్టించుకున్న మెహందీని చూపించారు నద కౌస్సా.

– **వాకా మంజులారెడ్డి,** సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : ఎస్.ఎస్. ఠాకూర్

● బంధం

అతడు.. ఆమె... మిస్ వరల్డ్



● ఎరిక్ మోర్లే, జూలియా మోర్లే

ఆ భార్యాభర్తల పేర్లు 'మిస్ వరల్డ్'తో ముడిపడి ఉన్నాయి. భర్త 'మిస్ వరల్డ్' పోటీల సృష్టికర్త, భార్య 'బ్యూటీ విత్ ఏ పర్పస్' నినాదంతో 'మిస్ వరల్డ్'ను దాతృత్వ దారిలోకి తీసుకువచ్చింది.

మిస్ వరల్డ్ చైర్‌పర్సన్, సీయివో జూలియా మోర్లే వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త, మాజీ మోడల్.

మిస్ వరల్డ్‌ను తొలిసారిగా ప్రారంభించిన ఎరిక్ మోర్లే ఆమె భర్త. 2000 సంవత్సరంలో భర్త చనిపోయిన తరువాత 'మిస్ వరల్డ్' చైర్‌పర్సన్ అయింది జూలియ.

1972లో 'బ్యూటీ విత్ ఏ పర్పస్' నినాదాన్ని తెర మీదికి తీసుకువచ్చింది. ఈ నినాదంలో భాగంగా సామాజిక సేవాకార్యక్రమాల కోసం డబ్బు సేకరించడానికి శ్రీకారం చుట్టారు. 2009లో 'ఛారిటీ డిన్నర్' నిర్వహించడం ద్వారా వచ్చిన నిధులతో 'ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఫండ్' ఏర్పాటు చేసింది.

'సేవ్ ది చిల్డ్రన్' క్యాంపెయిన్‌కుగానూ 'ప్రియదర్శిని' అవార్డు అందుకుంది.



బుజ్జి చేతులు సాయం చేయాలి

పిల్లలూ...
చదువుకోవడం అందరూ చేస్తారు. సాయం కొందరే చేస్తారు. సాయం చేసే చేతులకు దేవుని ఆశీస్సులుంటాయి తెలుసా? మరి సాయం ఎలా చేయాలి? సింపుల్. పుస్తకాలు పంచినా... పేద విద్యార్థికి ఫీజ్ పే చేసినా... దుస్తులు కొనిచ్చినా సాయమే. స్నానం అలవాటు చేసుకున్నట్టుగా... సాయం అలవాటు చేసుకోవాలి. ఈ వేసవిలో సాయం మొదలెట్టండి... వచ్చే వేసవి వరకూ కొనసాగించండి. ఇక మీరు గొప్ప సామాజిక సేవకులు అయినట్టే.

పిల్లలూ.... మీకు మదర్ థెరిసా తెలుసు కదా. ఆమె ఏమన్నారో తెలుసా? ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్నారు. అంటే? 'ఈ ప్రపంచంలోని కష్టాలన్నీ తొలిగిపోవాలి' అని దేవుణ్ణి ప్రార్థించడం కంటే సాటి మనుషుల ఆ కష్టాలను కొన్నైనా దూరం చేయడానికి మనం సాయం చేయడమే మేలని అర్థం.

పేదవాళ్లందరూ మంచి కంఫర్ట్స్‌తో జీవించాలి అని దేవుణ్ణి కోరుకుంటే ఆ దేవుడు ఆ కోరికను ఎప్పుడు తీరుస్తాడో ఏమో. కాని ఒక పేదవాడికైనా మనం కొద్దిగా కంఫర్ట్ ఇస్తే మంచిది కదా. అదో సంతృప్తి. ప్రపంచంలో సైంటిస్టులు, లీడర్లు, స్పోర్ట్స్ పర్సన్‌లు ఉన్నట్టే సేవ చేసేవారు కూడా ఉంటారు. కైలాష్ సత్యార్థి పేరు విన్నారా? ఆయన వీధి బాలల కోసం చాలా పని చేశాడు. వారి బాగు కోసం తన జీవితాన్ని వెచ్చించాడు. అందుకే ఆయనంటే అందరికీ గౌరవం. ఆయనే కాదు... బాబా ఆమ్టే, సుందర్‌లాల్ బహుగుణ, మేధా పాట్కర్... ఇలా ఎందరో సామాజిక సేవకులు ఉన్నారు. వారి గురించి మీరు ఈ సెలవుల్లో గూగుల్ చేసి తెలుసుకోవచ్చు. స్ఫూర్తి పొందవచ్చు. అయితే సేవ ఎలా చేయాలి? సేవ చేయడం అంటే ఏమిటి?

సేవామార్గం అంటే ఏమిటి?

మన చుట్టూ ఎంతోమంది అనాథలు, అభాగ్యులు ఉంటారు. తినడానికి తిండి లేక, ఉండటానికి గూడు లేక ఇబ్బంది పడేవారు అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో చేరుతుంటారు. అలాంటి వారికి సేవ చేయడం ఎంతో మేలైన పని. దివ్యాంగులు, అంధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బడులు ఉంటాయి. అక్కడికి వెళ్లి, వారితో కాసేపు గడపడం, వారి యోగక్షేమాలు కనుక్కోవడం, వారికి చేతనైన సాయం అందించడం చేస్తే మనసుకు తృప్తి దక్కుతుంది. ఇలాంటి పనుల మీద మీరు శ్రద్ధ చూపిస్తే తప్పక మీ పేరెంట్స్ ఎంకరేజ్ చేస్తారు. మంచి పనులు చేస్తే ఎవరు వద్దంటారు?

ఎక్కడికి వెళ్లొచ్చు?

అనాథాశ్రమాలు: తల్లిదండ్రులు లేని చిన్నారుల కోసం మండల, జిల్లా కేంద్రాల్లో అనాథాశ్రమాలు ఉంటాయి. అలాంటి చోటికి తీసుకెళ్లమని మీ పేరెంట్స్‌కు చెప్పండి. అక్కడున్న పిల్లలతో మాట్లాడండి. వారితో కాసేపు ఆడితే వాళ్లే మీతో మనసు విప్పి వాళ్ల ఫీలింగ్స్ చెబుతారు. మీరు చేయదగ్గ హెల్ప్ చేయండి. వారిలో బాగా చదువుతున్న వారు, స్పోర్ట్స్‌లో షైన్ అవుతున్నవారెవరో తెలుసుకోండి. బుక్స్, షూస్, స్పోర్ట్స్ కిట్స్... ఫండ్స్ రైజ్ చేసి తెచ్చిస్తానని చెప్పండి. వాళ్లెంత సంతోషపడతారో గమనించండి. అలాంటి పిల్లలను కలిస్తే మీ మనసు ఎప్పుడూ హెల్ప్ చేయడం గురించే ఆలోచిస్తుంది.

ఓల్డ్ ఏజ్ హోమ్స్: పిల్లలూ... ఇంట్లో అమ్మమ్మను, నానమ్మను చూసి ఉంటారు కదా. కాని అందరు అమ్మమ్మలకూ అలా ఇల్లు ఉండదు. వాళ్లు ఉండే చోటు ఉంటుంది. అలాంటి చోటుతో మీ అమ్మా నాన్నలతో వెళ్లండి. తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలు, బామ్మలు, అవ్వలు అక్కడ చాలామంది ఉంటారు. వారికి మీలాంటి చిన్న పిల్లలను చూస్తే చాలా సంతోషం. వారిని తాతా, అమ్మమ్మా అని పలకరించండి. చాలా హ్యాపీ ఫీలవుతారు. కబుర్లు చెప్పండి. ఫ్రూట్స్, బిస్కెట్స్ ఇవ్వండి. వారి దగ్గర అవసరమైన మెడిసిన్స్ ఉన్నాయా లేదా అడగండి. ఎవరికైనా అవసరం ఉంటే మీ పేరెంట్స్‌కు చెప్పి వాళ్లకు హెల్ప్ చేయండి. ఎవరికైనా హ్యాండ్ స్టిక్ ప్రెజెంట్ చేయండి. వాళ్లు హ్యాపీ ఫీలయ్యి బ్లెస్ చేస్తే మీకు హ్యాపీగా అనిపిస్తుంది.

బట్టలు పంచుదామా

ఈ సమ్మర్ హాలిడేస్‌లో మీ బంధువులను, ఫ్రెండ్స్‌ను అడిగి 5 ఇయర్స్ నుంచి 12 ఇయర్స్ వరకూ వయసున్న అబ్బాయిల, అమ్మాయిల యూజ్ చేయని బట్టలు ఏమైనా ఉంటే ఇమ్మని అడగండి. చాలామంది దగ్గర ఒకటి రెండుసార్లు వేసుకొని మరి వేయకుండా మానేసిన బట్టలు కప్‌బోర్డుల్లో ఉంటాయి. అలాంటివన్నీ తెప్పించండి. అమ్మకు చెప్తే ఎవరైనా టైలర్ అంకుల్‌కు చెప్పి ఏవైనా బటన్స్, కుట్లు అవసరం అయితే చేయిస్తుంది. నాన్నకు చెప్తే ఐరన్ చేయించే ఏర్పాటు చేస్తాడు. ఇప్పుడు వాటిని చక్కగా పెయిర్స్‌గా సర్దండి. ఆ తర్వాత మీకు దగ్గరగా ఉన్న బస్తీలోని పిల్లలకు పంచండి. వాళ్లు పరిగెత్తుకుంటూ వచ్చి తీసుకెళతారు.

సేవ చేయడం అంటే ఏమిటంటే మనకు ఉన్నది లేని వారితో పంచుకోవడం. మీరు బాగా చదువుతారు కదా. మీ హౌస్‌హెల్ప్ వాళ్ల పిల్లలకు రోజూ సాయంత్రం పూట ట్యూషన్ చెప్పినా సేవే. పలక ఇచ్చినా సేవే. నోట్స్ కొనిచ్చినా సేవే. సేవను అలవాటు చేసుకొని ఈ సమ్మర్‌ను మీనింగ్‌ఫుల్ చేసుకోండి.

● దారి దీపం

మన హక్కులు మన చైతన్యం

మహిళల హక్కుల గురించి అస్పష్టత ఉన్నచోట, అంతగా అవగాహన లేని చోట ఉపయోగపడే పుస్తకం లీగల్లీ యువర్స్: ఎవ్రీ ఉమెన్స్ గైడ్ టు హర్ లీగల్ రైట్స్. లాయర్, రైట్స్ అడ్వకేట్ మానసి చౌదురి రాసిన ఈ పుస్తకాన్ని ప్రసిద్ధ ప్రచురణ సంస్థ హార్పర్‌కాలిన్స్ ప్రచురించింది. భారతీయ మహిళల న్యాయ హక్కులపై సమగ్రమైన స్పష్టతను అందించే పుస్తకం ఇది. మన దేశ న్యాయవ్యవస్థను అర్థమయ్యేలా చేస్తూ, సంక్లిష్ట చట్టాల గురించి సులువైన రీతిలో పరిచయం చేస్తుంది.

వారసత్వ హక్కులు, ఉద్యోగ ప్రదేశంలో వేధింపులు, రీప్రొడక్టివ్ రైట్స్...మొదలైన వాటి గురించి వివరిస్తుంది.

'జ్ఞానం అనేది ఎంపవర్‌మెంట్‌కు తొలి అడుగు' అంటున్న మానసి చౌదురి 'పింక్ లీగల్' వ్యవస్థాపకురాలు.



● మానసి చౌదురి

'ఈ పుస్తకం మహిళలకు మాత్రమే కాకుండా, మహిళల హక్కులను అర్థం చేసుకోవడంలో పురుషులకు కూడా ఉపకరిస్తుంది' అంటుంది హార్పర్‌కాలిన్స్ ఇండియా ఎడిటర్ హిమాకుమార్.

● మన(సు)లో మాట

ఒళ్ళంతా పురుగులు పాకుతున్నాయంటుంది!

మా అమ్మ గారికి 78 సంవత్సరాలు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. అలాంటిది ఆమె ఒక 6–7 నెలల నుండి ఒళ్ళంతా చిన్న చిన్న పురుగులు పాకుతున్నాయని, దురదగా ఉందని వళ్లంతా గోక్కుంటోంది. స్కిన్ ఇన్ఫెక్షన్ అనుకుని చర్మం డాక్టర్ గారి దగ్గరికి తీసుకుని వెళ్ళాము. పరీక్ష చేసి ఎలాంటి ఇన్ఫెక్షన్ లేదని దురద తగ్గడానికి కొన్ని మందులు ఆయింట్మెంట్ ఇచ్చారు. అవి వాడిన తర్వాత కూడా ఆమెకు ఉపశమనం లేదు. పురుగులు చర్మంలోకి చొచ్చుకు పోతున్నాయని గొడవ చేస్తుంది. పుండ్లు పుట్టేలా చర్మాన్ని గోకుతుంది. ఒక చిన్న ఖాళీ డబ్బా తీసుకుని దాంట్లో పురుగులు వేశానని మమ్మల్ని కూడా చూడమని చెప్తుంది. ఆ డబ్బాలో ఆమె బట్టలవి చిన్న చిన్న దారపు పోగులు తప్ప ఏమి లేవు అంటే ఒప్పుకోదు. ఆవిడ బాధ తట్టుకోలేక ఇంకో స్కిన్ డాక్టర్ గారి దగ్గరికి తీసుకు వెళ్ళాము. ఆయన తల స్కాన్ చేసి ఒకసారి మానసిక వైద్యునికి చూపించమని చెప్పారు. ఆమె అన్ని రకాలుగా బాగుంది. ఆమె పనులు ఆమె చేసుకుంటుంది. జ్ఞాపక శక్తి బాగుంది. ఈ పురుగులు పాకుతున్నాయిని ఒక్క కంప్లైట్ తప్ప! ఆమెకు సైకియాట్రిస్ట్ ట్రీట్మెంట్ అవసరం అంటారా?

– **పద్మావతి,** బళ్ళారి

మీరు మీ అమ్మగారిలో చూస్తున్న లక్షణాలు క్లాసికల్‌గా 'డెల్యూజనల్ పారా సైటోసిస్' లేదా 'ఎక్బామ్ సిండ్రోమ్' అనే మానసిక సమస్య వచ్చిన వారిలో కనబడతాయి. ఇది ఒక అరుదైన మానసిక సమస్య. దీనిని ఎక్కువగా స్త్రీలలో చూస్తాము. మెదడు రసాయనాల్లో వచ్చే మార్పులు ఈ జబ్బు రావడానికి ప్రధాన కారణం. రక్త హీనత, విటమిన్ లోపాలు, థైరాయిడ్ సమస్యలు లాంటివి ఉండే వారిలో కూడా జబ్బు వచ్చే అవకాశాలు ఎక్కువ. కొన్ని సార్లు పెద్దవయసులో వచ్చే 'ఆల్జీమర్స్ డిమెన్షియా' ఈ లక్షణంతోనే ప్రారంభం అవ్వొచ్చు. అలాగే అత్యంత అరుదుగా మెదడులో కణుతులు లాంటివి ఉన్నా డెల్యూజన్‌లో పారా సైటోసిస్ లక్షణాలు కనపడే అవకాశముంది. తమ వంటిమీద లేదా చర్మం కింద పురుగులు పాకుతున్నాయనే సందేహం తప్ప ఇతర లక్షణాలు ఏమి కనపడవు. దురద తట్టుకోలేక కొంతమంది చర్మానికి క్రిమి సంహారక మందులు పూసుకొని ప్రాణం మీదికి కూడా తెచ్చుకుంటారు. యాంటీ సైకోటిక్ మందుల ద్వారా ఈ జబ్బు లక్షణాలని పూర్తిగా తగ్గించవచ్చు. మీరు దగ్గర్లోని మానసిక వైద్యుని వెంటనే కలిసి వాళ్ళు చెప్పిన ప్రకారం మందులు వాడితే త్వరగా ఆమె సమస్య తగ్గుతుంది. ఇది మానసిక జబ్బు లక్షణమే తప్ప శారీరక అనారోగ్యం ఏమాత్రం కాదనేది అందరూ గుర్తించాలి!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ
sakshifamily3@gmail.com

● బ్యూటిప్స్

చర్మం తాజాదనానికి..

ఎండ వేడికి చర్మం కమలడం, తాజాదనం కోల్పోవడం సహజంగా ఎదుర్కొనే సమస్యలు. వీటి పరిష్కారానికి...

కమిలిన చర్మానికి కలబంద

ఎండకు కమిలిన చర్మానికి కలబంద మంచి ఉపశమనం ఇస్తుంది. మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. కలబంద రసాన్ని ఐస్ ట్రేలో పోసి ఫ్రీజర్‌లో ఉంచాలి. కలబంద క్యూబ్‌తో కమిలిన చర్మం మీద మృదువుగా రబ్ చేయాలి. ఇది వెంటనే రిలీఫ్ ఇవ్వడంతో పాటు ట్యాన్ తగ్గిస్తుంది.

తాజాదనానికి రోజ్‌వాటర్


ఇంట్లో రోజ్‌వాటర్‌ని ఫ్రిజ్‌లో సిద్ధంగా ఉంచుకోండి. బయటకు వెళ్లి వచ్చినప్పుడు దూది ఉండను చల్లని రోజ్‌వాటర్‌లో ముంచి, దాంతో ముఖమంతా తుడవండి. కళ్ల చుట్టూ మరోమారు తుడవాలి. దీంతో మీకు అలసట తీరిపోయి ఫ్రెష్‌గా కనిపిస్తారు.



ప్రియాంక ఖాతాలో నాలుగో విజయం

ఆసియా వ్యక్తిగత చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి నూతక్కి ప్రియాంక నాలుగో విజయం నమోదు చేసింది. యూఏఈలో జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లో ప్రియాంక 43 ఎత్తుల్లో తనాజ్ అజాలి (ఇరాన్)పై గెలిచింది. ఎనిమిదో రౌండ్ తర్వాత ప్రియాంక ఖాతాలో 4.5 పాయింట్లున్నాయి. భారత్‌కే చెందిన శ్రీజ, వంతిక ఆరు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. పురుషుల విభాగంలో నిహాల్, నారాయణన్ ఆరు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.

'లెఫ్టినెంట్ కల్నల్' నీరజ్ చోప్రా



టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు లెఫ్టినెంట్ కల్నల్ హోదా కల్పించారు. టెరిటోరియల్ ఆర్మీలో భాగంగా గౌరవ హోదా కల్పించినట్లు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. హరియాణాకు చెందిన 27 ఏళ్ల చోప్రా ప్రస్తుతం భారత సైన్యంలో సుబేదార్ మేజర్ హోదాలో ఉన్నాడు. ఈ ఏడాదే అతను రిటైర్ కానున్నట్లు సమాచారం.

ఐపీఎల్ నిబంధనల్లో సడలింపులు

న్యూఢిల్లీ: ఐపీఎల్ కొత్త షెడ్యూల్ ప్రకారం పలువురు విదేశీ క్రికెటర్లు వివిధ జట్లకు అందుబాటులో ఉండటం లేదు. వేర్వేరు కారణాలతో కొందరు స్వదేశం నుంచి తిరిగి రావడానికి ఇష్టపడకపోగా... ముందే నిర్ణయించుకున్న తేదీల ప్రకారం అంతర్జాతీయ క్రికెట్‌కు అందుబాటులో ఉండాల్సి రావడంతో మరికొందరు మిగిలిన మ్యాచ్‌ల నుంచి తప్పుకోవాల్సి వస్తోంది. దాంతో ప్రత్యామ్నాయ ఆటగాళ్లను ఎంచుకోవడం ఫ్రాంచైజీలకు కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఆటగాళ్లను తీసుకునే విషయంలో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఇప్పటి వరకు ఉన్న నిబంధనలను సడలించింది. ఇదంతా మే 9న ఐపీఎల్ వాయిదా ప్రకటన చేసిన సమయం తర్వాతి నుంచి వర్తిస్తుంది. సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌ల కోసం 'తాత్కాలికంగా' తమకు కావాల్సిన ఆటగాళ్లను తీసుకునే అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం ఎవరైనా ఒక ఆటగాడు అనారోగ్యం లేదా గాయంతో తప్పుకుంటేనే అతని స్థానంలో మరో ప్లేయర్‌ను తీసుకునే అవకాశం ఉండేది. అదీ లీగ్ దశలో ఆ జట్టు తొలి 12 మ్యాచ్‌ల వరకు దీనికి అనుమతి ఉంది. అయితే మారిన పరిస్థితుల కారణంగా జట్టుకు దూరమైన ప్లేయర్ల స్థానాల్లో ఎవరినైనా ఈ సీజన్ ముగిసే వరకు తీసుకోవచ్చు. అయితే ఈ క్రికెటర్లను 2026 సీజన్ కోసం 'రిటెయిన్' చేసుకునే అవకాశం లేదు. ఐపీఎల్‌లో మిగిలిన మ్యాచ్‌ల కోసం మళ్లీ వచ్చి తమ జట్టుతో చేరే విషయంలో పలువురు క్రికెటర్లు స్పష్టతనిచ్చారు. ముంబై ఆట గాడు బౌల్ట్, కోల్‌కతా ప్లేయర్ డికాక్, పంజాబ్ ప్లేయర్ యాన్సెన్ తాము తిరిగి వస్తున్నట్లు చెప్పారు. మరోవైపు ఢిల్లీ ప్లేయర్ జేక్ ఫ్రేజర్, చెన్నై ఆటగాడు ఒవర్టన్ తిరిగి రాలేమని సమాచారం అందించారు.

తరుణ్ శుభారంభం

- తొలి రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్‌పై విజయం
- లక్ష్య సేన్, ప్రియాన్షు పరాజయం


తరుణ్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి శుభారంభం చేశాడు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన తరుణ్ తొలి రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్ జస్టిన్ హో (మలేసియా)పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. 48 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 53వ ర్యాంకర్ తరుణ్ 21-16, 21-19తో జస్టిన్ హో ఆట కట్టించాడు. క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్, భారత్‌కే చెందిన కిడాంబి శ్రీకాంత్‌ను బోల్తా కొట్టించిన తరుణ్ అదే జోరును మెయిన్ 'డ్రా'లోనూ కొనసాగించాడు. తొలి గేమ్‌లో ఒకదశలో 8-11తో వెనుకబడిన తరుణ్ ఆ తర్వాత ఒక్కసారిగా చెలరేగి వరుసగా ఏడు పాయింట్లు గెలిచి 15-11తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అదే దూకుడుతో ఆడి తొలి గేమ్‌ను దక్కించుకున్నాడు. వరుసగా మూడు పాయింట్లు నెగ్గి రెండో గేమ్‌ను ఆరంభించిన తరుణ్ ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్నాడు. ఒకదశలో జస్టిన్ హో 15-16తో ఆధిక్యాన్ని ఒక పాయింట్‌కు తగ్గించాడు. అయితే తరుణ్ రెండు పాయింట్లు గెలిచి 18-15తో ముందంజ వేశాడు. ఆ తర్వాత జస్టిన్ స్కోరును సమం చేసేందుకు యత్నించినా చివరకు తరుణ్ రెండు పాయింట్ల ఆధిక్యంతో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

మరోవైపు పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో నేరుగా పోటీపడ్డ ఇద్దరు భారత ఆటగాళ్లు లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్‌ను దాటలేకపోయారు. లక్ష్య సేన్ 18-21, 21-9, 17-21తో ఎన్‌హాట్ నుగుయెన్ (ఐర్లాండ్) చేతిలో, ప్రియాన్షు 13-21, 21-17, 16-21తో అల్వీ ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో పోరాడి ఓడిపోయారు.

ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి-ట్రెసా జోడీ

మహిళల డబుల్స్‌లో భారత్‌కు చెందిన పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... రష్మి గణేశ్-సానియా సికందర్ (భారత్); సెల్వం కవిప్రియ-సిమ్రన్ సింఘి (భారత్) జంటలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి. గాయత్రి-ట్రెసా ద్వయం 21-15, 21-13తో జిన్ యె-కార్మెన్ టింగ్ (మలేసియా) జంటను ఓడించింది. రష్మి-సానియా 11-21, 5-21తో టాన్ పియర్లీ-థినా (మలేసియా) చేతిలో, కవిప్రియ-సిమ్రన్ 17-21, 17-21తో బెన్‌యాపా-నుంతాకర్న్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో పృథ్వీ కృష్ణమూర్తి రాయ్-సాయిప్రతీక్ (భారత్) జంట 20-22, 21-17, 18-21తో ఆరిఫ్ జునైది-రాయ్ కింగ్ (మలేసియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

ఉన్నతి, ఆకర్షి గెలుపు

మహిళల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఉన్నతి హుడా, ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోద్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టగా... రక్షిత శ్రీ, అనుపమ తొలి రౌండ్‌లో ఓడిపోయారు. ఉన్నతి 21-14, 18-21, 23-21తో థమోన్‌వన్ (థాయ్‌లాండ్)పై, ఆకర్షి 21-16, 20-22, 22-20తో కవోరు సుగియామ (జపాన్)పై, మాళవిక 21-12, 13-21, 21-17తో నెస్లిహాన్ అరిన్ (తుర్కియే)పై విజయం సాధించారు. రక్షిత శ్రీ 18-21, 7-21తో యో జియా మిన్ (ఇండోనేసియా) చేతిలో, అనుపమ 11-21, 9-21తో ఇంతనోన్ రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి చవిచూశారు.

1511 రోజులుగా...



- వరల్డ్ నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా జడేజా
- టెస్టు క్రికెట్ చరిత్రలో అసాధారణ ఘనత

న్యూఢిల్లీ: భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టు క్రికెట్‌లో అరుదైన, అసాధారణ ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. ఈ ఫార్మాట్‌లో సుదీర్ఘ కాలంగా తన సత్తా చూపిస్తున్న జడేజా మరోసారి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వరల్డ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా తన స్థానాన్ని పటిష్టం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఏకంగా 1511 రోజులుగా నంబర్‌వన్‌గా నిలిచిన ఈ రికార్డు సృష్టించిన తొలి ఆటగాడిగా నిలిచాడు. నాలుగేళ్లకు పైగా అగ్రస్థానాన కొనసాగుతున్న అతనికి ఏ టెస్టు ఆల్‌రౌండర్ నుంచి కూడా ఇప్పటి వరకు పోటీ ఎదురు కాలేదు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో జడేజా 400 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా... బంగ్లాదేశ్‌కు చెందిన మెహదీ హసన్ మిరాజ్ 327 పాయింట్లతో రెండో స్థానం, దక్షిణాఫ్రికా ప్లేయర్ మార్కో యాన్సెన్ 294 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు.

జడేజా తన 13 ఏళ్ల టెస్టు కెరీర్‌లో భారత్ సాధించిన పలు చిరస్మరణీయ విజయాల్లో ఆల్‌రౌండర్‌గా కీలకపాత్ర పోషించాడు. జాతీయ జట్టు తరఫున 80 టెస్టులు ఆడిన జడేజా 34.74 సగటుతో 3370 పరుగులు సాధించాడు. ఇందులో 4 సెంచరీలు, 22 అర్ధ సెంచరీలు ఉన్నాయి. కేవలం 24.14 సగటుతో అతను 323 వికెట్లు పడగొట్టాడు. భారత్ తరఫున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో కుంబ్లే (619), అశ్విన్ (537), కపిల్ (434), హర్భజన్ (417) తర్వాత ఐదో స్థానంలో ఉండటం విశేషం.

భారత్‌లో ఆసియా కప్ హాకీ: పాక్‌కు ఎంట్రీ కష్టమే



- ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 7 వరకు టోర్నీ
- విజేత జట్టుకు ప్రపంచకప్ బెర్త్

న్యూఢిల్లీ: భారత్‌లో జరిగే పురుషుల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ పాల్గొనడంపై నీలినీడలు కమ్ముకున్నాయి. పహల్గాంలో ఉగ్రదాడి తదనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల కాస్తా యుద్ధ వాతావరణాన్ని సృష్టించింది. చివరకు కాల్పుల విరమణతో భారత్ వైపు నుంచి ప్రతిదాడులు తప్పినా... పాక్ నుంచి చీకటి పడగానే డ్రోన్ల దాడి ఎదురవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పాకిస్తాన్ హాకీ జట్టును కేంద్ర ప్రభుత్వం అనుమతించే అవకాశాలే లేవు. దీనిపై హాకీ ఇండియా (హెచ్ఐ) భారత ప్రభుత్వ సలహా కోరగా... ప్రభుత్వం నుంచి ప్రతిస్పందన రాలేదు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిర్ వేదికగా ఆసియా కప్ టోర్నీ జరగనుంది. ఇందులో ఆతిథ్య భారత్ సహా జపాన్, కొరియా, చైనా, మలేసియా, ఒమన్, చైనీస్ తైపీ, పాకిస్తాన్ పోటీపడతాయి. ప్రపంచకప్ హాకీకి ఈ ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీగా జరుగుతోంది. నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యమివ్వబోతున్న ప్రపంచకప్ హాకీ టోర్నీ వచ్చే ఏడాది జరుగుతుంది.

భారత్‌లో జరిగే టోర్నీ కోసం పాక్‌ను అనుమతించకపోవడం గతంలోనూ జరిగింది. 2016లో పఠాన్‌కోట్‌లో భారత ఎయిర్‌బేస్‌పై ఉగ్రదాడి జరగడంతో ఆ ఏడాది జరిగిన జూనియర్ ప్రపంచకప్ హాకీలో పాక్‌ను అనుమతించలేదు. ఏదేమైనా ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారమే నడుచుకోవాల్సి ఉంటుందని హాకీ ఇండియా సెక్రటరీ జనరల్ భోళానాథ్ సింగ్ చెప్పారు. అనుమతిస్తారా, నిరాకరిస్తారా అన్నది ప్రభుత్వం చేతుల్లో ఉందని, దీనిపై ముందస్తుగా తాము చెప్పడానికేమీ లేదని ఆయన చెప్పారు. ఆసియా టోర్నీలో పాక్ స్థానంలో మలేసియాను ఆడించే అవకాశమైంది. ఈ టోర్నీలో ఐదుసార్లు విజేత అయిన దక్షిణ కొరియా డిఫెండింగ్ చాంపియన్ హోదాతో బరిలోకి దిగుతుంది. కొరియా తర్వాత దాయాది దేశాలు చెరో నాలుగుసార్లు ఆసియా కప్ గెలిచాయి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఏం జరుగుతుందో ఊహించలేరు!

- హీరో నవీన్ చంద్ర



''నాకు తెలుగు, తమిళ్, కన్నడ, బెంగాలీ, మరాఠీ వంటి ఎనిమిది భాషలు వచ్చు. దీంతో 'లెవన్' తమిళ వెర్షన్‌కి నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను. మలయాళ సినిమాలు చేయాలని ఉంది. నా భార్యకు మలయాళ సినిమాల బ్యాక్‌గ్రౌండ్ ఉంది. దర్శకులు సిద్ధిఖీ, జీతూ జోసెఫ్ వంటి వారి దగ్గర పని చేసింది. నన్ను మలయాళంకు తీసుకెళ్లాలని అనుకుంటోంది. నాకూ ఆసక్తి ఉంది. కానీ ఆ భాషపై మరింత పట్టు వచ్చిన తర్వాత మలయాళ సినిమాలు చేస్తాను'' అని నవీన్ చంద్ర చెప్పారు. నవీన్ చంద్ర హీరోగా నటించిన తాజా చిత్రం 'లెవన్'. లోకేశ్ అజ్లస్ దర్శకత్వంలో అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించిన ఈ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం ఈ నెల 16న విడుదలవుతోంది. రుచిర ఎంటర్‌టైన్మెంట్స్ ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ ఎన్. సుధాకర్ రెడ్డి ఈ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. 'లెవన్' విడుదల సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నవీన్ చంద్ర మాట్లాడుతూ– ''లెవన్' సినిమాను తమిళనాడులో ప్రివ్యూ వేశాం. సాధారణ ఆడియన్స్ చాలామందికి ఈ సినిమా చూపించాం. పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఫస్ట్ హాఫ్ ఎంగేజ్ చేస్తుంది. సెకండ్ హాఫ్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంటుంది. ఈ చిత్రంలో నేను పోలీసాఫీసర్‌గా నటించాను. కథలో నా ఇన్వెస్టిగేషన్ అంత సులభంగా ఉండదు. నెక్ట్స్ ఏం జరుగుతుందో ప్రేక్షకులు ఊహించలేరు. నెక్రోఫోబియా అనే పాయింట్‌ని కూడా టచ్ చేశాం. ఇది సినిమాలో కీలకంగా ఉంటుంది. ఇక నా ప్రతి సినిమాకు కనీసం పదిమంది కొత్త ప్రేక్షకులకు దగ్గరవ్వాలని ప్రయత్నిస్తుంటా. తమిళంలో నేను, సునీల్‌గారు కలిసి హరి అనే కొత్త దర్శకుడితో ఓ కామెడీ ఫిల్మ్ చేస్తున్నాం. కరుణకుమార్ డైరెక్షన్‌లో 'హనీ' అనే డార్క్ ఫిల్మ్ చేస్తున్నా. ఈ సినిమా చూశాక నవీన్‌కి ఏమైనా పిచ్చి పట్టిందా? ఇలాంటి క్యారెక్టర్ చేశాడని ఆడియన్స్ అనుకుంటారేమో. రవితేజగారి 'మాస్ జాతర' సినిమాలో పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నాను. రవితేజగారే నన్నీ పాత్రకు సిఫార్స్ చేశారు. హ్యాపీ ఫీలయ్యాను. ఇంకా 'ఇన్‌స్పెక్టర్ రుషి' సీజన్ 2 సిరీస్ ఉంది'' అని అన్నారు.

క్రైమ్... థ్రిల్


విజయ్ ఆంటోని

విజయ్ ఆంటోని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మార్గన్'. లియో జాన్ పాల్ దర్శకత్వంలో మీరా విజయ్ ఆంటోని సమర్పణలో విజయ్ ఆంటోని ఫిల్మ్స్ కార్పొరేషన్ నిర్మిస్తోంది. ఈ సినిమాని జూన్ 27న విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ మేరకు విజయ్ కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''మర్డర్ మిస్టరీ, క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'మార్గన్'. ఈ సినిమా ద్వారా విజయ్ ఆంటోని మేనల్లుడు అజయ్ ధీషన్ విలన్‌గా పరిచయమవుతున్నారు. చక్కని కుటుంబ కథా చిత్రంగా రానున్న మా సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, కెమెరా: యువ ఎస్.

కాన్స్ హంగామా మొదలు

- పామ్ డి ఓర్ పురస్కారం అందుకున్న రాబర్ట్ డి నీరో
- జ్యూరీ సభ్యురాలిగా ముంబై ఫిల్మ్‌మేకర్ పాయల్ కపాడియా


లియోనార్డో, రాబర్ట్ డి నీరో

కాన్స్ చలన చిత్రోత్సవాల కాంతులు ఫ్రాన్స్‌లో వెలిగిపోతున్నాయి. 78వ కాన్స్ చలన చిత్రోత్సవాలు ఫ్రాన్స్‌లో ఈ నెల 13న ప్రారంభమై, 24 వరకు జరగనున్న విషయం తెలిసిందే. ప్రముఖ అమెరికన్ ఫిల్మ్ మేకర్ క్వెంటిన్ టరంటినో ఈ 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ వేడుకను ప్రారంభించి, ఆయన మైక్‌ను వెంటనే కిందపడవేయడం వీక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. ఎందుకిలా చేశారనే చర్చ జరుగుతోంది. ఇక ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ, ఈ ఏడాది జ్యూరీలో ఓ సభ్యురాలిగా ఇండియన్ ఫిల్మ్ మేకర్ పాయల్ కపాడియా ఈ వేడుకకు హాజరయ్యారు. కాన్స్‌లోని ప్రతిష్ఠాత్మక 'పామ్ డి ఓర్' పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ అమెరికన్ నటుడు, దర్శకుడు రాబర్ట్ డి నీరో అందుకున్నారు. అమెరికన్ నటుడు లియోనార్డో డికాప్రియో చేతుల మీదుగా రాబర్ట్ డి నీరో 'పామ్ డి ఓర్' అవార్డును స్వీకరించారు. అలాగే విదేశాల్లో చిత్రీకరణ జరుపుకునే చిత్రాలను అమెరికాలో ప్రదర్శించాలనుకుంటే వంద శాతం టారిఫ్‌ను విధించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన ప్రకటనను రాబర్ట్ డి నీరో తన అవార్డు యాక్సెప్టెన్స్ స్పీచ్‌లో తప్పుబట్టారు. దీంతో అమెరికాలో సినిమాలపై వంద శాతం టారిఫ్ విధానం కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చర్చనీయాంశమైంది. ముంబై ఫిల్మ్ మేకర్ పాయల్ కపాడియా జ్యూరీ మెంబర్‌గా ఉండటం పట్ల రాబర్ట్ డి నీరో హర్షం వ్యక్తం చేశారు. అలాగే జూన్‌లో వందేళ్లు పూర్తి చేసుకోనున్న చార్లీ చాప్లిన్ 'ది గోల్డ్ రష్' చిత్రాన్ని ప్రదర్శించారు. ఇక ఈసారి కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరయ్యేవారి వస్త్రధారణపై జ్యూరీ ప్రత్యేక నియమ నిబంధనలను విధించింది. ఇండియన్ డిజైనర్ గౌరవ్ సిద్ధం చేసిన ఓ ప్రత్యేక కాస్ట్యూమ్‌ను కాన్స్ ప్రస్తుత రూల్స్ వల్ల తాను ధరించలేకపోయాయని అమెరికన్ నటి హాలీ బెర్రీ పేర్కొన్నారు.


పాయల్

కాన్స్‌లో భారతీయం: సత్యజిత్ రే దర్శకత్వంలోని ప్రముఖ బెంగాలీ ఫిల్మ్ 'అరణ్యేర్ దిన్ రాత్రి', అనుపమ్ ఖేర్ డైరెక్షన్‌లోని తాజా చిత్రం 'తన్వి: ది గ్రేట్', హైదరాబాద్ ఫిల్మ్‌మేకర్ నీరజ్ దర్శకత్వం వహించిన 'హోమ్ బౌండ్' (జాన్వీ కపూర్, ఇషాన్ కట్టర్ లీడ్ యాక్టర్స్‌గా చేశారు), చరక్, సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణంలోని 'ఏ డాల్ మేడప్ ఆఫ్ క్లే' చిత్రాలు కాన్స్‌లో ప్రదర్శితం కానున్నాయి. దీంతో ఈ సినిమాలకు చెందిన కొందరు నటీనటులు, దర్శక-నిర్మాతలు ఈ చిత్రోత్సవాలకు హాజరు కానున్నారు. అలాగే 'అన్ సర్టైన్ రిగార్డ్స్' విభాగంలో అవార్డు కోసం 'హోమ్‌బౌండ్' చిత్రం పోటీ పడుతున్న సంగతి తెలిసిందే. ఇక ఈ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొననున్నట్లుగా ఆలియా భట్ ఓ సందర్భంగా చెప్పారు. అయితే భారత్-పాక్ యుద్ధం నేపథ్యంలో ఆమె ఈ ఫెస్టివల్‌కు హాజరు కాకూడదనుకున్నారట. ఇంకా దాదాపు పది రోజుల పాటు ఈ ఫెస్టివల్ జరుగుతుంది కాబట్టి ఆలియా మనసు మార్చుకుంటారేమో. ఇక కాన్స్ అంటే ఐశ్వర్యా రాయ్ ఉండా ల్సిందే. ఈసారి ఆమెతో పాటు ఇంకొందరు భారతీయ తారలు కాన్స్ చిత్రోత్సవాల్లో మెరవనున్నారు.

ఊహూ... ఉర్ఫీకి చేదు అనుభవం


ఉర్ఫీ

బాలీవుడ్ నటి ఉర్ఫీ జావేద్‌కి చేదు అనుభవం ఎదురైంది. 'కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2025'లో తొలిసారి పాల్గొనే అవకాశం అందుకున్నారామె. హ్యాపీగా వీసాకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఊహూ... అంటూ వీసాని తిరస్కరించడంతో ఉర్ఫీ నిరుత్సాహపడ్డారు. కానీ తిరస్కరణలు తనకు కొత్తేం కాదంటూ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేశారామె. ''కాన్స్‌లో కొన్ని వైవిధ్యమైన దుస్తుల్లో కనిపించాలని ప్లాన్ చేసుకున్నాను. కానీ, విధిరాత వల్ల నా వీసా తిరస్కరణకు గురైంది. నా జీవితంలో వ్యాపారంలో ఇప్పటికే చాలా సార్లు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాను. జీవితంలో ఎన్నో తిరస్కరణల తర్వాత కూడా నేను ఎక్కడా ఆగిపోలేదు. నాలాగా మీలో చాలామంది తిరస్కరణకు గురై ఉంటారు. ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొని ఉంటే... షేర్ చేసుకుని, అందరికీ ఆదర్శంగా నిలవాలి'' అని పోస్ట్ చేశారు ఉర్ఫీ జావేద్.

అప్పుడు మొసలి.. ఇప్పుడు చిలుక!


ఊర్వశి

కాన్స్ చిత్రోత్సవాల ఎర్ర తివాచీ పై రంగురంగుల గౌనులో సందడి చేశారు నటి ఊర్వశీ రౌతేలా. కొందరు నెటిజన్స్ మాత్రం ఆమె లుక్‌పై విమర్శలు చేస్తున్నారు. 2018లో జరిగిన కాన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొన్న ఐశ్వర్యా రాయ్ ఇలాంటి మల్టీ కలర్ గౌను ధరించారని, ఆమె లుక్‌ని ఊర్వశి కాపీ కొట్టారనీ కామెంట్ చేస్తున్నారు. మరికొందరైతే ఆమె మేకప్ ఎక్కువైందని, హెయిర్ స్టైల్ బాగోలేదని విమర్శలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే... ఊర్వశీ రౌతేలా చేతిలో ఉన్న చిలుక ఆకారం ఉన్న క్లచ్ (పర్సు) అందర్నీ ఆకట్టుకుంది. చిలుక ఆకారంలో క్రిస్టల్స్ పొదిగిన ఈ క్లచ్ ధర సుమారు రూ. 4 లక్షలు ఉంటుందని టాక్. కాగా 2023లో జరిగిన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న ఊర్వశీ రౌతేలా ధరించిన మొసలి ఆకారంలోని నెక్లెస్ అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. కోట్ల రూపాయలు విలువ చేసే ఆ నెక్లెస్ అంత బాగా లేదని అప్పట్లో విమర్శలు వచ్చాయి. తాజాగా మేకప్, హెయిర్ స్టైల్ విషయంలో విమర్శలు ఎదురయ్యాయి. అయితే 'ప్యారెట్ క్లచ్' మాత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


కింగ్‌డమ్ వాయిదా


విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ హీరోగా రూపొందిన 'కింగ్‌డమ్' సినిమా విడుదల తేదీ మారింది. ఈ నెల 30న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ జూలై 4వ తేదీకి వాయిదా వేసినట్లు బుధవారం మేకర్స్ పేర్కొన్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ''కింగ్‌డమ్'ని ముందుగా అనుకున్నట్టు మే 30న రిలీజ్ చేయాలని ఎంతగానో ప్రయత్నించాం. కానీ, మన దేశంలో ఇటీవల ఊహించని సంఘటనలు జరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రమోషన్స్, వేడుకలు నిర్వహించడం కష్టతరమని వాయిదా నిర్ణయం తీసుకున్నాం. విడుదల తేదీ మార్పు విషయంలో మాకు మద్దతు ఇచ్చిన నిర్మాత 'దిల్' రాజు, హీరో నితిన్‌గార్లకు థ్యాంక్స్'' అని యూనిట్ పేర్కొంది.

ఏకాగ్రతతో చూడాల్సిన సినిమా ఇది

- దర్శకుడు రాజ్ రాచకొండ



''మన వయసు రీత్యా ఆలోచన ధోరణుల్లో మార్పులు వస్తాయనే న్యూరో సైన్స్ అంశాల ఆధారంగా, కొన్ని వాస్తవ సంఘటనలతో '23' చేశాను. ప్రేక్షకులు ఏకాగ్రతతో చూడాల్సిన సినిమా '23'' అని అన్నారు దర్శకుడు రాజ్ రాచకొండ. తేజ, తన్మయి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '23'. 'మల్లేశం, 8ఏఎమ్ మెట్రో' చిత్రాల ఫేమ్ రాజ్ రాచకొండ దర్శకత్వంలో స్టూడియో 99 ఈ సినిమాను నిర్మించింది. వెంకట్ సిద్ధారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూట్ చేస్తున్న ఈ సినిమా ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఈ చిత్రదర్శకుడు రాజ్ రాచకొండ మాట్లాడుతూ– ''23'లో పలు థీమ్స్ ఉన్నాయి. లవ్‌స్టోరీతో సినిమా మొదలవుతుంది. ఆ తర్వాత చుండూరు ఘటన, జూబ్లీహిల్స్ ఘటన చూపించాను. ఈ సినిమాలో ప్రస్తావించిన కొన్ని అంశాలు న్యాయ వ్యవస్థను ప్రశ్నించేలా ఉంటాయి. సెన్సార్ విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాను. కొన్ని సన్నివేశాల్లో మితి మీరిన హింస ఉందని, ఈ హింసాత్మక సన్నివేశాల నిడివి తగ్గించాలని చెప్పారు. కానీ ఈ సినిమాలోని హింసతో పోల్చితే... కొన్ని ఇతర సినిమాల్లో హింసాత్మక సన్నివేశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అయితే నా సినిమాకు సెన్సార్ రూల్స్ చెబుతున్నారు. చట్టం అన్ని సినిమాలకి ఒకేలా వర్తించాలి. కానీ అలా జరగటం లేదు. దీన్ని ఎవరో ఒకరు ప్రశ్నించాలి. అలాంటి ఒక ప్రశ్నని రేకెత్తించే సినిమానే ఇది'' అని అన్నారు.

సాక్షి బిజినెస్

గురువారం
15-5-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	182	81,331
నిఫ్టీ ▲	89	24,667

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	19,099	▲	87
డోజోన్స్	42,015	▽	129
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8.585	▽	18
డాక్స్	23,527	▽	112
షాంఘై	3,375	▲	29
నికాయ్	38,128	▽	55

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.44	87.12
£	బ్రిటన్ పౌండ్	111.16	116.10
€	యూరో	93.50	97.96
¥	జపాన్ యెన్ (100)	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	52.72	57.56
S$	సింగపూర్ డాలర్	63.36	68.06
SAR	సౌదీ రియాల్	21.84	23.35
UAE D	యూఏఈ దిర్హామ్	22.33	24.11
¥	చైనా యువాన్	10.96	12.78

చిన్న నగరాల్లో స్మార్ట్‌ఫోన్స్ హవా!

మెట్రోలు, బడా నగరాల్లో డిమాండ్ మందగమనం | కంపెనీలకు రూరల్ సేల్స్ దన్ను | చౌక, ప్రీమియం 5జీ ఫోన్లకూ మంచి గిరాకీ...

మెట్రోలు, బడా నగరాల వంటి అర్బన్ మార్కెట్లో స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు పతాక స్థాయికి చేరుకోవడంతో డిమాండ్ మందకొడిగా మారింది. అయితే, హ్యాండ్‌సెట్ తయారీ సంస్థలకు ద్వితీయ శ్రేణి నగరాలు, గ్రామీణ ప్రాంతాలు ఇప్పుడు ఈ లోటును భర్తీ చేస్తున్నాయి. చౌక ఫోన్లే కాదు.. ప్రీమియం 5జీ ఫోన్ల కొనుగోళ్లకూ కస్టమర్లు తగ్గేదేలే అంటున్నారు. పెద్ద నగరాలను మించి విక్రయాలు నమోదవుతుండటంతో సేల్స్ పెంచుకోవడానికి కంపెనీలు రూరల్ రూట్ ఎంచుకుంటున్నాయి. అంతేకాదు, ఫైనాన్సింగ్ ఆప్షన్ల దన్నుతో సెకండ్ హ్యాండ్ 4జీ ఫోన్లు కూడా హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి.

-సాక్షి, బిజినెస్ డెస్క్



ఒకప్పుడు కీప్యాడ్ ఫీచర్ ఫోన్స్ వాడకానికి బాగా అలవాటు పడ్డ గ్రామీణ, చిన్న పట్టణాల ప్రజలు 'స్మార్ట్'గా అప్‌గ్రేడ్ అవుతున్నారు. దీంతో చిన్న నగరాలు, పట్టణాలతో పాటు పల్లెల్లోనూ స్మార్ట్‌ఫోన్లకు డిమాండ్ దూసుకెళ్తోంది. పెద్ద నగరాల్లో స్తబ్దుగా మారిన సేల్స్‌ను కంపెనీలు అక్కడ పూడ్చుకుంటున్నాయి. దీంతో మొత్తంమీద స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు పడిపోకుండా, వృద్ధి సిగ్నల్స్‌కు వీలవుతోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. '4జీతో పాటు 5జీ మోడల్స్ కూడా అందుబాటు ధరల్లో లభ్యమవుతుండటంతో ద్వితీయ శ్రేణి నగరాల్లో ఈ ఏడాది అమ్మకాల వృద్ధి భారీగా నమోదుకానుందని టెక్‌ఆర్క్ అడ్వయిజర్ అజయ్ శర్మ చెప్పారు. '2023, 2024 సేల్స్ ట్రెండ్‌ను పరిశీలిస్తే, పెద్ద నగరాలకు మించి టియర్-2 నగరాల్లో అమ్మకాలు పుంజుకున్నాయి. ప్రీమియం ఫోన్ల పట్ల ఆసక్తి ఈ నగరాలకూ పాకింది. మరోపక్క, చౌక 5జీ ఫోన్ల దన్నుతో కొన్ని బ్రాండ్‌లు మిగతా కంపెనీల కంటే వేగంగా వృద్ధి చెందుతున్నాయి' అని పేర్కొన్నారు.

ఆఫ్‌లైన్ స్టోర్స్ ద్వారా...

చిన్న నగరాలు, పట్టణాల్లో కూడా ప్రజల ఆదాయాలు పెరుగుతుండటంతో పాటు డిజిటల్ టెక్నాలజీ పట్ల అవగాహన, రిటైల్ నెట్‌వర్క్‌లను విస్తరిస్తుండటం వల్ల కస్టమర్లు హై-ఎండ్ డివైజ్‌లకు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ ఎనలిస్ట్ సుభమ్ సింగ్ తెలిపారు. 'ప్రధాన హ్యాండ్‌సెట్ బ్రాండ్‌లన్నీ ఆఫ్‌లైన్ (రిటైల్ స్టోర్స్) ద్వారా చిన్న నగరాల్లోకి చొచ్చుకుపోతున్నాయి. స్టోర్‌లో నేరుగా ఫోన్‌ను చూసి, అనుభూతి చెందే అవకాశం, అలాగే ఈజీ ఫైనాన్సింగ్ ఆప్షన్లతో ఖరీదైన స్మార్ట్‌ఫోన్ కొనుగోళ్లకు వెనకాడటం లేదు' అని సింగ్ వివరించారు. 30 నగరాల్లో నిర్వహించిన మార్కెట్ అధ్యయనం ప్రకారం, బడా నగరాల్లో (టియర్-1) వార్షిక అమ్మకాల వృద్ధి సింగిల్ డిజిట్‌కు పరిమితం కాగా, టియర్-2, అంతకంటే చిన్న నగరాల్లో రెండంకెల వృద్ధి నమోదవుతున్నట్లు చెప్పారు. ఫీచర్ ఫోన్స్ కస్టమర్లు అప్‌గ్రేడ్ అవుతుండటం, అనువైన రుణ సదుపాయాల వల్ల తృతీయ శ్రేణి (టియర్-3) ప్రాంతాల్లో తమ అమ్మకాలు 19-20 శాతం పెరిగాయని హ్యాండ్‌సెట్ బ్రాండ్ టెక్నో సీఈఓ అరిజిత్ తలపాత్ర పేర్కొన్నారు.

అమ్మకాలు ఫ్లాట్.. ఆదాయాలు జూమ్

కోవిడ్ ముందు నాటి స్మార్ట్‌ఫోన్ అమ్మకాల వృద్ధితో పోలిస్తే ప్రస్తుతం దేశంలో సేల్స్ మందగమనం స్పష్టంగా కనబడుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏటా విక్రయాలు 15 కోట్ల స్థాయికి పరిమితం అవుతున్నాయి. ఈ ఏడాది (2025) అమ్మకాలు ఫ్లాట్‌గా ఉంటాయని అంచనా వేస్తున్నారు. టాప్‌లేపుతున్న వివో, శాంసంగ్, షావోమి, ఒప్పో, రియల్‌మీ వంటి బ్రాండ్‌లకు ఇది ప్రతికూల సిగ్నల్స్ పంపుతోంది. అయితే, 2024లో దేశీ స్మార్ట్‌ఫోన్ పరిశ్రమ మొత్తం ఆదాయం ఆల్‌టైమ్ గరిష్ఠానికి (9% వార్షిక వృద్ధి) దూసుకెళ్లడం విశేషం. ప్రధానంగా 5జీ, జెనరేటివ్ ఏఐ వంటి ఫీచర్లు గల ఖరీదైన స్మార్ట్‌ఫోన్స్‌పై కస్టమర్లు భారీగా ఖర్చు చేయడమే దీనికి కారణమని కౌంటర్‌పాయింట్ వెల్లడించింది.

ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) గణాంకాల ప్రకారం 2024లో 15.1 కోట్ల స్మార్ట్‌ఫోన్‌లు అమ్ముడయ్యాయి. 4 శాతం వృద్ధి నమోదైంది.



సగం ఫోన్ సేల్స్ అక్కడి నుంచే...

'ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల వాడకం ట్రెండ్ మెట్రోలు, పెద్ద నగరాలకే పరిమితం కావడం లేదు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో కూడా రూ.8,500-17,000 స్థాయికి మించి ఖరీదైన ఫోన్లకు కస్టమర్లు సై అంటున్నారు. ముఖ్యంగా ఔత్సాహిక మధ్య తరగతి కొనుగోలుదారులు వేగంగా ప్రీమియం ఫోన్లకు అప్‌గ్రేడ్ అవుతున్నారు' అని సీఎంఎస్ ఇన్‌సైట్ సీనియర్ ఎనలిస్ట్ ఏక్తా మిట్టల్ చెప్పారు. స్మార్ట్‌ఫోన్ పరిశ్రమలో భవిష్యత్తు వృద్ధికి చిన్న నగరాలే చోదకంగా నిలుస్తాయంటున్నారు. ప్రస్తుతం సగానికి పైగా స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు చిన్న నగరాలు, పట్టణాల్లోనే నమోదవుతున్నాయని కూడా సీఎంఎస్ ఇన్‌సైట్ తెలిపింది. మరోపక్క, జియో, ఎయిర్‌టెల్ తమ 5జీ నెట్‌వర్క్‌ను గ్రామీణ, సబర్బన్ ప్రాంతాలకు వేగంగా విస్తరిస్తుండటం, క్వాల్‌కామ్, మీడియాటెక్ వంటి చిప్ తయారీ దిగ్గజాలు రూ.12,000 కంటే తక్కువ స్థాయిలో 5జీ ఫోన్లు లభించేలా చౌక 5జీ ప్రాసెసర్లను అందుబాటులోకి తేవడం కూడా పరిశ్రమకు దన్నుగా నిలుస్తోందనేది నిపుణుల మాట!

పరిమిత శ్రేణి ట్రేడింగ్... స్వల్ప లాభాలు

- ఆరేళ్ల కనిష్టానికి ద్రవ్యోల్బణం
- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు

ముంబై: ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్టానికి దిగిరావడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో స్టాక్ సూచీలు బుధవారం లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 182 పాయింట్లు పెరిగి 81,331 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 89 పాయింట్లు బలపడి 24,667 వద్ద నిలిచింది. ఉదయం స్వల్పలాభాలతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 80,910 వద్ద కనిష్టాన్ని,



81,692 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 24,536 – 24,768 శ్రేణిలో కదలాడింది. బ్యాంకులు మినహా అన్ని రంగాలకు కొనుగోళ్ల మద్దతు లభించింది. అమెరికా చైనా ట్రేడ్ డీల్‌తో మెటల్స్ మెరిశాయి. లాభాల స్వీకరణతో దిగివచ్చిన ఐటీ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు.

- బీఎస్ఈ ఇండెక్సుల్లో మెటల్ 2.46%, ఇండస్ట్రియల్స్, రియల్టీ 2%, కమోడిటీస్, ఆయిల్అండ్ గ్యాస్ 1.50% చొప్పున రాణించాయి. మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు 1.63%, 1.19% పెరిగాయి.
- రక్షణ పరికరాల ఉత్పత్తి, ఎగుమతులను ప్రోత్సహించే దిశగా కేంద్రం లక్ష్యాలు నిర్దేశించుకోవడంతో రక్షణ రంగ కంపెనీల షేర్లకు డిమాండ్ కొనసాగింది. మిశ్ర ధాతు నిగమ్ షేరు 15% దూసుకెళ్లింది. యాక్సిస్‌కేడ్స్ టెక్నాలజీ 5%, పారస్ డిఫెన్స్ 4%, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ 3.50%, డేటా ప్యాటర్న్స్ 3% పెరిగాయి.

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ నుంచి హీట్ ఎక్స్ఛేంజర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా తొలిసారిగా గ్లాస్-లైన్డ్ షెల్, ట్యూబ్ హీట్ ఎక్స్ఛేంజర్ల తయారీని చేపట్టినట్లు స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ వెల్లడించింది. ఇందుకోసం జపాన్‌కి చెందిన ఏజీఐ గ్రూప్, దాని అనుబంధ సంస్థ జీఎల్ హక్కోతో జట్టు కట్టినట్లు కంపెనీ ఎండీ నాగేశ్వర రావు కందుల తెలిపారు. ఫార్మా, కెమికల్ రంగాలకు కీలకమైన ఈ ఉత్పత్తులను ప్రస్తుతం దిగుమతి చేసుకోవాల్సి ఉంటోందని ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన వివరించారు. వీటిని దేశీయంగా తయారు చేసే ఏకైక సంస్థ తమదే అన్నారు. ఉత్పత్తి ప్రారంభించడానికి



ముందుగానే తమకు 150 ఆర్డర్లు లభించాయని పేర్కొన్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే ప్లాంటులో వచ్చే ఏడాది జనవరి-మార్చి త్రైమాసికం నాటికి ప్రాథమికంగా నెలకు 200 యూనిట్లు ఉత్పత్తి చేస్తామని వివరించారు. 90 పైచిలుకు ఉత్పత్తుల రకాలతో స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ సంస్థ .. ఇంజనీరింగ్ సూపర్‌మార్కెట్‌గా నిలుస్తోందని ఏజీఐ గ్రూప్ సీఈవో యసుయుకి ఇకెడా తెలిపారు.

టోకు ధరలూ తగ్గాయ్



- 13 నెలల కనిష్టానికి ద్రవ్యోల్బణం
- ఏప్రిల్‌లో 0.85 శాతంగా నమోదు

న్యూఢిల్లీ: ఆహార ఉత్పత్తులు, ఇంధనం మొదలైన వాటి ధరలు నెమ్మదించడంతో ఏప్రిల్‌లో టోకు ద్రవ్యోల్బణం తగ్గింది. టోకు ధరల ఆధారిత సూచీ (డబ్ల్యూపీఐ) 13 నెలల కనిష్టమైన 0.85 శాతానికి పరిమితమైంది. గతేడాది మార్చిలో 0.26 శాతంగా నమోదైన తర్వాత డబ్ల్యూపీఐ ఇంత తక్కువ స్థాయికి దిగిరావడం ఇదే ప్రథమం. ఇది తాజా మార్చిలో 2.05 శాతంగా, గతేడాది ఏప్రిల్‌లో 1.19 శాతంగా నమోదైంది. డేటా ప్రకారం ఆహార ఉత్పత్తుల ధరలు 0.86 శాతం, కూరగాయల రేట్లు 18.26 శాతం స్థాయిలో క్షీణించడంతో ప్రతిద్రవ్యోల్బణం నమోదైంది. సీక్వెన్షియల్‌గా విమాన ఇంధనం, కిరోసిన్ మొదలైన వాటి ధరలు తగ్గడంతో ఇంధనాలు.. విద్యుత్ రేట్లు 2.18 శాతం క్షీణించాయి. తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 2.62 శాతంగా నమోదైంది. సానుకూల బేస్ ఎఫెక్ట్ కారణంగా రాబోయే నెలల్లో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం తక్కువ స్థాయిలోనే కొనసాగే అవకాశం ఉందని బార్‌క్లేస్ ఒక నివేదికలో తెలిపింది. రుతుపవనాలు ముందే తాకడం, వర్షపాతం సాధారణ స్థాయికన్నా ఎక్కువగానే ఉండొచ్చనే అంచనాలు పంట దిగుబడులకు, ఆహార ద్రవ్యోల్బణానికి సానుకూలాంశాలని ఇక్రా సీనియర్ ఎకనమిస్ట్ రాహుల్ అగ్రవాల్ తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఎంట్రీలెవల్ ఉద్యోగాల్లో మహిళలు అంతంతే!	ఐషర్ రూ. 70 డివిడెండ్

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

సెంట్రల్ పవర్ రీసెర్చ్‌లో 44 పోస్టులు

బెంగళూరులోని కేంద్ర ప్రభుత్వ విద్యుత్ శాఖ పరిధిలోని సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీఆర్‌ఐ) 44 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైన వారిని భోపాల్, హైదరాబాద్, నాగ్‌పూర్, నాసిక్, నోయిడా, కోల్‌కతా, గువాహటి, రాయ్‌పూర్ యూనిట్లలో ఎక్కడైనా నియమించవచ్చు. » **మొత్తం పోస్టులు:** 44

» **ఖాళీల వివరాలు:** సైంటిఫిక్ అసిస్టెంట్-4, ఇంజినీరింగ్ అసిస్టెంట్-8, టెక్నీషియన్(గ్రేడ్-1)-6, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-1, అసిస్టెంట్(గ్రేడ్-2)-23,అసిస్టెంట్ లైబ్రేరియన్-2

అర్హతలు

» సైంటిఫిక్ అసిస్టెంట్ కోసం బీఎస్సీ(కెమిస్ట్రీ) ప్రథమ శ్రేణిలో పాసై, 5 ఏళ్ల అనుభవం ఉండాలి.
» ఇంజినీరింగ్ అసిస్టెంట్.. ఎలక్ట్రికల్/సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా ఫస్ట్‌క్లాస్‌లో పాసవ్వాలి. ఐదేళ్ల అనుభవం ఉండాలి. టెక్నీషియన్(గ్రేడ్-1) ఎలక్ట్రికల్ బ్రాంచితో ఐటీఐ ట్రేడ్ సర్టిఫికెట్ ఉండాలి.
» జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్.. హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో డిగ్రీ ఉండాలి.
» అసిస్టెంట్ (గ్రేడ్-2).. బీఏ/ బీఎస్సీ/ బీకాం/ బీబీఏ/ బీబీఎం/ బీసీఏ ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
» అసిస్టెంట్ లైబ్రేరియన్‌కు డిగ్రీ,లైబ్రరీ సైన్స్‌లో డిప్లొమా పూర్తి చేయాలి.
» **వయసు:**సైంటిఫిక్,ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు,టెక్నీషియన్(గ్రేడ్-1)కు 28 ఏళ్లు,జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, అసిస్టెంట్ (గ్రేడ్-2), అసిస్టెంట్ లైబ్రేరియన్‌కు 30 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:**కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ), కొన్నింటికి స్కిల్ టెస్ట్/ట్రేడ్ టెస్ట్ ఉంటాయి.
» **వేతనం:** సైంటిఫిక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్లకు నెలకు రూ.35,400-1,12,400. టెక్నీషియన్ గ్రేడ్-1కు రూ.19,900-63,200. అసిస్టెంట్ గ్రేడ్-2, అసిస్టెంట్ లైబ్రేరియన్లకు రూ.25,500-81,100 వరకూ ఉంటుంది.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్లో చేసుకోవాలి
» దరఖాస్తుకు చివరి తేదీ: 25.05.2025
» మరిన్ని వివరాలకు: https://cpri.res.in

ఐసీఎంఆర్, న్యూఢిల్లీలో ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టులు

ఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్).. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ మేనేజర్-సైంటిఫిక్(మెడికల్)-01, ప్రాజెక్ట్ మేనేజర్-సైంటిఫిక్(నాన్ మెడికల్)-01, ప్రాజెక్ట్ మేనేజర్-టెక్నికల్ (సీపీసీ-డివిజన్)-01, ప్రాజెక్ట్ మేనేజర్(అడ్మిన్)-01, ప్రాజెక్ట్ మేనేజర్(ఫైనాన్స్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ/ఐసీడబ్ల్యూఏ, ఎంబీఏ, ఎంపీఎం, ఎంబీబీఎస్, ఎండీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం,ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.05.2025.
» **వెబ్‌సైట్:** https://www.icmr.gov.in

ఎన్‌ఏబీఎఫ్‌ఐడీ, ముంబైలో సీనియర్ ప్రొఫెషనల్స్ పోస్టులు

ముంబైలోని నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ (ఎన్‌ఏబీఎఫ్ఐడీ).. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **పోస్టుల వివరాలు:** వైస్ ప్రెసిడెంట్-లీడింగ్ అండ్ ఫైనాన్స్-02, వైస్ ప్రెసిడెంట్-లీడింగ్ అండ్ ప్రాజెక్ట్ ఫైనాన్స్(క్రెడిట్ ఆపరేషన్స్)-02, వైస్ ప్రెసిడెంట్-ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్(ఎండీ ఆఫీస్)-01, వైస్ ప్రెసిడెంట్-కార్పొరేట్ స్ట్రాటజీ, పార్ట్‌నర్‌షిప్స్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ,పీజీ, ఎంబీఏ /సీఏ/సీఎంఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 25.05.2025 నాటికి 55 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** recruitment@nabfid.org
» **దరఖాస్తులకు చివరితేది:** 25.05.2025.
» **వెబ్‌సైట్:** https://nabfid.org

లెఫ్టినెంట్ హోదా.. లక్ష వేతనం

బీఈ/బీటెక్ అభ్యర్థులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ఇండియన్ ఆర్మీ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు(టీజీసీ), జనవరి 2026కు నోటిఫికేషన్ విడుదల చేసింది. సర్వీస్ సెలక్షన్ బోర్డు(ఎస్ఎస్‌బీ) ఎంపిక ప్రక్రియ ద్వారా నియామకాలు చేపడుతుంది. ఇలా ఎంపికైన వారికి ఒక ఏడాది శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలోనే నెలకు రూ.56,100 స్టైపెండ్ లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఇండియన్ ఆర్మీ టీజీసీ నోటిఫికేషన్, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, శిక్షణ తదితర వివరాలు..

» టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సుకు ఆర్మీ నోటిఫికేషన్
» ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ ద్వారా నియామకాలు
» బీఈ/బీటెక్‌తో దరఖాస్తుకు అవకాశం

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 30
- **విభాగాల వారీగా ఖాళీలు:** సివిల్ ఇంజనీరింగ్-08 పోస్టులు, కంప్యూటర్ సైన్స్-06 పోస్టులు, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-02 పోస్టులు, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్-06 పోస్టులు, మెకానికల్ ఇంజనీరింగ్ -06 పోస్టులు, ఇతర ఇంజనీరింగ్ విభాగాలు-02 పోస్టులు.

అర్హతలు

అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. ఆయా పోస్టులను అనుసరించి సంబంధిత బ్రాంచ్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. వీరు 2026, జనవరి 1వ తేదీ నాటికి అన్ని విద్యార్హతల సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది.

- **వయసు:** 01.01.2026 నాటికి 20 ఏళ్ల నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ

- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను బీఈ/బీటెక్‌లో సాధించిన మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఇందుకోసం ఆయా ఇంజనీరింగ్ స్ట్రీమ్‌ల వారీగా కటాఫ్ మార్కులను నిర్ణయిస్తారు. షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియకు పిలుస్తారు. ఇలా ఎంపికైన వారికి ప్రయాగ్‌రాజ్ (యూపీ), భోపాల్ (మధ్య ప్రదేశ్), బెంగళూరు(కర్ణాటక), జలంధర్ (పంజాబ్)ల్లోని కేంద్రాల్లో ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ ప్రక్రియ రెండు దశలు స్టేజ్1, స్టేజ్ 2లుగా ఐదురోజులపాటు కొనసాగుతుంది. తొలుత స్టేజ్ 1లో ఇంటెలిజెన్స్‌పై పరీక్షలు ఉంటాయి. ఇందులో అర్హత సాధించిన వారినే స్టేజ్ 2కు అనుమతిస్తారు.



- స్టేజ్ 2కు ఎంపికైన వారికి నాలుగు రోజుల పాటు వివిధ పరీక్షలు నిర్వహిస్తారు. స్టేజ్ 2లోనూ ప్రతిభ చూపిన వారికి వైద్య పరీక్షలు ఉంటాయి. అనంతరం తుది విజేతలను ప్రకటిస్తారు.

12 నెలల శిక్షణ

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రకియలో విజేతలుగా నిలిచి టీజీసీ కోర్సులో చేరిన వారికి డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడెమీ(ఐఎంఏ)లో ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. 2026, జనవరి నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది. శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 స్టైపెండ్ అందుతుంది.

వేతనం ఇలా..

12 నెలలపాటు కొనసాగే శిక్షణను సైతం విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు లెఫ్టినెంట్ హోదాలో శాశ్వత ప్రాతిపదికన ఇండియన్ ఆర్మీలో కొలువు ఖరారవుతుంది. ఇలా ఉద్యోగంలోకి చేరిన వారికి ప్రారంభంలోనే లెవెల్-10 ప్రాతిపదికన నెలకు మూల వేతనం రూ.56,100 అందుతుంది. దీంతోపాటు మిలిటరీ సర్వీస్ పే, డీఏ, ఇతర ప్రోత్సాహకాలు అన్నీ కలుపుకొని నెలకు రూ.లక్ష వరకూ వేతనం అందుకునే అవకాశముంది.

కెరీర్ స్కోప్

లెఫ్టినెంట్ హోదాలో కెరీర్ ప్రారంభించిన వీరు తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయి హోదాలు సొంతం చేసుకోవచ్చు. రెండేళ్ల సర్వీస్‌తో కెప్టెన్, ఆరేళ్ల తర్వాత మేజర్, 13 ఏళ్ల సర్వీస్ అనంతరం లెఫ్టినెంట్ కల్నల్‌గా హోదాలు పొందొచ్చు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 29.05.2025
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

ఇంటర్‌తోనే ఆర్మీలో కొలువు + కోర్సు

ఇండియన్ ఆర్మీ.. టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ (పర్మనెంట్ కమిషన్)కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్మీడియెట్ ఎంపీసీ(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ)ఉత్తీర్ణులైన అవివాహిత పురుష అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు. ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిస్తే.. సైన్యంలో లెఫ్టినెంట్ కొలువుతోపాటు ఇంజనీరింగ్ డిగ్రీ పట్టా సైతం అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఇండియన్ ఆర్మీ 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, శిక్షణ, కెరీర్ స్కోప్‌పై ప్రత్యేక కథనం..

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 90(10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ 54వ కోర్సు–జనవరి 2026.

అర్హతలు

- గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో 10+2/ఇంటర్మీడియెట్(మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి. దీంతో పాటు జేఈఈ మెయిన్ 2025కు హాజరై ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
- **వయసు:** 01.01.2026 నాటికి 16.5 ఏళ్ల నుంచి 19.5 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం

సర్వీస్ సెలక్షన్ బోర్డ్(ఎస్ఎస్‌బీ).. జేఈఈ మెయిన్ స్కోర్ ఆధారంగా దరఖాస్తులను షార్ట్‌లిస్ట్ చేసి.. స్టేజ్1, స్టేజ్ 2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టులు నిర్వహిస్తుంది. వీటిలో చూపిన ప్రతిభ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తుంది. స్టేజ్1లో అర్హత సాధించిన వారికి మాత్రమే స్టేజ్ 2 నిర్వహిస్తారు. స్టేజ్1లో అర్హత సాధించని వారిని అదేరోజు వెనక్కు పంపిస్తారు. ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ ప్రక్రియ ఐదు రోజులపాటు కొనసాగుతుంది. ఈ ఎంపిక ప్రక్రియలో సాధించిన మార్కుల ఆధారంగా తుది జాబితా ప్రకటిస్తారు.

నాలుగేళ్ల శిక్షణ

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియలో విజయంతో పాటు వైద్య పరీక్షల్లో అర్హత సాధించి తుది జాబితాలో నిలిచిన వారికి ప్రి కమిషన్డ్ ట్రైనింగ్ అకాడెమీల్లో నాలుగేళ్లపాటు శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణ ఫేజ్1, ఫేజ్ 2లుగా కొనసాగుతుంది. ఫేజ్ 1 శిక్షణ సీఎంఈ పుణె/ఎంసీటీఈ మావ్/ఎంసీఈఎంఈ సికింద్రాబాద్ ల్లో మూడేళ్లపాటు ఉంటుంది. ఆ తర్వాత ఐఎంఏ డెహ్రాడూన్‌లో ఒక ఏడాది పాటు ఫేజ్ 2 శిక్షణ ఇస్తారు.

స్టైపెండ్

శిక్షణ సమయంలోనే నెలకు రూ.56,100 స్టైపెండ్ లభిస్తుంది. ట్రైనింగ్ పూర్తిచేసుకొని పర్మనెంట్ కమిషన్ పొందిన అభ్యర్థులకు రూ.17-18 లక్షల వార్షిక సీటీసీ అందుతుంది(పే మ్యాట్రిక్స్‌లో లెవెల్ 10).

ఇంజనీరింగ్ డిగ్రీ

సంబంధిత శిక్షణ కేంద్రాల్లో నాలుగేళ్లపాటు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఇంజనీరింగ్ పట్టా అందిస్తారు. దీంతోపాటు లెఫ్టినెంట్ ర్యాంకుతో కొలువు ఖరారవుతుంది.



ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 13.05.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 12.06.2025
- ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలు: ఆగస్ట్/సెప్టెంబర్ 2025
- వెబ్‌సైట్: www.joinindianarmy.nic.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-ఇంగ్లిష్

కర్రిగుట్టల్లో 31 మంది మావోయిస్టులు మృతి

- ఏప్రిల్ 21 నుంచి కూంబింగ్ ఆపరేషన్ ఆపలేదు
- ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్ వెల్లడి

చర్ల: ఆపరేషన్ కర్రిగుట్టల పేరిట తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో చేపట్టిన కూంబింగ్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారని, వారి నుంచి 35 ఆయుధాలతో పాటు భారీగా మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నామని ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్ వెల్లడించారు. బీజాపూర్ జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర హోం మంత్రి ఆదేశాల మేరకు ఏప్రిల్ 21 నుంచి కర్రిగుట్టల్లో ఆపరేషన్ చేపట్టామని, 60 కిలోమీటర్ల పొడవు, 5 నుంచి 20 కిలోమీటర్ల వెడల్పు గల ఈ గుట్టల్లో 21 రోజుల పాటు కూంబింగ్ కొనసాగించామని తెలిపారు. మొత్తంగా 21 ఎన్‌కౌంటర్లు జరిగాయని, ఏప్రిల్ 24న జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు, మే 5న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒకరు, మే 7న 22 మంది, మే 8న ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారని వివరించారు. ఇందులో 16 మంది మహిళలు ఉన్నారని చెప్పారు. మృతులపై రూ. 1.72 కోట్ల నగదు రివార్డులు ఉన్నాయన్నారు. మృతుల్లో 20 మందిని గుర్తించామని, ఇంకా 11 మందిని గుర్తించాల్సి ఉందని తెలిపారు. 450 మందుపాతరలు గుర్తించామన్నారు. కాగా, ఈ ఆపరేషన్ సమయంలో జరిగిన పేలుళ్లలో కోబ్రా, ఎస్టీఎఫ్, డీఆర్‌జీ విభాగాలకు చెందిన 18 మంది జవాన్లు గాయపడ్డారని, కర్రిగుట్టల్లో ఉష్ణోగ్రత 45 డిగ్రీల కంటే ఎక్కువగా ఉండడంతో పలువురు జవాన్లు అస్వస్థతకు గురయ్యారని వివరించారు. ఆపరేషన్ ఆపలేదని, కొనసాగుతూనే ఉందన్నారు.

శాంతి స్థాపనకు కట్టుబడి ఉన్నాం: ప్రధాని
తెలంగాణ–ఛత్తీస్ సరిహద్దులోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో శాంతి స్థాపనకు కట్టుబడి ఉన్నామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. ఈ ప్రాంతాలను అభివృద్ధి చెందుతున్న సమాజంతో అనుసంధానం చేస్తామన్నారు. వామపక్ష తీవ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం సరైన దిశలో వెళ్తోందని చెప్పారు.



ఇది తినండి.. ఇలా ఉండండి!

మిస్ వరల్డ్ పోటీదారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

నిరంతరం న్యూట్రీషినిస్టులు, వైద్యసిబ్బంది సేవలు

ప్రత్యేక ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఏం తినాలో వారే చెప్తారు... ఎప్పుడు తినాలో సూచిస్తారు.. దగ్గినా తుమ్మినా పరిగెత్తుకొస్తారు. నలతగా ఉందంటే క్షణాల్లో వాలిపోతారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న సుందరీ మణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. 24 గంటల మెడికల్ కేర్, న్యూట్రీషినిస్టుల సేవలు, నెలసరి సమస్యలు చికాకు పెట్టకుండా అందుబాటులో మహిళా సిబ్బంది.. ఇలా మిస్ వరల్డ్ పోటీల కోసం ప్రపంచం నలు మూలల నుంచి వచ్చిన సుందరీ మణుల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.

- సాక్షి, హైదరాబాద్

ప్రపంచ సుందరి కావాలన్న కల చాలామంది యువతుల్లో ఉంటుంది. అందం, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యం, ఆకట్టుకునే తెలివితేటలు.. కలబోసిన సంపూర్ణ వ్యక్తిత్వం.. ఈ లక్షణాలున్నవారు ప్రపంచ సుందరి కిరీటం కోసం ఆరాటపడటం సహజం. దీనిని సాధించుకునే లక్ష్యంతో చాలామంది కఠోర దీక్షగా సాగుతారు. ఎంతో ఇష్టమైన పదార్థాలున్నా ముట్టకుండా దూరంగా ఉంటారు. నిరంతరం కఠినమైన వ్యాయామం చేస్తారు. బద్ధకానికి అందనంత దూరంగా ఉండేందుకు నిరంతరం చలాకీతనం తొణికిసలాడేలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఇవన్నీ ఆచరణలో పెట్టేందుకు వారు తీవ్రంగా శ్రమిస్తారు. దాదాపు ఏడెనిమిది ఏళ్లపాటు దీక్షగా ముందుకు సాగుతారు. ఇన్నేళ్ల పట్టుదల, శ్రమ.. పోటీలయ్యేవరకు సడలకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. వారి సొంత ప్రాంతంలో దీన్ని నిలబెట్టుకున్నా, పోటీల కోసం మరో తరహా వాతావరణం ఉండే ప్రాంతానికి వెళ్లి దాదాపు నెల రోజుల పాటు అక్కడే ఉండాల్సిన పరిస్థితిలో వారు దాన్ని కొనసాగించటం పెద్ద సవాలే. అక్కడి వాతావరణం, పరిస్థితులు, ఆహారంలో మార్పు వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తాయి. అందుకే పోటీలు జరిగే ప్రాంతంలో దాదాపు రెండు నెలల ముందు నుంచి అక్కడి యంత్రాంగాన్ని మిస్‌వరల్డ్ లిమిటెడ్ అప్రమత్తం చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వానికి ఈ విషయంలో మార్చి మొదటి వారంలోనే మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్‌పర్సన్ జూలియా మోర్లే అప్రమత్తం చేశారు. మొదటిసారి హైదరాబాద్‌కు వచ్చి ఇక్కడి పరిస్థితులు పరిశీలించి, పోటీకి అనువైన వాతావరణం ఉందని తేల్చుకున్నాక రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగంతో ఈ విషయంపై చర్చించారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మెడికల్ టూరిజంలో తెలంగాణ అగ్రభాగాన ఉన్నందున, అక్కడ ప్రపంచ స్థాయి వైద్య వసతులున్నాయని, ఆ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని అధికారులు భరోసా ఇచ్చారు.

ఐదారేళ్ల శ్రమ..

టాప్ ఆస్పత్రితో ఒప్పందం..

ప్రస్తుతం నగరంలోని ఓ ప్రముఖ ఆస్పత్రితో మిస్ వరల్డ్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న యువతులు బస చేసిన ట్రైడెంట్ హోటల్‌లో ఆ ఆస్పత్రి ఓ ఎమర్జెన్సీ విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో షిఫ్టుల వారీగా వైద్యులు నిరంతరం అందుబాటులో ఉంటారు. నర్సులు, పారామెడికల్ సిబ్బంది, న్యూట్రిషనిస్టులు సహాయకంగా ఉంటారు.

- ✦ పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణుల్లో దాదాపు అన్ని ఖండాలకు చెందిన వారున్నారు. వారి శరీరానికి సరిపడే ఆహార పదార్థాలేమిటో తెలిపే జాబితాను మిస్‌వరల్డ్ ప్రతినిధులు ముందుగానే స్థానిక యంత్రాంగానికి అందజేశారు. ఆయా పదార్థాలు నిత్యం హోటల్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు.
- ✦ మంగళవారం చౌమహల్లా ప్యాలెస్‌లో వెల్‌కం డిన్నర్‌లో హైదరాబాద్ బిర్యానీని ప్రత్యేకంగా వడ్డించారు. కానీ, ఈ బిర్యానీని మసాలా తక్కువగా, మధ్య రకంగా, పూర్తిస్థాయి మసాలాతో.. ఇలా మూడు రకాలుగా తయారు చేసి ఉంచారు. యూరప్, అమెరికా తదితర ప్రాంతాలకు చెందిన వారిని తక్కువ మసాలా ఉన్న బిర్యానీ తీసుకోవాల్సిందిగా సూచించటం విశేషం.
- ✦ చాలా ఆరోగ్య సమస్యలు మంచినీటితోనే వస్తాయి. అందుకే సాధారణ నీళ్లు కాకుండా, ప్రస్తుతం సుందరీమణులకు లీటరు రూ.800 ఖరీదు చేసే ప్రత్యేక బ్రాండ్ మంచినీటిని అందిస్తున్నట్టు తెలిసింది.
- ✦ ప్రస్తుతం హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌లలో దాదాపు 80 రకాల ఇంటర్ కాంటినెంటల్ వంటకాలను బఫేలో ఉంచుతున్నారు. తమకు ఏది సరిపోతుందో ఆ ఆహారా పదార్థాలను సుందరీమణులు ఎంచుకునే వెసులుబాటు కల్పించారు.
- ✦ మిస్‌వరల్డ్ తరఫున వచ్చిన న్యూట్రిషనిస్టులు సూచించిన ఆహారాన్నే సుందరీమణులు స్వీకరిస్తున్నారు.
- ✦ రాష్ట్ర పర్యటనలకు వెళుతున్నప్పుడు కూడా ముందుగానే భోజన వివరాలను తెలిపి, స్టార్ హోటల్‌లో వండించి మరీ సిద్ధం చేస్తున్నారు.
- ✦ సుందరీమణులు ఎక్కడకు వెళ్లినా పూర్తి ఎమర్జెన్సీ వైద్య వసతులతో కూడిన అంబులెన్సు ఫాలో అవుతోంది. అందులో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది ఉంటున్నారు

అమ్మవారికి అగ్గిపెట్టెలో చీర

- విజయవాడ కనకదుర్గమ్మకు నివేదన
- సిరిసిల్ల నేత కార్మికుడు విజయ్‌కుమార్ సృష్టి





సిరిసిల్ల చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్.. విజయవాడ కనకదుర్గ అమ్మవారికి అగ్గిపెట్టెలో ఇమిడే చీరను బుధవారం సమర్పించారు. ఆలయ ఈవో సీనానాయక్, ఆలయ పూజారుల సమక్షంలో.. అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు చీరను ఆవిష్కరించారు. పట్టుపోగులతో ఐదున్నర మీటర్ల పొడవు, 48 అంగుళాల వెడల్పుతో చీరను నేశారు. విజయ్‌కుమార్ తండ్రి నల్ల పరంధాములు నాలుగు దశాబ్దాల కిందటే.. అగ్గిపెట్టెలో ఇమిడే చీరను చేనేత మగ్గంపై నేశారు. **- సిరిసిల్ల**

పెళ్లిపెద్దగా పెద్దపల్లి కలెక్టర్

అనాథ యువతికి వివాహం జరిపించనున్న కోయ శ్రీహర్ష



బాజాభజంత్రీలు.. మేళతాళాలు.. వేదపండితుల మంత్రోచ్ఛారణలు.. తరలివచ్చే అతిథుల సమక్షంలో ఓ అనాథ యువతి వివాహం జరిపించేందుకు పెద్దపల్లి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. తల్లిదండ్రులను కోల్పోయి రామగుండంలోని తబిత బాలల సంరక్షణ కేంద్రంలో మానస, తన చెల్లితో కలిసి 16 ఏళ్లుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన రాజేశ్‌తో ఇటీవల ఆమెకు వివాహం నిశ్చయమైంది. ఆ యువతికి పెళ్లిపెద్దగా కలెక్టర్ కోయ శ్రీహర్ష వ్యవహరించేందుకు ముందుకు వచ్చారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి వేణుగోపాల్‌రావు, అదనపు కలెక్టర్లు, బాలల పరిరక్షణ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈనెల 21న యువతి వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని వేదికగా ఎంచుకున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి.

- సాక్షి, పెద్దపల్లి

వన్యప్రాణుల రక్షణకు చర్యలు

- కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టుకు రాష్ట్ర సర్కార్ నివేదిక
- ఆహారం, నీరు, భద్రతకు అన్ని ఏర్పాట్లు చేశామన్న సీఎస్
- నేడు విచారణ చేపట్టనున్న అత్యున్నత న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం భూ, అటవీ జంతువుల పరిరక్షణకు తీసుకున్న చర్యలను వివరిస్తూ నివేదిక అందజేసింది. ప్రభుత్వం తరఫున ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు వివరాలు, ఫొటోలతో సహా అత్యున్నత న్యాయస్థానానికి అందజేశారు. '100 ఎకరాల్లో అటవీ నిర్మూలన కారణంగా ప్రభావితమైన వన్యప్రాణులను రక్షించడానికి తీసుకోవలసిన చర్యలు, తక్షణం అమలు చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించాలని రాష్ట్ర వన్యప్రాణి ఉన్నతాధికారులను ఆదేశించాం. ఏప్రిల్ 17, 21, మే 3, 8న రాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్, వన్యప్రాణుల నిర్వహణ నిపుణులతో కంచ గచ్చిబౌలి భూములను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ భూములు 2,374 ఎకరాల్లో విస్తరించి ఉండగా, అందులో 400 ఎకరాలు వివాదాస్పదంగా మారింది. ఇవన్నీ రాళ్లు, చెట్లు, గడ్డితో కూడిన భూములు. అధికారుల తనిఖీల సమయంలో కొన్ని పక్షులు, మచ్చల జింకలు కనిపించాయి. ఈ ప్రాంతంలో చాలా వీధి కుక్కలు తిరుగుతున్నాయని, వాటి కారణంగా వన్యప్రాణులకు ముప్పు కలిగే అవకాశం ఉందని గ్రహించారు. దీనిపై జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ చేసిన అభ్యర్థన మేరకు ఏప్రిల్ 4 నుంచి 30 మధ్య 26 వీధి కుక్కలను పట్టుకోవడానికి బృందాలను నియమించి చర్యలు తీసుకున్నాం'అని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలు అమర్చాం
'భూముల్లో వన్యప్రాణులపై నిఘా, రక్షణ కోసం 24 గంటలూ 3 షిఫ్టుల్లో ఐదుగురితో మూడు బృందాలను నియమించాం. నరికిన, ఎండిన చెట్లతో పాటు పొదలు ఎక్కువగా ఉండటం, వేసవిలో అగ్ని ప్రమాదాలకు అవకాశం ఉండటంతో నివారణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాం. వారికి ప్రత్యేక అగ్నిమాపక యంత్రాలు అందజేశాం. ఏ ప్రాంతంలోనైనా వన్యప్రాణుల కదలికల పర్యవేక్షణ, సంగ్రహణకు 20 కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేశాం. జింకల నీటి అవసరాలకు 12 కృత్రిమ నీటి వనరులను నెలకొల్పాం. భద్రత పర్యవేక్షణలో భాగంగా సీసీ కెమెరాలు అమర్చాం. అడవి జంతువుల భద్రత కోసం వర్సిటీ, టీజీఐఐసీ, పోలీసులు సమన్వయంతో పనిచేస్తున్నారు. తక్షణ పశువైద్య సంరక్షణ, చికిత్స కోసం తెలంగాణ అటవీ శాఖతో కలిపి యాంటీ పోచింగ్ పేరిట స్క్వాడ్‌ను ఏర్పాటు చేశాం. అటవీశాఖ ఆధ్వర్యంలో చెట్ల పెంపకానికి చర్యలు తీసుకోవడంతోపాటు ఇకపై చెట్లను ఎవరూ నరకకుండా జాగ్రత్తలు తీసుకున్నాం'అని నివేదికలో వివరించారు. ఈ కేసుపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది.

సూర్యునిపై భారీ తుపాను

- 10 లక్షల కిలోమీటర్ల వెడల్పాటి మహా తుపాను... 30 సెకన్లలో భూమిని చుట్టేంత వేగంతో విస్తరణ
- పెద్ద సౌర జ్వాలను పసిగట్టిన ఆదిత్య ఎల్–1

న్యూఢిల్లీ: భగభగమండే భానుడి నుంచి అనూహ్య రీతిలో పెను తుపాను పెల్లుబికింది. ఇది ఎంత వేగంగా బయటకు ఎగదన్ని సౌరమండలంలోకి విస్తరించిందంటే సెకన్‌కు ఈ తుపాను వేగం ఏకంగా 1,500 కిలోమీటర్లు. ఇది ఎంతటి వేగమంటే మనం ఒకవేళ ఇదే వేగంతో ప్రయాణిస్తే భూమిని కేవలం అర నిమిషంలో చుట్టేసిరావొచ్చు. 10 లక్షల కిలోమీటర్ల వెడల్పాటి మహా తుపాను పెను భీకరంగా విస్తరించడాన్ని ఇస్రో వారి ప్రతిష్టాత్మక ఆదిత్య ఎల్–1 మిషన్ గుర్తించడం విశేషం. ఇలా సౌర వాతావరణంపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య ఎల్–మిషన్ మరో ఘనత సాధించింది. సూర్యుని ఉపరితలం నుంచి ఎగసిపడిన ఈ భారీ సౌర తుపానుతోపాటు ప్లాస్మా విడుదలను ఆదిత్య ఎల్–1 రికార్డ్ చేసింది. ఆదిత్య ఎల్–1 వ్యోమనౌకలోని అత్యాధునిక రిమోట్ సెన్సింగ్ పరికరం అయిన సోలార్ అల్ట్రా వాయిలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్(సూట్) ఈ ఖగోళ వింత తాలూకు డేటాను నిక్షిప్తంచేసింది. సమీప అతినీలలోహిత కాంతి(ఎన్‌యూవీ) తరంగదైర్ఘ్యంలో ఇలాంటి అంశాన్ని ఆదిత్య ఎల్–1 రికార్డ్ చేయడం ఇదే తొలిసారి. సూర్యుని అయస్కాంత బలాల్లో ఒడిదుడుకుల కారణంగా ఉద్భవించే సౌర తుపానులపై భవిష్యత్ పరిశోధనలకు ఈ డేటా ఎంతగానో ఉపయోగపడనుంది. సౌర ఉపరితలం మీద చిన్న మచ్చలాగా ఏర్పడి తర్వాత నుదుటిపై పెద్ద బొట్టులాగా మారి తర్వాత అదృశ్యమైంది. తొలుత సెకన్‌కు 300 కిలోమీటర్ల వేగంతో ఉపరితలంపై విస్తరించి వెనువెంటనే వేగాన్ని సెకన్‌కు 1,500 కిలోమీటర్లకు పెంచుకుంది. ఇలా ఏర్పడిన మచ్చను మరింత స్పష్టంగా రికార్డ్ చేసేందుకు ఆదిత్య ఎల్–1 ప్రయత్నించినా ధగద్ధాయమానంగా వెలిగిపోతున్న సూర్యుడి వెలుగులో ఆ మచ్చ స్పష్టంగా కనిపించలేదు. ఈ మచ్చను ఒకరకంగా సోలార్ ఫిలమెంట్‌గానూ పిలవచ్చు. అయస్కాంత బలాల్లో వైరుధ్యాల కారణంగా సూర్యుడి ఉపరితల వాతావరణంలోని దట్టమైన ప్లాస్మా కాస్తంత చల్లబడి ఇలా నల్లటి మచ్చలాగా ఏర్పడుతుంది. వాస్తవానికి ఇది కూడా అత్యంత కాంతిని వెదజల్లే తెల్లని మచ్చే. కానీ ఆ వెనుక నుంచి దూసుకొస్తున్న అంతకంటే ప్రకాశవంతమైన కాంతితో పోలిస్తే ఈ మచ్చ చూడ్డానికి కాస్తంత నల్లగా ఉంటుంది. సూర్యుడిపై మచ్చలా గోచరించే ఈ సౌర తుపాన్లను మనం గమనించాల్సిందే. లేదంటే అతి శక్తివంతమైన సౌరతుపాన్ల కారణంగా కృత్రిమ ఉపగ్రహ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదాలను ముందే పసిగట్టలేం. సౌరజ్వాల కారణంగా భూమిపై టెక్నాలజీ, మౌలిక సదుపాయాలపైనా పెను ప్రభావం పడుతుంది. సాధారణంగా సౌర తుపాన్లను ఎక్స్–రే కిరణాలు, అత్యంత అతినీలలోహిత కాంతిలో గమనిస్తారు. కానీ సమీప అతినీలలోహిత కాంతిలో డేటాను రాబట్టడం ద్వారా సూర్యుని ఎరుపు, నారింజ రంగుల కలయికగా కనిపించే క్రోమోస్ఫియర్, దాని కింద ఉండే ఫొటోస్ఫియర్ పొరల రహస్యాలను తెల్సుకునేందుకు వీలు చిక్కుతుంది. అందుకే ప్రత్యేకంగా డిజైన్ చేసిన 11 ఫిల్టర్ల సాయంతో ఆదిత్య ఎల్–1 ఈ డేటాను సంపాదించగల్గింది. సూర్యుని వేర్వేరు పొరల మధ్య శక్తి బదిలీ ఏ స్థాయిలో ఉంటుందనేది ఈ డేటాతో తెలియనుంది. ఆదిత్య ఎల్–1ను ఇస్రో 2023 సెప్టెంబర్‌లో ప్రయోగించింది. 2024 జనవరిలో భూమి, సూర్యుడి సరళరేఖలో భూమి నుంచి 15,00,000 కి.మీ.ల దూరంలో చేరి అక్కడి నుంచి సూర్యశోధన చేస్తోంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
గురువారం। 15-5-2025



వివిధ రూపాల్లో ఉన్న నాగదేవత విగ్రహాలు







గ్రామంలోని వేప చెట్టు కింద వెలిసిన నాగదేవత విగ్రహాలు

సర్పస్థలి... నాగులపేట

ఏడాదికి ఓ విగ్రహం వెలుగు చూస్తున్న వైనం

ఊరంతా నాగదేవత పేరిట పేర్లు ● ఏటా పెద్దఎత్తున నాగులమ్మ జాతర



కోరుట్ల: ఒకటి రెండు కాదు..ఏకంగా 40 నాగదేవత విగ్రహాలు ఒకే చోట ఉన్నాయి. అదీ కాక..ఏడాదికో పురాతన నాగ దేవత విగ్రహం భూమి పొరల నుంచి వెలుపలికి వస్తోంది. ఇదీ కోరుట్ల మండలం నాగులపేట గ్రామంలోని నాగులమ్మ ఆలయం విశిష్టత. ఒకే చోట పదుల సంఖ్యలో నాగయక్షిణి విగ్రహాలు బయల్పడటంతో ఈ గ్రామానికి సర్పస్థలిగా చెప్పుకుంటారు. అంతే కాదు..గ్రామస్తుల ఇలవేల్పుగా నిలుస్తున్న నాగులమ్మ పేరిట ప్రతి ఇంటిలో ఒకరికి 'నాగ'పదం పేరిట నామకరణం చేస్తుండటం మరో విశేషం.

అంతుచిక్కని వైనం..

8వ శతాబ్దిలో వేములవాడ పరిసర ప్రాంతాల్లో పరిపాలన సాగించిన జైన చాళుక్యుల సంప్రదాయ శిల్ప శైలిలో ఉన్న నాగయక్షిణి రూపంలో ఉన్న నాగ దేవత విగ్రహాలు నాగులపేట గ్రామ శివారులో 200 ఏళ్ల క్రితం నాటి వేపచెట్టు కింద వెలిశాయి. దీంతో గ్రామస్తులు ఆ స్థలంలో దేవాలయం నిర్మించి నాగదేవతను ఇలవేల్పుగా తలచి కొలుస్తున్నారు. మొదట్లో వేప చెట్టు కింద ఒకటి..రెండు నాగ దేవత విగ్రహాలు భూమి పొరల నుంచి బయల్పడగా, ఆ తరువాత కాలంలో ప్రతీ ఏడాదికి ఒకటి రెండు చొప్పున నాగులమ్మ విగ్రహాలు పలు రూపాల్లో వరుసగా బయట పడుతుండటం విశేషం. కాలం గడిచిన కొద్దీ వేపచెట్టు వేర్లు నేల కింది భాగంలోకి చొచ్చుకుపోతున్న క్రమంలో భూగర్భంలో ఉన్న నాగులమ్మ విగ్రహాలు వెలికివస్తున్నాయా..? లేదా..ఈ ప్రాంతంలో నాగదేవత విగ్రహాలు చెక్కడానికి సంబంధించిన శిల్ప కుటీరం ఉండేదా..అన్న విషయంలో స్పష్టత లేదు. మొత్తం మీద వరుసగా ఒకే చోట నాగదేవత విగ్రహాలు వివిధ రూపాల్లో బయటపడటం మాత్రం అమ్మవారి మహిమేనని గ్రామస్తులు అంటున్నారు. నాగులమ్మ దేవాలయం ఉన్న వేపచెట్టు కింద మాత్రమే కాదు.. గ్రామంలోని పలుచోట్ల నాగులమ్మ విగ్రహాలు వెలుగులోకి రావడం గమనార్హం. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో కనిపించిన నాగదేవత విగ్రహాలను నాగులమ్మ దేవాలయ స్థలంలోకి చేర్చి పూజాధికాలు నిర్వహిస్తుంటారు. స్వయంభూగా వెలిసిన నాగులమ్మను ఇంటి దైవంగా భావిస్తున్న గ్రామస్తులు ప్రతీ ఏటా పెద్దఎత్తున నాగులమ్మ జాతర నిర్వహిస్తుంటారు. ఈ జాతరకు పరిసర ప్రాంతాల పట్టణాలు, గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు. అన్నదానంలో పాల్గొని నాగులమ్మ ప్రసాదాన్ని పవిత్రంగా స్వీకరించడం విశేషం.

ఏడాదికో విగ్రహం



నాగులమ్మ ఒక్క నాగులపేట గ్రామంలోనే కాదు..ఈ ప్రాంతాల్లో చాలా గ్రామాల వారికి ఇంటి దేవత. కోరిన కోర్కెలు తీర్చే నాగులమ్మ ఈ ప్రాంతంలో కొలువుదీరడం భక్తులకు వరంగానే భావిస్తాం. నాగులమ్మ దేవాలయ ప్రత్యేకత ఏమిటంటే ప్రతీ ఏడాది ఒకటి రెండు నాగదేవత, యక్షిణిరూపాల్లో ఉన్న విగ్రహాలు బయటకు రావడం. ఇప్పటివరకు 40 వరకు నాగదేవత విగ్రహాలు వెలిశాయి. ఇంకా కొన్ని విగ్రహాల కొనలు భూగర్భం నుంచి పైకి కనిపిస్తున్నాయి. కాలక్రమేణా అవన్నీ బయటకు వస్తాయి. ప్రతీ విగ్రహం స్వయంభూ కావడం విశేషం.. అమ్మవారి మహాత్మ్యంగానే భావిస్తాం.

– బ్రహ్మన్నగారి శంకర్, పూజారి, కోరుట్ల

నాగ పేర్లు పెట్టుకోవడం ఆనవాయితీ



మా ఊరిలో వెలిసిన నాగులమ్మ దేవత పేరిట ప్రతిఇంట్లో ఒకరిద్దరి పేర్లు పెట్టుకోవడం ఆనవాయితీ. మా ఇలవేల్పు నాగులమ్మ పేరు పెట్టుకోవడంతో మా అందరికి అమ్మవారి దయతో మేలు జరుగుతుందన్న నమ్మకం . ప్రతి ఒక్కరూ పవిత్రంగా నాగులమ్మను కొలిచి ఆశీస్సులు పొందడం ఇక్కడ సంప్రదాయం.

– నాగరాజు, నాగులపేట

'నాగ'..పేరిట పేర్లు..

ఇదిలా ఉండగా నాగదేవతను ఇలవేల్పుగా భావించే గ్రామస్తులు తమ ఇంటిలో ఒకరి పేరును 'నాగ'పదంతో కలిపి పెట్టుకోవడం గమనార్హం. ఈ క్రమంలోనే గ్రామంలో నాగరాజు, నాగరాణి, నాగసాయి, అనంత నాగ, నాగేశ్, నాగేశ్వర్ వంటి పేర్లు ఎక్కువగా ఉంటాయి. నాగులమ్మ దేవత పేరిట పిల్లల పేర్లు ఉంటే తమ కుటుంబానికి ఎల్లవేళలా నాగమ్మ ఆశీస్సులు ఉంటాయని గ్రామస్తుల నమ్మకం. మొత్తం మీద కోరుట్ల మండలం నాగులపేట నాగులమ్మ దేవత పేరిట తన ప్రత్యేకతను చాటుకోవడం గమనార్హం.



ఓరుగల్లు వేదికగా సుందరీమణులు హొయలొలికించారు...చీరకట్టుతో సంప్రదాయాన్ని చాటారు. భక్తిభావంతో ఉప్పొంగిపోయారు. రామప్ప దేవాలయ శిల్పకళను చూసి అబ్బురపడిపోయారు. చారిత్రక వేయిస్తంభాల గుడిలో అభిషేకాలు చేసి ఆధ్యాత్మికంగా పరవశించిపోయారు.

స్మార్ట్‌గా ఆ'దరువు'!

డప్పు కళకు ఆధునిక హంగులు

సరికొత్త స్టెప్పులతో ప్రదర్శనలు

మహిళలకు శిక్షణతో ఉపాధి

వృత్తిని కాపాడుకుంటున్న కళాకారులు



డప్పు కళాకారుల ప్రదర్శన

జూలపల్లి(పెద్దపల్లి): ప్రతీ రంగంలో స్మార్ట్ హంగులు వస్తున్నాయి. ఏఐ సాయంతో ఆధునిక సాంకేతికత రాజ్యమేలుతోంది. ఈ తరుణంలో గ్రామీణ చేతి వృత్తులు, కళలను కాపాడటంలో తమవంతు ప్రయత్నం కొనసాగిస్తున్నారు పెద్దపల్లి జిల్లా జూలపల్లి దళిత డప్పు కళాకారులు. తమ కులవృత్తిలో భాగమైన డప్పు కళను బతికించేందుకు ఆధునిక హంగులు జోడిస్తున్నారు. ఆకట్టుకునే ప్రదర్శనలిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. సరికొత్త స్టెప్పులతో డప్పు కళకు జీవం పోస్తున్నారు.

డప్పు కళాకారిణులుగా..

డప్పు కళను ఒకప్పుడు పురుషులే నేర్చుకునేవారు. ఊళ్లలో పోచమ్మ బోనాలు, రేణుకాఎల్లమ్మ పట్నాల సందర్భంగా డప్పు కళ ప్రదర్శించేవారు. మృతుల అంత్యక్రియల్లోనూ ఈ కళాకారుల పాత్ర అత్యంత కీలకం. ఈ క్రమంలోనే డప్పు కళకు ఆధునిక హంగులు జోడిస్తూ.. డప్పు కళాకారుడు మల్యాల కొమురయ్య మహిళలకు కళ నేర్పిస్తున్నారు. సుమారు 10 – 20 మంది వరకు కాళ్లకు గజ్జెలు కట్టి.. రెండు లైన్లలో ముందుకు సాగుతూ.. స్టెప్పులు వేస్తూ, డప్పు కొడుతూ.. ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం రాజకీయ పార్టీల బహిరంగ సభలు, ఎన్నికల సభలు, వివిధ ఉత్సవాలు, వీఐపీల రాక సందర్భంగా వారికి స్వాగతం పలికేందుకు డప్పు కళాకారుల ప్రదర్శనలు తప్పనిసరిగా మారుతున్నాయి.

ఉపాధికి బాట..

గ్రామాల్లోని డప్పు కళ ప్రస్తుతం పట్టణాలు, నగరాలకూ చేరింది. ప్రతీ కార్యక్రమానికి డప్పు కళాకారులు తమ విన్యాసాలు, ప్రదర్శనలు ఇచ్చి ప్రజల దృష్టి ఆకర్షిస్తున్నారు. తద్వారా డప్పు కళకు డిమాండ్ పెరిగి కళాకారులు ఉపాధి పొందుతున్నారు. ఒక కార్యక్రమంలో ప్రదర్శనలిస్తే రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు బిల్లు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం డప్పు కళకు ప్రోత్సాహం అందిస్తే.. మరింత ఆధునికత జోడించి కళను ఉన్నత స్థితికి చేర్చుతామంటున్నారు కళాకారులు.



ప్రభుత్వం ప్రోత్సహించాలి

గ్రామీణ డప్పు కళకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి. ప్రతీ ప్రభుత్వ కార్యక్రమంలో డప్పు కళాకారులకు అవకాశం ఇవ్వాలి. గుర్తింపు కార్డులు జారీ చేయాలి. యాభయ్యేళ్ల వయసు దాటిన కళాకారులకు పింఛను మంజూరు చేయాలి.

– మల్యాల కొమురయ్య, డప్పు కళాకారుడు, శిక్షకుడు, జూలపల్లి



ఉపాధి దొరుకుతోంది

ఎప్పటినుంచో వారసత్వంగా వస్తున్న డప్పు కళలో.. కొత్తరకంగా స్టెప్పులు వేస్తూ.. డప్పు కొట్టడంతో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రాజకీయ సభలు, ఉత్సవాలు ఉన్నప్పుడు కొంత వరకు ఉపాధి దొరుకుతోంది.

– సుశీల, జూలపల్లి



ప్రశంసలు వస్తున్నాయి

డప్పు కళను మేమూ నేర్చుకున్నాం. బహిరంగ సభలు, ఉత్సవాల్లో ప్రదర్శనలిస్తున్నాం. మా ప్రదర్శనలకు ప్రజల నుంచి ప్రశంసలు వస్తున్నాయి. కళను కాపాడుతున్నందుకు తృప్తిగా, ఉత్సాహంగా ఉంది.

– ఎస్.పద్మ, జూలపల్లి













ఆపద వస్తే ఇలా చేయండి....

గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై బుధవారం ఉద్యోగులకు అవగాహన కల్పించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య, అటవీ, మునిసిపాలిటీ శాఖల అధికారులు మాక్ డ్రిల్ చేపట్టారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



బతుకు పోరు..

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో అన్ని వర్గాల ప్రజలు తమ పనులను ముందే చక్కబెట్టుకుని ఇళ్లకు వెళ్లిపోతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు మాత్రం మండుటెండలో ఇలా తమ జీవనపోరాటాన్ని సాగిస్తున్నారు. నెల్లూరు మినీ బైపాస్‌లో ఆకర్షణీయమైన టోపీలు, విసనకర్రలను వృద్ధుడు విక్రయిస్తున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



కిక్‌తో పడగొడతా!

వేసవి సెలవుల నేపథ్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని వివిధ క్రీడా మైదానాల్లో తైక్వాండో శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ తీసుకోవడానికి యువత ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. తైక్వాండో శిక్షణలో భాగంగా కస్పా హైస్కూల్‌లో ఎయిర్‌లో యువకుడు కిక్ కొడుతుండగా తీసిన చిత్రమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ఏపీఐఐసీకి చేసిన భూకేటాయింపు నిలిపివేత

సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లాలోని రామశింగవరంలో ఏపీఐఐసీకి 173.60 ఎకరాల భూమిని కేటాయిస్తూ 2017లో జారీ చేసిన జీఓను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ భూమి అటవీ శాఖ నియంత్రణలోని పంచాయతీ అటవీ భూమిగా గుర్తించిన నేపథ్యంలో అటవీ (సంరక్షణ) చట్టం, 1980 ప్రకారం కేంద్ర ప్రభుత్వ అనుమతి వచ్చే వరకు కేటాయింపును నిలిపివేయాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులిచ్చారు. జిల్లా కలెక్టర్ నివేదిక ప్రకారం 2017లోనే ఏపీఐఐసీకి భూమి అప్పగించినా అటవీ శాఖ దాన్ని తమ ఆధీనంలో ఉన్నట్లు తెలిపి అభ్యంతరం వ్యక్తం చేసింది. రెవెన్యూ రికార్డుల్లో ఈ భూమి ×గయాలు౯గా నమోదై ఉండగా, అటవీ శాఖ దీన్ని 1993లో తమకు రిజర్వ్ భూములుగా ఇచ్చినట్లు తెలిపింది. దీంతో ఈ భూమిలో ఏపీఐఐసీ ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండా, అటవీ చట్టం కింద అనుమతులు పొందేవరకూ ఆగాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖ నెల్లూరు డీఐజీగా మునిశంకరయ్య

సాక్షి, అమరావతి: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎం.మునిశంకరయ్యకు డీఐజీగా పదోన్నతి ఇచ్చి నెల్లూరు డీఐజీగా నియమించారు. డీఐజీ పదోన్నతుల ప్యానల్ జాబితాలో ఉన్న ఆయనకు ఇచ్చిన ఈ పదోన్నతి కేవలం తాత్కాలికమని, ఆయన్ను ఎప్పుడైనా మళ్లీ జిల్లా రిజిస్ట్రార్‌గా రివర్ట్ చేయవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ పదోన్నతి కోర్టు తీర్పులకు లోబడి ఉంటుందని రెవెన్యూ శాఖ బుధవారం జీవో జారీ చేసింది.

ప్రజలను మభ్యపెడుతున్న మోదీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): అమెరికా ఆదేశాలతో కాల్పుల విరమణ జరిగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా చెప్పడంతో మనదేశ ప్రతిష్ట పూర్తిగా దిగజారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు దుయ్యబట్టారు. నెల్లూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉగ్రవాదుల్ని తుదముట్టించే వరకు ఆపరేషన్ సిందూర్ ఆగదని దేశ ప్రజలను ప్రధాని మోదీ మభ్య పెడతున్నారని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ సక్సెస్ అయిందంటూ దేశ వ్యాప్తంగా తిరంగా ర్యాలీ చేపట్టాలని బీజేపీ నిర్ణయించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తీవ్రవాదుల్ని మట్టుబెట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందిన మోదీ దాన్ని కప్పిపుచ్చుకునేందుకు తిరంగా ర్యాలీ అనే మరో కొత్త నాటకానికి తెర తీశారని ఆరోపించారు.

కూటమికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి కల్చరల్: కూటమికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు, ప్రగతిశీల శక్తులతో కలిసి రాజకీయ ప్రత్యామ్నాయం వేదికను సిద్ధం చేయనున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ప్రకటించారు. బుధవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల నాటికి ప్రత్యేక వేదికపై నుంచి ఉద్యమించనున్నట్లు తెలిపారు. ఉగ్రమూకలను ప్రోత్సహిస్తున్న పాక్‌తో చర్చలకు సిద్ధమైన కేంద్రం నక్సల్స్‌తో చర్చలకు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

ఎంబీయూలో ఘనంగా అచీవర్స్ డే



చంద్రగిరి: ఉద్యోగం అన్నది మీ జీవిత లక్ష్యానికి కేవలం ఆరంభం మాత్రమే అని, మీ ఉన్నతికి పడిన తొలిమెట్టుగా భావించి మరింత ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఓ మార్గం మాత్రమేనని మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) ప్రో చాన్స్‌లర్ మంచు విష్ణు అన్నారు. తిరుపతికి సమీపంలోని ఎంబీయూలో బుధవారం అచీవర్స్ డే–2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంబీయూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంబీయూ ప్రముఖులతో పాటు ఈ విద్యాసంవత్సరంలో ప్లేస్‌మెంట్లు సాధించిన సుమారు 1500 మంది విద్యార్థులు హాజరయ్యారు. విష్ణు మాట్లాడుతూ.. ఎంబీయూలో విద్యను అభ్యసిస్తూ 1500మందికి పైగా విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ ద్వారా ఉద్యోగాలను పొందడం ఆనందంగా ఉందన్నారు. కాగా, అమెరికాలోని పెన్ స్టేట్ వర్సిటీతో మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ (ఎంఓఏ)పై ఎంబీయూ సంతకాలు చేసుకోనుందని ఎంబీయూ నిర్వాహకులు తెలిపారు.

ఆడనే చంపేస్తున్నారు!

ఒక బిడ్డకు జన్మనివ్వాలన్నది ప్రతి స్త్రీ కల. ఆ కలను సాకారం చేసుకునే క్రమంలో సంతానలేమితో బాధపడే వారి వేదన అంతా ఇంతా కాదు. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు మాత్రం కడుపులో ఉన్నది ఆడబిడ్డ అని తెలియగానే చేతులారా అబార్షన్ చేయించుకుంటున్నారు. ఆడ బిడ్డ పుడితే అత్తింటి వేధింపుల భయంతోనే కొందరు కడుపులోనే పిండాన్ని నిర్దాక్షిణ్యంగా తొలగించుకుంటున్నారు. ఈ కారణంగా సమాజంలో స్త్రీ, పురుషుల నిష్పత్తిలో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది. ఆడపిల్లలు లభించక చాలా మంది పురుషులకు వివాహాలు కాని పరిస్థితి నెలకొంది.




యథేచ్ఛగా భ్రూణ హత్యలు

- ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్
- ప్రోత్సహిస్తున్న వైద్యులు, పలు ప్రైవేట్ ఆసుపత్రులు
- స్కానింగ్ సెంటర్లపై నిఘా శూన్యం
- తూతూ మంత్రంగా తనిఖీలు

కర్నూలు(హాస్పిటల్): 'భ్రూణ హత్యలు వద్దు.. ఆడపిల్లలను బతకనిద్దాం.. లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు'.. అంటూ అధికారులు పలు వేదికలపై ఈ అంశంపై అవగాహన కల్పిస్తున్నా ఇంకా కొందరిలో మార్పు రావడం లేదు. కర్నూలు జిల్లాలో భ్రూణ హత్యలు జరుగుతూనే ఉన్నాయి. వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం జిల్లాలో 240 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇంకా కొత్తగా దరఖాస్తు చేసుకున్నవి 8, రెన్యువల్ కోసం వచ్చినవి మరో 15 దాకా ఉన్నాయి. వీటికి జిల్లా కమిటీ పరిశీలించి అనుమతులు జారీ చేయాల్సి ఉంది. అధికారికంగా ఉన్న స్కానింగ్ కేంద్రాలే గాక అనధికారికంగా జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల అనుమతులు లేకుండా స్కానింగ్ మిషన్లు ఏర్పాటు చేసుకుని స్కానింగ్ చేస్తున్నట్లు సమాచారం. వీటిలో కర్నూలుతో పాటు కోడుమూరు, గూడూరు, ఎమ్మిగనూరు, ఆదోనిలోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లలో కొందరు వైద్యులు స్కానింగ్ ద్వారా లింగనిర్ధారణ చేస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కడుపులో ఉన్నది ఆడబిడ్డ అని తెలిస్తే చాలు నిర్దాక్షిణ్యంగా అబార్షన్(భ్రూణహత్య)లు చేయించుకుంటున్నారు. ఇందుకు సాక్ష్యంగా అప్పుడప్పుడూ కర్నూలు నగరంలోని కొత్తబస్టాండ్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిసర ప్రాంతాలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని శివారు ప్రాంతాల్లో మృతశిశువులు వెలుగు చూస్తుంటాయి. ఇలా లభించిన వాటి గురించి ఏ ఒక్క అధికారి కూడా విచారణ చేసి చర్యలు తీసుకున్న దాఖలాలు ఇప్పటి వరకు జిల్లాలో నమోదు కాలేదు. అంతెందుకు గత పదేళ్లలో ఒక్క స్కానింగ్ కేంద్రం, వైద్యులపై కూడా స్కానింగ్ అక్రమాల గురించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ఏప్రిల్ నెలలో జిల్లాలో వైద్యుల బృందం 40 స్కానింగ్ కేంద్రాల పరిశీలనకు వెళ్లింది. అన్ని స్కానింగ్ కేంద్రాల్లో రికార్డులు, రిపోర్టులు, మిషన్లు, వైద్యుల వివరాలు, గర్భిణీల వివరాలు అన్నీ సక్రమంగా ఉన్నాయని అధికారులకు రిపోర్టు ఇవ్వడం గమనార్హం.

ఆర్‌ఎంపీలకు నజరానాలు



జిల్లాలో డోన్, కృష్ణగిరి, ఆదోని, పత్తికొండ, కోసిగి, హొళగుంద, పెద్దతుంబళం, చిన్నతుంబళం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కౌతాళం వంటి వెనుకబడిన ప్రాంతాలే గాక తెలంగాణా, కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి సైతం స్కానింగ్ కోసం గర్భిణులు కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరుకు వస్తుంటారు. ఇందులో కొందరికి అప్పటికే ఆడపిల్లలు జన్మించి ఉండటంతో మళ్లీ ఆడబిడ్డ జన్మిస్తే కుటుంబంలో పెద్దలు ఒప్పుకోరని భావించి స్కానింగ్‌లో ఆడబిడ్డ అని తేలితే అబార్షన్ చేయించుకోవడానికి సిద్ధపడి వస్తారు. ఈ మేరకు కర్నూలులోని కొత్తబస్టాండ్, గాయత్రి ఎస్టేట్, బుధవారపేట, ఎన్‌ఆర్ పేట, కోడుమూరు, గూడూరు, ఎమ్మిగనూరు, ఆదోనిలోని కొన్ని ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలకు గర్భిణులను తీసుకొస్తారు. లింగ నిర్ధారణతో పాటు అవసరమైతే భ్రూణహత్య(అబార్షన్) చేయడానికి కూడా వెనుకాడటం లేదు. ఈ తతంగంలో మొత్తం సూత్రధారులు ఎక్కువగా ఆర్‌ఎంపీలే ఉంటున్నారు. లింగనిర్ధారణకు రూ.4వేల నుంచి రూ.5వేలు, అబార్షన్‌కు రూ.15వేల నుంచి రూ.20వేల దాకా తీసుకుంటున్నారు. ఇందులో ఆర్‌ఎంపీలకు 20 నుంచి 40 శాతం వరకు కమీషన్ ముట్టజెబుతున్నారు.



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని స్కానింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ

లింగనిర్ధారణ చేస్తే జైలుకే...కానీ...!

భ్రూణహత్యల నివారణకు కేంద్ర ప్రభుత్వం 1994లో పీసీ పీఎన్‌డీటీ యాక్ట్‌ను తీసుకొచ్చింది. దీని ప్రకారం లింగనిర్ధారణ చేసినా, గర్భస్రావాలు చేయించినా ఇరువర్గాలను శిక్షించే వీలుంది. మొదటిసారి తప్పు చేస్తే మూడేళ్లు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా, రెండోసారి తప్పు చేస్తే ఐదేళ్లు జైలు శిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తారు. అయితే ఇప్పటి వరకు ఒక్కరిపై కూడా కేసు నమోదు చేసిన దాఖలాలు లేవు. ఈ చట్టం కింద ఏ ఒక్కరికీ శిక్ష పడదు. ఈ చట్టం ఒకటి ఉందని రోగులకు, గర్భిణీలకు తెలిసేటట్లు ఆయా స్కానింగ్ కేంద్రాల్లో పోస్టర్లు మాత్రం ప్రదర్శించి ఉంటాయి. కానీ కొన్నిచోట్ల అదే ప్రాంతాల్లో లింగనిర్ధారణ జరుగుతుంది. గతంలో 10 ఏళ్ల క్రితం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కర్నూలు, కోడుమూరు, గూడూరు ప్రాంతాల్లో స్కానింగ్ సెంటర్లపై దాడులు నిర్వహించి స్కానింగ్ మిషన్లను సీజ్ చేశారు. అయితే సీజ్ చేసిన మిషన్ల పక్కనే మరో మిషన్‌ను తీసుకొచ్చి లింగనిర్ధారణ చేసిన వైద్యశిఖామణులు ఉన్నారు. ఆయా ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు రాజకీయ నాయకుల పలుకుబడి ఉండటంతో ఇలా సీజ్ చేస్తే అలా తెరిపించుకునే స్థాయిలో ఉన్నారు.

తిరిగి దాడులు, తనిఖీలు నిర్వహిస్తాం



జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలను తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నాము. ఈ మేరకు ఐదుగురు వైద్యులతో బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందాలు గత ఏప్రిల్‌లో 40 స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అయితే ఆయా కేంద్రాలను తిరిగి తనిఖీ చేసి వాస్తవ పరిస్థితులను నిగ్గు తేలుస్తాం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారి పేరు, వివరాలు బహిర్గతం గాకుండా చేసి, సదరు స్కానింగ్ కేంద్రంపై దాడులు నిర్వహిస్తాం. రెగ్యులర్‌గా ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై దాడులు ముమ్మరం చేస్తాం. లింగనిర్ధారణ, అబార్షన్లు చేసే ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

మూగజీవులకు 'ఫ్రెండ్స్'

పశువులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న వెటర్నరీ వైద్యులు

- జీవాలకు ఎక్కడ కష్టమొస్తే అక్కడకు వెళ్లి చికిత్స
- 15 ఏళ్లుగా సేవలందిస్తున్న ఫ్రెండ్లీ వెట్ బృందం
- ఫ్రెండ్లీ వెట్ పేరిట యూట్యూబ్ చానల్ ద్వారా సేవలు
- తాజాగా 'ఫ్రెండ్లీ వెట్ వాట్సాప్ లైవ్‌స్టాక్ మార్కెట్' ఏర్పాటు
- 7207956409 నంబర్‌కు మెసేజ్ పెడితే చాలు..
- ఉత్తమ పశుపోషణ, వైద్య, మార్కెటింగ్ సేవలు పొందే వెసులుబాటు

సాక్షి, అమరావతి: 'సొంత లాభం కొంత మానుకొని పరుల కోసం పాటుపడవోయ్' అన్న గురజాడ మాటలను కొందరు పశు వైద్యులు పుణికిపుచ్చుకున్నారు. మూగజీవాల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచితంగా సేవలు అందిస్తున్నారు. స్వల్ప చికిత్స చేస్తే కోలుకునే పశువులను సైతం అవగాహన, ఆర్థిక స్థోమత లేక అమ్ముకుంటున్న పశుపోషకులకు అండగా నిలవాలన్న సంకల్పంతో పల్నాడు జిల్లాకు చెందిన పశు వైద్యుడు డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి 2017లో 'ఫ్రెండ్లీ వెట్' గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. తన మిత్రులు మరో పది మంది ఆయనతో కలిశారు. గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్ల వంటి వాటికి వైద్యసేవలు అందించడంలో నిష్ణాతులైన వీరంతా నాటి నుంచి ఉచితంగా సేవలు అందిస్తున్నారు. ప్రమాదాల్లో కొమ్ములు, కాళ్లు విరిగి విలవిల్లాడుతున్న జీవాలకే కాదు,



ప్లాస్టిక్ తిని ప్రాణాపాయ స్థితిలో ఉన్న అనాథ జీవాలకు వైద్యం చేస్తూ వాటికి కొత్త జీవితాలను ప్రసాదిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో 2021లో 'ఫ్రెండ్లీ వెట్' పేరిట ప్రారంభించిన యూట్యూబ్ చానెల్ ద్వారా పశుపోషకులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. అర్ధరాత్రి అయినా ఫోన్ చేస్తే వెంటనే వెళ్లి సొంత ఖర్చులతో ఆపదలో ఉన్న జీవాలకు వైద్యం చేస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో నేరుగా వెళ్లి సేవలు అందిస్తున్నారు. ఏపీలో మిగిలిన జిల్లాలు, తెలంగాణతోపాటు అమెరికా, లండన్, టర్కీ, ఉక్రెయిన్, పాకిస్తాన్ తదితర దేశాల నుంచి కూడా పశుపోషకులు వీరికి ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు.

కొత్తగా.. ఫ్రెండ్లీ వెట్ వాట్సాప్ లైవ్‌స్టాక్ మార్కెట్ యాప్

ఫ్రెండ్లీ వెట్ టీమ్ దేశంలోనే తొలిసారిగా ఉచితంగా పశు పోషకులకు సేవలు అందించేందుకు 'ఫ్రెండ్లీ వెట్ వాట్సాప్ లైవ్‌స్టాక్ మార్కెట్' పేరిట యాప్‌ను అభివృద్ధి చేసింది. 7207956409 అనే నంబర్‌కి హాయ్.. అని ఒక్క మెసేజ్ పెడితే చాలు.. ఎలాంటి పశు సంబంధిత సేవలైనా క్షణాల్లో అందించేలా ఈ యాప్‌ను డిజైన్ చేశారు. పశువులను కొనడం, అమ్మడం, పశుగ్రాసాలు, దాణాలు, అందులో వాడే పదార్థాలు కొనడం, గొర్రెలు, మేకలు, పందుల పెంపకం, డెయిరీలు, కోళ్ల ఫారాలు లీజుకు ఇచ్చేవారు, విక్రయించేవారి వివరాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. వ్యవసాయ కార్మికుల(లేబర్) లభ్యత, పశు పోషణ, వ్యాధుల నివారణ, పశువుల పెంపకం తదితర అంశాలపై సలహాలు, ప్రభుత్వ పథకాల సమాచారం, సబ్సిడీ వివరాలు, విజయగాథలు, స్ఫూర్తి, స్వయం ఉపాధి, రైతు శిక్షణ, వర్క్‌షాప్స్, పరికరాల అమ్మకం, అద్దె వంటి సేవలు కూడా ఈ యాప్ ద్వారా అందిస్తున్నారు. గ్రామీణ రైతులకు సాంకేతికతను సులభతరం చేసి, వారిపై ఆర్థిక భారం లేకుండా, మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా ఈ యాప్‌ను అభివృద్ధి చేసినట్టు సాయి మహేష్‌రెడ్డి తెలిపారు.

మంచి ధరకు అమ్ముకోగలిగాను..



ఫ్రెండ్లీ వెట్ వాట్సాప్ మార్కెట్ ద్వారా నా గొర్రెల అమ్మకం కోసం పోస్ట్ చేశాను. కొన్ని రోజుల్లోనే మంచి ధరకు అమ్మగలిగాను. రైతులకి ఇది నిజంగా చాలా ఉపయోగపడుతుంది.

– యాల్ల చెంచమ్మ, పల్నాడు జిల్లా

స్వయం ఉపాధి పొందాను



ఒకప్పుడు గుంటూరులో కూలీ పనులు చేసుకునేవాడిని. ఇప్పుడు గొర్రెల పెంపకం చేపట్టి నెలకు రూ.30,000 వరకు సంపాదిస్తున్నాను.ఈ మార్పుకు ఫ్రెండ్లీ వెట్ గైడెన్స్ చాలా ఉపయోగపడింది.

– రామయ్య, గుంటూరు జిల్లా

2.50 లక్షల జీవాలకు సేవలందించాం



'ప్రతి మూగ జీవి బాధను తీర్చే వైద్యం ఉంది' అని రైతుకు చెప్పాలన్న ఉద్దేశంతోనే ఈ ఫ్రెండ్లీ వెట్‌ను ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు 2.50 లక్షల జీవాలకు ఉచితంగా వైద్యాన్ని అందించాం. ప్రభుత్వ సేవలతోపాటు వ్యక్తిగతంగా మరింత శ్రద్ధతో సేవలను అందించడమే ఫ్రెండ్లీ వెట్ గ్రూప్ ప్రత్యేకత.

సాయిమహేష్‌రెడ్డి, ఫ్రెండ్లీ వెట్ గ్రూప్ వ్యవస్థాపకుడు

సూర్యునిపై భారీ తుపాను

- 10 లక్షల కిలోమీటర్ల వెడల్పాటి మహా తుపాను
- 30 సెకన్లలో భూమిని చుట్టేంత వేగంతో విస్తరణ
- పెద్ద సౌర జ్వాలను పసిగట్టిన ఆదిత్య ఎల్–1



సూళ్లూరుపేట/న్యూఢిల్లీ: భగభగమండే భానుడి నుంచి అనూహ్యరీతిలో పెను సౌర తుపాను పెల్లుబికింది. ఇది ఎంత వేగంగా బయటకు ఎగదన్ని సౌరమండలంలోకి విస్తరించిందంటే సెకన్‌కు ఈ తుపాను వేగం ఏకంగా 1,500 కిలోమీటర్లు. ఇది ఎంతటి వేగమంటే మనం ఒకవేళ ఇదే వేగంతో ప్రయాణిస్తే భూమిని కేవలం అర నిమిషంలో చుట్టేసిరావొచ్చు. 10 లక్షల కిలోమీటర్ల వెడల్పాటి మహా తుపాను పెను భీకరంగా విస్తరించడాన్ని ఇస్రో వారి ప్రతిష్టాత్మక ఆదిత్య ఎల్–1 మిషన్ గుర్తించడం విశేషం. ఇలా సౌర వాతావరణంపై అధ్యయనం కోసం ప్రయోగించిన ఆదిత్య ఎల్–మిషన్ మరో ఘనత సాధించింది. సూర్యుని ఉపరితలం నుంచి ఎగసిపడిన ఈ భారీ సౌర తుపానుతోపాటు ప్లాస్మా విడుదలను ఆదిత్య ఎల్–1 రికార్డ్ చేసింది. ఆదిత్య ఎల్–1 వ్యోమనౌకలోని అత్యాధునిక రిమోట్ సెన్సింగ్ పరికరం అయిన సోలార్ అల్ట్రా వాయిలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్(సూట్) ఈ ఖగోళ వింత తాలూకు డేటాను నిక్షిప్తంచేసింది. సమీప అతి నీలలోహిత కాంతి(ఎన్‌యూవీ) తరంగదైర్ఘ్యంలో ఇలాంటి అంశాన్ని ఆదిత్య ఎల్–1 రికార్డ్ చేయడం ఇదే తొలిసారి. సూర్యుని అయస్కాంత బలాల్లో ఒడిదుడుకుల కారణంగా ఉద్భవించే సౌర తుపానులపై భవిష్యత్ పరిశోధనలకు ఈ డేటా ఎంతగానో ఉపయోగపడనుంది. సౌర ఉపరితలం మీద చిన్న మచ్చలాగా ఏర్పడి తర్వాత నుదుటిపై పెద్ద బొట్టులాగా మారి తర్వాత అదృశ్యమైంది. తొలుత సెకన్‌కు 300 కిలోమీటర్ల వేగంతో ఉపరితలంపై విస్తరించి వెనువెంటనే వేగాన్ని సెకన్‌కు 1,500 కిలోమీటర్లకు పెంచుకుంది. ఇలా ఏర్పడిన మచ్చను మరింత స్పష్టంగా రికార్డ్ చేసేందుకు ఆదిత్య ఎల్–1 ప్రయత్నించినా ధగద్ధాయమానంగా వెలిగిపోతున్న సూర్యుడి వెలుగులో ఆ మచ్చ స్పష్టంగా కనిపించలేదు. ఈ మచ్చను ఒకరకంగా సోలార్ ఫిలమెంట్‌గానూ పిలవచ్చు. అయస్కాంత బలాల్లో వైరుధ్యాల కారణంగా సూర్యుడి ఉపరితల వాతావరణంలోని దట్టమైన ప్లాస్మా కాస్తంత చల్లబడి ఇలా నల్లటి మచ్చలాగా ఏర్పడుతుంది. వాస్తవానికి ఇది కూడా అత్యంత కాంతిని వెదజల్లే తెల్లని మచ్చే. కానీ ఆ వెనుక నుంచి దూసుకొస్తున్న అంతకంటే ప్రకాశవంతమైన కాంతితో పోలిస్తే ఈ మచ్చ చూడ్డానికి కాస్తంత నల్లగా ఉంటుంది. సూర్యుడిపై మచ్చలా గోచరించే ఈ సౌర తుపాన్లను మనం గమనించాల్సిందే. లేదంటే అతి శక్తివంతమైన సౌరతుపాన్ల కారణంగా కృత్రిమ ఉపగ్రహ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదాలను ముందే పసిగట్టలేం. సౌరజ్వాల కారణంగా భూమిపై టెక్నాలజీ, మౌలిక సదుపాయాలపైనా పెను ప్రభావం పడుతుంది. సాధారణంగా సౌర తుపాన్లను ఎక్స్–రే కిరణాలు, అత్యంత అతినీలలోహిత కాంతిలో గమనిస్తారు. కానీ సమీప అతి నీలలోహిత కాంతిలో డేటాను రాబట్టడం ద్వారా సూర్యుని ఎరుపు, నారింజ రంగుల కలయికగా కనిపించే క్రోమోస్ఫియర్, దాని కింద ఉండే ఫొటోస్ఫియర్ పొరల రహస్యాలను తెల్సుకునేందుకు వీలు చిక్కుతుంది. అందుకే ప్రత్యేకంగా డిజైన్ చేసిన 11 ఫిల్టర్ల సాయంతో ఆదిత్య ఎల్–1 ఈ డేటాను సంపాదించగల్గింది. సూర్యుని వేర్వేరు పొరల మధ్య శక్తి బదిలీ ఏ స్థాయిలో ఉంటుందనేది ఈ డేటాతో తెలియనుంది. ఆదిత్య ఎల్–1ను ఇస్రో 2023 సెప్టెంబర్‌లో ప్రయోగించింది. 2024 జనవరిలో భూమి, సూర్యుడి సరళరేఖలో భూమి నుంచి 15,00,000 కి.మీ.ల దూరంలో చేరి అక్కడి నుంచి సూర్యశోధన చేస్తోంది.



పాప ప్రక్షాళనం

చిత్రగుప్త ఆలయం

> పురాణ పరిచయం పెద్దగా లేని ఈ యువతరంలో కూడా చలనచిత్రాల పుణ్యమా అని బాగా తెలిసిన పౌరాణిక పాత్ర చిత్రగుప్తుడు. యముడికి ధర్మనిర్వహణలో సహాయకుడిగా, భూలోకవాసుల మరణానంతరం వారి పాప పుణ్యాలకు పద్దులు రాసే వ్యక్తిగా చిత్రగుప్తుడు అందరికీ తెలుసు. ఈ నేపథ్యంలో గరుడ పురాణంలోని చిత్రగుప్తుడి జననంతో పాటు ఆయన ఆలయాల గురించిన కథనం మీ కోసం.



ఈ విశ్వం ప్రారంభం తర్వాత భూలోకంలోని జీవులు చనిపోయినప్పుడు వారి ఆత్మలు స్వర్గానికి లేదా నరకానికి వెళ్లేవి. ఇలా వెళ్లిన ఆత్మల పాపాలను నిర్ణయించడంలో యమధర్మరాజు కొంత గందరగోళానికి గురయ్యేవాడు. ఎందుకంటే ఎవరు ఎంత పాపం చేసింది సరిగా నిర్ణయించలేక పోయేవాడు. దీంతో తన ఇబ్బందిని యమధర్మరాజు సృష్టికర్త అయిన అయిన బ్రహ్మకు విన్నవించాడు. సమస్య పరిష్కారం కోసం బ్రహ్మ యోగనిద్రలోకి వెళ్లాడు. కళ్లుతెరిచిన తర్వాత ఆయనకు ఎదురుగా ఓ ఆజానుబాహుడు కనిపించాడు. చేతిలో పుస్తకం, ఘటం (కలం), నడుముకు కత్తి ఉన్నాయి. తర్వాత తన దివ్యదృష్టితో జరిగిన విషయం తెలుసుకొంటాడు. ఆ వ్యక్తి తన చిత్తం (శరీరం)లో గుప్తంగా (గుప్తంగా) నివాసమున్నవాడని అర్థమవుతుంది. అతనికి చిత్రగుప్తుడని పేరు పెడతాడు. అటుపై నీవు ఈ విశ్వంలోని ప్రతి జీవిలో రహస్యంగా ఉంటూ వారి మంచి చెడులను గూర్చి తెలుసుకొంటూ ఉంటావు.





ఈ విషయాలన్నీ యమధర్మ రాజుకు చెబుతూ పాపాత్ములకు శిక్షలు పడేవిధంగా సహాయపడతావు. అదేవిధంగా ఏక కాలంలో కొన్ని కోట్ల రూపాలను ధరించే శక్తి కూడా నీకు ఉంటుందని బ్రహ్మ చిత్రగుప్తుడికి వరమిస్తాడు. అంతేకాకుండా చిత్రగుప్తుడికి ఈ విషయంలో సహాయపడటానికి కొంతమంది సహాయకులుగా కూడా ఉంటారు. వారిలో బ్రహ్మమానసపుత్రులైన శ్రవణులు. శ్రవణులు ఈ భూలోకం పైనే కాకుండా పాతాళ, మత్స్య, స్వర్గ లోకాల్లో కూడా విహరిస్తూ జీవుల పాప పుణ్యాలను ఎప్పటికప్పుడు చిత్రగుప్తుడికి తెలియజేస్తూ ఉంటారు. అందువల్లే ఈ విశ్వంలోని జీవుల పాపపుణ్యాలను చిత్రగుప్తుడు ఖచ్చితంగా నిర్ణయించగలుగుతున్నాడని గరుడ పురాణం చెబుతోంది.

చిత్రగుప్తుడికి కూడా గుడులు ఉన్నాయంటే ఆశ్చర్యమే. మనదేశంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలోనూ, తమిళనాడులోని కంచిలోనూ చిత్రగుప్తుడికి గుడులు ఉన్నాయి. తెలంగాణలో కూడా చిత్రగుప్తుడి దేవాలయం ఒకటి ఉంది. ఇంత అరుదైన దేవాలయం హైదరాబాద్ పాతబస్తీ కందికల్ గేట్ ప్రాంతంలో ఉంది.

చిత్రగుప్తుని సంస్కృతంలో కాయస్థ్ అంటారు. చిత్రగుప్తుడు హిందువులలోని కాయస్థ్ కులానికి చెందినవాడిగా అందరూ భావిస్తుంటారు. కాయస్థుల కులదైవం కూడా చిత్రగుప్తుడే.

న్యాయం, శాంతి, అక్షరాస్యత, విజ్ఞానం ఈ నాలుగు గుణాలు పొందడానికి చిత్రగుప్తుడిని పూజిస్తారు. చిత్రగుప్తుడి పూజలో ఉపయోగించే వస్తువులు కలం, కాగితం, సిరా, తేనె, వక్కపొడి, అగ్గిపెట్టె, చక్కెర, గంధం చెక్క. ఆవాలు, నువ్వులు, తమల పాకులు. హైదరాబాద్‌లోని చిత్రగుప్తుని ఆలయంలో దీపావళి రెండో రోజు ఘనంగా ఉత్సవం జరుగుతుంది. మామూలు రోజుల్లో పెద్దగా పూజలు జరగవు. దీపావళి రెండో రోజు యమద్వితీయ సందర్భంగా, ఆ రోజు చిత్రగుప్తుడి పుట్టినరోజు నిర్వహించే ఆచారం కొనసాగుతుంది. ఆయనకు విశేషపూజలను చేస్తారు. దీన్నే భాయ్ దూజ్ అంటారు. చిత్రగుప్తుడికి ఇష్టమైన రోజు బుధవారం ఇక్కడ అభిషేకం, ప్రత్యేక పూజలు జరుపుతున్నారు. అకాల మృత్యువును జయించడానికి మాత్రమే కాదు ఆరోగ్యం, చదువు, పెళ్ళి, సంతానం ఇలా అనేక సమస్యలకు పరిష్కారం కోసం భక్తులు ఈ దేవాలయాన్ని దర్శించుకుంటారు. కేతుగ్రహ దోష నివారణకు కూడా ఈ దేవాలయంలో పూజలు చేస్తారు. స్త్రీల వ్రతాలలో చిత్రగుప్తుడి నోము కూడా ఉంది.

> మనుషుల పాప పుణ్యాలను అనుసరించి వారికి శిక్ష విధించడం యమధర్మరాజు విధి అని మనకు తెలిసిందే. యముడికి భారత దేశంలో అక్కడక్కడా దేవాలయాలు ఉన్నాయి. వీటిని వేళ్లమీద లెక్క పెట్టవచ్చు. ఇదిలా ఉండగా ఈ విశ్వంలో కోట్లాది జీవుల పాపపుణ్యాలను యమధర్మరాజు ఒక్కడే లెక్కగట్టలేడు కదా. ఆయనకు ఈ విషయంలో సహకారం అందించేది చిత్రగుప్తుడు. మనుషులు తెల్లవారి లేచిన దగ్గర్నుంచి పడుకునే వరకు పాపాలు చేస్తుంటాడు. ఈ పాపాలు ఎవరూ చూడరనుకుంటారు, కానీ మనం చేసే ప్రతి పాపపు పనికీ లెక్క కట్టి చిట్టా తయారు చేసేది చిత్రగుప్తుడేనని గరుడ పురాణం చెబుతుంది.

● నిర్మల వాణి

గాయత్రి మంత్ర విశిష్టత

ఓం భూర్భువస్సః తత్స వితుర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి ధియోయోనఃప్ర చోదయాత్

అనేది గాయత్రి మంత్రం. ఇందులోని ప్రతి బీజాక్షరం మహిమాన్వితమైంది.

వేదాల ప్రకారం సవితా దేవి గాయత్రీ మంత్రానికి అధిష్ఠాన దేవత. గాయత్రీ మంత్రం ప్రాచీనమైనది. నాలుగు వేదాల సృష్టికి ముందు బ్రహ్మ 24 అక్షరాలతో కూడిన గాయత్రీ మంత్రాన్ని రచించాడని చెబుతారు.

ఈ గాయత్రీ మంత్రం సవితా దేవిని, సూర్యదేవుని కీర్తిస్తూ, సూర్య (పింగళా) నాడిని ముఖ్యంగా స్వాధిష్ఠాన చక్రాన్ని చైతన్యపరచడానికి చదివే మంత్రం. సుమారు 5000 సం.క్రితం విశ్వామిత్రునిచే స్తుతింపబడిన ఈ మంత్రం ఋగ్వేదంలోనిది.

గాయత్రి మంత్ర పరమార్థం ఏమిటో, ఎప్పుడు ఆ మంత్ర పఠనం చేయాలో అనే అవగాహన వుండడం మంచిది. అతి సర్వత్రా వర్జయేత్ .. ఏది అతిగా చేయడం, ఆచరించడం శ్రేయస్కరం కాదు. దానివలన ఒక్కోసారి ప్రతికూల ప్రభావాలు కూడా ఉండవచ్చు.



గాయత్రి మంత్రం మన సూక్ష్మ నాడీవ్యవస్థలోని చక్రాలలో ఉన్న పంచ మహాభూతాల సారాన్ని మనకు బోధిస్తుంది. మంత్రాల గురించి చాలా పెద్ద శాస్త్రమే ఉందని చెప్పవచ్చు. మానవ అంతర్గత సూక్ష్మశరీర వ్యవస్థలో చక్రాలలోనూ, నాడులలోను దేవీదేవతలు అధిష్ఠాన దేవతలుగా ఉంటారు. దేవీకవచంలో చెప్పినట్టు మన శరీరంలోని అంగప్రత్యంగాలన్నీ కూడా ఏదో ఒక దేవత అధీనంలో ఉండి వారి చేత రక్షింపబడుతుంటాయి. మన సమస్య ఏ అవయవంలో ఉంటే ఆయా అవయవానికి సంబంధించిన అధిష్ఠాన దేవతా మంత్రాన్ని పఠించుకుని ఆ దేవతని సంతృప్తిపరుచుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చును. అంటే మనకున్న సమస్య కాలికి అయితే, వైద్యం చేతికి చేసినట్లు కాకుండా మన ప్రార్థన కూడా ఏ ఏ చక్రాలలో, లేదా ఏ నాడిలో లోపం వుందో వాటికి సంబంధించిన అధిష్ఠాన దేవీ దేవతలను ప్రసన్నం చేసుకునేదిలా ఉండాలి.

మన శరీరంలోని కుడిపార్శ్వపు నాడి (పింగళా నాడి)లో గాయత్రి దేవి నివాస స్థానం ఉంటుంది. నా అంతటి వాడు లేడనే అత్యహంకారం వలన ఈ పింగళా నాడి సమస్యకు లోనవుతుంది. దీనివలన ఈ నాడి అసమతుల్యతకు లోనై అనారోగ్య సమస్యలు కలగవచ్చు. అలా కుడిపార్శ్వంలో సమస్యలు ఉన్నవారు అతిగా గాయత్రి మంత్ర పారాయణ చేయటం వలన వారు మరింత కోపిష్టిగా, అహంకారిగా మారి విజ్ఞతను కోల్పోయే అవకాశం ఉంది. పూర్వ కాలంలో ఎంతో కఠోర తపస్సు చేసి భగవంతుని అనుగ్రహం పొందిన మునీశ్వరులు, ఋషులలో కొందరు ఇటువంటి కారణం చేతనే భగవంతుని ఆగ్రహానికి గురయ్యారని మనకు తెలిసున్నదే. పంచ మహాభూతాలైన మూలకాలన్నీ మన కుడిపార్శ్వంలో ఉన్న పింగళనాడిలో నిక్షిప్తమై ఉంటాయి. గాయత్రీ మంత్రంలోని బీజాక్షరాలు మన చక్రాలలోని పంచ భూత తత్వాలతో అనుసంధానిపబడి ఉంటాయి. ఇదే గాయత్రి మంత్ర విశిష్టత, పరమార్థం.


శ్రీ మాతాజీ నిర్మలాదేవి

కుండలినీ జాగృతి చెంది బ్రహ్మ రంధ్రం ఛేదించుకుని వచ్చి సహస్రారం మీద భగవంతుని పరమ చైతన్య శక్తితో ఏకీకృతమైనప్పుడు మనం ఆత్మ సాక్షాత్కార అనుభూతి పొందుతాం. అలా ఆత్మసాక్షాత్కారం పొంది సహజయోగ సాధన చేస్తున్న వారికి గాయత్రి మంత్రం ప్రాధాన్యత గాయత్రి మంత్రోచ్చారణ ఫలితం బాగా అవగతమవుతుంది.

– డా. పి. రాకేశ్
(పరమ పూజ్య శ్రీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

● ఇస్లాం వెలుగు

ప్రేమ నిండిన జీవబంధం కుటుంబం

వేగవంతమైన, వ్యక్తి కేంద్రీకృతమైన నేటి ఆధునిక కాలంలో మానవ జీవితానికి శాంతిని, స్థిరత్వాన్ని అందించే ప్రధాన ఆధారం కుటుంబం. ఇది కేవలం ఒక సామాజిక వ్యవస్థ మాత్రమే కాదు, మానవ సంబంధాలను, ఆధ్యాత్మిక విలువలను పటిష్ఠ పరిచే జీవ బంధం. కుటుంబంలో ఉన్న అనుబంధం, నిబద్ధత, పరస్పర గౌరవం వ్యక్తిగత వికాసానికి దారితీయడమే కాకుండా, సమాజ నిర్మాణానికి మూలస్తంభంగా నిలుస్తుంది.

పవిత్ర ఖురాన్, కుటుంబానికి మూలకందమైన ఆలుమగల సంబంధాన్ని ప్రస్తావిస్తూ, 'మీరు వారి దగ్గర శాంతి పొందేందుకు, మీ మధ్య పరస్పరం ప్రేమ, కరుణ ఏర్పడేందుకు...' (సూరా అర్-రూమ్ 30:21) అని చెబుతుంది. ఇది కుటుంబ బంధం అనేది ప్రేమ, దయ, నమ్మకం మీద నిర్మితమైందని స్పష్టంగా తెలియజేస్తుంది. ఇది వ్యక్తిగత స్వేచ్ఛను పరిమితం చేయకుండా, దానికి విలువలతో కూడిన సరైన దిశను చూపుతుంది.

'మీరు మిమ్మల్ని కాకుండా మీ కుటుంబాన్ని కూడా నరకాగ్ని నుండి కాపాడుకోండి' (సూరా తహ్రీమ్ 66:6) అనే వాక్యం తల్లిదండ్రుల కర్తవ్యాన్ని స్పష్టం చేస్తోంది. తల్లి పాదాల చెంత స్వర్గం ఉందన్న ప్రవక్త ప్రవచనం, ఆమె స్థానం ఎంత గౌరవనీయమో తెలియజేస్తే, తండ్రి స్వర్గానికి ముఖద్వారం అన్న ప్రవచనం తండ్రి పాత్రలోని ప్రాముఖ్యతను, ధర్మబద్ధతను గుర్తింప జేస్తుంది.



ఇస్లాం దృష్టిలో కుటుంబ వ్యవస్థకు చాలా ప్రాముఖ్యం ఉంది. ప్రేమ, న్యాయం, విశ్వాసాలతో నిండిన ప్రదేశంగా. పెద్దల అనుభవం, ఆశీర్వాదం కుటుంబానికి మార్గదర్శనం చేయాలి.


'తల్లిదండ్రుల పట్ల సత్ ప్రవర్తన కలిగి ఉండండి.' అనే ఖురాన్ ఆదేశం పెద్దల పట్ల ఎంత గౌరవంగా, వినయంగా ఉండాలో తెలియజేస్తుంది.

ఈ ఆధునిక కాలంలో స్వేచ్ఛ పేరుతో సంబంధాలు సడలిపోతున్న వేళ, ప్రేమ, బాధ్యత, కరుణలతో కూడిన కుటుంబ వ్యవస్థ మనుషుల మధ్య సుస్థిరతను, మనఃశాంతిని నిలబెట్టే మార్గం. ఇలాంటి బంధాన్ని కాపాడటమే మనందరి సామూహిక బాధ్యత. కుటుంబం మన జీవనయాత్రలో ఒక నిష్కళంక ఆశ్రయ స్థలం. విలువలు, బాధ్యతలు, బంధాలను ఎడబాటు చేయలేని ఈ వ్యవస్థను మనం కాపాడుకోవాలి. సమాజ నిర్మాణంలో కుటుంబం మౌలిక అంగంగా నిలవాలి. మన అభ్యసనం, సంస్కారం మొదలు సమస్త జీవన రంగాలకూ కుటుంబమే మొట్టమొదటి శిక్షణా నిలయం.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● సువార్త

పరమ తండ్రి ప్రసిద్ధ ప్రేమ



'ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో ఉండదు' (1యోహాను 2:15). ఈ వాక్య భావం లోతుగా ఎరుగని వారే ఆత్మీయ తండ్రులమని లేఖన విరుద్ధ భావజాలాలతో పిలిపించుకుంటారు. తండ్రిగా వ్యవహరించడం వేరు. తండ్రి ప్రేమతో వ్యవహరించడం వేరు. క్రీస్తు తనలో ఉన్న తన తండ్రి ప్రేమను లోకానికి కనుపరచి గొప్ప వాడయ్యాడు. పరమ తండ్రి ప్రేమతో క్రీస్తు సుప్రసిద్ధుడయ్యాడు.

తండ్రిగా కాక, తండ్రి ప్రేమతో నిత్యం వ్యవహరించడం క్రీస్తు ప్రత్యేకత. ఆయన అదే ప్రేమతో ఆ పరమ తండ్రి ప్రేమతోనే లోకాన్ని మార్చగలిగాడు. తండ్రి ప్రేమతో వ్యవహరించే వారు ఏనాడూ స్వకీయ మహిమను వెదకరు. ఇలా ఎప్పుడు తండ్రియైన దేవుని మహిమను దొంగిలించనే దొంగిలించరు. పరమ దేవుని ప్రసిద్ధ ప్రేమగా చెప్పబడే క్రీస్తు ప్రేమతో బలవంతం చేయబడ్డ అపొస్తలులు ఏనాడూ ఆత్మీయ తండ్రులమంటూ చాటుకోలేదు. అపొ. పౌలు తిమోతిని నా కుమారుడా అన్నడంటే అది యుక్తమైన సహజ పిలుపు.

అబ్రాహాము, యోబుల విషయానికి వస్తే అబ్రాహామునకు వృద్ధాప్యమందు లేక లేక ఒక కొడుకు పుడితే అతడిని నాకు బలి ఇవ్వమని దేవుడు అజ్ఞాపిస్తాడు. ఈ నా కుమారుడు దేవుడే ఇచ్చిన బహుమానం, నాకు అన్నింటి కన్నా దేవుడే మిన్న అన్న గొప్ప తలంపుతో బాలుడైన ఇస్సాకుపై కత్తి ఎత్తుతాడు అబ్రాహాము. ఆ బలి ఇక ఆపమని వద్దని కోరుతూ దేవుని విశ్వాస పరీక్షలో నెగ్గిన అతడిని ఆశీర్వదిస్తూ దేవుడు అనేక జనములకు తండ్రినిగా చేస్తాడు. తమ సంతానం కంటె దేవుడే తమకు ఎక్కువని దేవుని ప్రేమించే వారికి సంతానం ఎప్పుడు దూరంకాక, వారి భక్తి వలన వారి సంతానం కూడా ఎప్పుడూ వారికి దగ్గరగానే ఉంటుంది. తన పిల్లలపై జాలిపడే దేవుడు అన్యాయము చేయుట మాత్రం అసంభవం. అబ్రాహాము విశ్వాసమును అనుసరించే నేటి తండ్రులు పిల్లల దృష్టిలో గొప్పవారిగా ఎంచబడతారు.

ఇక యోబు పెంపకం విశేషం ఏమంటే, తన కుమారులు పాపము చేసారేమో తమ హృదయాలలో దేవుని దూషించిరేమో అనుకోని దేవునికి భయపడుతూ వారి పాప నివారణకు యోబు అరుణోదయానే లేచి అప్పటి నియమం ప్రకారం ఒక్కొక్కని నిమిత్తం దహన బలులు అర్పించేవాడు.

తన కుమారులను దేవునివైపు తిప్పడం కుటుంబ పెద్దగా యజమానిగా వేకువనే లేచి దేవునికి ప్రార్థనలు చేస్తూ బలులు అర్పించడం ఒక ఉత్తమోత్తమ తండ్రిగా యోబు నిర్వర్తించిన గొప్పవైన బరువు, బాధ్యతలు ఇప్పటి తండ్రులకు ఎంతో ఆదర్శము. యోబు జీవితం గూర్చి క్లుప్తంగా చెప్పాలంటే దేవుని పై అనుకొన్న మానవ మాత్రుడు అపవాది మీద విజయం సాధించడం, దేవుని మెప్పు పొందడం. యువతకు ఇంతకు మించిన స్ఫూర్తిమంత జీవితం ఎక్కడా దొరకదు.

బైబిలు నందు ఎందరో శరీర సంబంధులైన తండ్రులు ఉన్నతంగా, ఉత్తమంగా ఆత్మసంబంధులుగా బాధ్యతతో నడిచిన వారుగా ఉన్ననూ, యోబు, అబ్రాహాములు అనే భక్తిపరులు వేర్వేరు దేశాలలో పుట్టిన వారుగా ఒకే కాలానికి చెందిన ఆత్మసంబంధులైన ఈ ఇద్దరు శక్తివంతమైన ఉత్తమ తండ్రులుగానే కాక, విశ్వాసానికి వన్నెలద్దే దేశాన్నే, గొప్ప జాతినే సష్టించి చరిత్రలోనూ సుస్థిరంగా నిలిచిపోయారు.


> కుటుంబంలోనైనా సంఘంలోనైనా తమ పిల్లలతో పెద్దలైన తల్లిదండ్రులు, సంఘ పెద్దలు, సువార్తికులు మీతో పాటు మేము కూడా కలిపితే మనమందరం దేవుని పిల్లలం. దేవుడే మన అందరి తండ్రి అంటూ తమ బాల్యాన్ని ఏనాడు మరువక ఇలా తగ్గించుకొని దీనులుగా సత్య విషయాలు బోధించే వారే పిల్లలకు అత్యంత ప్రియులవుతారు. వారి పాలిట మంచి మార్గదర్శకులవుతారు.

– జేతమ్

ధర్మ సందేహం

పీఠం అంటే...

పీఠం అంటే సంస్కార చిహ్నం. భారతీయ సనాతన ధర్మ పరిరక్షణకు మూల కేంద్రాలు ఆధ్యాత్మిక పీఠాలు. భారతీయ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఆలయాలు ఉన్నా అవి కేవలం వ్యక్తి నిర్మాణానికే ఉపకరిస్తున్నాయి. కానీ సమాజ నిర్మాణానికి దోహదపడుతున్నది పీఠాలే. లోక హితం, సామాజిక చింతన కాంక్షించేవి ఈ పీఠాలే. ఒకప్పుడు ఈ కార్యాన్ని గురుకులాలు నిర్వర్తించేవి. క్రమేణా అవి బలహీనపడడంతో ఆది శంకరాచార్యుని చొరవతో పీఠాలు ఏర్పడ్డాయి. పీఠాలు విశాలమైన సామూహిక, సామాజిక హితం కోసం ఏర్పడ్డాయి. కుల, మత, వర్ణ, వర్గాలకు అతీతంగా పీఠాధిపతులే కేంద్రంగా ముందుకు సాగుతాయి. ధర్మ పరిరక్షణ కోసం పాటుపడేవే పీఠాలు. అతి సనాతనమైన ధర్మాన్ని ఆధునిక సమాజానికి అనుగుణంగా నిత్య నూతనమైన మానవ సమూహాలకు దిశా దర్శనం చేయిస్తున్న భారతీయ ధర్మం గంగా స్రోతస్వినిగా నిరంతరం ప్రవహింపజేయడానికి భారతీయ తత్వాన్ని, భారతీయ సత్వాన్ని నేల నలుచెరగులా అనుక్షణం ప్రబోధం చేసేటటువంటి గొప్ప కార్యాన్ని పీఠం నిర్వహించాలి.



పిల్లలకు పుట్టు వెంట్రుకలు ఎప్పుడు తీయాలి?


పిల్లలకు తొమ్మిదవ నెలలో కాని, '11 'వ నెలలో కాని, '3 'వ సంవత్సరంలో కాని పుట్టు వెంట్రుకలు తీయవలెను. అయితే ఇది కొన్ని కుటుంబాలు, ప్రాంతాలలోని ఆచారం మేరకు ఇంకా ముందు కూడా తీస్తుంటారు.



● జెన్ పథం

నీడివ్వని నీ నీడ

అతను ధనవంతుడు. బోలెడంత సంపద. దాంతో అతను బంధువులందరినీ కాదని కొందరు నౌకర్లతో ఉల్లాసంగా ఉంటున్నాడు. ఏం కావాలన్నా పనివాళ్ళున్నారనే ధీమాతో ఉన్నాడు. ఓరోజు ఓ జ్ఞాని అనుకోకుండా ఆయన వద్దకు వచ్చాడు.



ధనికుడు సకల మర్యాదలతో ఆహ్వానించాడు. జ్ఞాని 'ఏరీ నీ భార్యా పిల్లలూ? ఇక్కడి వాతావరణం చూస్తుంటే బంధువులెవరూ కూడా వచ్చిపోతున్నట్లనిపించడం లేదు? నీ బంధువులందరూ ఏమయ్యారు? ఎంతసేపూ నౌకర్లే కనిపిస్తున్నారు?' అని అడిగాడు.

దానికి ధనికుడిలా జవాబిచ్చాడు... 'నాకు బోలెడంత డబ్బు ఉంది. నాకేం కావాలన్నా చేసిపెట్టడానికి నౌకర్లున్నారు. నేను గుమ్మం దాటక్కర్లేదు. అటువంటప్పుడు నాకు భార్యా బిడ్డల అవసరమేముంది. బంధువులెవరూ రాకున్నా నాకేమీ నష్టం లేదు. నాకు వాళ్ళెవరితోనూ ఏ అవసరమూ లేదు' అని.

'ఓహో. అలాగా' అంటూ జ్ఞాని కాస్సేపు నాతో అలా వస్తావా? అటూ ఇటూ తిరిగొద్దాం' అన్నాడు జ్ఞాని.

'సరే' అంటూనే ఎండలో రమ్మంటాడేమిటీ అని మనసులో అనుకుంటాడు. కానీ రాలేనని చెప్పడం ఇష్టం లేక అన్యమనస్కంగానే బయలుదేరుతాడు జ్ఞాని వెంట ధనికుడు. కొంచెం దూరం వెళ్ళేసరికే ఎండకు తట్టుకోలేక నీడ కోసం చుట్టూ చూస్తాడు.

అది తెలిసి జ్ఞాని ఏమీ ఎరగనట్టే 'ఎవరికోసం చూస్తున్నావు? నీకెవరి తోడూ అక్కర్లేదన్నావుగా? నీకేం కావాలన్నా చేసి పెట్టడానికి నౌకర్లు ఉన్నారుగా. అయినా నీ నీడే నీకుందిగా. అందులో సేదదీరవచ్చుగా?' అంటాడు.

'అదెలా కుదురుతుంది స్వామీ? నా నీడ నాకెలా నీడిస్తుంది?' అని ప్రశ్నిస్తూనే అన తప్పుని తెలుసుకుని తలదించుకుంటాడు.

అందుకే అంటారు అనుభవజ్ఞులు...

డబ్బులెంత వరకు ఉపయోగపడతాయో తెలుసుకోవాలి. చుట్టాలూ పక్కాలూ స్నేహితులూ అంటూ బంధాలన్నీ పరస్పర తోడునీడలకోసం అవసరమే. ఒంటికన్ను రాకాసిలా నాకెవరి తోడూ అవసరం లేదనుకునే బతుకు బతుకే కాదు. ఈ లోకంలో ఉన్నప్పుడే కాదు, పోయేటప్పుడూ నలుగురి అవసరం ఉందనే వాస్తవం గుర్తెరిగి నడచుకోవాలి.

– యామిజాల జగదీశ్

సాక్షి ప్లస్
గురువారం । 15-5-2025

ఎంట్రీలెవల్ ఉద్యోగాల్లో మహిళలు అంతంతే!

- ప్రతి ముగ్గురిలో ఒక్కరికే చోటు
- మేనేజర్ బాధ్యతల్లో 24 శాతమే
- సముచిత స్థానంతో సత్ఫలితాలు
- మెకిన్సే అండ్ కంపెనీ నివేదిక వెల్లడి



ముంబై: ప్రైవేటు రంగంలో ఎంట్రీలెవల్ (ఆరంభ స్థాయి) ఉద్యోగాలు, మేనేజర్ స్థాయి ఉద్యోగాల్లో మహిళలకు సముచిత స్థానం దక్కడం లేదు. ప్రతి మూడు ఎంట్రీలెవల్ ఉద్యోగాల్లో ఒకే మహిళ ఉంటుంటే.. నిర్వహణ బాధ్యతల్లో మహిళల స్థానం 24 శాతంగా ఉన్నట్టు మెకిన్సే అండ్ కంపెనీ విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. పట్టభద్రుల్లో సగం మంది మహిళలు ఉంటుంటే.. ప్రైవేటు సంఘటిత రంగంలో ఉద్యోగం పొందడం, ఉన్నత పదవులను అధిరోహించడం, వాటిని నిలుపుకునే విషయంలో వారు వ్యవస్థీకృత అడ్డంకులను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఆరంభ స్థాయి, మేనేజర్ ఉద్యోగాల్లో స్త్రీ-పురుష ఉద్యోగుల మధ్య ఉన్న అంతరాన్ని ఈ నివేదిక ప్రస్తావించింది. భారత్, నైజీరియా, కెన్యా వ్యాప్తంగా 324 సంస్థల ఉద్యోగ డేటాను మెకిన్సే అండ్ కంపెనీ విశ్లేషించింది. ఇందులో భారత్ నుంచి 77 ప్రైవేటు సంస్థల డేటా కూడా ఉంది. ఇక భారత్‌లో ఎంట్రీలెవల్ ఉద్యోగాల విషయంలో స్త్రీ-పురుషుల మధ్య వయసులోనూ అంతరం నెలకొన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. మహిళల సగటు వయసు 39 ఏళ్లుగా ఉంటే, పురుషుల వయసు 32 ఏళ్లుగా ఉంది. మెకిన్సే విశ్లేషించిన అన్ని దేశాల్లోనూ ఈ వయసు అంతరం భారత్‌లోనే ఎక్కువగా ఉంది. దీని ఆధారంగా భారత్‌లో ఎక్కువ మంది మహిళలు ప్రైవేటు రంగంలో ఉపాధిని ఆలస్యంగా ప్రారంభిస్తున్నట్టు తెలుస్తోందని ఈ నివేదిక పేర్కొంది.

పదోన్నతులూ తక్కువే..

పురుషులతో పోల్చి చూస్తే ఎంట్రీలెవల్ ఉద్యోగాల్లోని మహిళలకు పదోన్నతులు తక్కువగానే దక్కుతున్నాయి. స్త్రీలతో పోల్చి చూసినప్పుడు 2.4 రెట్లు అధికంగా పురుషులకు మేనేజర్ పదవులను అలంకరిస్తున్నారు. అంతేకాదు పురుషులతో పోల్చి చూస్తే మహిళలు 1.3 రెట్లు అధికంగా ఈ ఉద్యో గాలను వీడుతున్నారు. పెద్దగా పదోన్నతులు ఇవ్వకుండా, మహిళలను ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లోనే అట్టిపెట్టుకోవడం అన్నది వారి కెరీర్ పురోగతికి అవరోధమని ఈ నివేదిక పేర్కొంది. ''పని ప్రదేశాల్లో లింగ సమానత్వం అన్నది నైతిక లేదా సామాజిక అవసరమే కాదు. ఇదొక వ్యూహాత్మకం కూడా. 2035 నాటికి భారత్ 8 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్న లక్ష్యం నేపథ్యంలో మహిళలను సంఘటిత రంగంలో పూర్తి స్థాయిలో మమేకం చేయడం అన్నది అభివృద్ధికి పు నాది అవుతుంది. చాలా సంస్థలు వైవిధ్యమైన నిర్వహణ, బృందాల ఆవశ్యకతను గుర్తించినప్పటికీ పురోగతి ఆశించిన మేర లేదు''అని మెకిన్సే అండ్ కంపెనీ సీనియర్ పార్ట్‌నర్ వివేక్ పండిట్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-5-2025

విశాఖ	510-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATASTEEL	155.3	3.93
SHRIRAMFIN	651	2.75
BEL	344.5	2.61
HINDALCO	649.5	2.32
TECHM	1,607.40	2.22

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,286.00	-1.66
CIPLA	1,499.90	-1.33
KOTAKBANK	2,091.90	-1.12
TATAMOTORS	700.2	-1.06
POWERGRID	296.3	-0.72

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,395
ఎన్ఎస్ఈ	1,15,869
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,87,759
ఎఫ్ఐఐ	+ 932
డీఐఐ	+ 361

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.26	$ 63.67
బ్రెంట్	66.22	$ 66.63

ఏషియన్ పెయింట్స్‌లో వాటాల విక్రయంపై రిలయన్స్ కసరత్తు

సుమారు రూ. 11 వేల కోట్ల మార్కెట్ విలువ



ముంబై: దేశీ పెయింట్స్ దిగ్గజం ఏషియన్ పెయింట్స్‌లో తనకున్న 4.9 శాతం వాటాలను విక్రయించడంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ కసరత్తు చేస్తోంది. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ వాటా విలువ దాదాపు రూ. రూ. 11,140 కోట్లుగా ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఏకమొత్తంగా ఒకేసారి లేదా పలు డీల్స్ ద్వారానైనా ఈ లావాదేవీని నిర్వహించేందుకు బ్యాంక్ ఆఫ్ అమెరికా (బీవోఎఫ్ఏ)ను నియమించుకున్నట్లు సమాచారం. అయితే, ప్రస్తుత మార్కెట్ ధర కంటే డిస్కౌంట్‌కే ఆఫర్లు వస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఎప్పుడో 17 ఏళ్ల క్రితం 2008 జనవరిలో రిలయన్స్ ఈ వాటాలను రూ. 500 కోట్లతో కొనుగోలు చేసింది. దానితో పోలిస్తే ప్రస్తుత ధర ప్రకారం దాదాపు 24 రెట్లు లాభాన్ని కంపెనీ అందుకోనుంది. పెయింట్స్ పరిశ్రమలో పోటీ తీవ్రం కావడంతో ఏషియన్ పెయింట్స్ మార్కెట్ వాటా గత ఆర్థిక సంవత్సరం 59 శాతం నుంచి 52 శాతానికి తగ్గింది. అలాగే గత ఏడాది వ్యవధిలో షేరు విలువ సుమారు 19 శాతం పైగా క్షీణించింది. దేశీయంగా నంబర్ వన్ స్థానంలో ఉన్న ఏషియన్ పెయింట్స్ అంతర్జాతీయంగా 8వ స్థానంలో ఉంది. 15 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది.

బీమా వ్యాపారంలోకి అపోలో

కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులపైనా దృష్టి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అపోలో హెల్త్‌కో తాజాగా బీమా సర్వీసుల వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నట్లు వెల్లడించింది. కార్పొరేట్ ఏజెంటుగా వ్యవహరించేందుకు అనుబంధ సంస్థ అపోలో 24/7 ఇన్సూరెన్స్ సర్వీసెస్‌కు అనుమతులు రావడంతో వచ్చే రెండు నెలల్లో తమ ప్లాట్‌ఫాం ద్వారా ఆరోగ్య, జీవిత, జనరల్ బీమా పథకాలను విక్రయించనున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఇప్పటికే ఎనిమిది బీమా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నామని, మరో నాలుగింటితో సంప్రదింపులు జరుగుతున్నాయని అపోలో హెల్త్‌కో సంస్థ సీఈవో మధివణన్ బాలకృష్ణన్ తెలిపారు. తొలి ఏడాది రూ. 80-100 కోట్ల ప్రీమియంను అంచనా వేస్తున్నట్లు వివరించారు. మరోవైపు, ఒక దిగ్గజ సంస్థతో కలిసి కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డును కూడా త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వివరించారు. ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించుకునేలా ప్రోత్సహించే క్రమంలో అల్టిమేట్ హెల్త్ చాలెంజ్‌ను ప్రవేశపెట్టినట్లు బాలకృష్ణన్ చెప్పారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేనట్లు తేలితే వైద్యపరీక్షల ఫీజులను పూర్తిగా వాపసు పొందవచ్చని వివరించారు.

6జీ పేటెంట్లలో ఆరు టాప్ దేశాల్లో భారత్



న్యూఢిల్లీ: 6జీ పేటెంట్ ఫైలింగ్స్‌కి సంబంధించి అంతర్జాతీయంగా టాప్ ఆరు దేశాల్లో భారత్ కూడా ఉన్నట్లు కేంద్ర టెలికం శాఖ సహాయ మంత్రి చంద్రశేఖర్ పెమ్మసాని తెలిపారు. దేశీయంగా 111 రీసెర్చ్ ప్రాజెక్టులకు రూ. 300 కోట్లకు పైగా నిధులు మంజూరైనట్లు ఆయన వివరించారు. 6జీ సేవలు 5జీ కన్నా 100 రెట్లు వేగంగా ఉంటాయన్నారు. టెక్నాలజీలో అంతర్జాతీయంగా భారత్ అగ్రగామిగా ఎదిగే క్రమంలో పలు దశాబ్దాల పాటు ఈ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. దీనితో కొత్త పరిశ్రమలు వస్తాయని, ప్రస్తుతమున్న వాటిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయని భారత్ 6జీ 2025 సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఫలితంగా 2035 నాటికి భారత ఎకానమీ 1 లక్ష కోట్ల డాలర్ల మేర పెరుగుతుందని చంద్రశేఖర్ చెప్పారు. దేశీయంగా 6జీని అభివృద్ధి చేసుకోవడం వల్ల మన కమ్యూనికేషన్స్ వ్యవస్థ సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రధాన పోర్టుల్లో కార్గో హ్యాండ్లింగ్ అప్..

- 2024-25లో 4.3 శాతం పెరుగుదల
- 855 మిలియన్ టన్నులుగా నమోదు



న్యూఢిల్లీ: దేశీయంగా ప్రధాన పోర్టుల్లో గత ఆర్థిక సంవత్సరం (2024-25) కార్గో హ్యాండ్లింగ్ 855 మిలియన్ టన్నులుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 4.3 శాతం పెరిగినట్లు కేంద్రం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. అత్యధికంగా ఎరువులు (13 శాతం), ఇతరత్రా కమోడిటీల (31 శాతం) హ్యాండ్లింగ్ నమోదైనట్లు పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వైజాగ్ పోర్టు, ముంబై పోర్టు తదితర 12 ప్రధాన పోర్టులు ఉన్నాయి. వీటి చరిత్రలో తొలిసారిగా పారాదీప్ పోర్ట్ అథారిటీ (పీపీఏ), దీనదయాళ్ పోర్ట్ అథారిటీ (డీపీఏ) 150 మిలియన్ టన్నుల (ఎంటీ) మార్కును అధిగమించాయి. గత ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామికీకరణ కోసం దేశీ పోర్టులు 962 ఎకరాలు కేటాయించాయి.

వీగార్డ్ మెరుగైన పనితీరు

- లాభం, ఆదాయంలో వృద్ధి
- రుణ రహిత సంస్థగా అవతరణ



న్యూఢిల్లీ: ఎలక్ట్రికల్ ఉత్పత్తులను విక్రయించే వీగార్డ్ ఇండస్ట్రీస్ మార్చి త్రైమాసికంలో మెరుగ్గా రాణించింది. లాభం 19.6 శాతం పెరిగి రూ.91 కోట్లుగా నమోదైంది. ఆదాయం సైతం 15 శాతం వరకు పెరిగి రూ.1,538 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ లాభం రూ.76 కోట్లు, ఆదాయం రూ.1,343 కోట్ల చొప్పున ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద వీగార్డ్ ఇండస్ట్రీస్ లాభం అంతక్రితం ఆర్థిక సంవత్సంతో పోల్చి చూస్తే 22 శాతం పెరిగి రూ.314 కోట్లకు చేరుకోగా.. ఆదాయం 14 శాతం పెరిగి రూ.5,599 కోట్లుగా నమోదైంది. ఆదాయం, లాభదాయకత పరంగా బలమైన పనితీరు సాధించినట్టు కంపెనీ ఎండీ మిథున్ కే చిట్టిలప్పిలి తెలిపారు.

బీఎస్ఈలో వీగార్డ్ షేరు అర శాతం నష్టంతో రూ.377 వద్ద స్థిరపడింది.

రాణించిన బెర్జర్ పెయింట్స్

మార్చి క్వార్టర్‌లో రూ.263 కోట్ల లాభం



న్యూఢిల్లీ: బెర్జర్ పెయింట్స్ ఇండియా మార్చితో ముగిసిన త్రైమాసికంలో నిలకడైన పనితీరు నమోదు చేసింది. రూ.263 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.223 కోట్లతో పోల్చి చూస్తే 18 శాతం వృద్ధి చెందింది. కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.2,520 కోట్ల నుంచి రూ.2,704 కోట్లకు పెరిగింది. వ్యయాలు సైతం ఇదే కాలంలో రూ.2,274 కోట్ల నుంచి రూ.2,380 కోట్లకు ఎగిశాయి. అమ్మకాలు 7.4% పెరిగాయి. డెకొరేటివ్ పెయింట్స్ విభాగంలో సింగిల్ డిజిట్‌లోనే అధిక వృద్ధి నమోదైంది. క్రితం త్రైమాసికంతో పోల్చి చూసినా ఈ విభాగం మెరుగైన పనితీరు చూపించింది. ఉత్పత్తుల మిశ్రమానికి తోడు ధరల పెంపు ఇందుకు అనుకూలించినట్టు కంపెనీ తెలిపింది. ఇక ప్రొటెక్టివ్ కోటింగ్స్ విభాగం నిలకడైన పనితీరు చూపించింది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో బెర్జర్ పెయింట్స్ లాభం రూ.1,183 కోట్లుగా ఉంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.1,170 కోట్లతో పోల్చి చూస్తే అత్యల్ప వృద్ధి కనిపించింది. ఆదాయం రూ.11,199 కోట్ల నుంచి రూ.11,545 కోట్లకు పెరిగింది. రానున్న నెలల్లో డిమాండ్ పట్ల తాము ఆశావహంగా ఉన్నట్టు కంపెనీ ఎండీ, సీఈవో అభిజిత్ రాయ్ తెలిపారు.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో కంపెనీ షేరు 2% లాభపడి రూ.554 వద్ద ముగిసింది.

శ్రీ సిమెంట్ రూ. 60 డివిడెండ్

క్యూ4 లాభం రూ. 556 కోట్లు




న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ శ్రీ సిమెంట్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 16 శాతం క్షీణించి రూ. 556 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 662 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం రూ. 5,073 కోట్ల నుంచి రూ. 5,240 కోట్లకు ఎగసింది. నిర్వహణ లాభం(ఇబిటా) నిలకడగా రూ. 1,381 కోట్లను తాకింది. ఒక క్వార్టర్‌లో కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా మొత్తం సిమెంట్, క్లింకర్ విక్రయాలు 9.84 మిలియన్ టన్నులకు చేరాయి. కంపెనీ బోర్డు వాటాదారులకు షేరుకి రూ. 60 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన గతేడాది రెండు గ్రైండింగ్ యూనిట్లను ప్రారంభించింది. ఉత్తరప్రదేశ్‌లోని ఈటాలో 3 ఎంటీపీఏ, చత్తీస్‌గఢ్‌లోని బలోడా బజార్‌లో 3.4 ఎంటీపీసీ సామర్థ్యాలతో వీటిని నెలకొల్పింది. దీంతో కంపెనీ మొత్తం సిమెంట్ తయారీ సామర్థ్యం 62.8 ఎంటీపీఏకు చేరింది. 2027-28కల్లా సామర్థ్యాన్ని 80 ఎంటీపీఏకు చేర్చుకునే లక్ష్యంతో విస్తరణ ప్రణాళికలు అమలు చేస్తోంది. ఇందుకు అనుగుణంగా రాజస్తాన్, కర్ణాటక, జార్ఖండ్‌లలో ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తోంది. నవాల్‌గఢ్ యూనిట్‌లో క్లింకర్ సామర్థ్యాన్ని 3.8 నుంచి 4.5 ఎంటీపీఏకు పెంచుకుంది.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్ఈలో 1.4 శాతం లాభంతో రూ. 30,632 వద్ద ముగిసింది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

టాటా పవర్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 1,306 కోట్లు
- షేరుకి రూ. 2.25 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం టాటా పవర్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 25 శాతం ఎగసి రూ. 1,306 కోట్లను అధిగమించింది. విద్యుదుత్పత్తి, ప్రసారం, పంపిణీ, పునరుత్పాదక బిజినెస్‌ల పటిష్ట పనితీరు ఇందుకు తోడ్పాటునిచ్చాయి. అంతక్రితం ఏడాది (2023-24) ఇదే కాలంలో రూ. 1,046 కోట్ల లాభం మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 16,464 కోట్ల నుంచి రూ. 17,447 కోట్లకు బలపడింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 2.25 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. జులై 7న చెల్లించనుంది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 4,280 కోట్ల నుంచి రూ. 4,775 కోట్లకు పుంజుకుంది. మొత్తం ఆదాయం రూ. 63,272 కోట్ల నుంచి రూ. 66,992 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2 శాతం లాభంతో రూ. 397 వద్ద ముగిసింది.

ఐషర్ రూ. 70 డివిడెండ్

- క్యూ4 లాభం రూ. 1,362 కోట్లు



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం ఐషర్ మోటార్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 27 శాతం జంప్‌చేసి రూ. 1,362 కోట్లను తాకింది. వివిధ మార్కెట్లలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,070 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 70 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 4,256 కోట్ల నుంచి రూ. 5,241 కోట్లకు ఎగసింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ 23 శాతం వృద్ధితో 2,80,801 మోటార్‌సైకిళ్లను విక్రయించింది. ఒక క్వార్టర్‌కు కంపెనీ చరిత్రలోనే ఇవి అత్యధికంకాగా.. పూర్తి ఏడాదికి 10% వృద్ధితో 10,02,893 యూనిట్లను విక్రయించింది. ఇవి సైతం సరికొత్త రికార్డ్‌కాగా.. తొలిసారి 10 లక్షల వాహన అమ్మకాలు సాధించింది. వీటిలో దేశీ విక్రయాలు 9,02,757 యూనిట్లుగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 0.6 శాతం లాభంతో రూ. 5,451 వద్ద ముగిసింది.

టాటా క్యాపిటల్ లాభం హైజంప్

31% వృద్ధితో రూ.1,000 కోట్లకు



న్యూఢిల్లీ: త్వరలో ఐపీవోకు వచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్న టాటా క్యాపిటల్ మార్చి త్రైమాసికానికి రూ.1,000 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ లాభం రూ.765 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం సైతం ఇదే కాలంలో 50 శాతం వృద్ధితో రూ.7,478 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.4,998 కోట్లుగా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో టాటా క్యాపిటల్ లాభం రూ.3,665 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో (2023-24) లాభం రూ.3,327 కోట్లతో పోల్చితే స్వల్పంగా పెరిగింది. ఆదాయం రూ.18,715 కోట్ల నుంచి రూ.28,313 కోట్లకు చేరుకుంది. గత నెలలో టాటా క్యాపిటల్ సెబీ వద్ద ఐపీవో పత్రాలను దాఖలు చేయడం తెలిసిందే. 2 బిలియన్ డాలర్ల నిధులను (రూ.17వేల కోట్లు) సమీకరించాలనుకుంటోంది. సెబీ ఆమోదం లభిస్తే అతిపెద్ద ఐపీవోల్లో ఒకటి కానుంది. టాటా క్యాపిటల్‌లో టాటా సన్స్‌కు 92.83 శాతం వాటా ఉంది. అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా ఆర్‌బీఐ నుంచి టాటా క్యాపిటల్ గుర్తింపు కలిగి ఉంది.

సాయి లైఫ్ సైన్సెస్ లాభం 57 % అప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో సాయి లైఫ్ సైన్సెస్ నికర లాభం రూ. 88 కోట్లుగా నమోదైంది. అంతక్రితం క్యూ4లో నమోదైన రూ. 56 కోట్లతో పోలిస్తే సుమారు 57 శాతం పెరిగింది. సమీక్షాకాలంలో ఆదాయం రూ. 439 కోట్ల నుంచి 32 శాతం వృద్ధితో రూ. 580 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి లాభం 105 శాతం పెరిగి రూ. 170 కోట్లకు, ఆదాయం 16 శాతం వృద్ధితో రూ. 1,695 కోట్లకు పెరిగింది.

మేక్‌మై ట్రిప్ లాభం రూ.246 కోట్లు



న్యూఢిల్లీ: ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ 'మేక్ మై ట్రిప్' మార్చి త్రైమాసికంలో మెరుగైన పనితీరు ప్రదర్శించింది. నికర లాభం 29.2 మిలియన్ డాలర్లుగా (రూ.246 కోట్లు) నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ లాభం 171.9 మిలియన్ డాలర్లుగా (రూ.1,461 కోట్లు) ఉంది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో ఏకీకృత లాభం 126 మిలియన్ డాలర్లు కూడా కలసి ఉంది. దీనికితోడు వాయిదా వేసిన పన్నుల రూపంలో ఆర్జన 30.6 మిలియన్ డాలర్లను మినహాయించి చూస్తే గతేడాది మార్చి త్రైమాసికంలో లాభం 15.2 మిలియన్ డాలర్లుగానే ఉన్నట్టు మేక్ మై ట్రిప్ వెల్లడించింది. స్థూల బుకింగ్‌ల విలువ మార్చితో ముగిసిన త్రైమాసికంలో 30 శాతం పెరిగి 2,553 మిలియన్ డాలర్లుగా నమోదైంది. ఆదాయం 25 శాతానికి పైగా పెరిగి 245 మిలియన్ డాలర్లకు (రూ.2,082 కోట్లు) చేరింది. రికార్డు బుకింగ్‌లు, ఆదాయం నమోదు చేసినట్టు మేక్‌మైట్రిప్ గ్రూప్ సీఈవో రాజేష్ మాగోవ్ తెలిపారు. వీటికితోడు మార్జిన్ల విస్తరణ తమ ప్లాట్‌ఫామ్ బలాన్ని తెలియజేస్తుందన్నారు.

టొరెంట్ పవర్ లాభం రెట్టింపు

- క్యూ4లో రూ. 1,077 కోట్లు
- షేరుకి రూ. 5 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం టొరెంట్ పవర్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 1,077 కోట్లను అధిగమించింది. పన్ను చెల్లింపుల పద్దులో భాగంగా రూ. 637 కోట్ల రివర్సల్ ఇందుకు ప్రధానంగా సహకరించింది. ప్రస్తుత 34.94 శాతానికి బదులుగా 25.16 శాతం కొత్త పన్ను రేటును అమలు చేసినట్లు కంపెనీ వెల్లడించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 447 కోట్ల లాభం మాత్రమే ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం రూ. 6,625 కోట్ల నుంచి రూ. 6,571 కోట్లకు స్వల్పంగా నీరసించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. సెప్టెంబర్ 4న చెల్లించనుంది. ఒకేసారి లేదా దశలవారీగా మార్పిడిరహిత డిబెంచర్ల ప్రయివేట్ ప్లేస్‌మెంట్ ద్వారా రూ. 3,000 కోట్లు సమీకరించే ప్రతిపాదనను బోర్డు అనుమతించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 1,896 కోట్ల నుంచి రూ. 3,059 కోట్లకు జంప్‌చేసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2 శాతం లాభంతో రూ. 1,453 వద్ద ముగిసింది.

జూబిలెంట్ ఫుడ్ లాభం రూ. 49 కోట్లు

- షేరుకి రూ. 1.2 డివిడెండ్



న్యూఢిల్లీ: ఫాస్ట్‌ఫుడ్ చైన్ దిగ్గజం జూబిలెంట్ ఫుడ్ వర్క్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 49 కోట్లకుపైగా నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 208 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 2,103 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 1,573 కోట్ల టర్నోవర్ సాధించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 1.2 డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 217 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24లో రూ. 400 కోట్ల లాభం నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 8,217 కోట్లను తాకింది. 2023-24లో రూ. 5,696 కోట్ల ఆదాయం అందుకుంది. మొత్తం స్టోర్ల సంఖ్య 3,316కు చేరింది. దేశీయంగా గతేడాది 14 శాతం అధికంగా రూ. 6,104 కోట్ల టర్నోవర్ సాధించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.5 శాతం నష్టంతో రూ. 692 వద్ద ముగిసింది.

పాక్ హెడ్ కోచ్‌గా మైక్ హెసన్



లాహోర్: న్యూజిలాండ్‌కు చెందిన మైక్ హెసన్‌ను పాకిస్తాన్ హెడ్ కోచ్‌గా నియమించారు. అయితే వన్డే, టి20 **ఈ రెండు** ఫార్మాట్లకు ఆయన కోచింగ్ **సేవలు అందిస్తారని** పాక్ క్రికెట్ బోర్డు **(పీసీబీ) తెలిపింది.** పాకిస్తాన్ సూపర్ లీగ్ ముగి**సిన మరుసటి** రోజే మే 26న హెసన్ జట్టు**తో కలుస్తాడని** పీసీబీ ప్రకటించింది. అతను **కివీస్ జట్టుకు** హెడ్ కోచ్‌గా వ్యవహరించాడు. **అతని కోచిం**గ్‌లోనే 2015 వన్డే ప్రపంచకప్**లో న్యూజిలాండ్** ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచిం**ది. ఐపీఎల్‌లో** పంజాబ్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీలకు కోచింగ్ సేవలందించారు. హెసన్ ప్రస్తుతం పీఎస్ఎల్ డిఫెండింగ్ చాంపియన్ ఇస్లామాబాద్ యునైటెడ్ హెడ్ కోచ్‌గా ఉన్నారు. మైక్ హెసన్‌లాంటి అంతర్జాతీయ కోచింగ్ నిపుణుడి ఆధ్వర్యంలో పాక్ జట్టు ఆశించిన ప్రగతి సాధిస్తుందని పీసీబీ చైర్మన్ మోసిన్ నఖ్వీ తెలిపారు. అయితే కేవలం రెండేళ్ల వ్యవధిలోనే పాక్ జట్టు ఐదుగురు విదేశీ కోచ్‌లను మార్చడం విశేషం. 2023 నుంచి బ్రాడ్‌బర్న్, మికీ అర్థర్, సైమన్ హెల్మెట్, గ్యారీ కిర్‌స్టెన్, గిలెస్పీలు కోచ్‌లుగా వచ్చి వెళ్లారు. ఈ కోవలో ఆరో కోచ్ అయిన హెసన్ హెడ్‌కోచ్ ముచ్చట ఎన్నాళ్లో మరి!

రెండో స్థానానికి చేరువగా భారత మహిళల జట్టు

దుబాయ్: ఇటీవల శ్రీలంకలో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు ఇంగ్లండ్ రెండో స్థానానికి ఎసరుతెచ్చింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన మహిళల వన్డే జట్ల ర్యాంకుల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 121 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నప్పటికీ ఇంగ్లండ్ (127)కు కేవలం ఆరు పాయింట్ల దూరంలోనే ఉంది. ఏడుసార్లు విశ్వ విజేతగా నిలిచిన ఆస్ట్రేలియా 167 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్ (96), దక్షిణాఫ్రికా (90), శ్రీలంక (82) వరుసగా 4, 5, 6వ ర్యాంకుల్లో ఉన్నాయి. లంక గడ్డపై జరిగిన టోర్నీలో అత్యంత చెత్త ప్రదర్శన చేసిన సఫారీ ఐదో స్థానంలో పదిలంగా నిలువడం విశేషం. ర్యాంకులు, రేటింగ్ పాయింట్లను లెక్కించేందుకు 2022 మే నుంచి 2024 ఏప్రిల్ వరకు జరిగిన మ్యాచ్‌లకు 50 శాతం వెయిటేజీ ఇవ్వగా, ఆ తర్వాత జరిగిన మ్యాచ్‌లకు వంద శాతం వెయిటేజీ ఇస్తున్నట్లు ఐసీసీ తెలిపింది.



గడుల ఆట... కొత్త బాట!

- దోహాలో సరికొత్తగా ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్
- డిసెంబర్ 26 నుంచి మెగా టోర్నీ

ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు మారబోతున్నాయి. దీంతో గడుల్లో వేసే ఎత్తులు, పైఎత్తులు కొత్త ఫార్మాట్‌లో జరగనున్నాయి. అయితే ఈ తరహా ఫార్మాట్ ఇప్పుడైతే ఖతర్‌లో జరిగే టోర్నీలో నిర్వహిస్తారు. ఆ తర్వాత కొనసాగుతుందో లేదో టోర్నీ జరిగిన విధానం, ఆసక్తిగొలిపిన వైనాన్ని బట్టి అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) తుది నిర్ణయం తీసుకుంటుంది. మొత్తానికి ఇన్నాళ్లు జరిగిన ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలది ఒక లెక్కయితే... దోహాలో జరగబోయేది మాత్రం కొత్త లెక్క! ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్‌షిప్ మాత్రం మారలేదు. తెలుగుతేజం, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి డిఫెండింగ్ చాంపియన్ హోదాతో బరిలోకి దిగనుంది.

టూకీగా... ఇదీ టోర్నీ కహానీ!

'ఫిడే' ప్రపంచ ర్యాపిడ్–బ్లిట్జ్ టోర్నీకి దోహా (ఖతర్) ఆతిథ్య వేదిక కాగా... డిసెంబర్ 26 నుంచి 31 వరకు ఆరు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయి. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ: 10 లక్షల యూరోలు (భారత కరెన్సీలో రూ. 9.58 కోట్లు). ఓపెన్ కేటగిరీ విజేతలకు ర్యాపిడ్, బ్లిట్జ్ (3.5 లక్షల యూరోల చొప్పున) 7 లక్షల యూరోలు (రూ. 6.7 కోట్లు), మహిళల విభాగం విజేతలకు 3 లక్షల యూరోలు (రూ.2.87 కోట్లు). ర్యాపిడ్, బ్లిట్జ్‌లకు లక్షన్నర యూరోల చొప్పున కేటాయించారు.

బ్లిట్జ్ ఫార్మాట్ మార్పులివి...

ఈ ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నాకౌట్ దశను మరింత క్రమబద్ధీకరించారు. అంటే గతంలో ఎనిమిది మందితో మొదలయ్యే క్వార్టర్ ఫైనల్ నాకౌట్ దశ స్థానంలో ఇప్పుడు నలుగురు మాత్రమే పాల్గొనే సెమీఫైనల్‌ను తీసుకొచ్చారు. ఈ టోర్నీల తొలిదశ స్విస్ లీగ్ పద్ధతి నుంచి నేరుగా సెమీఫైనల్స్ పోటీలే జరుగుతాయి. మధ్య ఎనిమిది మంది బరిలో ఉండే క్వార్టర్ ఫైనల్స్ ఉండవిక!



డిఫెండింగ్ చాంపియన్స్ నిపోమ్‌నిషి, ముర్జిన్, కోనేరు హంపి, జు వెన్‌జున్ (ఫైల్)

ఈ మార్పుతో ఒరిగేదేంటి?

'ఫిడే' అధికారుల వివరణ ప్రకారం కొత్త బ్లిట్జ్ ఫార్మాట్‌లో స్విస్ లీగ్ పద్ధతి నుంచి నాకౌట్ చేరే వరకు ప్రతీ మ్యాచ్ ఆసక్తికరంగా, పోటాపోటీగా జరిగే అవకాశముంటుంది. స్విస్ లీగ్ దశలో ఎక్కువ మ్యాచ్‌లు ఆడటం వల్ల ఇందులో నిలకడైన ప్రదర్శన కనబరిచిన వారే చివరకు నాకౌట్ దశ (సెమీస్)కు అర్హత సాధిస్తారు. అంటే ఒకరితో ఒక ఎత్తు పొరపాటుతో ఓడిన మ్యాచ్, మరొకరు ఒక పైఎత్తుతో గెలిచిన మ్యాచ్‌ల వల్ల నాకౌట్ అవకాశాలు కోల్పోరు. ఎందుకంటే విరివిగా ఉండే లీగ్ మ్యాచ్‌ల వల్ల ఒక పొరపాటును అధిగమించి మరో మ్యాచ్‌లో గెలిచే అవకాశాలుంటాయి.

బ్లిట్జ్‌లో 19 రౌండ్లు

ఓపెన్ కేటగిరీలో బ్లిట్జ్ చాంపియన్‌షిప్ 19 రౌండ్ల పాటు జరుగుతుంది. మహిళల విభాగంలో 15 రౌండ్ల పాటు నిర్వహిస్తారు. అనంతరం నలుగురు చొప్పున సెమీఫైనల్‌కు చేరతారు. ఇక్కడి నుంచి గెలిచిన ఇద్దరి మధ్య ఫైనల్ పోరు జరుగుతుంది. దీనికి సంబంధించిన మరింత సమాచారాన్ని, నియమనిబంధనల్ని ఫిడే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.



యథాతథంగానే ర్యాపిడ్ ఈవెంట్

బ్లిట్జ్ పోరు మారింది. కానీ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌ను ఫిడే మార్చలేదు. ఓపెన్ కేటగిరీలో 13 రౌండ్లు, మహిళల విభాగంలో 11 రౌండ్ల మ్యాచ్‌లు జరుగుతాయి. అగ్రస్థానంలో నిలిచిన వారే విజేతగా ఆవిర్భవిస్తారు. ఒకవేళ టాప్‌లో పాయింట్లు సమంగా ఉంటే మాత్రం విజేతను తేల్చడానికి ప్లేఆఫ్ పోటీని నిర్వహిస్తారు.

గత ఏడాది న్యూయార్క్ వేదికగా ప్రపంచ ర్యాపిడ్, చెస్ చాంపియన్‌షిప్ జరిగింది. ర్యాపిడ్ ఫార్మాట్ ఓపెన్‌లో విభాగంలో రష్యాకు చెందిన 18 ఏళ్ల ముర్జిన్... మహిళల విభాగంలో భారత స్టార్ కోనేరు హంపి విజేతలుగా నిలిచారు. బ్లిట్జ్ ఫార్మాట్ ఓపెన్ విభాగంలో ఇయాన్ నిపోమ్‌నిషి (రష్యా), కార్ల్‌సన్ (నార్వే) సంయుక్త విజేతలుగా నిలువగా... మహిళల విభాగంలో చైనాకు చెందిన జు వెన్‌జున్ టైటిల్ సాధించింది.

పోలాండ్ ఈవెంట్‌కు నీరజ్



న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పోలాండ్ టోర్నీలో పాల్గొనేందుకు సిద్ధమయ్యాడు. నిజానికి చోప్రా ఈ నెల 24న 'ఎన్‌సీ క్లాసిక్' టోర్నమెంట్‌ను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాడు. కానీ భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితుల వల్ల పలు విమానాశ్రయాల మూసివేతతో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలనుకున్న ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్ నిరవధికంగా వాయిదా పడింది. ఇపుడు ఇదే సమయంలో పోలాండ్‌లో జరిగే ఈవెంట్‌లో నీరజ్ బరిలోకి దిగుతాడు. ఈ నెల 23న అక్కడ 'ఒర్లిన్ జానుస్జ్ కుసాసిన్స్కి మెమోరియల్ ఈవెంట్' జరుగనుంది. ఈ ఈవెంట్‌లో పలువురు అంతర్జాతీయ మేటి జావెలిన్ త్రోయర్లు పాల్గొంటారు. రెండుసార్లు ప్రపంచ చాంపియన్, పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జులియన్ వెబెర్ (జర్మనీ), పోలాండ్ జాతీయ రికార్డు నెలకొల్పిన మార్సిన్ క్రుకొవ్‌స్కీ తదితరులు పాల్గొంటారు. ఈ సీజన్‌లో దక్షిణాఫ్రికా ఈవెంట్‌తో ఈ సీజన్‌కు శ్రీకారం చుట్టిన చోప్రా ఈ నెల 16న దోహా డైమండ్ లీగ్‌లో పాల్గొనాల్సి ఉంది.

సంయుక్త ఆధిక్యంలో ప్రజ్ఞానంద

బుకారెస్ట్ (రొమేనియా): సూపర్ బెట్ క్లాసిక్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద తన ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నాడు. మరో ముగ్గురితో కలిసి అతను సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాడు. అలీరెజా (ఫ్రాన్స్)తో జరిగిన ఏడో రౌండ్ పోరును ప్రజ్ఞానంద 'డ్రా'గా ముగించాడు. 7 రౌండ్‌ల తర్వాత 4 పాయింట్లతో ప్రజ్ఞానంద, అలీ రెజా, కరువానా (అమెరికా), మ్యాగ్జిమ్ (ఫ్రాన్స్)లు సంయుక్తంగా ముందంజలో ఉన్నారు. ఈ టోర్నీలో మరో రెండు రౌండ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ నలుగురిలో ఎవరైనా విజేతగా నిలిచే అవకాశం ఉంది.


వచ్చే నెలలో జాతీయ షూటింగ్ ట్రయల్స్

రాణించిన వారు ఆసియా, ప్రపంచకప్ టోర్నీలకు ఎంపిక

న్యూఢిల్లీ: జాతీయ షూటింగ్ సెలక్షన్ వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు భారత రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) సమాఖ్య తెలిపింది. జూన్ 24 నుంచి 30 వరకు డెహ్రాడూన్‌లోని త్రిశూల్ షూటింగ్ రేంజ్‌లో ఈ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహిస్తారు. ఇందులో గ్రూప్ 'ఎ' రైఫిల్, పిస్టల్ షూటర్లు పాల్గొంటారని ఎన్ఆర్ఏఐ వర్గాలు తెలిపాయి. ఈ ట్రయల్స్‌లో ఎంపికై న జట్టు ఆసియా షూటింగ్‌తో పాటు ప్రపంచకప్‌లలో పాల్గొంటుంది. ఆసియా చాంపియన్‌షిప్ కజకిస్తాన్‌లో ఆగస్టులో జరుగనుండగా... చైనా, ఈజిప్టులలో జరగాల్సిన ప్రపంచకప్ తేదీలు త్వరలో వెల్లడి కానున్నాయని ఎన్ఆర్ఏఐ వర్గాలు తెలిపాయి. ఇటీవల అర్జెంటీనా, పెరూలలో జరిగిన షూటింగ్ పోటీల్లో భారత షూటర్లు విశేషంగా రాణించారు. ఏకంగా 32 ఈవెంట్లలో ఫైనల్ చేరిన షూటర్లు ఆరు బంగార్ల పతకాలు సహా 15 పతకాలను గెలుపొందారు. అయితే డెహ్రాడూన్‌లో జరిగేది ఓపెన్ సెలక్షన్ కాదు... అర్హత గల గ్రూప్ 'ఎ' షూటర్లు మాత్రం ఈ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అర్హులు. ట్రయల్స్–3, ట్రయల్స్–4 మొత్తం ఒలింపిక్ రైఫిల్, పిస్టల్ ఈవెంట్లను కవర్ చేస్తుంది.



ఇక స్లాట్‌ల విషయానికొస్తే... 10 మీటర్ల ఎయిర్ రైఫిల్, 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లలో మహిళలు, పురుషులకు కలిపి 50 స్లాట్‌లు ఉంటాయి. 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో 30 స్లాట్‌లు, 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ (పురుషులు)లో 20 స్లాట్‌లు, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ (మహిళలు)లో 30 స్లాట్‌లు అందుబాటులో ఉన్నాయి.



'నా ప్రదర్శన సంతృప్తినిచ్చింది'

భారత్ ఆఫ్ స్పిన్నర్ స్నేహ్ రాణా

న్యూఢిల్లీ: శ్రీలంకలో జరిగిన ముక్కోణపు వన్డే టోర్నీని భారత మహిళల జట్టు గెలుచుకోవడంలో ఆఫ్‌స్పిన్నర్ స్నేహ్ రాణా కీలకపాత్ర పోషించింది. ఐదు మ్యాచ్‌లలో కలిపి కేవలం 14 సగటుతో 15 వికెట్లు పడగొట్టిన రాణా 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచింది. ముఖ్యంగా బ్యాటర్లు భారీ స్కోర్లతో ఆధిపత్యం ప్రదర్శించిన పిచ్‌లపై స్నేహ్ సాంప్రదాయ ఆఫ్ స్పిన్‌తో ఆకట్టుకుంది. గతంలో ఒక వన్డే టోర్నీలో అత్యధిక వికెట్లు (15) తీసిన ఆస్ట్రేలియా బౌలర్ కేథరీన్ ఫిట్‌ప్యాట్రిక్ రికార్డును కూడా ఆమె సమం చేసింది. తన ప్రదర్శన వెనక జట్టు బౌలింగ్ కోచ్ అవిష్కార్ సాల్వీ సహకారం ఎంతో ఉందని, ఆయన మార్గనిర్దేశనంలోనే తన ఆటలో పదును పెరిగినట్లు స్నేహ్ చెప్పింది. 'సిరీస్ సమయంలో కోచ్ సాల్వీ చక్కటి సూచనలు అందించారు. బ్యాటింగ్‌కు బాగా అనుకూలిస్తున్న పిచ్‌లను సరైన రీతిలో అర్థం చేసుకున్న ఆయన ఇక్కడ ఎలాంటి బౌలింగ్ పని చేస్తుందో గుర్తించారు. వేగాన్ని కాస్త తగ్గించి ఫుల్ లెంగ్త్ బంతులు వేయాలని ఆయన సూచించారు. అది చాలా బాగా పని చేసింది' అని వివరించింది. ఈ సిరీస్‌కు ఏడాదిన్నర కాలం పాటు స్నేహ్ రాణా జట్టులో స్థానం కోల్పోయింది. పునరాగమనంలో సత్తా చాటి జట్టును గెలిపించడం చాలా సంతృప్తినిచ్చిందని ఆమె చెప్పింది. 'సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టీమ్‌లోకి రావడం రావడం సంతోషంగా అనిపించింది. ఈ బ్లూ జెర్సీని ధరించడం నాకు గర్వకారణం. ఇప్పుడు నాకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలిగాను. ప్రతికూల పరిస్థితుల్లో ఒత్తిడిని అధిగమించి రాణించడం ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది. ఈ అనుభవం కూడా ఎంతో పనికొస్తుంది. వ్యక్తిగతంగా చూస్తే చాలా కాలం విరామం తర్వాత జట్టు తరఫున బాగా ఆడి 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలవడం చూస్తే నిజంగా నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను' అని స్నేహ్ రాణా భావోద్వేగంతో చెప్పింది. భారత్ తరఫున 32 వన్డేల్లో 44 వికెట్లు పడగొట్టిన రాణా...25 టి20ల్లో 24 వికెట్లు తీసింది. శ్రీలంకలో ఆమె తాజా ప్రదర్శనను చూస్తే స్వదేశంలో ఈ ఏడాది జరిగే వన్డే వరల్డ్ కప్‌లో రాణాకు చోటు ఖాయమని చెప్పవచ్చు.

సినెర్ ముందంజ

క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్



రోమ్: నిషేధం గడువు పూర్తయ్యాక బరిలోకి దిగిన తొలి టోర్నమెంట్‌లో ప్రపంచ పురుషుల టెన్నిస్ నంబర్‌వన్ యానిక్ సినెర్ జోరు కొనసాగిస్తున్నాడు. రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టోర్నీలో సినెర్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ 18వ ర్యాంకర్ ఫ్రాన్సిస్కో సెరున్‌డోలో (అర్జెంటీనా)తో జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సినెర్ 7–6 (7/2), 6–3తో విజయం సాధించాడు. 2 గంటల 17 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సినెర్ రెండు ఏస్‌లు సంధించాడు. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. ఏడుసార్లు నెట్ వద్దకు దూసుకొచ్చిన సినెర్ నాలుగుసార్లు పాయింట్లు గెలిచాడు. సెరున్‌డోలో 14 సార్లు నెట్ వద్దకు వచ్చి ఎనిమిది సార్లు పాయింట్లు సొంతం చేసుకున్నాడు. 17 విన్నర్స్ కొట్టిన సినెర్ 30 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు సెరున్‌డోలో 29 విన్నర్స్ కొట్టి ఏకంగా 53 అనవసర తప్పిదాలు చేశాడు. 91 సర్వీస్ పాయింట్లలో సినెర్ 51 పాయింట్లు... 86 సర్వీస్ పాయింట్లలో సెరున్‌డోలో 47 పాయింట్లు సాధించారు. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఏడో ర్యాంకర్ కాస్పర్ రూడ్ (నార్వే)తో సినెర్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో సినెర్ 3–0తో రూడ్‌పై ఆధిక్యంలో ఉన్నాడు. మరోవైపు ప్రపంచ మూడో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్ జాక్ డ్రేపర్ (బ్రిటన్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్ 6–4, 6–4తో విజయం సాధించాడు.

సెమీస్‌లో కోకో గాఫ్

రోమ్ ఓపెన్ మహిళల టోర్నీలో ప్రపంచ మూడో ర్యాంకర్, అమెరికా స్టార్ కోకో గాఫ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. ప్రపంచ ఏడో ర్యాంకర్ మీరా ఆంద్రియెవా (రష్యా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో కోకో గాఫ్ 6–4, 7–6 (7/5)తో గెలుపొందింది. ఒక గంట 32 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో కోకో గాఫ్ తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

చైనా పత్రికలపై భారత్‌ నిషేధం

న్యూఢిల్లీ: చైనా పాల్పడుతున్న భారత వ్యతిరేక ప్రచారంపై కేంద్రం కన్నెర్రజేసింది. పాకిస్తాన్‌కు అనుకూలంగా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నందుకు గ్లోబల్‌ టైమ్స్, జిన్‌హువా పత్రికల ఎక్స్‌ ఖాతాలను నిషేధించింది. అవి రెండూ చైనా కమ్యూనిస్ట్‌ పార్టీ కరపత్రాల వంటివి. భారత ప్రభుత్వం ధ్రువీకరించని విషయాలను సోషల్‌ మీడియాలో పోస్టు చేస్తున్న చైనా మీడియాకు మన రాయబార కార్యాలయం గతంలోనే హెచ్చరికలు జారీ చేసింది. అయినా అదే ధోరణి కొనసాగడంతో తాజా చర్యలు తీసుకుంది. ఆపరేషన్‌ సిందూర్‌ తర్వాత మూడు భారత యుద్ధ విమానాలను పాక్‌ కూల్చేసిందని గ్లోబల్‌ టైమ్స్‌ పేర్కొంది. ఇలా పచ్చి అబద్ధాలు ప్రచురించడం బాధ్యతారాహిత్యమని, జర్నలిజం విలువలకు విరుద్ధమని భారత రాయబార కార్యాలయం విమర్శించింది. భారత్‌–పాక్‌ ఉద్రిక్తతలపై తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేయడంపై ఆగ్రహించింది. అయితే గ్లోబల్‌ టైమ్స్‌పై నిషేధాన్ని బుధవారం అర్ధరాత్రి ఎత్తేసింది.



రాష్ట్రపతి ముర్మతో సీడీఎస్, త్రివిధ దళాల అధిపతుల భేటీ

న్యూఢిల్లీ: చీఫ్‌ ఆఫ్‌ డిఫెన్స్‌ స్టాఫ్‌(సీడీఎస్‌) అనిల్‌ చౌహాన్‌తోపాటు త్రివిధ దళాల అధిపతులు జనరల్‌ ఉపేంద్ర ద్వివేది, ఎయిర్‌ చీఫ్‌ మార్షల్‌ ఎ.పి.సింగ్, అడ్మిరల్‌ దినేశ్‌ కె.త్రిపాఠి బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మను కలిశారు. ఆపరేషన్‌ సిందూర్‌ గురించి ఆమెకు వివరించారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి భవన్‌ వర్గాలు 'ఎక్స్‌'లో తెలియజేశాయి. భారత సైనిక దళాల శక్తిసామర్థ్యాలు, అంకితభావాన్ని రాష్ట్రపతి ఈ సందర్భంగా ప్రశంసించినట్లు పేర్కొన్నాయి.



వలసవచ్చిన వ్యోమగామి !

సాంస్కృతిక గుర్తింపు, వలసవాదం, ప్రపంచీకరణ అంటూ సమకాలీన అంశాలపై భిన్న కళాకృతులకు ప్రాణం పోసే ప్రముఖ కళాకారుడు యింకా షోనిబారే సీబీఈ సృష్టించిన కొత్త కళాఖండమిది. ఈ కళాఖండానికి ''తట్టా బుట్టా సర్దుకుని వలస వచ్చిన పర గ్రహపు వ్యోమగామి'' అని పేరు పెట్టారు. నెదర్లాండ్స్‌లోని రోట్టెర్డ్యామ్‌ నగరంలోని ఫీనిక్స్‌ మైగ్రేషన్‌ మ్యూజియంలో ఈ కళాఖండాన్ని బుధవారం ప్రదర్శించారు.

బహమాస్‌లో భారత విద్యార్థి మృతి

హోటల్‌ బాల్కనీ నుంచి పడి దుర్మరణం

బోస్టన్‌: భారత సంతతికి చెందిన ఓ అమెరికా విద్యార్థి బహమాస్‌ ద్వీపంలో ప్రమాదవశాత్తూ మరణించాడు. 25 ఏళ్ల గౌరవ్‌ జైసింగ్‌ అమెరికాలో బెంట్లీ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్‌ ఇన్ఫర్మేషన్‌ సిస్టమ్స్‌ చదువుతున్నాడు. శనివారం వర్సిటీ అండర్‌ గ్రాడ్యుయేషన్‌ వేడుక నేపథ్యంలో సీనియర్‌ విద్యార్థులు బహమాస్‌ పర్యటనకు వెళ్లారు. అట్లాంటిస్‌ ప్యారడైజ్‌ ఐలాండ్‌ రిసార్ట్‌ అండ్‌ క్యాసినోలో బస చేశారు. మే 11 రాత్రి హోటల్‌ గదిలో మిత్రులతో కలిసి గడుపుతున్న గౌరవ్‌ పై అంతస్తు బాల్కనీ నుంచి పడిపోయాడు. అత్యవసర వైద్యం అందించి ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించినట్టు పోలీసులు తెలిపారు. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందని ధ్రువీకరించారు. దర్యాప్తు కొనసాగుతోంది. బోస్టన్‌కు 12 మైళ్ల దూరంలో ఉండే బెంట్లీ ఓ చిన్న ప్రైవేట్‌ విశ్వవిద్యాలయం.

పాక్‌ సిబ్బందితో భారత్‌కు నౌక

ఒడిశా ఓడరేవులో కలకలం

పారాదీప్‌: సింగపూర్‌ మీదుగా దక్షిణకొరియా నుంచి భారత్‌కు వచ్చిన చమురు రవాణా నౌకలో మొత్తం సిబ్బందిలో 21 మంది పాక్‌ జాతీయులు ఉన్నట్లు తేలడంతో ఒడిశాలోని పారాదీప్‌ ఓడరేవులో ఒక్కసారిగా కలకలం రేగింది. పరస్పర సైనిక చర్యలతో భారత్, పాక్‌ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ పాక్‌ వ్యతిరేక వర్గాలు నౌకాశ్రయానికి చేరుకుని ఆందోళన చేపట్టకుండా ఉండేందుకు పోర్ట్‌ అధికారులు వెంటనే అలర్ట్‌ ప్రకటించారు. ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌ కోసం విదేశాల నుంచి తీసుకొచ్చిన ముడి చమురును నౌక నుంచి కిందకు దింపే వరకు నౌకాశ్రయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా చర్యలు చేపట్టారు. పారాదీప్‌ పట్టణంలో ఒడిశా పోలీసులు వెంటనే భద్రతను పెంచారు. 25 మంది సిబ్బందితో 'ఎంటీ సైరన్‌ II' పేరున్న సరకు రవాణా నౌక బుధవారం తెల్లవారుజామున పారాదీప్‌ పోర్ట్‌కు రాగానే అధికారులు సిబ్బంది గురించి వాకబుచేశారు. వీరిలో ఒక శ్రీలంకన్, ఒక థాయిలాండ్‌ దేశస్తుడు, ఇద్దరు భారతీయులు, 21 మంది పాకిస్తానీయులు ఉన్నారు. ఇమిగ్రేషన్‌శాఖ నుంచి సంబంధిత సమాచారాన్ని ఒడిశా మెరైన్‌ పోలీస్‌కు, సెంట్రల్‌ ఇండస్ట్రియల్‌ సెక్యూరిటీ ఫోర్స్‌(సీఐఎస్‌ఎఫ్‌)కు చేరవేశామని మెరైన్‌ పోలీస్‌స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ బబితా చెప్పారు. ప్రస్తుతం ఓడ నౌకాశ్రయం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో సముద్రజలాల్లో లంగరు వేసి ఉంది. క్రూడ్‌ ఆయిల్‌ అన్‌లోడింగ్‌ అవగానే సిబ్బందితో నౌక వెళ్లిపోతుందని జగత్‌సింగ్‌పూర్‌ ఎస్పీ భవానీశంకర్‌ స్పష్టంచేశారు. అప్పటిదాకా పాకిస్తాన్‌ సిబ్బందిని నౌక నుంచి బయటకు అనుమతించబోమని చెప్పారు.

నోరు పారేసుకున్న మంత్రిపై ఎఫ్‌ఐఆర్‌

మధ్యప్రదేశ్‌ మంత్రి విజయ్‌ షా వ్యాఖ్యలపై రగడ

- ఉగ్రవాదుల సోదరి కల్నల్‌ సోఫియా ఖురేషీ అంటూ వ్యాఖ్యలు



మంత్రి విజయ్‌ షా



సోఫియా ఖురేషీ

జబల్పూర్‌: పాకిస్తాన్‌ ఉగ్రవాదులే లక్ష్యంగా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్‌ సిందూర్‌'గురించి మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి, దేశ ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించిన మహిళా సైనికాధికారి, కల్నల్‌ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్‌ గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి, బీజేపీ నేత విజయ్‌ షా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. మహిళా అధికారిని కించపర్చేలా మాట్లాడిన విజయ్‌ షాపై ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేయాలని మధ్యప్రదేశ్‌ హైకోర్టు బుధవారం పోలీసులను ఆదేశించింది. మంత్రి వ్యాఖ్యలను న్యాయస్థానం సుమోటోగా విచారణకు స్వీకరించింది. బుధవారం సాయంత్రం 6 గంటల్లోగా ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేసి, ఆ విషయం తమకు తెలియజేయాలని పేర్కొంది. తదుపరి విచారణను గురువారం ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసింది.

అసలేమిటీ వివాదం?

మంత్రి విజయ్‌ షా మంగళవారం ఓ సాంస్కృతిక కార్యక్రమంలో ప్రసంగించారు. కల్నల్‌ సోఫియా ఖురేషీ ఉగ్రవాదుల సోదరి అనే అర్థం వచ్చేలా మాట్లాడారు. ''జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు హిందువుల బట్టలు విప్పి, మతం నిర్ధారించుకొని కాల్చి చంపారు. ఉగ్రవాదుల బట్టలు మనం విప్పలేకపోయాం. కాబట్టి వారి మతానికి చెందిన ఒక సోదరిని(సోఫియా ఖురేషీ) పంపించాం. మా సోదరీమణులను ఉగ్రవాదులు వితంతవులుగా మార్చారు. అందుకే మీ మతంలోని ఒక సోదరి మిమ్మల్ని వివస్త్రలుగా మారుస్తుంది. పహల్గాం ఉగ్రవాద దాడి పట్ల ప్రతీకారం తీర్చుకోవడానికి ఉగ్రవాదుల సోదరిని పాకిస్తాన్‌పైకి పంపవచ్చని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిరూపించారు''అని విజయ్‌ షా పేర్కొన్నారు. ఈ వీడియో సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారింది. ఆయన వ్యాఖ్యల పట్ల దేశ వ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలకు అతీతంగా అందరూ ఖండిస్తున్నారు. మాజీ సైనికాధికారులు కూడా ఖండించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మంత్రివర్గం నుంచి తొలగించాలి

విజయ్‌ షాను తక్షణమే మధ్యప్రదేశ్‌ మంత్రివర్గం నుంచి తొలగించాలని కాంగ్రెస్‌ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్‌ రమేశ్‌ డిమాండ్‌ చేశారు. విజయ్‌ షా వ్యాఖ్యలను బీజేపీ సీనియర్‌ నేత ముక్తార్‌ అబ్బాస్‌ నఖ్వీ తీవ్రంగా ఖండించారు. ఆయనొక మూర్ఖుడు అని మండిపడ్డారు. బుద్ధిజ్ఞానం లేకుండా మాట్లాడడం కొందరికి అలవాటైపోయిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయ్‌ షా అభ్యంతకర వ్యాఖ్యలను ఉత్తరప్రదేశ్‌ మాజీ ముఖ్యమంత్రి, బీఎస్పీ అధినేత మాయావతి సైతం ఖండించారు. మహిళా అధికారి గురించి అలా మాట్లాడడం సిగ్గుచేటు అని ధ్వజమెత్తారు. ఆయనపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తాజా వివాదంపై జాతీయ మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ విజయ రహత్కార్‌ తీవ్రంగా స్పందించారు. మహిళలను కించపర్చేలా మాట్లాడడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. యూనిఫాంలో విధులు నిర్వర్తించే మహిళా అధికారులను గౌరవించాలని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ అనుచితంగా మాట్లాడడాన్ని సహించబోమని హెచ్చరించారు.

పదిసార్లు క్షమాపణ చెప్పడానికి సిద్ధం: విజయ్‌ షా

తన వ్యాఖ్యల పట్ల దుమారం రేగుతుండడంతో విజయ్‌ షా బుధవారం స్పందించారు. ఎవరైనా బాధపడి ఉంటే ఒకటి కాదు పదిసార్లు క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కల్నల్‌ సోఫియా ఖురేషీని తన సోదరి కంటే ఎక్కువగా గౌరవిస్తున్నానని చెప్పారు.

సోఫియా ఖురేషీ అత్తింటిపై దాడి అంటూ వదంతులు

సాక్షి బెంగళూరు: కల్నల్‌ సోఫియా ఖురేషీ అత్తవారింటిపై ఆర్‌ఎస్‌ఎస్‌ వర్గాలు దాడి చేశాయని 'ఎక్స్‌'లో వదంతులు వ్యాపించాయి. కర్ణాటకలోని బెళగావిలో సోఫియా భర్త ఇంటిపై దాడి జరిగినట్లుగా వినిపిస్తున్న వార్తలన్నీ అవాస్తవాలని జిల్లా ఎస్పీ డాక్టర్‌ భీమా శంకర్‌ స్పష్టంచేశారు. సోఫియా భర్త ఇంటిపై ఆర్‌ఎస్‌ఎస్‌ మద్దతుదారులు దాడి చేసినట్లుగా ధ్వంసమైన ఒక ఇంటిని ఫోటోను అనీస్‌ ఉద్దీన్‌ అనే పేరుతో 'ఎక్స్‌'లో షేర్‌ చేశారు. అది ఫేక్‌ పోస్టు అని పోలీసులు తేల్చారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఎవరైనా సోషల్‌ మీడియాలో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

ఇవేంటి! ఇంత అద్భుతంగా ఉన్నాయ్‌!

ఖతార్‌ ప్యాలెస్‌ అందాలకు ముగ్ధుడైన ట్రంప్‌

దోహా: ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశానికి అధ్యక్షుడు. అపర కుబేరుడు. అలాంటి ట్రంప్‌ సౌదీ అరేబియా, ఖతార్‌ అధినేతల ప్రాభవం చూసి నోరెళ్లబెట్టారు. వారి రాజభవనాలను చూసి అసూయపడ్డానని స్వయంగా చెప్పారు. ఖతార్‌ రాజప్రాసాదాల ఠీవి, సౌకర్యాలు చూసి, ''ఇవేంటి ఇంత అద్భుతంగా ఉన్నాయి! వీటిని జీవితంలో కొనలేం'' అని వ్యాఖ్యానించారు. తన అత్యాధునిక 'ఎయిర్‌ ఫోర్స్‌ వన్‌' విమానం కంటే అత్యంత విలాసవంత, అధునాతన బోయింగ్‌–747 రకం విమానాలను ఖతార్, సౌదీల్లో చూశానని చెప్పుకొచ్చారు. ఖతార్‌ నుంచి విమానాన్ని కానుకగా తీసుకోవడానికి సంకోచించబోనని బల్లగుద్దిమరీ చెప్పారు. ఖతార్‌ పాలకుడు అమీర్‌ తమీమ్‌ బిన్‌ హమాద్‌ అల్‌ థానీ రాజభవనం 'అమీర్‌ దివాన్‌'ను చూసి దిగ్భ్రాంతికి లోనయ్యానని వెల్లడించారు. ''స్వతహాగా నేను రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారిని. నిర్మాణ నైపుణ్యం, కట్టడాల నేర్పు ఇట్టే పసిగడతా. మీ నివాసాలు భూలోక స్వర్గాలు. ఇంద్రభవనాలు. ఎంత పర్‌ఫెక్ట్‌గా కట్టారో!'' అంటూ ప్రశంసల్లో ముంచెత్తారు.

ఖతార్‌తో 200 బిలియన్‌ డాలర్ల డీల్‌

అమెరికా నుంచి 160 విమానాల కొనుగోలుకు ఖతార్‌ సంసిద్ధత

- ఖతార్‌లో పర్యటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌

దోహా/రియాద్‌: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ సౌదీ అరేబియా పర్యటన ముగించుకొని బుధవారం ఖతార్‌ చేరుకున్నారు. ఖతార్‌లో ఆయన ఘన స్వాగతం లభించింది. అమెరికాకు చెందిన బోయింగ్‌ సంస్థ నుంచి 160 విమానాలు కొనుగోలు చేసేందుకు ఖతార్‌ ఒప్పందం చేసుకున్నట్లు ట్రంప్‌ వెల్లడించారు. ఈ డీల్‌ విలువ 200 బిలియన్‌ డాలర్లు అని తెలిపారు. ఖతార్‌ పాలకుడు షేక్‌ తమీమ్‌ బిన్‌ హమద్‌ అల్‌–థానీ, డొనాల్డ్‌ ట్రంప్‌ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. ఈ పర్యటన కంటే ముందు ట్రంప్‌ మాట్లాడుతూ.. ఖతార్‌ నుంచి ఒక విమానాన్ని బహుమతిగా స్వీకరించాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఖతార్‌ ఇచ్చే విమానాన్ని ఎయిర్‌ఫోర్స్‌ వన్‌గా వాడుకుంటానని వ్యాఖ్యానించారు. మరోవైపు తుర్కియేలో పర్యటించాలన్న ఆకాంక్షను ట్రంప్‌ వ్యక్తంచేశారు. ఉక్రెయిన్, రష్యా అధినేతలు జెలెన్‌స్కీ, పుతిన్‌ తుర్కియేలో ముఖాముఖి భేటీ కాబోతున్నట్లు ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే. ఈ భేటీ పట్ల ట్రంప్‌ ఆసక్తి కనబరుస్తున్నారు. తాను తుర్కియేకు వెళ్తే పుతిన్‌ ఎంతగానో సంతోషిస్తారని ట్రంప్‌ చెప్పారు.

ఒకప్పుడు ఉగ్రవాదుల జాబితాలో ఉన్న సిరియా అధ్యక్షుడితో ట్రంప్‌ సమావేశం



సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్‌ అల్‌ షారాతో ట్రంప్‌ కరచాలనం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ బుధవారం సౌదీ అరేబియాలో సిరియా అధ్యక్షుడు అహ్మద్‌ అల్‌–షారాతో సమావేశమయ్యారు. రెండు దేశాల అధినేతలు కలుసుకోవడం గత 25 ఏళ్లలో ఇదే మొదటిసారి. 50 ఏళ్లగా అస్సద్‌ కుటుంబ పాలనలో అంతర్యుద్ధంతో నలిగిపోయిన సిరియాకు ఇటీవలే విముక్తి లభించిన సంగతి తెలిసిందే. ట్రంప్‌తో అల్‌–షారా కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌ దేశాన్ని అధికారికంగా గుర్తించాలని, సిరియా నుంచి విదేశీ ఉగ్రవాదులను బయటకు వెళ్లగొట్టాలని అల్‌–షారాను ట్రంప్‌ కోరినట్లు వైట్‌హౌస్‌ ప్రెస్‌ సెక్రెటరీ కరోలిన్‌ లెవిట్‌ తెలిపారు. అల్‌– షారాతో భేటీ అనంతరం ఎయిర్‌ఫోర్స్‌ వన్‌లో డొనాల్డ్‌ ట్రంప్‌ మీడియాతో మాట్లాడారు. సిరియా అధ్యక్షుడిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన ఆకర్షణీయంగా కనిపిస్తున్న అందమైన యువకుడు అంటూ కొనియాడారు. బలమైన వ్యక్తి, ఫైటర్‌ అంటూ శ్లాఘించారు. సిరియాపై ఆంక్షలు రద్దు చేస్తున్నట్లు ట్రంప్‌ ఇప్పటికే ప్రకటించారు. దీంతో సిరియా ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. తమకు మంచి రోజులు వచ్చాయని ఆనందం వ్యక్తంచేశారు. అస్సద్‌ ప్రభుత్వ హయాంలో తిరుగుబాటు నాయకుడిగా గుర్తింపు పొందిన అల్‌–షారాను అమెరికా ప్రభుత్వం 2013లో అంతర్జాతీయ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది. ఆయనపై 10 మిలియన్‌ డాలర్ల రివార్డు ప్రకటించింది. అదే అల్‌–షారా అధ్యక్షుడు కావడం, డొనల్డ్‌ ట్రంప్‌ ఆయనతో భేటీ కావడం విశేషం.

జైశంకర్‌ భద్రత పెంపు

న్యూఢిల్లీ: ఆపరేషన్‌ సిందూర్, పాకిస్తాన్‌తో తాజా ఉద్రిక్తతలు, నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో మంత్రులు, సీనియర్‌ ఉన్నతాధికారుల భద్రతపై కేంద్రం నిశితంగా దృష్టి పెట్టింది. విదేశాంగ మంత్రి ఎస్‌.జైశంకర్‌కు భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. తాజా సమీక్ష అనంతరం మంత్రి కాన్వాయ్‌లో మరో రెండు బుల్లెట్‌ ప్రూఫ్‌ వాహనాలను చేరుస్తూ కేంద్ర హోం శాఖ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలోని ఆయన నివాసం చుట్టూ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. జైశంకర్‌కు భద్రతను 2023లో వై నుంచి జెడ్‌ కేటగిరీకి పెంచారు. ఇప్పటికే రెండో అత్యున్నత స్థాయి భద్రత. అందులో భాగంగా 33 మందితో కూడిన సీఆర్‌పీఎఫ్‌ కమాండోల బృందం 24 గంటలూ ఆయనను కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటుంది. జెడ్‌ కేటగిరీలో నేషనల్‌ సెక్యూరిటీ గార్డ్‌ (ఎన్‌ఎస్‌జీ), 4 నుండి ఆరుగురు స్థానిక పోలీసు మంది కమాండోలతో సహా 22 మంది సిబ్బంది, ఒక బుల్లెట్‌ ప్రూఫ్‌ వాహనం, ఎస్కార్ట్‌ వాహనాలుంటాయి. సాధారణంగా ఉన్నత స్థాయి రాజకీయ నాయకులకు, ప్రముఖులకు, బెదిరింపులను ఎదుర్కొంటున్న వారికి ఈ స్థాయి భద్రత అందిస్తారు. కేంద్ర రక్షణ జాబితాలోని వీవీపీ భద్రతా కవర్‌ జెడ్‌–ప్లస్‌ (అడ్వాన్స్‌డ్‌ సెక్యూరిటీ లైజన్), జెడ్, వై, వై–ప్లస్, ఎక్స్‌ దాకా ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా, కాంగ్రెస్‌ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్‌ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో సహా దాదాపు 200 మందికి సీఆర్‌పీఎఫ్‌ వీవీపీ భద్రతా సంరక్షణ ఉంది.

మన వేలితో మన కన్నే..!

తుర్కియే నైచ్యానికి పరాకాష్ట • భారత ముడి పదార్థాలతోనే డ్రోన్లు

వాటినే పాక్‌కు పంపిన కండకావరం • సైనికులను కూడా పంపినట్టు వెలుగులోకి

రెండేళ్ల క్రితం భయానక భూకంపం వేళ తుర్కియేకు అందరికంటే ముందు ఆపన్న హస్తం అందించింది భారతే. 'ఆపరేషన్‌ దోస్త్‌' పేరిట భారీ సాయం చేసింది. కానీ ఆ దేశం మాత్రం తిన్నింటి వాసాలే లెక్కబెడుతోంది. సాయుధ సంఘర్షణ వేళ దాయాది పాకిస్తాన్‌కు ఎడాపెడా డ్రోన్లు, ఇతర ఆయుధాలను అందజేసి కృతఘ్నతకు బ్రాండ్‌ అంబాసిడర్‌గా మారింది. విశ్వాస ఘాతుకానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. వాటితో పాటు సైనికులను, శిక్షణా సిబ్బందిని కూడా పాక్‌కు తుర్కియే భారీగా పంపినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. డ్రోన్ల వాడకం తదితరాల్లో వాళ్లు పాక్‌ జవాన్లకు పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చినట్టు తేలింది. పాక్‌కు తుర్కిష్‌ కంపెనీ అసిస్‌గార్డ్‌ సోంగార్‌ పంపిన బైరక్తార్‌ టీబీ2, ఈహా డ్రోన్లు ఆత్మాహుతి తరహావి. లక్ష్యంపై పడి పేలిపోతాయి. ఈ డ్రోన్ల తయారీలో భారత్‌ ఎగుమతి చేసే కీలకమైన మూలకాలు, ముడి సరుకులే ప్రధాన వనరులు కావడం విశేషం! మనకు వ్యతిరేకంగా ఇలా నిస్సిగ్గుగా బరితెగించిన తుర్కియేకు ఆ కీలక ఎగుమతులను తక్షణం నిలిపేయాలని రక్షణ నిపుణులు సూచిస్తున్నారు.

కంట్రోలర్ల నుంచి రిసీవర్‌ దాకా...

ఆపరేషన్‌ సిందూర్‌లో భాగంగా ఉగ్రశిబిరాలను భారత్‌ కుప్పకూల్చిన కొద్ది గంటలకే పాక్‌ దాదాపు 400 డ్రోన్లతో సరిహద్దు ప్రాంతాలపై దాడికి తెగించడం తెలిసిందే. తుర్కియేకు భారత ఎగుమతుల్లో సింహభాగం అల్యూమినియం, అల్యూమినియం సంబంధ ఉపకరణాలు, ఆటో ఉత్పత్తులు, విమానాల విడిభాగాలు, టెలికం ఉపకరణాలు, ఎలక్ట్రిక్‌ వస్తువులు, పరికరాలు తదితరాలే. వీటిలో చాలావరకు డ్రోన్ల తయారీలో కీలకం. డ్రోన్లలోని కంట్రోలర్, ఫ్రేమ్, మోటార్, ప్రొపెల్లర్, కెమెరా, ఫ్లైట్‌ కంట్రోల్, రిసీవర్, వీడియో ట్రాన్స్‌మిటర్, యాంటెన్నా, స్పీడ్‌ కంట్రోలర్, కంట్రోలర్లను కూడా భారత్‌ నుంచే తుర్కియే దిగుమతి చేసుకుంటోంది. ముఖ్యంగా కరోనా తర్వాత ఈ ఎగుమతులు ఎక్కువచయ్యాయి. ఆ విడిభాగాలతో రూపొందించిన డ్రోన్లను పాక్‌కు అందజేయాలన్నది తుర్కియే అధ్యక్షుడు రెసిప్‌ తయ్యిప్‌ ఎర్డోగన్‌ నిర్ణయమేనని తెలుస్తోంది. అతనికి అంతులేని భారత విద్వేషిగా పేరుంది. తమ డ్రోన్లు, ఆయుధాలను భారత్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదనే ఒట్టు పెట్టుకున్నారు!

– సాక్షి, నేషనల్‌ డెస్క్‌

మన విమానాశ్రయాల భద్రత తుర్కియే సంస్థ చేతుల్లో!

భారత్‌లోని పలు అంతర్జాతీయ విమానాశ్రయాల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా అంశాల్లో కూడా తుర్కియే పరోక్షపాత్ర ఉందని వెలుగులోకి వచ్చింది. వాటిలో కార్గో హ్యాండ్లింగ్‌ వంటి కీలక కాంట్రాక్టులను తుర్కియేకు చెందిన సెలెబీ ఏవియేషన్‌ కంపెనీ చెందిన అనుబంధ సంస్థ సంపాదించిందని తేలింది. భారత్‌లో 2008 నుంచి ఈ సంస్థ సేవలందిస్తోంది. ఏటా 58,000 విమానాలు, 5.4 లక్షల టన్నుల సరకు రవాణా బాధ్యతలను చూసుకుంటోంది. అందులో 7,800 మంది సిబ్బంది ఉన్నారు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, ఢిల్లీ, అహ్మదాబాద్, గోవా, కొచ్చిన్, కన్నూర్‌ వంటి కీలక విమానాశ్రయాల్లో హై సెక్యూరిటీ బాధ్యతలు సెలెబీవే! గ్రౌండ్‌ హ్యాండ్లింగ్, కార్గో మేనేజ్‌మెంట్, ఎయిర్‌సైడ్‌ ఆపరేషన్స్‌ విధులను ఈ సంస్థే చూస్తోంది. విమానాలను నిలిపి ఉంచే హై సెక్యూరిటీ జోన్, ఎయిర్‌సైడ్‌ జోన్లన్నా సంస్థ సిబ్బందే విధుల్లో ఉంటున్నారు. ప్రయాణికుల బ్యాగులు, కార్గో పనులను చూసుకునేదీ వాళ్లే. అంతర్జాతీయ సర్వీసుల్లో కూడా ఈ బాధ్యతలను వీళ్లకే అప్పగించారు. తాజా పరిణామాల నేపథ్యంలో దీనిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆరు దేశాల్లోని 70 విమానాశ్రయాల్లో కూడా సెలెబీ కాంట్రాక్టులు సంపాదించింది.

ముమ్మరంగా 'బ్యాన్‌ తుర్కియే'

పాక్‌కు సైనికసాయం చేస్తున్నందుకు నిరసనగా తుర్కియే ఉత్పత్తులను బహిష్కరించాలన్న డిమాండ్లు దేశవ్యాప్తంగా ఊపందుకున్నాయి. ఇకపై తుర్కియే యాపిల్‌ పండ్లను దిగుమతి చేసుకోవద్దని మహారాష్ట్రలోని కీలకమైన పుణె పండ్ల మార్కెట్‌ ట్రేడర్లు నిర్ణయించుకున్నారు. ''మన సైన్యానికి మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నాం. తుర్కియేకు బదులు ఇక హిమాచల్, ఉత్తరాఖండ్‌ ఇరాన్‌ నుంచి ఆపిల్స్‌ తెప్పిస్తాం'' అని పుణె వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌ కమిటీ ట్రేడర్‌ సుయోగ్‌ జిందే చెప్పారు. పుణెలో తుర్కియే యాపిల్స్‌ టర్నోవర్‌ రూ.1,200 కోట్ల పై చిలుకే. దాంతో ఈ నిర్ణయం ఆ దేశానికి పెద్ద దెబ్బే కానుంది. తుర్కియే నుంచి తెల్ల చలువరాయి దిగుమతులనూ నిషేధించాలన్న డిమాండ్లు విన్పిస్తున్నాయి.

యాత్రలూ బంద్‌!

తుర్కియేకు మనోళ్ల విహార యాత్రలు కూడా భారీగా తగ్గాయి. ఆ దేశానికి క్యాన్సలేషన్‌లు భారీగా పెరుగుతున్నాయని ఈజ్‌మైట్రిప్, ఇక్సిగో వంటి ఆన్‌లైన్‌ ట్రావెల్‌ ప్లాట్‌ఫాంలు తెలిపాయి. తుర్కియే ప్రభుత్వ వార్తా చానల్‌ 'టీఆర్‌టీ' తాలూకు 'ఎక్స్‌' ఖాతాను కేంద్రం బ్లాక్‌ చేసింది. టర్కీతో మన వాణిజ్యం కూడా తగ్గుముఖం పడుతోంది. 2024–25 మధ్య తుర్కియేకు మన ఎగుమతులు 5.2 బిలియన్‌ డాలర్లకు పడిపోయాయి. భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌కు బాహాటంగా మద్దతు ప్రకటించిన అజర్‌బైజాన్‌కు కూడా ఇదే సెగ తగులుతోంది. దాని రాజధాని బకు ఇటీవలి దాకా భారత పర్యాటకులకు ఫేవరెట్‌ డెస్టినేషన్లలో ఒకటిగా ఉండేది. ఏటా లక్షలాది మంది అక్కడికి వెళ్లేవారు. బకుకు బుకింగులు కూడా ఇప్పుడు భారీగా తగ్గిపోతున్నాయి.

జేఎన్‌యూ కటీఫ్‌

తుర్కియే విద్యాసంస్థలతోనూ తెగదెంపులు చేసుకోవాలనే డిమాండ్ల నేపథ్యంలో ఆ దేశంలోని ఇనోను వర్సిటీతో అవగాహన ఒప్పందాన్ని జవహర్‌లాల్‌ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) రద్దు చేసుకుంది. జాతీయ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. గత ఫిబ్రవరిలో కుదిరిన ఈ మూడేళ్ల ఒప్పందం ప్రకారం రెండు వర్సిటీల విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడికి అవకాశముండేది.

గాజాపై ఇజ్రాయెల్‌ భీకర దాడులు

22 మంది చిన్నారులు సహా 70 మంది మృతి

గాజా: గాజాపై ఇజ్రాయెల్‌ సైన్యం మరోసారి భీకర స్థాయిలో విరుచుకుపడింది. ఉత్తర, దక్షిణ గాజాపై బుధవారం క్షిపణుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 22 మంది చిన్నారులు సహా మొత్తం 70 మంది మృతిచెందడం గమనార్హం. ఉత్తర గాజాలోని జబాలియాలో 50 మంది మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇజ్రాయెల్‌–అమెరికన్‌ బందీని హమాస్‌ మిలిటెంట్లు విడుదల చేసిన మరోసటి రోజే ఇజ్రాయెల్‌ సైన్యం గాజాపై దాడులకు దిగడం చర్చనీయాంశంగా మారింది. మృతదేహాలను సమీపంలోని ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలకు తరలించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌ గల్ఫ్‌ దేశాల్లో పర్యటిస్తున్న సమయంలోనే ఈ దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇజ్రాయెల్‌–అమెరికన్‌ బందీని బేషరతుగా విడుదల చేయడం ద్వారా కాల్పుల విరమణకు సిద్ధమని హమాస్‌ మిలిటెంట్లు సంకేతాలిచ్చారు. అయినప్పటికీ ఇజ్రాయెల్‌ సైన్యం లెక్కచేయలేదు. మిలిటెంట్లు రాకెట్‌ లాంచర్లు, మౌలిక సదుపాయాలే లక్ష్యంగా క్షిపణులు ప్రయోగించినట్లు సైన్యం వెల్లడించింది. హమాస్‌ను నాశనం చేసేదాకా దాడులు సాగుతాయని ఇజ్రాయెల్‌ ప్రధాని బెంజమిన్‌ నెతన్యాహూ స్పష్టం చేశారు.

రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

వైదిక నాగరికత - 2

తొలి వేద కాలంలో ఆర్యులు ప్రధానంగా సప్త సింధూ ప్రాంతానికే పరిమితమయ్యారు. తూర్పున యమునా నదిని దాటి విస్తరించలేదు. అందుకే తొలివేద కాలానికి చెందిన రుగ్వేదంలో సింధూ, దాని ఐదు ఉపనదులతోపాటు సరస్వతిని అధికంగా ప్రస్తావించారు. కానీ మలివేద కాలానికి ఆర్యులు యమునను దాటి గంగామైదాన ప్రాంతానికి విస్తరించారు. ఈ భౌగోళిక విస్తరణతో పాటే మలివేద కాలం నాటికి ఆర్యుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, మత వ్యవస్థల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

వైదిక నాగరికత లక్షణాలు

సామాజిక వ్యవస్థ: ఆర్యులు భారతదేశంలో వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించారు. ఇందులో మొదటి మూడు వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులుగా పరిగణించారు. నాలుగో వర్ణమైన శూద్రులు రుగ్వేద కాలం చివరలో కనిపిస్తారు. అయితే ఈ వర్ణ వ్యవస్థ అంత కఠినంగా లేదు. ఏ వర్ణం వారైనా ఏ వృత్తినైనా చేపట్టవచ్చు. వర్ణాంతర వివాహాలు అధికంగానే జరిగేవి. అయితే అనులోమ వివాహాల సంఖ్య అధికంగా ఉంది. ఆనాటి సమాజంలో పైన పేర్కొన్న నాలుగు వర్ణాలతోపాటు దస్యులు అనే మరొక వర్గం కూడా ఉంది. వీరు ఆర్యుల చేతిలో ఓడిపోయిన స్థానిక ప్రజలు. వాస్తవంగా 'వర్ణం' అనే పదానికి రంగు అని అర్థం. నలుపు వర్ణంలో ఉన్న స్థానిక ప్రజలను సూచించేందుకు దీన్ని వాడారు. నాటి సమాజంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. పాలనా సభల్లో కూడా మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. స్త్రీలు భర్తతోపాటు యజ్ఞయాగాది క్రతువుల్లో పాల్గొనేవారు. తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలోనూ స్వేచ్ఛ ఉండేది. వీరికి విద్యా హక్కు కూడా ఉండేది. ఉన్నత విద్యను అభ్యసించిన 20 మంది మహిళా మేధావుల ప్రస్తావన రుగ్వేదంలో కనిపిస్తోంది. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలకు తావు లేదు. వితంతు పునర్వివాహాలకు, నియోగ వివాహాలకు అవకాశముండేది. అపాల, విశ్వవర, ఘోష మొదలైన బ్రహ్మవాదినులు.. జీవితాంతం వివాహం లేకుండా విద్యార్జనకే తమ జీవితాలను అంకితం చేసినట్లు తెలుస్తోంది. రుగ్వేదంలోని చాలా శ్లోకాలను మహిళలే రచించారని చరిత్రకారుల అభిప్రాయం. బృహదారణ్యక ఉపనిషత్‌లో గార్గి అనే బ్రహ్మవాదినికి యజ్ఞవల్క్య మహర్షికి మధ్య జరిగిన తాత్విక చర్చల ప్రస్తావన ఉంది.

మలివేద కాలం నాటికి చాతుర్వర్ణ వ్యవస్థ బాగా స్థిరపడింది. వర్ణ వ్యవస్థ కఠినంగా మారింది. దీనికితోడు వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం జీవితాన్ని బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు దశలుగా విభజించారు. ఒకే వర్ణానికి చెందిన వారి మధ్య మాత్రమే వివాహాలను అనుమతించేవారు. గోత్ర సంప్రదాయం అమల్లోకి వచ్చింది. ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహాలను అనుమతించేవారు కాదు. వర్ణాంతర వివాహాలు నిషేధించినా అవి ఆగలేదు. అందుకే వర్ణ సంకర సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ కాలంలోనే అష్ట వివాహ పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇందులో బ్రహ్మ, దైవ, అర్ష, ప్రజాపత్య, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచ అనే 8 రకాల పద్ధతులున్నాయి. వీటిలో గాంధర్వ, రాక్షస వివాహాలకు క్షత్రియులను అనుమతించారు. వర్ణాంతర వివాహాల వల్ల సమాజంలో అనేక మిశ్రమ కులాలు వచ్చి చేరాయి. రుగ్వేద కాలంతో పోలిస్తే స్త్రీల గౌరవ మర్యాదలు క్షీణించాయి. వారిపై అనేక రకాలైన ఆంక్షలను విధించారు. స్త్రీలకు సంబంధించి అనేక సామాజిక దురాచారాలు ప్రారంభమయ్యాయి. బాల్య వివాహాలు, సతీ సహగమనం, వితంతు వివాహాలను నిషేధించారు. వేదాధ్యయనం చేసే అవకాశం స్త్రీలకు లేదు. పున్నామ నరకాన్ని తప్పించేవాడు అని పుత్ర సంతానానికి ప్రాధాన్యం పెరిగింది. సభ, సమితి వంటి వాటిలోనూ స్త్రీలకు సభ్యత్వం లేకుండా పోయింది.

ఆర్థిక వ్యవస్థ: రుగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి పశుపోషణ. కాబట్టి గోవులకు అమిత ప్రాధాన్యతనిచ్చారు. రుగ్వేదంలో 'గోవ్' అనే పదాన్ని 176సార్లు ప్రస్తావించారు. వీరి సంపదకు మూలం పశువులే. కాబట్టి పశువుల దొంగతనాలను ఘోరాపరాధంగా పరిగణించేవారు. ఈ నేరానికి కఠినమైన శిక్షలుండేవి. ఆ కాలంలో 'పాణిలు' అనేవారు పశువుల దొంగతనాలకు పాల్పడేవారు. పశు సంపదను రక్షించడం రాజన్ ముఖ్య విధి. కాబట్టి రాజన్‌ను 'గోప, గోపతి' అనే పేర్లతో పిలిచేవారు. సంపన్నమైన వ్యక్తిని 'గోమత్' అనేవారు. 'గవిష్టి' అంటే గోవుల కోసం చేసే యుద్ధం లేదా గోవుల కోసం వెదకడం అని అర్థం. ఈ విధంగా వీరి ఆర్థిక వ్యవస్థలో సమస్త పదాలు గోవులతో ముడిపడి ఉండడాన్ని బట్టి చూస్తే పశువులు రుగ్వేదార్యుల ఆర్థిక వ్యవస్థలో ముఖ్య స్థానం ఆక్రమించినట్లు తెలుస్తోంది. పశుపోషణ తర్వాత ఆర్యుల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇంకా స్థిర జీవనం ఏర్పడనందున వ్యవసాయాన్ని పరిమితంగానే చేపట్టారు. వీరి ముఖ్య పంటలు గోధుమ, బార్లీ. తొలివేద కాలంలో అనేక రకాల చేతివృత్తుల వారు ఉన్నారు. చేతివృత్తుల్లో రథాలను తయారు చేసే రథకారులకు (వడ్రంగులు) ప్రముఖ స్థానముండేది.

ఇంకా ఇతర వృత్తుల్లో వస్త్రాలు, కుండలు, చర్మ వస్తువుల తయారీ మొదలైనవి పేర్కొనదగినవి. లోహాన్ని 'ఆయాస్' అని పిలిచారు. లోహ వస్తువులను తయారు చేసేవారిని 'కర్మార' అనేవారు. ఆ కాలంలో రాగి లేదా కంచును అధికంగా ఉపయోగించారు. తొలివేద కాలంలో పరిమిత స్థాయిలో వ్యాపార, వాణిజ్యాలు జరిగాయి. రుగ్వేదంలో 'నిష్క' అనే నిర్దిష్ట విలువ కలిగిన బంగారు ఆభరణం గురించి ప్రస్తావన ఉంది. దీన్ని నాణెంగా ఉపయోగించారని కొందరి అభిప్రాయం. అయినప్పటికీ వాణిజ్యం ప్రధానం వస్తు మార్పిడి పద్ధతిలోనే జరిగేది. వేదాల్లో 'ఫణి' అనే అనార్య జాతికి చెందిన వ్యాపారస్తుల ప్రస్తావన ఉంది.

మలివేద కాలానికి ఆర్యుల ఆర్థిక జీవనంలో పెనుమార్పులు సంభవించాయి. దీనికి ప్రధాన కారణం వీరు సప్త సింధూ నుంచి ప్రపంచంలోనే అత్యంత సారవంతమైన గంగా మైదానానికి విస్తరించడమే. ఈ విస్తరణకు ఇనుప పరిజ్ఞానం తోడై ఆర్యుల ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థగా మారడానికి కారణమైంది. ఇనుమును వీరు 'కృష్ణ ఆయా' లేదా 'శ్యామ ఆయా' అని పిలిచారు. ఇనుప నాగళ్ల ఉపయోగం ప్రారంభమైంది. శతపథ బ్రాహ్మణంలో వివిధ రకాలైన వ్యవసాయ కార్యకలాపాల గురించిన ప్రస్తావన ఉంది. గోధుమ, బార్లీతోపాటు వరి ప్రధాన పంటగా రూపొందింది. ఈ వ్యవసాయాభివృద్ధి వల్ల ఆర్యుల సంచార జీవితం అంతమై స్థిర జీవనం ప్రారంభమైంది. తొలివేద కాలంతో పోలిస్తే వృత్తుల సంఖ్య కూడా పెరిగింది. లోహకారులకు ప్రాధాన్యం పెరిగింది. ఈ అభివృద్ధి అంతా కలిసి చిన్న చిన్న పట్టణాలు ఏర్పడటానికి దారి తీసింది. మలివేద గ్రంథాల్లో కనిపించే 'నగరం' అనే పదాన్ని ఈ పట్టణాలకు సంకేతంగా భావించవచ్చు. అయితే వాస్తవంగా పట్టణాలు ఏర్పడింది మాత్రం మలివేద యుగం చివరలో మాత్రమే. మలివేద గ్రంథాల్లో పేర్కొన్న కొన్ని ముఖ్య పట్టణాలు.. కాశీ, కౌశాంబి, వైదేహ, అయోధ్య, హస్తినాపూర్, ఇంద్రప్రస్థ మొదలైనవి. విస్తృత వ్యవసాయం, స్థిరమైన జీవన విధానం, పట్టణ జీవితం, చేతి వృత్తులు ఇవన్నీ కలిసి వ్యాపార వాణిజ్యాల అభివృద్ధికి దోహదపడ్డాయి. దీంతో వ్యాపార నిర్వహణకు వ్యాపారస్తులు 'శ్రేణులు' లేదా 'గణ'లుగా ఏర్పడ్డారు. రుగ్వేద కాలపు నిష్కతోపాటు అనేక రకాలైన నాణేలు వచ్చాయి. అవి.. శతమాన, క్రిష్ణాల, సువర్ణ, హిరణ్య పిండ మొదలైనవి. బృహదారణ్యక ఉపనిషత్‌లో 'పడ' అనే నాణెం ప్రస్తావన ఉంది. అయితే వాస్తవంగా ఇవన్నీ నిర్ణీత విలువ కలిగిన ఆభరణాలు మాత్రమే. అసలైన నాణేలు వాస్తవంగా క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. అవే విద్ధాంక నాణేలు. అథర్వణ వేదం సంతల గురించి, అక్కడి సందడిని గురించి ప్రస్తావిస్తోంది. ఈ కాలంలో వడ్డీ వ్యాపారం కూడా ఒక వృత్తిగా గుర్తింపు పొందింది. వడ్డీ వ్యాపారిని 'కుసిదిన్' అని పిలిచేవారు.

రాజకీయ వ్యవస్థ: రుగ్వేద కాలంలో పూర్తిస్థాయి రాచరిక వ్యవస్థ ఏర్పడలేదు. పాలక వర్గాలను రాజన్య అని పిలిచేవారు. ఈ వర్గాల నుంచే రాజన్‌ను ఎన్నుకునేవారు. రాజన్‌ను రాజుగా కంటే తెగ నాయకుడిగా పరిగణించడమే సబబుగా ఉంటుంది. రాజన్ ముఖ్య విధి ప్రజలను కాపాడడంతో పాటు వారి ప్రధాన సంపద అయిన గోవులను దొంగిలించకుండా కాపాడటం. దీని కోసం గూఢచారులను నియమించేవారు. ఇంకా పురోహితుడు, సేనాపతి, ప్రజాపతి మొదలైన వారు రాజుకు సహాయకులుగా ఉండేవారు. 'ప్రజాపతి' ముఖ్య విధి గడ్డి మైదానాల పర్యవేక్షణ. రుగ్వేద కాలంలో వశిష్ఠుడు, విశ్వామిత్రుడు ప్రసిద్ధి చెందిన పురోహితులు. దశరాజ యుద్ధానికి వీరు పరోక్ష కారకులు. రుగ్వేద కాలంలో కుటుంబాన్ని 'కుల' అన్నారు. కుటుంబ పెద్దను 'కులప' అని పిలిచేవారు. కొన్ని కులాల కలయికతో ఏర్పడేదే గ్రామం. దీనికి 'గ్రామణి' అధిపతిగా ఉండేవాడు. కొన్ని గ్రామాల సమూహాన్ని 'విస్' అనేవారు. దీనికి విస్పతి అధిపతిగా ఉండేవాడు. ఇలాంటి విస్‌ల సముదాయంతో 'జన' లేదా 'తెగ' ఏర్పడుతుంది. దీని నాయకుడే 'రాజన్'. అయితే రుగ్వేద కాలంలో రాజన్ అధికారం అపరిమితమైంది కాదు. సభ, సమితి, విధాత, గణ అనే ప్రజా సభలు రాజన్ అధికారాన్ని నియంత్రించేవి. రుగ్వేదంలో బలి, భాగ అనే పన్నుల ప్రస్తావన ఉంది. ఇవి వాస్తవంగా పన్నులు కావు. 'బలి' అనేది ప్రజలు రాజుకు ఇచ్చే కానుక. 'భాగ' అనేది యుద్ధంలో కొల్లగొట్టిన సంపదలో రాజు వాటా.

మలివేద కాలానికి ఆర్యులు స్థిర జీవనానికి అలవాటు పడ్డారు. కాబట్టి రుగ్వేద కాలం నాటి తెగల ఆధారిత పాలనా వ్యవస్థ స్థానంలో ప్రదేశం ఆధారిత పాలనా వ్యవస్థ ఏర్పడింది. వీటినే 'జనపదాలు' అంటారు. ఈ కాలంలో రాజన్ కేవలం గోవులను రక్షించే గోపతి మాత్రమే కాదు.. సుశిక్షిత సైన్యాన్ని కలిగి ఉండి పక్క రాజ్యాలను ఆక్రమించే స్థాయికి ఎదిగాడు. దీనికోసం రాజసూయ, అశ్వమేధ, వాజపేయ వంటి యజ్ఞ, యాగాలూ ప్రారంభమయ్యాయి. రాజుపై నియంత్రణాధికారమున్న సభలు క్షీణించి సభ, సమితులు మాత్రమే మిగిలాయి. అవి కూడా నామమాత్రపు సలహా మండళ్లుగా మారిపోయాయి. దీనివల్ల సభలతో ఎంపికయ్యే రాజన్ పదవి వంశపారంపర్య పదవిగా మారిపోయింది. ఈ కాలంలో రాజుకు సహాయ సహకారాలు అందించేందుకు 'ద్వాదశ రత్నిన్' అనే మంత్రి మండలి ఏర్పడింది. వీరిలో ప్రధాన పురోహితుడు, పట్టమహిషి, సేనాని, సూత, సంగ్రహిత్రి, భాగదుఘ, అక్షావాప, గోవికర్తన, గ్రామణి మొదలైనవారు సభ్యులుగా ఉండేవారు. బలి, భాగ అనేవి పూర్తిస్థాయి పన్నులుగా మారాయి. వాటి వసూలుకు భాగదుఘ అనే అధికారి ఉండేవాడు. అయినప్పటికీ ఈ కాలానికి పూర్తిస్థాయి అధికార యంత్రాంగం మాత్రం ఏర్పడలేదు.

మత వ్యవస్థ: రుగ్వేద కాలపు ఆర్యులు ప్రకృతి శక్తులను అర్థం చేసుకోలేకపోవడంతో వాటికి దైవత్వాన్ని ఆపాదించారు. మానవ రూపమిచ్చి పూజించారు. రుగ్వేదంలో మొత్తం 33 మంది దేవతల ప్రస్తావన ఉంది. వీరందరిలో అతిముఖ్య దైవం ఇంద్రుడు లేదా పురంధరుడు. ఇతడు యుద్ధ దేవత. రెండో ముఖ్య దైవం అగ్ని. ఇతడిని మానవులకు, దేవతలకు మధ్య వారధిగా భావించారు. వరుణుడు ప్రకృతిని క్రమబద్ధీకరించే దేవత. ఇంకా సోమ, ఉషస్,అదితి, పృథ్వీ, అరణ్యాని మొదలైన దేవతల ప్రస్తావన ఉంది. వీరి పూజా విధానంలో భక్తికి ప్రాధాన్యముండేది. భక్తి శ్లోకాలను ఆలపించడం, కానుకలను సమర్పించడం ద్వారా దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. తమకు ప్రీతిపాత్రమైన సోమ, సుర అనే పానీయాల్ని నైవేద్యంగా సమర్పించేవారు. వీరు ప్రధానంగా సంతానం, పశు సంపద కోసం దేవతలను ప్రార్థించారు.

మలివేద కాలానికి రుగ్వేదపు ప్రధాన దేవతల ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇంద్రుడు, అగ్ని వంటి దేవతల స్థానాన్ని త్రిమూర్తులు ఆక్రమించారు. రుగ్వేదపు ప్రధాన దేవతలు అష్టదిక్పాలకులుగా మారిపోయారు. సృష్టికర్త అయిన ప్రజాపతి ప్రధాన దేవతగా, రుద్రుడు, విష్ణువు మొదలైనవారు ఇతర ముఖ్య దేవతలుగా అవతరించారు. ఈ కాలంలో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు వర్ణాల వారీగా దేవతలు ఏర్పడటం. ఈ విధంగా ఏర్పడిన దేవతే 'పుషాన్' అనే శూద్రుల దేవత. ఆర్యుల పూజా విధానంలోనూ మార్పులు సంభవించాయి. భక్తి ప్రాధాన్యత తగ్గి యజ్ఞ యాగాలు,బలిదానాలకు ప్రాధాన్యత పెరిగింది. విపరీతమైన జంతు బలుల వల్ల పశు సంపదకు పెద్ద నష్టం వాటిల్లింది. మోక్ష మార్గం సంక్లిష్టం, వ్యయభరితం అవడమే కాకుండా శూద్రులు, స్త్రీలు వంటి కొన్ని వర్గాలకు మోక్ష మార్గాన్ని నిరాకరించారు. మలివేద కాలంలో మత వ్యవస్థలో చోటు చేసుకున్న ఈ పరిణామాలన్నీ కలిసి వైదిక యుగం చివరినాటికి అంటే క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి వైదిక మతంపై తిరుగుబాటుగా అనేక మత ఉద్యమాలు రావడానికి కారణమయ్యాయి.

మాదిరి ప్రశ్నలు

1. వేద కాలం నాటి 'పాణిలు' అంటే?
   1) నాణేలు 2) సైనిక వర్గం
   3) వ్యాపారులు 4) పశువుల దొంగలు
2. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
   1) కినాస 2) శూద్ర 3) క్షేత్రక 4) కర్షక
3. వీటిలో తప్పుగా జతపర్చిన దాన్ని గుర్తించండి?
   1) గోఘన - అతిథి 2) దౌహిత్రి - కూతురు
   3) గోప - పశుకాపరి 4) గవిష్టి - యుద్ధం
4. వీరిలో పురోహితుల దైవం?
   1) ఇంద్రుడు 2) అగ్ని
   3) వరుణుడు 4) సూర్యుడు
5. వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
   1) సభ, సమితి 2) సమితి, విధాత
   3) విధాత, గణ 4) గణ, పరిషత్
6. వేద కాలంలో ఏ వృత్తి వారికి ఉపనయనం ధరించే అర్హతను కల్పించారు?
   1) స్వర్ణకారులు 2) రథకారులు
   3) చర్మకారులు 4) లోహకారులు
7. వీటిలో సరైన జతను గుర్తించండి?
   1) కులాల-కుండలు తయారు చేసేవారు
   2) నిషాద - చేపలు పట్టేవారు
   3) కైవర్త - బుట్టలు అల్లేవారు
   4) వేణ - వేటాడేవారు
8. కింద ఇచ్చిన జాబితాల నుంచి సరైన సమాధానాన్ని గుర్తించండి?

జాబితా -1	జాబితా-2
ఎ) సూత	1) మంగలి
బి) దౌహిత్రి	2) వధించరానిది (ఆవు)
సి) గోఘన	3) రథకారుడు
డి) అఘన్య	4) కూతురు
ఇ) వాప్త	5) అతిథి

కోడ్స్:	ఎ	బి	సి	డి	ఇ
1	5	4	1	2	3
2	3	4	5	2	1
3	3	4	1	2	5
4	1	2	3	4	5

9. దశరాజ యుద్ధానికి కారకుడైన పురోహితుడు?
   1) దుర్వాసుడు 2) విశ్వామిత్రుడు
   3) యజ్ఞవల్క్య 4) సుదాసు
10. వైదిక యుగ పాలనా విభాగాలను సరైన ఆరోహణ క్రమంలో అమర్చండి?
   1) రాష్ట్ర, జన, విశ్, గ్రామ, కుల
   2) జన, రాష్ట్ర, గ్రామ, కుల, విశ్
   3) కుల, గ్రామ, విశ్, జన, రాష్ట్ర
   4) కుల, గ్రామ, విశ్, రాష్ట్ర, జన

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3; 4) 2; 5) 1;
6) 2; 7) 1; 8) 2; 9) 2; 10) 3.

మనదేశంలో నైరుతి రుతుపవన కాలం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జాగ్రఫీ

1. భారతదేశం ఏ రకమైన శీతోష్ణస్థితిని కలిగి ఉంది?
జ. ఉష్ణమండల రుతుపవన శీతోష్ణస్థితి
2. మన దేశంలో పశ్చిమ దిశగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్న నదులేవి?
జ. నర్మద, తపతి, మహి, సబర్మతి
3. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం?
జ. రాజస్థాన్‌లోని జైసల్మీర్
4. మనదేశంలో నైరుతి రుతుపవన కాలం?
జ. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు
5. ఈశాన్య రుతుపవనాలు (తిరోగమన రుతుపవనాలు) వీచే కాలం?
జ. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు
6. నైరుతి రుతుపవనాల వల్ల మొదటగా ఏ రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయి?
జ. కేరళ
7. ఈశాన్య రుతుపవనాలు మొదటగా ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తాయి?
జ. పంజాబ్
8. ప్రస్తుతం హిమాలయాలున్న భూభాగంపై మధ్య మహాయుగంలో ఉన్న సముద్రం?
జ. టెథిస్
9. భారత ద్వీపకల్ప పీఠభూమిని పూర్వం ఏమని పిలిచేవారు?
జ. గోండ్వానా పీఠభూమి
10. హిమాలయాలు ఏ రకమైన పర్వతాలు?
జ. నవీన ముడుత పర్వతాలు
11. సిమ్లా పట్టణం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. ధౌల్‌దార్ శ్రేణి
12. అరుణాచల్‌ప్రదేశ్‌లోని బాహ్య హిమాలయాలను ఏమని పిలుస్తారు?
జ. మిష్మి కొండలు
13. ప్రముఖ వేసవి విడిది కేంద్రమైన డెహ్రాడూన్ ఏ రాష్ట్రంలో ఉంది?
జ. ఉత్తరాఖండ్
14. ప్రపంచంలో రెండో అతి ఎత్తైన శిఖరం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. కారకోరం శ్రేణి
15. మడ అడవులు (సుందర వనాలు) ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయి?
జ. పశ్చిమ బెంగాల్
16. ఆరావళి పర్వతాల్లో ఎత్తైన శిఖరం?
జ. గురుశిఖర్ పర్వతం (1722 మీటర్లు)
17. ఆరావళి పర్వతాలు ఏ రకాని చెందినవి?
జ. అతి పురాతన ముడుత పర్వతాలు
18. ఛోటా నాగపూర్ పీఠభూమి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. జార్ఖండ్
19. ఆరావళి పర్వత శ్రేణి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. రాజస్థాన్
20. ఊటీ ఏ కొండల్లో ఉంది?
జ. నీలగిరి కొండలు (తమిళనాడు)
21. సింధు నది ముఖ్య ఉపనదులు?
జ. జీలం, చీనాబ్, బియాస్, సట్లెజ్, రావి
22. బ్రహ్మపుత్ర నదిని అరుణాచల్‌ప్రదేశ్‌లో ఏమని పిలుస్తారు?
జ. ది హాంగ్
23. అసోం దుఃఖదాయనిగా పేరొందింది?
జ. బ్రహ్మపుత్రా నది
24. కృష్ణా నది జన్మస్థానం?
జ. మహాబలేశ్వర్ (మహారాష్ట్ర)
25. సింధు నది జన్మస్థానం?
జ. మానస సరోవరం (టిబెట్)
26. అమర్ కంటక్ వద్ద జన్మించిన నది?
జ. నర్మద
27. తపతి నది జన్మస్థానం?
జ. ముల్తాయి (బేటల్, మధ్యప్రదేశ్)
28. కోరమండల్ తీరంలో ఏ రుతుపవనాల వల్ల అధిక వర్షం కురుస్తుంది?
జ. ఈశాన్య రుతుపవనాలు
29. కరువుకు గురయ్యే ప్రాంతాల ప్రణాళిక(DPAP)ను ఏ సంవత్సరంలో ప్రవేశ పెట్టారు?
జ. 1973
30. మహానది ఏ రాష్ట్రంలో ఎక్కువ దూరం ప్రవహిస్తోంది?
జ. ఒడిశా
31. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
జ. దామోదర్ నది
32. సుగంధ నూనెలను తయారుచేయడానికి ఉపయోగపడే రూసా గడ్డిని ఏ జిల్లాలో పండిస్తున్నారు?
జ. నిజామాబాద్
33. భారతదేశ సగటు అటవీ శాతం?
జ. 20.55%
34. అడవుల విస్తీర్ణం పరంగా మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా, చివరిస్థానంలో ఉన్న రాష్ట్రం?
జ. హర్యానా
35. వైశాల్యం పరంగా అత్యధిక శాతం అడవులు ఉన్న రాష్ట్రం?
జ. అరుణాచల్ ప్రదేశ్
36. మృత్తికా క్రమక్షయం అంటే?
జ. సహజ కారణాల వల్ల సారవంతమైన నేలల పైపొర కొట్టుకొని పోవడం
37. ఉష్ణమండల చెర్నోజెమ్ మృత్తికలుగా పేరొందినవి?
జ. నల్లరేగడి నేలలు
38. మౌసమ్ అనేది ఏ భాషా పదం?
జ. అరబిక్ (అర్థం-రుతువు)
39. మన దేశంలో ఇప్పటి వరకూ అత్యల్ప ఉష్ణోగ్రత (−40°C) ఎక్కడ నమోదైంది?
జ. ద్రాస్ (కార్గిల్- కశ్మీర్)
40. అత్యధిక వర్షపాతం(1141సెం.మీ.) నమోదయ్యే మాసిన్‌రామ్ ప్రాంతం ఏ రాష్ట్రంలో ఉంది?
జ. మేఘాలయ
41. తమిళనాడులో అత్యధిక వర్షపాతం సంభవించడానికి కారణమయ్యే రుతుపవనాలు?
జ. తిరోగమన రుతుపవనాలు
42. పత్తి పంటకు అత్యంత అనుకూలమైన నేలలు?
జ. నల్లరేగడి నేలలు
43. భంగర్, ఖాదర్ మృత్తికలుండే నేలలు?
జ. ఒండ్రు నేలలు
44. మృత్తికా పరిరక్షణ పద్ధతులేవి?
జ. కాంటూర్ బండింగ్, ఫిర్రోయింగ్, స్ట్రిప్ క్రాసింగ్
45. దక్కన్ లావా నేలలుగా పేరుగాంచినవి?
జ. నల్లరేగడి నేలలు
46. జనసాంద్రత అంటే?
జ. చదరపు కిలోమీటరుకు నివసించే సగటు జనాభా
47. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఏ రోజున జరుపుకుంటాం?
జ. జూలై 11
48. తెలంగాణలో అక్షరాస్యత ఎక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్ కాగా తక్కువగా ఉన్న జిల్లా?
జ. మహబూబ్‌నగర్ (55.4%)
49. తెలంగాణ రాష్ట్ర మొత్తం జనాభా?
జ. 3 కోట్ల 52 లక్షలు
50. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న జిల్లా రంగారెడ్డి. కాగా, అతి తక్కువ జనాభా ఉన్న జిల్లా?
జ. నిజామాబాద్
51. తెలంగాణలో ఎస్సీ జనాభా తక్కువగా ఉన్న జిల్లా హైదరాబాద్. కాగా, ఎక్కువగా ఉన్న జిల్లా?
జ. కరీంనగర్
52. తెలంగాణలో ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లా ఖమ్మం కాగా, తక్కువగా ఉన్న జిల్లా ఏది?
జ. హైదరాబాద్
53. దేశంలో ఎక్కువగా వ్యవసాయానికి తోడ్పడే నీటి పారుదల వనరు?
జ. బావులు
54. పెరియార్, మెట్టూరు కాలువలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
జ. తమిళనాడు
55. చెరువుల ద్వారా సాగయ్యే భూమి ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉంది?
జ. తెలంగాణ
56. కాలువలు, బావుల ద్వారా సాగయ్యే భూమి అత్యధికంగా ఉన్న రాష్ట్రం?
జ. ఉత్తరప్రదేశ్
57. ఏ రాష్ట్రంలో చాలా వరకు వ్యవసాయమంతా నీటిపారుదల వసతుల కిందే జరుగుతుంది?
జ. పంజాబ్
58. భారీ నీటిపారుదల పథకాల ఆయకట్టు ప్రాంతం ఎంత ఉంటుంది?
జ. 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ
59. చిన్నతరహా నీటిపారుదల పథకాల ఆయ కట్టు ప్రాంతం ఎన్ని హెక్టార్లలోపు ఉం టుంది?
జ. 2000
60. తెల్లబొగ్గుగా పిలిచేది?
జ. జలవిద్యుచ్ఛక్తి
61. దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం విద్యుచ్ఛక్తిలో జలవిద్యుచ్ఛక్తి వాటా?
జ. 22 శాతం
62. మనదేశంలో జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తికి అత్యంత అనువైన ప్రాంతం?
జ. హిమాలయ పర్వతపాద ప్రాంతం
63. ఏ బహుళార్థసాధక పథకం వల్ల అధికంగా జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది?
జ. భాక్రానంగల్
64. మనదేశంలోని ఏకైక అంతర్జాతీయ బహుళార్థసాధక ప్రాజెక్టు
జ. కోసి ప్రాజెక్టు
65. భాబర్ అంటే?
జ. గులకరాళ్లతో కూడిన సచ్ఛిద్ర మండలం
66. టెరాయి అంటే?
జ. చిత్తడి ప్రాంతం
67. భంగర్ అంటే?
జ. ప్రాచీన కాలంలో ఏర్పడిన ఒండలి మైదానం.
68. ఖాదర్ అంటే?
జ. నూతనంగా ఏర్పడిన ఒండలి మైదానం
69. రే/ కల్లార్ అంటే?
జ. చవుడు, లవణీయ, స్ఫటికీయ భూభాగం

బహుళార్థసాధక ప్రాజెక్టు	నది	నిర్మించిన ప్రదేశం	లబ్ధి పొందుతున్న రాష్ట్రాలు
భాక్రానంగల్ ప్రాజెక్టు	సట్లెజ్	భాక్రానంగల్ (హిమాచల్ ప్రదేశ్)	పంజాబ్, హర్యానా, రాజస్థాన్
బియాస్ ప్రాజెక్టు	బియాస్	పాంగ్ (పంజాబ్)	పంజాబ్, హర్యానా, రాజస్థాన్
దామోదర్ ప్రాజెక్టు	దామోదర్	జార్ఖండ్	పశ్చిమ బెంగాల్, జార్ఖండ్
హిరాకుడ్ ప్రాజెక్టు	మహానది	సంబల్‌పూర్	ఒడిశా
నాగార్జునసాగర్ ప్రాజెక్టు	కృష్ణా	నందికొండ (నల్గొండ, తెలంగాణ)	తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
తుంగభద్ర ప్రాజెక్టు	తుంగభద్ర	మల్లాపూర్ (బళ్లారి)	కర్ణాటక, ఆంధ్రప్రదేశ్
కోసి ప్రాజెక్టు	కోసి నది	హనుమాన్ నగర్ (బీహార్)	బిహార్, నేపాల్ (అంతర్జాతీయ పథకం)
చంబల్ ప్రాజెక్టు	చంబల్	మధ్యప్రదేశ్	మధ్యప్రదేశ్, రాజస్థాన్
గండక్ ప్రాజెక్టు	గండక్	వాల్మీకి నగర్ (బిహార్)	బిహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్
రామ్‌గంగా ప్రాజెక్టు	రామ్‌గంగా	కాలాగర్	ఉత్తరాఖండ్

పర్వతాలు	రాష్ట్రం
మహాదేవ్ కొండలు	మధ్యప్రదేశ్
రాజ్‌మహల్ కొండలు	జార్ఖండ్
మిష్మి కొండలు, డాఫ్లా కొండలు	అరుణాచల్‌ప్రదేశ్
కచార్ కొండలు	అసోం
పాట్‌కాయ్ కొండలు	నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్
ఖాసీ కొండలు, జాంతియా కొండలు, గారో కొండలు	మేఘాలయ
పళని కొండలు, నీలగిరి కొండలు, షేవరాయ్ కొండలు	తమిళనాడు
యాలకుల (కార్డమమ్) కొండలు, అన్నామలై కొండలు	కేరళ
లూషాయ్ కొండలు	మిజోరాం
గిర్ కొండలు	గుజరాత్

తీరప్రాంత మైదానం	విస్తరించిన రాష్ట్రం
సర్కార్ తీరం	ఆంధ్రప్రదేశ్
ఉత్కల్ తీరం	ఒడిశా
కోరమండల్ తీరం	తమిళనాడు
మలబార్ తీరం	కేరళ
కెనరా తీరం	కర్ణాటక
కొంకణ్ తీరం	గోవా, మహారాష్ట్ర

2011 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో	
మొత్తం జనాభా	121 కోట్లు
జనాభా పెరుగుదల రేటు (దశాబ్దంలో)	17.7%
అక్షరాస్యత	74%
లింగనిష్పత్తి	1000 : 943
జనసాంద్రత	382
పట్టణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం	గోవా (62.2%)
గ్రామీణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం	హిమాచల్ ప్రదేశ్ (90%)

జనబాహుళ్యంలో ఆదరణ పొందిన కళారూపాలు

జానపద కళలు - కళాకారులు

తెలంగాణ రాష్ట్రంలో అనేక రకాల జానపద కళాకారులు ఉన్నారు. వీరు తమ కళలనే కులవృత్తులుగా చేసుకొని వాటి ద్వారా జీవనం సాగిస్తున్నారు. టీఎస్‌పీఎస్సీ సిలబస్‌లో వీటన్నింటినీ ప్రత్యేక అధ్యాయంగా పేర్కొన్నారు. అందువల్ల అభ్యర్థులు తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, కళారూపాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

కొలనుపాక భాగవతులు

కొలనుపాక భాగవతులనే గంటె భాగవతులుగా పేర్కొంటారు. వీరికి, ఆంధ్ర ప్రాంతంలో ఉండే గంటె భాగవతులకూ వ్యత్యాసం ఉంది. తెలంగాణలో గంటె భాగవతులు ఎక్కువగా కరీంనగర్ జిల్లా కొలనుపాకలో ఉన్నారు. వీరు రాత్రి వేళల్లోనే ప్రదర్శన చేస్తారు. వీరి ప్రదర్శనలకు సాహిత్యపరంగా అంతగా ప్రాముఖ్యం లేదు. వీరు ప్రదర్శనల్లో ప్రధానంగా గరిటెలను ఉపయోగిస్తారు. అందువల్ల వీరిని గరిటె భాగవతులు, గంటె భాగవతులుగా వ్యవహరిస్తారు. ప్రతి పాత్రధారి చేతిలోనూ ఒక గరిటె ఉంటుంది. అందులో చమురు పోసి, వత్తి వేసి వెలిగిస్తారు. ప్రతి పాత్ర హావభావాలూ, ఆంగిక చలనాలు ఈ గరిటె వెలుతురు వల్ల ప్రేక్షకులకు విశదంగా వెల్లడవుతాయి. ప్రదర్శనలో భాగంగా మధ్య మధ్య నటనను సాగిస్తూ, గరిటెలలోని వత్తిని ఎగదోస్తూ ఉంటారు. గరిట ప్రాముఖ్యంతోనే నాటకాలను ప్రదర్శిస్తారు.

శారదకాండ్రు

శారదకాండ్రు అనే జానపద కళాకారులు కేవలం తెలంగాణాలోనే కనిపిస్తారు. వీరు ఎక్కువగా వరంగల్ ప్రాంతంలో ఉన్నారు. బుర్రకథ వాయిద్యకారులు, శారద కథకులకు మధ్య పెద్ద వ్యత్యాసమేమీ కనిపించదు. బుర్రకథకుల మాదిరిగానే వీరు కూడా డక్కీలను ఉపయోగిస్తారు. వీరు ఉపయోగించే తంబురాను 'శారద' అంటారు. అందువల్ల వీరికి శారదకాండ్రు అనే పేరు వచ్చింది.

గంగిరెద్దులాట

ఇది తెలంగాణ రాష్ట్రంలో ఒక చక్కని జానపద కళ. సాధారణంగా పూజగొల్ల కులానికి చెందిన వారు గంగిరెద్దులను ఆడిస్తారు. వీరు ఎద్దును చక్కగా అలంకరించి, ఊళ్లలో తిరుగుతూ దాన్ని ఆడిస్తారు. వీరు ప్రధానంగా భిక్షాటన ద్వారా జీవనం సాగిస్తారు. ఒక గంగిరెద్దుతో పాటు ముగ్గురు వ్యక్తులు ఉంటారు. వీరిలో ఒకరు గంగిరెద్దును ఆడిస్తే.. మరో వ్యక్తి డోలు వాయిస్తాడు. మూడో వ్యక్తి సన్నాయి వాయిస్తాడు. ఇది గ్రామస్థులకు మంచి వినోదం. సాధారణంగా వీరు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఎక్కువగా కనిపిస్తారు.

ఒగ్గుకథ

ఒగ్గుకథ ఒక కళారూపం. కురు కులానికి చెందినవారు దీన్ని ప్రదర్శిస్తారు. 'ఒగ్గు' అంటే త్రినేత్రుడైన శివుడిని ప్రార్థించడం. వీరశైవారాధకుల్లో పురోహితులైనవారు శైవ దీక్ష తీసుకుంటారు. ఒగ్గు దీక్ష తీసుకున్నవారు మల్లన్న, వీరన్న కథలను వల్లె వేస్తారు. కోయతెగకు చెందిన ఒక వంశస్థులు సమ్మక్క కథ చెబుతూ పాటలు పాడతారు.

బుడబుక్కల వాళ్లు

వీరు తెలంగాణ రాష్ట్రంలో సంచార జాతికి చెందినవారు. వీరు ఊరూరా తిరుగుతూ ఉంటారు. సాధారణంగా వీరు క్షుద్రదేవతలను పూజిస్తారు. తెల్లవారుజామున విచిత్ర వేషధారణతో ఢమరుకం వాయిస్తూ గ్రామాల్లో వీధుల వెంట తిరుగుతారు. జ్యోతిషం చెబుతూ, తాయత్తులు కడుతూ యాచిస్తారు.

బుడగ జంగాలు

బుడగ జంగాలు శివభక్తులు. ఒక చేతిలో గంట వాయిస్తూ, శివుడి గురించి యక్షగానం చేస్తూ భిక్షాటన చేస్తారు. వినసొంపైన జానపద పాటలు పాడుతారు. ప్రజలకు విభూతిని పంచుతారు. అందువల్ల వీరిని 'జంగమదేవర' అని పిలుస్తారు. వీరు వాయించే గంటపై చిన్న 'నంది' విగ్రహం ఉంటుంది.

భిక్షుక కుంట్లు

వీరు కూడా తెలంగాణా ప్రాంతానికి చెందిన సంచారజాతివారే. వీరు సత్యహరిచ్చంద్ర, మార్కండేయ, భక్త ప్రహ్లాద కథలను ఎంతో రమ్యంగా చెబుతారు. ప్రదర్శనలో నలుగురు కళాకారులు ఉంటారు. ప్రధాన కథకుడు చేతిలో 'పన్నుకర్ర' పట్టుకొని అటూ ఇటూ ఊపుతూ కథ చెబుతాడు. మిగిలినవారు మద్దెల, హార్మోనియం, తాళాలు వాయిస్తూ అతడిని అనుకరిస్తారు.

రంజు కళాకారులు

విశ్వ బ్రాహ్మణులపై ఆధారపడి రంజు, పవన, సమయాలు ఇచ్చే ప్రదర్శనలు ఎంతో రమ్యంగా ఉంటాయి. వీరు 'రంజు' అనే వాయిద్యాన్ని వాయిస్తారు. వీర బ్రహ్మేంద్ర స్వామి కథ, విశ్వకర్మ పురాణం చెబుతారు. వీరు శైవ మతాన్ని అనుసరిస్తారు.

డోలి కళాకారులు

కోయ జాతికి చెందిన వీరు అడవుల్లో, పర్వత ప్రాంతాల్లో నివసిస్తారు. డోలి కళాకారులు వారి జాతికి చెందిన ఆదిపురుషుల గురించి కథల రూపంలో చెబుతారు. కోయజాతిలో మూడో తరానికి చెందిన 'పేరంబోయరాజు' కథను వల్లె వేస్తారు.



బండారు కళాకారులు

వీరు పెరిక కులంపై ఆధారపడి ఉంటారు. బండారు కళాకారులు పెరిక జాతి గొప్పతనం గురించి పురాణకథలు చెబుతారు. వీరు ఏ రకమైన వాయిద్యాలను ఉపయోగించరు. ప్రధాన కథకుడు కథ చెబుతూ ఉంటే మరో ఇద్దరు వంత పాడతారు.

డాఢీల ప్రదర్శన

వీరు లంబాడీ తండాలకు వెళ్లి అక్కడి పెద్దలను కలిసి ప్రదర్శనలు ఇస్తారు. వీరిని 'భట్టు' అనే పేరుతో కూడా పిలుస్తారు. వీరు తమ జాతిలో మూలపురుషుల కథలను పాడుతూ సంచారం చేస్తూ భిక్షాటన చేస్తారు. వీరు ఒక బృందంగా ఏర్పడి పాటలు పాడతారు. ఒక్కో బృందంలో అయిదు నుంచి 15 మంది సభ్యులు ఉంటారు.

అసాదులు

తెలంగాణా ప్రజలకు అనేక గ్రామ దేవతలను పూజించే ఆచారం ఉంది. వీరు ప్రకృతి దేవతలను కూడా పూజిస్తారు. ఎల్లమ్మ, పోచమ్మ, నల్లపోచమ్మ, పెద్దమ్మ పేర్లతో దేవతలను పూజిస్తారు. రాష్ట్రంలో అడుగడుగునా ఇలాంటి దేవాలయాలు కనిపిస్తాయి. ఈ దేవాలయాల్లో అన్ని రకాల శూద్ర కులాలకు చెందినవారు అర్చకులుగా ఉంటారు. వీరినే 'అసాదు లు' అంటారు. ఈ అసాదులు అమ్మవార్లను 'తాంత్రిక' పద్ధతిలో పూజిస్తారు. మాల కులంలో మాలదాసరులు ఉన్నట్లుగానే.. మాదిగ కులంలో అసాదు లనే తెగకు చెందినవారు ఉంటారు. అసాదులంటే మాల, మాదిగ కులాల్లో పూజారి వర్గానికి చెందినవారని 'ఆరుద్ర' పేర్కొన్నారు. వీరు ప్రధానంగా ఎల్లమ్మ కథను గానం చేస్తూ చిందులు వేస్తారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ సంస్కృతి-కళలు

కప్పతల్లి

అత్యంత ప్రాచీనమైన జానపద కళ ఇది. నృత్యం, పాట, తప్పెట, లయతో ఈ జానపద కళ ఎంతో రమ్యంగా ఉంటుంది. తప్పెటను ఎదురు రొమ్ముపై పెట్టుకొని వాయిస్తారు. తెలంగాణలో ఈ కళను 'కప్పతల్లి'గా వ్యవహరిస్తారు.

కాటి కాపరులు

వీరు దహన కార్యక్రమాల్లో పాలు పంచుకొంటారు. శ్మశానంలో అన్ని ఏర్పాట్లు చేస్తారు. మరణించిన వారి గురించి కీర్తిస్తూ పాటలు పాడటం ద్వారా యాచిస్తారు. చనిపోయిన వ్యక్తి దుస్తులను కూడా వీరు స్వీకరిస్తారు.

మాయాజాల కళాకారులు

వీరిని 'విప్ర వినోదులు'గా పేర్కొంటారు. వీరు గారడి ద్వారా అనేక మాయలను ప్రదర్శించి, యాచిస్తారు.

మందెచ్చు కళాకారులు

వీరు యాదవ కులానికి చెందినవారు. ఈ జానపద కళాకారులు 'ఒల్లమాదేవి' కథను పాడుతూ యాచిస్తారు. వీరిలో ప్రధాన కళాకారుడు ఒక చేతిలో కత్తి, మరో చేతిలో చిరుతలు పట్టుకొని కథకు సంబంధించిన పాటలు పాడతాడు. మరో ఇద్దరు.. ఒకరు కత్తి, మరొకరు కర్ర పట్టుకొని ఇతడికి వంత పాడతారు.

తోటి కళాకారులు

గిరిజన, అడవి జాతులకు చెందిన కోయ, గోండు, నాయకపోడు కులాలకు ఆశ్రిత కులం తోటివారు. గిరిజన జాతులన్నీ లక్ష్మీదేవి జాతికి చెందినవి. తోటి కళాకారులు కురువంశానికి చెందినవారిగా, వారికి వారసులుగా భావిస్తారు. వీరు కురువంశ మూలపురుషుల కథలు చెబుతారు.

పెద్దమ్మ కళాకారులు

వీరు సంచార జాతికి చెందిన మహిళా కళాకారులు. సాధారణంగా ముగ్గురు లేదా నలుగురు కలిసి ప్రదర్శనలు ఇస్తారు. పెద్దమ్మ దేవత విగ్రహాన్ని ఒకరి చేతిలో ఉంచుతారు. మరో కళాకారిణి డోలు వాయిస్తుంది. చేతిలో పెట్టిన విగ్రహాన్ని కళాకారిణి తలపై పెట్టుకొని డోలు శబ్దానికి అనుగుణంగా లయబద్ధంగా నృత్యం చేస్తుంది. వీరు నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించిన విప్లవ వీరుడు 'పండుగ శాయన్న' గాథను పాడుతూ ప్రదర్శన నిర్వహిస్తారు.

యానాది భాగవతం

యానాది కులానికి చెందినవారు చెప్పే భాగవతాన్ని 'యానాది భాగవతం' అంటారు. వీరు చెంచులక్ష్మీ కథను ఎంతో రమ్యంగా చెబుతారు. దీన్నే 'గరుడాచల భాగవతం'గా వ్యవహరిస్తారు. వీరు నృత్యం చేస్తూ, పాటలు పాడుతూ కథను వల్లె వేస్తారు.

పర్ధాన్ కళాకారులు

ఇది గోండు జాతి పుట్టు పుర్వోత్తరాలకు సంబంధించిన జానపద కళ. ఆదిమవాసీలైన పర్ధాన్‌లు 'దేవాల్ పులాక్' పురాణగాథను ఆలపిస్తూ ప్రదర్శనలు ఇస్తారు. వీరు డక్కి, తాళాలు అనే వాయిద్యాలను ఉపయోగిస్తారు.

జముకులవారు

పోచమ్మ, ఎల్లమ్మ, అక్కమ్మ, సారంగధర మొదలైన గ్రామ దేవతల కథలను వీరు ఎంతో మనోరంజకంగా చెబుతారు. వీరు ఉపయోగించే వాయిద్యాల్లో 'జమిడిక' లేదా 'బవనిక' ముఖ్యమైంది.

వీరముష్టివారు

వీరు వైశ్యులకు అనుయాయులు. వైశ్యుల ఆరాధ్య దైవమైన శ్రీకన్యకాపరమేశ్వరి గురించి పాటలు పాడతారు. వీరు 'జంగాల' దగ్గర కూడా యాచిస్తారు.

సాతాను వైష్ణవులు

వీరు వైష్ణవ భక్తులు. విష్ణువును ఆరాధిస్తారు. విష్ణువు గురించి పాటలు పాడుతూ యాచిస్తారు.

పిట్టల దొర

తెలంగాణాలో ఆదరణ ఉన్న మరో ముఖ్యమైన జానపద కళాకారుడు 'పిట్టల దొర'. ఈ వేషాన్నే 'లత్కోర్ సాబ్', 'బుడ్డర్ ఖాన్', 'తుపాకి రాముడు'గా పేర్కొంటారు. ఇది పగటి వేషాల్లో ఒక రకానికి చెందింది. వీరు ప్రధానంగా గ్రామాల్లో ప్రదర్శనలు ఇస్తారు. పిట్టల దొర వేషగాళ్లు సమాజంలోని లోపాలు, కుతంత్రాలను హాస్యాత్మకంగా, వ్యంగ్య రూపంలో చెబుతారు. ఖాకీ ప్యాంటు లేదా నిక్కరు, చిరిగిన ఖాకీ షర్టు, తలపై దొర టోపి, కాళ్లకు బూట్లు ధరిస్తారు. టోపిపై ఒక పక్కన తెల్లటి ఈక, చేతిలో కట్టె తుపాకీ, మెడలో రుమాలు ఉంటుంది. వీరు ముఖానికంతా తెల్ల రంగు పూసుకుని, ఫ్రెంచ్‌కట్ మీసంతో దొరలా హంగామా చేస్తూ విరామం లేని వాగ్ధోరణితో ప్రజలను అలరిస్తారు.


మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణలో మాయాజాల కళాకారులుగా ఎవరిని పిలుస్తారు?
   1) మందెచ్చు కళాకారులు
   2) విప్ర వినోదులు
   3) ఒగ్గుకథ కళాకారులు
   4) శారదకాండ్రు
2. మిద్దె రాములు, చుక్క సత్తయ్య ఏ కళలో ప్రసిద్ధి చెందిన వ్యక్తులు?
   1) ఒగ్గుకథ 2) బుర్రకథ
   3) హరికథ 4) గుస్సాడి నృత్యం
3. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో గిరిజనులు చేసే నృత్యం పేరు?
   1) సిద్దీ నృత్యం 2) గుస్సాడి నృత్యం
   3) గరగల నృత్యం
   4) పేరిణీ తాండవం
4. కాకతీయ ప్రభువుల కాలంలో ప్రసిద్ధిగాంచిన నృత్యం ఏది?
   1) సిద్దీ నృత్యం 2) రేల నృత్యం
   3) కోలాటం
   4) పేరిణీ తాండవం
5. తెలంగాణ రాష్ట్రంలో గ్రామ దేవతలను పూజించే శూద్ర కుల అర్చకులను ఏమంటారు?
   1) శారదకాండ్రు 2) వీరముష్టివారు
   3) అసాదులు
   4) బండారు కళాకారులు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 4; 5) 3.

She buys milk and butter from the..



Bank Exams

ENGLISH

1. The girl in the pink frock is my daughter. (Use: wearing)
   1) Wearing pink frock is my daughter.
   2) The girl wearing in the pink frock is my daughter.
   3) My daughter is wearing pink frock.
   4) The girl wearing the pink frock is my daughter.
2. She said that she had gone there the night before.
   1) She said, "I went there the night before."
   2) She said "she went there the previous night."
   3) She told that 'she had gone there last night.'
   4) She said, "I went there last night."
3. Join the following simple sentences into a single sentence. He was tired of work. He lay down to rest.
   1) He was tired of work; he was lay down to rest.
   2) Being tired of work, he lay down to rest.
   3) So tired of work, to lay down to rest.
   4) Too tired of work he was laid down to rest.
4. She buys milk and butter from the ____
   1) Dairy 2) diary
   3) daily 4) dairies
5. ____ being fined he was sent to prison.
   1) beside 2) in
   3) besides 4) always
6. I have been in this office ____ six years.
   1) since 2) from
   3) for 4) last
7. All laughed at her. (Change into Passive)
   1) Everyone laughed at her
   2) Everybody laughed at her
   3) She was laughed at by all
   4) All were laughed at by her
8. You will never be hurt by him. (Change into Active)
   1) Nobody hurts you
   2) He will never hurt you
   3) He may not hurt you
   4) He may be hurting you
9. I cannot lift this box, I need ____ help.
   1) few 2) a few
   3) a little 4) little
10. Which sentence is correct?
    1) Bread and butter are a wholesome food.
    2) The captain, with all his men, were drowned.
    3) Either Ramu or Anil were absent.
    4) The jury were divided in their opinion.
11. In which sentence the verb is used in past continuous and simple past?
    1) We were playing when you came.
    2) The boys are doing their homework when the bell rang.
    3) She was dancing and playing.
    4) She was singing when I meet her.
12. There is ____ hotel in ____ centre of ____ town.
    1) the, the, the 2) the, a, the
    3) a, the, the 4) a, a, the
13. I met him ____ hour ago.
    1) a 2) an
    3) the 4) no article
14. They have gone to a movie. (Use an appropriate question tag)
    1) Have they? 2) Had they?
    3) Hadn't they? 4) Haven't they?
15. Raju rides a bicycle. ____?
    1) is he 2) does he
    3) was he riding 4) doesn't he
16. He flatters her whenever he meets her. The meaning of flatter is ____.
    1) prays 2) preys
    3) prize 4) praise
17. Keep him at arm's length, means
    1) keep him close
    2) keep him in front
    3) keep him near
    4) keep him away
18. Which of the sentence is correct?
    1) "I have seen a tiger", Ravi said.
    2) Ravi said "I seen tiger?"
    3) "I am seeing a tiger" Ravi said
    4) Ravi said, "I have saw a tiger?"
19. Identify the sentence with correct use of punctuation.
    1) "try and try again," said the teacher.
    2) "Try and Try again," said the Teacher.
    3) "Try and try again," said the teacher.
    4) The teacher said, "try and try again".
20. The police found him guilty. The structure of the sentence is
    1) S+V+ pronoun + complement
    2) S + V + O1 + O2
    3) S + V + IO + DO
    4) S + V + O + complement
21. Identify the silent letters in 'phlegm'
    1) P, l 2) P, h, g
    3) H, g, m 4) G, m, l
22. 'My Dear' is an expression used in ____
    1) formal letters
    2) semi formal letters
    3) personal letters
    4) official letters
23. Usually informal letters will be written to ____.
    1) Colleagues 2) Boss
    3) Editor 4) Near & dear
24. You have been summoned. The opposite of the underlined word is ____.
    1) Call for 2) Said for
    3) Dismiss 4) Call upon
25. He has ____ a lot of weight.
    1) Put in 2) Put on
    3) Put through 4) Put off

PASSAGE

We are living in the midst of a great chemical experiment, and some serious consequences are becoming apparent to scientists. More than two billion pounds of chemicals are spewed into the air each year which are brewing a disastrous stew. The greatest consequences of the atmosphere crisis may be global warming and the ozone depletion. The Earth appears to be warming due to greenhouse effect. Scientists estimate that average temperature could climb about 2 degrees Celsius in 20 years. Global warming is the predict result of the greenhouse effect, created by the greenhouse gases, such as carbon dioxide and methane, in the atmosphere. This change in the global climate would have disastrous results, including drought, coastal flooding and increased species extinction. Also, the scientists have discovered a hole in the ozone layer. The ozone layer is the only protection for life on Earth against deadly ultraviolet radiation from the sun. Once the ozone layer is completely destroyed, all life on Earth will cease exist, killed by the deadly radiation. The planet will become a barren rock devoid of all life. And when this happens the process of industrialization would have to take the blame which has resulted in increased use of fossil fuels such as coal, petroleum and diesel.

26. Which of the following can be inferred from the given passage?
    1) The use of all chemical products should be immediately stopped.
    2) Scientists will have a hard time to estimate the rate of change of temperature in the years to come due to enormous changes in environment.
    3) The environmental disaster in the future will happen as a result of increased usage of fossil fuels.
    4) All of the above
27. Greenhouse effect envisages ____
    1) Carbon dioxide and methane
    2) Harmful gases
    3) Global warming 4) Chemicals
28. The scientists have discovered a hole in the ozone layer. Hole means ____.
    1) complete 2) partial
    3) fissure 4) comprehensive
29. This is really helping us from the ultraviolet radiation____.
    1) global warming
    2) green house gases
    3) ozone layer
    4) industrialization
30. This pen is yours, isn't it?
    1) this is a statement
    2) request 3) interrogation
    4) asking for information

Key

1) 4	2) 4	3) 2	4) 1	5) 3
6) 3	7) 3	8) 2	9) 3	10) 4
11) 1	12) 3	13) 2	14) 4	15) 4
16) 4	17) 4	18) 1	19) 3	20) 4
21) 2	22) 3	23) 4	24) 3	25) 2
26) 4	27) 3	28) 3	29) 3	30) 4

విద్య, ఉద్యోగ సమాచారం

సీపీఆర్ఐ, బెంగళూరులో ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీఆర్ఐ).. ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 02.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీఆర్ఐ), పోస్ట్ బాక్స్ నెం.8066, ప్రొఫెసర్ సర్.సి.వి. రామన్ రోడ్, సదాశివనగర్ పోస్ట్ ఆఫీస్, బెంగళూరు-560080 చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 16.05.2025.
- వెబ్‌సైట్: https://cpri.res.in/

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టులు

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రెగ్యులర్ ప్రాతిపదికన మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 04.
- పోస్టుల వివరాలు: మేనేజర్(లీగల్)-01, డిప్యూటీ మేనేజర్(లీగల్)-02, అసిస్టెంట్ మేనేజర్(లీగల్)-01.
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- వయసు: 01.05.2025 నాటికి అసిస్టెంట్ మేనేజర్‌కు 30 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 33 ఏళ్లు, మేనేజర్‌కు 37 ఏళ్లు ఉండాలి.
- వేతనం: నెలకు మేనేజర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000.
- ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జీజీఎం, హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకెట్, న్యూఢిల్లీ-110017 చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 30.05.2025.
- వెబ్‌సైట్: https://ircon.org